వీక్షణం

ఆర్థిక, సామాజిక మాసపత్రిక

జూలై 2006 | 60 | రు. 10

* ఫోకస్ -

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి అరవై ఏళ్లు

  * భూమి సమస్య
  * ఇవాళ్టి ప్రశ్నలు
  * అరుదైన పత్రాలు, ఇంటర్వ్యూలు

* ఎస్సీలకు కోట్లాది నిధుల ఎగనామం
* బెంగాల్ ఎన్నికల్లో మార్క్సిస్టుల విజయమూలాలు
* చేనేత పునాదులపై పవర్‌లూమ్


తెలుగు సమాజానికి
వెలుగు దివ్వె

విధానాల విశ్లేషణలు

ప్రభుత్వ విధానాలు - వాటి
పర్యవసానాలపై లోతైన విశ్లేషణలు

క్షేత్ర నివేదికలు

వివిధ పథకాల అమలుపై,
ప్రజల జీవన స్థితిగతులపై
సమగ్ర క్షేత్ర నివేదికలు



వార్తా విశేషాల
కదంబం

ప్రధాన స్రవంతి పత్రికల్లో
అరుదుగా కనిపించే జాతీయ,
అంతర్జాతీయ కథనాలు

అభివృద్ధి చర్చలు

పోలవరం నుండి యురేనియం
ప్రాజెక్టు వరకూ 'అభివృద్ధి'పై
సవివరమైన చర్చలు

ఆలోచింపజేసే
గణాంకాలు

మిమ్మల్ని కదిలించి, రగిలించే
అరుదైన గణాంకాలు

పదునైన వ్యాసాలు

వివిధ రంగాలలో లబ్ధప్రతిష్ఠులైన
వారి వ్యాసాలు, వ్యాఖ్యానాలు

అధ్యాపకులు, అధికారులు, ఉద్యమకారులు, నేతలు, విద్యార్థులు, సామాన్య పాఠకులు

అందరికీ ఉపయోగపడే సమాచారాన్నిచ్చే సమగ్ర ఆర్థిక, సామాజిక మాసపత్రిక

విడి ప్రతి: రు. 10/-　　　సంవత్సర చందా: రు. 120/-

ఎం.ఓ. / డి.డి. పంపవలసిన చిరునామా

వీక్షణం

ఆర్థిక, సామాజిక మాస పత్రిక

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029. ఫోన్ / ఫాక్స్ : 040-55843495

వీక్షణం
ఆర్థిక, సామాజిక మాసపత్రిక
సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ
60 జులై 2006

వార్షిక చందా: రు.120 విడి ప్రతి : రు. 10

సంపాదకీయం

ఇవి స్థానిక ఎన్నికలేనా?


ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలు బీభత్సంగా, ఆర్భాటంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఎన్నికల లాగ జరుగుతున్నాయి. రెండు ప్రధాన పార్టీలూ, వాటితో చేరిన మిత్రపక్షాలూ కోట్లాది రూపాయల నిధులను, విపరీతంగా మద్యాన్నీ, హింసనూ ఉపయోగించి ఈ ఎన్నికల ఫలితాన్ని తమకు అనుకూలంగా మలచుకోదలచుకుంటున్నాయి. ఆ క్రమంలో అన్ని పార్టీలూ తమ తమ సిద్ధాంతాలకూ, సూత్రబద్ధ ప్రవర్తనలకూ నీళ్ళు వదిలి, ఎంతటి అవకాశవాద పొత్తులు కుదుర్చుకోవడానికయినా సిద్ధపడ్డాయి. కాంగ్రెస్ తెరాసతో, సిపిఐతో పొత్తు, తెలుగుదేశం సిపిఎంతో పొత్తు, సిపిఎంకు సిపిఐతో పొత్తు వెరసి చివరికి కాంగ్రెస్‌కూ తెలుగుదేశంకూ కూడ పొత్తు కుదిరిన స్థానాలున్నాయి. నిన్నటిదాకా అతి తీవ్రంగా విమర్శించుకున్న కాంగ్రెస్-తెరాస, తెలుగుదేశం-సిపిఎం ఇప్పుడు పొత్తు కుదుర్చుకోవడానికి ఇసుమంత కూడ సిగ్గుపడడం లేదు. ఎన్నికల రాజకీయాలలోని అన్ని పార్టీలూ ఒకే తానులోని ముక్కలనే విషయం ఈ ఎన్నికలు అతి స్పష్టంగా ప్రకటిస్తున్నాయి. ఆయా పార్టీలు తమ తమ వైఖరుల గురించి ఎన్ని వాదనలయినా వినిపించవచ్చు, ఎంత సమర్థన అయినా చేసుకోవచ్చు కాని నిన్నటి కయ్యం నిజమా నేటి వియ్యం నిజమా అని అనుమానంలో పడే ప్రజలను మాత్రమే మోసం చేస్తున్నారనక తప్పదు.

ఇక స్థానిక ఎన్నికలలో గెలుపు-ఓటములను నిర్ణయించే మెజారిటీ పెద్దగా ఉండబోదు గనుక ప్రతి ఒక్క వోటూ విలువయినదయి, రెండు పక్షాలూ కుత్తుకలు కత్తిరించుకునే పోటీలో పడిపోయాయి. వోటు విలువను విపరీతంగా పెంచివేసి కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్నాయి. ఇందుకు ప్రతిగా రానున్న ఐదు సంవత్సరాల గ్రామీణాభివృద్ధి నిధులు నిజంగా గ్రామాల అభివృద్ధికి కాక ఇప్పటి పెట్టుబడికి లాభాలుగా మారిపోతాయన్నమాట. ఇప్పటికే గ్రామాలలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలేవీ లేవు. ఆ నిధుల మీద కోత ఉంది. స్థానిక స్వపరిపాలనా సంస్థల అధికారాల మీద కోత ఉంది. ఇప్పుడు ఈ మితిమీరిన ఖర్చుతో ఉన్న కొద్దిపాటి నిధులు కూడ మరింత కోతకు గురవుతాయి.

ఈ ఎన్నికల వల్ల జరుగుతున్న మేలు ఏమన్నా ఉందంటే రెండు పక్షాలూ అవతలి పక్షం గురించి అచ్చమైన నిజాలు ప్రకటించడం. 'మీరు దొంగలు' అంటే 'మీరు దొంగలు' అంటూ ఇద్దరూ మన కళ్ళు తెరిపించి తమ తమ స్వభావాల గురించి నిజాలు తెలిసేటట్టు చేస్తున్నారు. పనిలో పనిగా న్యాయస్థానాలు, ఎన్నికల సంఘం, జిల్లా రెవెన్యూ, పోలీసు అధికారులు కూడ ఎంత పక్షపాతంతో వ్యవహరిస్తారో చెపుతూ మనకు జ్ఞానోదయం కలిగిస్తున్నారు.

ప్రతి ఎన్నికలోనూ గెలుస్తున్న ఈ రాజకీయ నాయకుల గురించి, ప్రతి ఎన్నికలోనూ ఓడిపోతున్న ప్రజలు, ఇప్పటికైనా నిజాలు తెలుసుకుంటారా? ◆

లోపలి పేజీల్లో...



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాందిగా భావించే దొడ్డి కొమరయ్య అమరత్వానికి ఈ జూలై 4, 2006కు అరవై సంవత్సరాలు నిండుతున్నాయి. ఈ సందర్భంగా ఆనాటి వీరోచిత పోరాటంపై ప్రత్యేక ఫోకస్ -

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం (1946-51) ఒకానొక చిన్న భౌగోళిక ప్రాంతం లో, అతి స్వల్పకాలం పాటు సాగి, అధికారికంగా విరమించబడిన పోరాటమే అయినప్పటికీ ఆధునికాంధ్ర చరిత్ర లోనూ, ఆధునిక భారత చరిత్రలోనూ దానికి అపూర్వమైన విశిష్టత ఉంది.

వీక్షణం

ఆర్థిక, సామాజిక మాసపత్రిక

మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040 - 55843495
ప్రింటర్స్ : చరితా ఇంప్రెషన్స్, అజామాబాద్, హైదరాబాద్.

సహాయ సంపాదకులు : కొణతం దిలీప్
డి.వి.రామకృష్ణారావు
సర్క్యులేషన్ మేనేజర్ : వై.రామచంద్రం
కంపోజింగ్ , లే ఔట్ : చరిత ఇంప్రెషన్స్

పాఠకుల వీక్షణం

'పాఠకుల వీక్షణం' (జూన్ '06) శీర్షికలో పి. నాగభూషణ గుప్తా, నిజామాబాద్ గారు రాసిన లేఖకు ప్రతిస్పందనగా వివరణ :

'వ్యాట్ – కొత్త ఆలోచనలు కావాలి' వ్యాసం అమలుకు సంబంధించినది. ఉద్దేశ్యాలకు భిన్నంగా అమలు జరుగుతున్న తీరు, కారణాలు ఆ వ్యాసంలో చెప్పబడ్డాయి. కొన్ని నిర్దుష్టమైన ప్రతిపాదనలు చేయబడ్డాయి. ఉదా : అమలు విధివిధానాల రూపకల్పనలో వ్యాపారస్తులకు భాగస్వామ్యం ఉండాలని.

పి. నాగభూషణ గుప్తాగారు వ్యాట్ ఆవశ్యకత, ప్రపంచబ్యాంకు అజెండా లాంటి అంశాల్ని ప్రస్తావిస్తూ కొత్త ఆలోచనలు ఆ వ్యాసంలో లేవని అన్నారు. అమలుకు సంబంధించిన చర్చలో గుప్తాగారు లేవనెత్తిన అంశాలు అప్రస్తుతమని అనుకుంటాను. ఆవశ్యకత, అమలు తీరుతెన్నుల మధ్య తేడా గమనించాలని కోరుతున్నాను.

– టి.వి. అధికారి, హైదరాబాద్.

వీక్షణం పత్రిక చదివాను. మన రాష్ట్రానికీ, దేశానికీ అత్యవసరమైన విభిన్న అంశాలపైన సమాచారభరితమైన, పరిశోధనాత్మకమైన వ్యాసాలున్నాయి. ఒక అంశం వివాదాస్పదంగా ఉన్నప్పుడు దానికి సంబంధించిన ఇరుపక్షాల వాదనలను సమర్పించడం నిజంగా సరైన పద్ధతి. వ్యాసాలన్నీ కూడ విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా ఉండటం నాకు సంతోషం కలిగించింది. నిజమైన ప్రజాస్వామ్యపు లక్షణాలలో ఒకటి భిన్నాభిప్రాయం ప్రకటించే స్వేచ్ఛ ఉండడమే.

– ప్రొ. ఐ.వి. చలపతిరావు, త్రివేణి సంపాదకులు
హైదరాబాద్.

'వీక్షణం' జూన్ 2006 సంచికలో విద్యాభూషణ్‌గారు రచించిన 'సమస్యల ప్రస్తావనా దిశగానే 2006 శాసనసభ ఎన్నికలు' చదివి చాలా ఆశ్చర్యానికి గురయ్యాను. నేను చదువుతున్నది 'వీక్షణం' పత్రికేనా అని అటూ ఇటూ తిప్పి చూశాను. 'ఎన్నికలు అంటే ప్రజల మనోభీష్టానికి అద్దం పట్టడమే' అనే వ్యాఖ్యతో ఆ వ్యాసం మొదలు పెట్టారు. ఇది నిజమేనా? మన దేశంలో జరుగుతున్న ఎన్నికలకూ ప్రజల మనోభీష్టానికీ ఎంత తేడా ఉంటున్నదో ఏ పసిపిల్లవాడినడిగినా చెపుతాడు. ఎన్ని అక్రమ మార్గాల ద్వారా మన నాయకులు ఓట్లు దండుకుంటున్నారో అందరికీ తెలుసు. సరే, వ్యాసం గురించి మళ్ళీ వ్యాసం రాయవలసి వస్తుంది గనుక ఇక్కడ ఆపుతాను. కాని 'వామపక్ష ప్రభుత్వపరంగా సైంటిఫిక్ రిగ్గింగ్ ఆరోపణకు నేటి ఎన్నికల్లో వాస్తవం నిగ్గుతేలింది. అంటే వామపక్షం ఆ ఆరోపణ నుండి బైటపడింది' అని రచయిత రాశారు. సైంటిఫిక్ రిగ్గింగ్ అనే మాట వాడినా, వాడక పోయినా బెంగాల్ ప్రజల్లో వామపక్ష ప్రభుత్వం పట్ల ఎంతో అసంతృప్తి ఉన్నప్పటికీ, గ్రామ ప్రాంతాలలోని ధనికరైతుల, పెత్తందార్ల పార్టీగా సిపిఎం మారిపోయిందని, ఆ పెత్తందార్లు గుత్తగా ఓట్లు వేయించారని కలకత్తా నుంచి వచ్చే పత్రికలే రాస్తున్నాయి.

– పి. రామచంద్రరాజు, విశాఖపట్నం.

తెలుగుమీడియాను తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి ముందు, తరువాత అని నిష్పాక్షికంగా ఎవరైనా అధ్యయనం చేయదలిస్తే కావాల్సినన్ని అంశాలు, కోణాలు ఉన్నాయి. శాశ్వత విలువలు, సత్యాలకు కూడా మీడియా తనకిష్టమైన రంగులు పులమగలిగింది. ఒక సందర్భంలో మద్య నిషేధం కోసం తనకుతానుగా బాధ్యతను భుజాన వేసుకుని ఊరూరా ఉద్యమాలు చేయించిన అక్షరం, మరో సందర్భంలో నిషేధం ఎత్తివేయగానే 'సరైన సమయంలో సరైన నిర్ణయం' అంటూ లోకోత్తర సంపాదకీయాలు రాసి పొంగి పులకించిపోతుంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా పత్తిరైతులు, వేరుశెనగరైతులు, చేనేత కార్మికులు ఆకలితో అలమటించి చనిపోయినా, అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్యలు చేసుకున్నా చూడ్డానికి నిరాకరించిన అక్షరం, చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడు కాగానే రైతులవైపు నిలిచి పోరాడుతుంది. కథలు కథలుగా రైతుల ఆత్మహత్యల మీద వ్యాసాలు, వార్తల పరంపరను సంధిస్తుంది. ఎల్ అండ్ టి., రిలయన్స్ కంపెనీలు అధికారిక రాయబారులను పెట్టి తెలుగుదేశం ప్రభుత్వాధినేతల చుట్టూ తిప్పిన సంగతులు అందరికీ తెలియకపోయినా దాచేస్తే దాగని సత్యాలు. ఇంకుడు గుంతలతో భూగర్భజలాలు తెలుగుదేశం మిత్ర పత్రికల

(మిగతా 14వ పేజీలో...)

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడ అంతే. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.



– సంపాదకులు

చందాదారులకు విజ్ఞప్తి

ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. అంటే ఏ నెల సంచిక ఆ నెల మొదటి వారానికల్లా పాఠకులకు చేరుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారం లోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు. మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.

– సర్క్యులేషన్ మేనేజర్


కొత్తపుస్తకాలు













- సామాజిక సందర్భం - పత్రికా వ్యాసాలు - ఘంటా చక్రపాణి - అనేక పబ్లికేషన్స్, 232 పేజీలు, 1/8 డెమీ, రు. 50 ప్రతులకు: డా. ఘంటా చక్రపాణి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషియాలజీ, డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రోడ్ నం. 46, జూబిలీహిల్స్, హైదరాబాద్-500 033.
- అక్షరాల్లో దగ్ధమై - కవితా సంపుటి, డా. ఎన్. గోపి, జిష్ణు ప్రచురణలు, 174 పేజీలు, 1/8 డెమీ, రు. 80. ప్రతులకు : శ్రీమతి ఎన్. అరుణ, 13-1//5బి. శ్రీనివాసపురం, రామంతాపూర్, హైదరాబాద్-500 013.
- ఆధునిక తెలుగు సాహిత్యం - స్త్రీవాద భూమిక - కాత్యాయనీ విద్మహే, స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ ప్రచురణ, 130 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : కాత్యాయనీ విద్మహే, 5-11-667, పశ్యంతి, కాకతీయ విశ్వవిద్యాలయం రోడ్డు, విద్యారణ్యపురి, వరంగల్-506 009.
- గాయపడ్డ తెలంగాణ - వ్యాసాలు - ముల్కీ స్టడీసెంటర్ ప్రచురణ; 54 పేజీలు, 1/8 డెమీ, రు. 15, ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తకాల దుకాణాలు.
- ఖిబ్లా - ఇస్లాం వాద కవితాసంకలనం - ముస్లిం రచయితల సంఘం ప్రచురణ, 104 పేజీలు, 1/8 డెమీ. రు. 30. ప్రతులకు: షేక్ కరీముల్లా, డోర్ నం. 21-36, పెద్ద మసీదు బజార్, వినుకొండ - 522 647.
- భారత విదేశీ సంబంధాలు తీరుతెన్నులు - ఒక విశ్లేషణ (అమెరికా-చైనా) గూడవల్లి నాగేశ్వరరావు, 76 పేజీలు, 1/8 క్రౌన్. రు. 12.
- భారత విదేశీ సంబంధాలు తీరుతెన్నులు - ఒక విశ్లేషణ (పాకిస్తాన్-నేపాల్) గూడవల్లి నాగేశ్వరరావు, 96 పేజీలు, 1/8 క్రౌన్ రు. 15. ఈ రెండు పుస్తకాలు ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన భవన్, ఆబిడ్స్, హైదరాబాద్ - 500 001.
- లైట్ హౌస్ కిరణాలు - నానీలు - కొట్టి రామారావు, ఆంధ్ర సారస్వత సమితి ప్రచురణ, 88 పేజీలు. 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : కొట్టి రామారావు, శ్రీ కిరణ్మయి, 23/247/7, బచ్చుపేట, మచిలీపట్నం - 521 001.
- భావవాదం-దాని అంతరార్థం - హారోల్డ్ మెచ్ టిటస్, అను : ఆర్వియార్ మాస్టారు, లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణ, 16 పేజీలు, 1/8 డెమీ, రు. 4.
- రివిజనిజం - వ్యాస సంకలనం - లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణ, 48 పేజీలు, 1/8 డెమీ, రు. 15. ఈ రెండు పుస్తకాలు ప్రతులకు: లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్, డి. రాధాకృష్ణమూర్తి, ఇం.నెం. 5-85-4/బి, పందరీపురం, 1వలైను, గుంటూరు-522 002.











ప్రజాకంటక విధానాల ఫలితమే పెట్రోధరల పెంపు

- విద్యా భూషణ్

బాధ్యత గల ప్రభుత్వాలు దేశంలో లభ్యమౌతున్న సహజ వనరులను గుర్తించి, వాటి సక్రమ నిర్వహణకై నిర్దిష్ట విధానాలను రూపొందించుకోవడం పరిపాటి. కానీ మన పాలక వర్గాలు ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించి 'సరళీకరణ' పేరిట పూర్తిగా ప్రైవేటురంగ విస్తరణకే కంకణం కట్టుకున్నాయి. ఈ కారణంగానే అత్యంత ప్రాధాన్యత గల చమురు రంగం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది. అందుబాటులో వున్న జాతీయ వనరులను వినియోగించుకోకుండానే, దిగుమతులకై వెంపర్లాడుతూ, ఈ దిగుమతి సుంకాలతో లాభాలను ఆర్జించి తమ బడ్జెట్ లోటును సరిచేసుకోవాలన్నదే ఆయా ప్రభుత్వాల లక్ష్యం. ఈ కారణంగా, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పుడల్లా మనకీ ధరల పెంపు అనివార్యమౌతుంది. యు.పి.ఎ. ప్రభుత్వం అధికారం చేపట్టిన ఈ కొద్దికాలంలోనే ఆరుసార్లు పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచింది.

చమురు విధాన రూపకల్పనలోనే భారతదేశం విఫలమయింది. మందు చమురు సహజ వాయు నిక్షేపాలను ప్రాధాన్యతాపరంగా గుర్తించి, ఉత్పత్తులను పెంపొందించుకుంటూ, దుర్వినియోగ ధోరణులను నియంత్రించాలి. నూతన చమురు నిక్షేపాలను గుర్తించేందుకై తగు పరిశోధనలనూ ప్రోత్సహించాలి. చమురు ధరల స్థిరీకరణకై ఏర్పాటు చేసిన ఆయిల్‌పూల్ అకౌంట్‌ను సక్రమంగా నిర్వహించాల్సిన అవసరమూ వుంది.

ఆయిల్‌పూల్ అకౌంట్ అంటే ఏమిటి?

ఆయిల్‌పూల్ అకౌంట్ చమురు ఉత్పాదిత రేటుకు కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలను కలిపిన తరువాతనే ప్రారంభమౌతుంది. దీన్నే స్టాక్ పాయింట్ ధర అని కూడా అంటారు. ఇందులో దిగుమతి ధరతో పాటుగా, కేంద్ర ప్రభుత్వం విధించే కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలు, రవాణా వ్యయాలు, కమీషన్లు, వాణిజ్యవర్గాలకు గ్యారంటీ చేసిన లాభాలూ వుంటాయి. ఈ స్టాక్ పాయింట్ ధరకూ అమ్మకం రేటుకూ మధ్య వున్న అంతరం, లోటుని తేడా మిగులును నిర్ణయిస్తుంది. ఇక జాతీయ వనరుల వినియోగానికి వస్తే, చమురు రేట్ల నిర్ణయంతో రాయల్టీలుగా పేర్కొంటారు. ఈ రాయల్టీల్లో మైనింగ్ హక్కుల ఛార్జీలు, రవాణా వ్యయాలు, ఎక్సైజ్ సుంకం, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులు, రిఫైనరీ వ్యయాలు, వాణిజ్య వర్గాలకు యిచ్చే గ్యారంటీలు వుంటాయి.

సాధారణంగా కేంద్రం దేశీయ చమురు నిల్వలను నిర్ణీత ధరకే రిఫైనరీలకు యిస్తుంది. అంతే కాకుండా శుద్ధి చేసేందుకయ్యే వ్యయాన్ని యిస్తూ, 18 శాతం నికర లాభాలకు గ్యారంటీ చేస్తుంది. దిగుమతి చేసుకునే చమురు విషయంలో కూడా శుద్ధి చేసే క్రమం నుండి అమ్మకం వరకూ అన్ని స్థాయిల్లోనూ లాభాలను కేంద్రమే గ్యారంటీ చేస్తుంది. ఈ ప్రక్రియ అంతా సాగిన తరువాత మిగిలిన మిగులును ఆయిల్‌పూల్ అకౌంట్‌లో జమ చేయాల్సి వుంటుంది. 1989 నాటికి ఈ ఆయిల్‌పూల్ అకౌంట్‌లో 8,900 కోట్ల రూపాయల నిల్వ వుండేది. ఈ మొత్తాలను ఎక్కువ వడ్డీ చెల్లించే ప్రభుత్వ బాండ్లలో పెట్టాలని ముందుగా నిర్ణయించి, తరువాత ఆ అభిప్రాయాన్ని మార్చుకున్నారు. కేవలం అయిదు శాతం వడ్డీ వచ్చే కేంద్ర ప్రభుత్వ ఖాతాలో వేశారు. రాష్ట్రాల ప్రభుత్వాలకు ఈ ఆయిల్‌పూల్ అకౌంట్‌తో ఏ విధమైన ప్రమేయమూ లేనందున, తరువాత క్రమంలో ఈ నిధులు కేంద్రానికి అదనపు వనరులుగా పరిగ్రమించాయి. యధేచ్ఛగా నిధుల దారి మళ్ళింపు మొదలయింది. ఈ ఆయిల్‌పూల్ నిధులను ప్రభుత్వం వినియోగించుకోకుండా ప్రభుత్వ రంగ చమురు కంపెనీల అభివృద్ధికై వినియోగిస్తే ప్రయోజనకరంగా వుండేది. ధరల స్థిరీకరణ నిధికి గాను ఒ.ఎన్.జి.సి. ఆయిల్ ఇండియా కంపెనీలు టన్నుకు రు. 1800 వంతున సెస్ చెల్లింపులను అమలు పర్చారు. సుమారు రు. 50 వేల కోట్లను ఈ సెస్ రూపంలో వసూలు చేసినప్పటికీ చమురు పరిశ్రమాభివృద్ధికి కేటాయించింది బహు తక్కువ.

అంతర్జాతీయ రంగంలో ముడిచమురుకై మనం చెల్లిస్తుంది దేశీయ ముడి చమురుకై చెల్లించేదానికన్నా సుమారు మూడు రెట్లు అదనం. దేశీయ చమురు వనరుల ఉత్పత్తులను పెంచుకోగలిగితే ఆయిల్‌పూల్ అకౌంట్‌కు లీటర్‌కు మూడు నుంచి నాలుగు రూపాయల మేరకు జమయ్యే వీలుందని నిపుణుల అంచనా. కానీ పాలక వర్గాలు 1992లో నాటి ప్రభుత్వం చేపట్టిన (ఎన్ఎల్ఇపి) విస్తరణా విధాన ఫలితంగా ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడం గమనార్హం. పన్నా-ముక్తా, తపతి చమురు స్థావరాలను ఎన్‌రాన్ బహుళజాతి సంస్థకు, రిలయన్స్ కన్సార్టియంకు ధారాదత్తం చేశారు. రవ్వ తవ్వకాలను వీడియోకాన్-మనుబరీ కన్సార్టియంకు అప్పగించేశారు.

ధరలు-పెరుగుదల :

ధరల నియంత్రణా విధానాన్ని ప్రభుత్వాలు రద్దు చేసినప్పుడే రాయితీల భారం వుండబోదన్న ప్రపంచ బ్యాంకు సలహా మేరకు మన ప్రభుత్వాలు ధరల నియంత్రణా విధానాన్ని రద్దు చేసుకున్నాయి. ఫలితంగా చమురు ధరలకే కాదు నిత్యావసర సరుకుల ధరలకూ రెక్కలొచ్చేస్తున్నాయ్. అయితే అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరుగుతున్నందునే, యిక్కడా పెట్రో ఉత్పత్తుల ధరలు పెరుగుతున్నాయనడం కేవలం ఓ సాకు మాత్రమే. ఎందుకంటే ఫిబ్రవరి 27, 1999లో ఆర్థికశాఖామంత్రి చేసిన బడ్జెట్ ప్రసంగంలో "అంతర్జాతీయ ముడిచమురు, పెట్రోలియం ఉత్పత్తుల ధరలు అసాధారణ రీతిలో తక్కువగా వున్నాయ్. అందువల్ల ఆసరకు ద్వారా కొంత అదనపు ఆదాయాన్ని సాధించవచ్చని భావిస్తున్నాను. ఈ కారణంగా దిగుమతి చేసిన లేదా దేశీయ పెట్రో ఉత్పత్తులపై లీటర్‌కు ఒక రూపాయి అదనపు సుంకం విధిస్తున్నాను. దీని ద్వారా వచ్చే ఆదాయమంతా కేంద్రానికే

చెందుతుంది" అని ప్రకటించారు. అసలైన కిటుకంతా యిక్కడే వుంది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినా, పెరిగినా మనదేశంలో ధరలు పెరుగుతాయన్నమాట. అంటే పాలకుల దృష్టి ఎప్పుడూ ఎలా ధరలు పెంచాలన్నదేనన్నదేనని స్పష్టమౌతుంది.

అంతర్జాతీయ చమురుధరలు తగ్గి, 1997- 99 మధ్య కాలంలో రాయితీలు పెరిగిన వాస్తవం మన ముందు వుంది. 1997- 98లో ఈ రాయితీలు రు. 1520 కోట్లు వుండగా, 1998-99లో రు. 2700 కోట్లకు పెరిగింది. ఇందుకు కారణం అంతర్జాతీయ చమురుధర డాలర్లలో వుంటుంది. మనం రూపాయిల్లో కొంటాం. అందుకని డాలర్లలో ధరలు తగ్గినా, రూపాయిల చెల్లింపుల్లో రాయితీల బిల్లు మాత్రం పెరుగుతుంది. స్వేచ్ఛా మార్కెట్ అంతస్సూత్రం యిదే. తరుగుతున్న రూపాయి విలువ కూడా ఈ అదనపు భారానికి పరోక్ష కారణమౌతుంది. ఆయిల్‌పూల్ అకౌంట్ నిల్వలను గత ప్రభుత్వం మాదిరిగా లోటు బడ్జెట్‌ల భర్తీకే వినియోగిస్తే, చిక్కిన ఆయిల్‌పూల్, ధరల పెరుగుదలను అనివార్యం చేస్తుంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ విధానాన్ని ప్రక్షాళన చేసి అభివృద్ధిపర్చాల్సిన చోట, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్‌ను ప్రోత్సహించడంతో, లోపభూయిష్ట రవాణా విధానం మరింతగా ఈ అనర్థాలను ప్రోత్సహిస్తుంది మునుముందు.

పెట్రోలు ధరల పెంపుకు ప్రభుత్వం ప్రధానంగా చూపుతున్న కారణాలు రెండు అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం ఒకటైతే, ప్రభుత్వరంగ చమురు కంపెనీలు తక్కువ మార్కెట్ ధరకు కిరోసిన్, వంటగ్యాస్‌లను సామాన్యులకందించేందుకనువుగా తగు రాయితీలను యిచ్చేందుకనేది రెండవది. ఈ పెరుగుతున్న అదనపు భారాన్ని ప్రభుత్వం, చమురు కంపెనీలు వినియోగదారులూ సమష్టిగా భరించాలన్నది పాలకవర్గాల ఉవాచ. అయితే ఆచరణలో అంతిమంగా ఈ భారాన్ని భరించాల్సింది వినియోగదారులేనన్నది వాస్తవం. ఎందుకంటే, పెరుగుతున్న భారాన్ని ప్రభుత్వాలు భరించడం అంటూ వుండదు. కావల్సిన మేరకు పన్నులు వడ్డించడమే వారి విధి. యిక చమురు కంపెనీల కనీస లాభాలకు ప్రభుత్వం గ్యారంటీ యిస్తూనే ధరల నియామకం జరుగుతుంది. కనుక పెరుగుతున్న ధరలతో ఈ అమ్మకందార్లకు ఒనగూడే నష్టమేమీ వుండదు. అంతిమంగా ఈ అధిక ధరల భారాన్ని పెట్రో వినియోగదారులూ, పాక్షికంగా సామాన్య ప్రజానీకం భరించాల్సిందే.

ఎన్డీయే ప్రభుత్వం అప్పటివరకూ కొనసాగుతున్న అధికారిక ధరల నియంత్రణా విధానాన్ని ప్రపంచ బ్యాంకు ఆదేశం మేరకు రద్దు చేసింది. అంతర్జాతీయ ధరలను బట్టి ప్రతి 15 రోజులకు ఒకసారి ధరలు మార్చే పద్ధతి ప్రవేశపెట్టింది. ఈ పద్ధతి అమల్లో వున్న మూడేళ్ళకాలంలో (జూన్ 2002 నుండి జూన్ 2005 వరకూ) ఒక్క మార్చ్ 2003లో జరిపిన పెట్రోధరల సమీక్షలో మాత్రమే ధరలు నామమాత్రంగా తగ్గడం గమనార్హం. ఇక్కడ దిగుమతులను ప్రోత్సహించేందుకై దిగుమతుల సుంకాలను తగ్గిస్తున్నామని చెప్తున్నప్పటికీ, ఎక్సైజ్ సుంకాల వడ్డనతో ఆదాయపు పెరుగుదలే లక్ష్యంగా కన్పిస్తుంది. పెట్రో అమ్మకం ధరల్లో సుమారు 50 శాతానికి పైగా పన్నుల భారమే. అదే డీజిల్ విషయంలో అయితే, వినియోగదారుని చెల్లింపుల్లో మూడో వంతు సర్కారీ పన్నులే.

2001 నుండి 2004ల మధ్య నాటి ఎక్సైజ్ సుంకాల ద్వారా ప్రభుత్వ ఆదాయాలను పరిశీలిస్తే, పెట్రోధరల పెంపును ప్రభుత్వం ఓ అదనపు వనరుగా భావిస్తుందన్న విషయం మనకు అవగతమౌతుంది. 2001-02 సంవత్సరంలో పెట్రో ఉత్పత్తులపై పన్నుల రూపంలో రు. 72,419 కోట్లు. ప్రభుత్వ స్థూలాదాయంలో 40.51 శాతంగా వుంటే, 2002-03 నాటికి అది రు. 82,254 కోట్లతో 43.72 శాతానికి పెరిగింది. 2003-04 సంవత్సరం నాటికి ఈ సుంకాలు రు. 90,907 కోట్లుగా 44.17 శాతానికి పెరిగింది. గత ఏడాది 2005-06 సంవత్సరంలో కేంద్రం కేవలం పెట్రోల్ రంగం నుంచి పన్నుల రూపంలో కొల్లగొట్టిన మొత్తం రు. 1,26,600 కోట్లు. యిది దేశానికి పన్నుల రూపంలో వస్తున్న మొత్తం ఆదాయంలో 34 శాతం ఎక్సైజ్ రూపేణా రు. 49,900 కోట్లు సంపాదించింది. ఇది మొత్తం ఎక్సైజ్ సుంకంలో 44 శాతం.

సామాన్యునికి మార్కెట్ ధర కన్నా తక్కువకు కిరోసిన్, వంటగ్యాస్‌లను అందించేందుకై ప్రభుత్వం రాయితీలను భరించాల్సి వున్నందునే ఈ పెట్రోధరలను పెంచాల్సి వస్తోందని ప్రభుత్వం పేర్కొంటుంది. వాస్తవంగా 2002-03లో కిరోసిన్‌పై ప్రభుత్వ రాయితీ లీటర్‌కు రు. 2.45 వుండగా, 2004 ఏప్రిల్ నాటికి 0.85 పైసలకు తగ్గిపోయింది. యిదేకాలంలో గ్యాస్ సిలెండర్‌పై రాయితీ రు. 67.75 నుండి రు. 22.58 కు తగ్గింది. పరోక్షంగా ఈ భారాన్ని ప్రభుత్వ చమురు కంపెనీలపైనే వేయడం జరిగింది. ఫలితంగా బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్, ఇండియన్ ఆయిల్ కంపెనీలు తమ లాభాలను 30-73 శాతం మేరకు కోల్పోయాయి. ఒక వైపు యిలా ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూనే, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, బొంగాయ్ గాన్ పెట్రోలియం అండ్ రిఫైనరీస్, చెన్నై పెట్రోలియం కార్పొరేషన్, కొచ్చి రిఫైనరీస్, మంగుళూర్ రిఫైనరీస్ అండ్ పెట్రో కెమికల్స్ వంటి కంపెనీలకు అధిక లాభాలను పొందేలా చేయడం జరిగింది. పబ్లిక్ రంగ చమురు సంస్థలు 2005 సంవత్సరపు ఏప్రిల్-జూన్ వరకూ అంటే, మూడు నెలల కాలంలో పెట్రోల్ డీజిల్ అమ్మకాల్లో రు. 4,300 కోట్లు, కిరోసిన్, వంటగ్యాస్ అమ్మకాల్లో రూ. 5000 కోట్లనూ నష్టపోయాయి. మరోవైపుగా ప్రైవేటు చమురు కంపెనీలకు ఎగుమతుల ప్రోత్సాహకాలుగా సాలీనా రు. 1200 కోట్ల మేరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యపరుస్తూ ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడమన్న మాట.

పెట్రో అమ్మకాల్లో పన్నుపోటు :

నేటి కేంద్ర ఎక్సైజ్ ఆదాయంలో 30 శాతం పెట్రో ఉత్పత్తుల నుంచే లభ్యమౌతుంది. యిక రాష్ట్రాలకు పెట్రో-డీజిల్ అమ్మకాల ద్వారా 30 శాతం అమ్మకం పన్ను రూపంలో ముడుతోంది. చమురు రంగంపై లెవీలు, పన్నులు, డివిడెండ్ల రూపంలో మొత్తం కేంద్రం ఆదాయంలో 21 శాతంగా వున్నాయి.

పెట్రో ధరలో క్రూడాయిల్ దిగుమతి రేటు, కస్టమ్స్ సుంకం, నౌకా రవాణా వ్యయం వగైరాలు 49.5 శాతం వుంటే, వీటికి 0.6 శాతం విద్యాసెస్సు, 0.1శాతం చమురు కంపెనీ నుండి వెలికి

వచ్చేందుకు గానూ, 31.9 శాతం ఎక్సైజ్ సుంకంగా, 16.2 శాతం అమ్మకం పన్నుగా వుంటాయి. వీటికి తోడు 1.7 శాతం డీలర్ కమీషన్ వెరసి 50.5 శాతం అంటే వినియోగదారుని కొనుగోలు ధరలో సగానికి పైగానే పన్ను పోటన్న మాట. ఈ తాజా పెట్రో దరల పెంపును అధికార సంకీర్ణ భాగస్వామ్యాలతో పాటు, కాంగ్రెస్‌లోని ఒక వర్గం వ్యతిరేకించిన వైనం మన ముందు వుంది. అయితే యుపిఏ చేపడుతున్న భారీ సంక్షేమ పథకాల అమలుకు ఈ మేరకు ధరలు పెంచక తప్పదని ఆర్థికమంత్రి అంటున్నారు. ఈ అదనపు భారాన్ని తగ్గించకుంటే ఉద్యమిస్తామన్న వామపక్ష సంకీర్ణ భాగస్వాముల రాజకీయ విశ్వాసాలకు - ఆర్థిక అగత్యాలకూ లంకె లేదన్న ఆర్థికమంత్రి స్పష్టీకరణతో కిమ్మనకుండా వుండిపోయాయి. తాము పెంచిన ధరల తగ్గింపును ప్రస్తావించకుండా కేంద్ర పెట్రోలియం శాఖామంత్రి దేవ్‌రా, రాష్ట్రాలు తమ అమ్మకం పన్నును తగ్గించుకుని సామాన్యుని భారాన్ని తగ్గించాలని హితవు పలికారు. కాంగ్రెసేతర ప్రభుత్వాలు, ముందు కేంద్రం పెంచిన ధరలను ఉపసంహరిస్తే, మేం మా అమ్మకం పన్నును తగ్గిస్తామని తమ ప్రజాపక్షపాతాన్ని స్పష్టం చేశాయి! పోతే మహారాష్ట్ర-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు మాత్రం సుమారు 0.75-1 శాతం మేరకు అమ్మకం పన్ను తగ్గించి తమ ప్రజాహిత నైజాన్ని చాటి చెప్పుకున్నాయి! 2002-06 మధ్యకాలంలో ముడి చమురు బ్యారెల్‌కు 24 డాలర్ల నుండి 75 డాలర్లకు పెరిగింది. ఈ కాలంలో కస్టమ్స్, ఎక్సైజ్, సెస్, రాయల్టీ, కార్పొరేషన్ పన్నుల రూపంలో కేంద్రం రు. 96,751 కోట్ల నుండి రు. 1,26,600 కోట్ల మేరకు కొల్లగొట్టింది. ఇదే కాలంలో అమ్మకం పన్ను, సెస్‌ల రూపేణా రాష్ట్రాలు రు. 32,156 కోట్ల నుండి రు. 48,800 కోట్ల స్వంతం చేసుకున్నాయి.

పెరుగుతున్న పెట్రో వినియోగం :

ఆధునిక జీవనంలో చమురు ప్రధాన ఇంధనమైంది. రోజువారీ వినియోగం సుమారు 8 కోట్ల 25 లక్షల బ్యారెళ్ళని అంచనా. మరోవైపు ఈ సహజ వనరు ఉత్పత్తి రోజురోజుకీ దిగజారుతూ వుంది. అంతర్జాతీయ పటంలో అధికార దర్పం పడగ విప్పినపుడల్లా చమురు వనరులు బలై పోతున్న ఘటనలు, యుద్ధ దాహానికి దాహార్తిగా దోహదపడ్డ సందర్భాలూ చోటు చేసుకుంటూనే వున్నాయి. నూతన వనరుల అన్వేషణ అనుకున్నంత స్థాయిలో లేదు. ప్రపంచ మార్కెట్‌లో ఆటోమొబైల్ పరిశ్రమ ప్రముఖ స్థానానికి చేరుకుంటుంది. ఆధునిక జీవనం మోటారు వాహన వినియోగాన్నే ఆర్థిక ప్రగతికి గీటురాయిగా భావిస్తుంది. ఏటా 10 లక్షల కొత్త కార్లు, రవాణా వాహనాలు, 50 లక్షల ద్విచక్ర వాహనాలూ అమ్ముడౌతున్నాయి. రానురానూ ప్రభుత్వ రవాణా వ్యవస్థ అధ్వాన్నంగా మారడంతో, స్వంత వాహన వినియోగం తప్పనిసరి అవుతుంది. ఇందుకు సైదోడుగా విస్తృతమౌతున్న మార్కెట్ వ్యవస్థ పూర్తి రుణ సౌకర్యాన్ని వాహన కొనుగోలుకై అందిస్తుంది. దీంతో వాహన వినియోగం అనూహ్యంగా పెరుగుతోంది. మనదేశంలోనే చమురు వినియోగం ఏటా 10 శాతం పెరుగుతూ వుంది. ఈ నేపథ్యం, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు పెట్రో వినియోగం ఓ అనువైన ఆర్థిక వనరుగా మార్చింది.

ఇంధన ప్రత్యామ్నాయం అనివార్యం :

రోజురోజుకీ పెరిగిపోతున్న చమురు వినియోగానికి తగు ప్రత్యామ్నాయం తక్షణ అవసరం. సౌర, తరంగ, వాయు విద్యుత్ ఇంధన వనరుల పట్ల సరైన సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకుని సౌర విద్యుత్‌ని ఆశ్రయించాల్సిందేనని, నోబెల్ బహుమతి పొందిన భౌతిక శాస్త్రవేత్త జార్జి పోర్టర్ పేర్కొన్నారు. ప్రపంచ భూ విస్తీర్ణంలో భారత్ వాటా 2.5 శాతమే వున్నా, వ్యవసాయ భూమిలో దాదాపు 12 శాతం మనకు అందుబాటులో వుంది. ఈ నేపథ్యంలో మన ముందో మూడు ప్రత్యామ్నాయ మార్గాలున్నాయి. చక్కెరను పులియపెట్టడం ద్వారా ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడం. జత్రోఫా, కార్కస్ వంటి మొక్కల నుండి బయోడీజిల్‌ను తయారుచేయడం, జన్యు నిర్మిత ఎంజైమ్‌లను ఉపయోగించుకోవడం ద్వారా సెల్యులోజ్ వంటి బయోమాస్‌ను, ఇథనాల్ వంటి ఇంధనాలుగా మార్చుకోవడం లాంటి ప్రత్యామ్నాయాల్లోకి వెళ్ళాలి. ఈ ప్రత్యామ్నాయ ఉత్పత్తుల్లో బ్రెజిల్ ఆదర్శప్రాయంగా వుంది. ఈ దేశం చెరుకు నుంచి రోజుకు 1400 కోట్ల లీటర్ల ఇథనాల్‌ను తయారు చేస్తుంది. ఇది రెండు లక్షల బ్యారెళ్ళ గ్యాసోలిన్‌కు సమానం. పైగా ఇథనాల్‌నే మోటారు వాహనాలకు వినియోగించాలని బ్రెజిల్ చట్టం సైతం చేసింది. సుమారు 20 శాతం మేరకు వాహనాలు ఇథనాల్‌తోనే నడుస్తున్నాయి. ఈ ఇథనాల్ ఉత్పత్తి రంగంలో 10 లక్షల మందికి ఉపాధి సైతం లభ్యమయింది. ఇథనాల్ ఉత్పత్తి సంస్థలకు అక్కడి ప్రభుత్వం తక్కువ వడ్డీతో రుణ సౌకర్యాన్ని సైతం కల్పిస్తుంది. కేవలం అయిదు శాతం వ్యవసాయ క్షేత్రాల ఇథనాల్ ఉత్పత్తి, 25 శాతం వినియోగదార్ల వినిమయానికి దోహదపడుతుంది. ఇక, మనదేశానికి వస్తే, నిరుపయోగంగా పడివున్న కోటీ పన్నెండు లక్షల హెక్టార్ల నిస్సార అటవీ ప్రాంత భూముల్లో ఈ ఇంధన ఉత్పత్తిని చేపట్టవచ్చు. ఈ జీవ ఇంధనాల కోసం వ్యవసాయపరంగా రాయితీలనిచ్చి ప్రోత్సహించాలి. మౌలిక సదుపాయాలను కల్పించాలి. పరిశోధనా ఉత్పత్తి కార్యక్రమాలను చేపట్టాలి. తద్వారా ఇంధన స్వయంసమృద్ధితో పాటు, విదేశీ మారక ద్రవ్యమూ ఆదా అవుతుంది.

పెట్రో పన్నుల నియంత్రణా విధానానికి చేపట్టాల్సిన చర్యలు

చమురు కంపెనీల యాజమాన్యాలను సంబంధిత పాలనాశాఖల నుంచి తప్పించాలి. లేకుంటే ఇప్పటి మాదిరిగానే ఎన్నికల సమయంలో ఉపేక్షించి, ఎన్నికల అనంతరం వడ్డించే క్రమానికి ఒరవడి కాగలదు. చమురు కంపెనీల నిర్వహణా తీరులను ప్రక్షాళన చేయాల్సి వుంది. తద్వారా అసమర్థ యాజమాన్య ధోరణులకు స్వస్తి చెప్పే మార్గం సుగమం కాగలదు. కానీ ప్రభుత్వం చేపట్టిన ప్రైవేటీకరణ విధానాలు మార్కెట్ పోటీని ప్రోత్సహించే లక్ష్యదిశగా సాగుతున్నందున స్వేచ్ఛా మార్కెట్‌తో ఈ యాజమాన్యాలను నియంత్రించడం సాధ్యం కాక పోవచ్చు. పోటీ ప్రపంచంలో ఆధిపత్య ధోరణులకు స్వస్తి పలకొచ్చని పాలకవర్గాలు చెప్తున్నా, ప్రజాహిత లక్ష్యం లేనిదే మంచి ఫలితాలను సాధించు కోలేమన్నది అనుభవం నేర్పిన పాఠం.... ◆

బెంగాల్ ఎన్నికల్లో మార్క్సిస్టు పార్టీ విజయమూలాలు

– సుధాకర్.ఎస్

పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టుల కూటమి మూడు దశాబ్దాలకు పైగా వరుసగా విజయాల్ని సాధించడమన్నది ఎన్నికల చరిత్రలోనే ఒక మహాద్భుతం. గత విజయాలకన్న నిన్నటి మార్క్సిస్టుల విజయం సహజంగానే దేశవ్యాప్తంగా ఎంతో కుతూహలాన్ని, మరెంతో ఆసక్తిని రేకెత్తించింది. వారి వారి ఆసక్తి అవగాహనల మేరకు ఆ విజయ రహస్యాల్ని సాధారణమైన పైపై విశ్లేషణలతో కొందరు మదింపు వేసే ప్రయత్నం చేస్తుంటే మరికొందరు ఎంతో గంభీరంగా తమ అసహనాన్ని, అజ్ఞానాన్ని ప్రదర్శించడం చారిత్రక విషాదం. ప్రతిపక్షాల మధ్య ఓట్ల చీలిక రాజకీయ పార్టీల పట్ల సామాజిక వర్గాల మొగ్గులో వస్తున్న మార్పులు, మారుతున్న పట్టణ–గ్రామీణ ప్రాంతాల ఓటర్ల మనోభావాలు, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో నూతన ఆర్థిక విధానాలు–గ్లోబలైజేషన్‌లకు అనుకూలంగా బుద్ధదేవ్‌లాంటి నాయకుల ప్రకటనలు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని రంగాలలో వ్యవస్థీకృతమై పోయిన పార్టీ కార్యకర్తలు చేస్తున్న సైంటిఫిక్ రిగ్గింగ్ లాంటి కారణాలు మార్క్సిస్టుల విజయాన్ని ప్రభావితం చేశాయన్నది ఒక మదింపు. మరోవైపు, అక్కడ పోటీ చేస్తున్న మార్క్సిస్టు పార్టీ అసలు కమ్యూనిస్టు పార్టీనే కాదని, ఆ పార్టీకి మార్క్సిజం అజెండా కానే కాదని, అది కేవలం గత కాంగ్రెస్ పార్టీకి నకలుగా మారిపోయిన వామపక్ష మొగ్గుగల మధ్యేవాద పార్టీ మాత్రమేనని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఆ పార్టీ అలా దిగజారిపోవడం కూడా వారు సాధించిన మరో ఘనకార్యమని విశ్లేషించబూనుకోవడం అటు చరిత్రను ఇటు మార్క్సిజాన్ని కించపరచడంగానే భావించాలి.

బెంగాల్ ఎన్నికల్లో మార్క్సిస్టుల విజయం యాభై సంవత్సరాల స్వతంత్ర భారతదేశ చరిత్రలో సంభవించిన ఒక అసాధారణమైన చారిత్రక ఘటన. చైతన్యపూరితమైన సామాజికోద్యమాలకు పేరెన్నికగన్న బెంగాల్ సమాజం ఆ విజయానికి భూమికైతే, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన కామ్రేడ్స్ పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు, జ్యోతిబసు, 1970వ దశాబ్దంలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వంలో వ్యవసాయమంత్రిగా పనిచేసిన హరేకృష్ణ కోనార్ లాంటి కమ్యూనిస్టు నాయకులెందరో ఆ విజయానికి స్ఫూర్తి ప్రదాతలు. ఇంతటి నిర్దిష్టమైన చారిత్రక ప్రాధాన్యత కలిగిన అంశాన్ని సమీక్షించే ముందు దాని వెనుక దాగిన చారిత్రక మూలాలను, సైద్ధాంతిక ఆచరణకు సంబంధించిన మౌలిక అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా పోటీ పరీక్షల ప్రాతిపదికన అవును–కాదు అని తీర్పులివ్వడం అంత మంచి పద్ధతి కాదు. సామాజిక, రాజకీయోద్యమాలకు సంబంధించిన ఆచరణపై అంతిమ తీర్పుల్ని ప్రకటించాల్సింది ప్రజలు మాత్రమే. అలాగే ఒక రాజకీయపార్టీకి సంబంధించిన సైద్ధాంతిక అవగాహన, ఆచరణతో విభేదించే హక్కు ఎవరికైనా వుంటుంది. ఉండాలి. అలాగని, ఎనిమిది దశాబ్దాలుగా మార్క్సిజమే ఎజెండాగా ప్రకటించుకొని ప్రజల్లో తమ అవగాహన మేరకు పనిచేస్తున్న ఒక కమ్యూనిస్టు రాజకీయపార్టీని అదసలు కమ్యూనిస్టు పార్టీ కాదని, దానికి మార్క్సిజం ఎజెండా కానే కాదని ప్రకటించడం విజ్ఞతతో కూడిన విశ్లేషణ అనిపించుకోకపోగా అరాచకంగా మాత్రమే మిగిలిపోతుంది.

దేశవ్యాప్తంగా జరుగుతున్న అన్ని ఎన్నికలకు ముందు, తరువాత జరుగుతున్న విశ్లేషణలలో పాటించే పద్ధతుల్నే బెంగాల్ ఎన్నికల విశ్లేషణకు కూడా యాంత్రికంగా అన్వయిస్తే పాక్షిక సత్యాల్ని మాత్రమే అందించడం సాధ్యమవుతుంది. ఏ సిద్ధాంతం, ఏ రాజకీయాచరణలైతే అక్కడి విజయాలకు మూలమో వాటి ఉనికిని, అస్తిత్వాన్ని, తమ విశ్లేషణల పేరుతో పూర్తిగా నిరాకరించడమే కాకుండా, వక్రీకరించే ప్రయత్నాలకు పూనుకోవడం యాదృచ్ఛికం కాదు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అత్యంత హేయమైన కుట్ర పద్ధతులలో కొనసాగుతున్న గ్లోబలైజేషన్, సామ్రాజ్యవాద దురాక్రమణలకు వ్యతిరేకంగా మార్క్సిజాన్ని, కమ్యూనిస్టు పార్టీల ఆచరణను ఒక ప్రత్యామ్నాయంగా గుర్తించడానికి నిరాకరించే ప్రయత్నంగా కూడా ఆ విశ్లేషణల్ని భావించాలి. విప్లవమంటేనే ఆయుధాలతో కూడిన విధ్వంసమని, కమ్యూనిజం అంటే రక్తపాతమని, మార్క్సిజం అంటే అభివృద్ధిని అడ్డుకోవడమనే అశాస్త్రీయమైన భావ జాలం కూడా ఆ విశ్లేషణలకు మూలం. ఏకె 47 తుపాకీ కాదుకదా కనీసం తపంచాలాంటి నాటు తుపాకీని గూర్చి కూడా ఆలోచించని పార్టీని కమ్యూనిస్టు పార్టీగా గుర్తించడం అలాంటి భావజాలంతో కొట్టుకుపోయేవారికి కష్టమైనపనే.

కమ్యూనిజం, మార్క్సిజం వాటి ఆచరణగా కొనసాగే 'విప్లవం' లాంటి మౌలిక అంశాల్ని రేఖామాత్రంగానైనా నిర్వచించే ప్రయత్నం చెయ్యకుండా పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో ఇప్పటివరకు మార్క్సిస్టులు సాధించిన విజయరహస్యాల్ని ఛేదించడమన్నది అసాధ్యమైనపనే. మార్క్సిజం సిద్ధాంతంగా కమ్యూనిస్టు పార్టీ ఆచరణలో కొనసాగే విప్లవానికి 'మౌలికమైన' అర్థం–ఏ సమాజంలోనైన ఆ సమాజ పురోభివృద్ధికి, మానవసంబంధాల, మానవ వనరుల వికాసానికి అవరోధంగా నిలిచే కరుడుగట్టిన (స్టాగ్నేటెడ్) సామాజిక నిర్మాణాల్ని (సోషల్ స్ట్రక్చర్స్) సమూలంగా (రాడికల్) నిర్మూలించి, నూతన సమాజ నిర్మాణాలకు దారిని సుగమం చెయ్యడమే విప్లవ ఆచరణకు కనిష్ఠస్థాయిలోను, గరిష్ఠస్థాయిలోను శాస్త్రీయమైన అర్థం, నిర్వచనం కూడా. అలాంటి సమూలమైన మార్పును సాధించడమన్నది సాయుధంగానా, నిరాయుధంగానా లేదా కేవలం చర్చలతోనా అన్నది ఆయా సమాజాల్లో నెలకొన్న నిర్దిష్ట పరిస్థితులే నిర్ణయిస్తాయి. ఇప్పటివరకు ప్రపంచ చరిత్రలో సంభవించిన సమూలమైన సామాజిక మార్పులన్నీ (అమెరికన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్‌తో సహా) తీవ్రమైన

ఘర్షణల అనంతరం మాత్రమే సాధ్యమయ్యాయన్నది చారిత్రక పాఠం.

ముప్ఫై సంవత్సరాల క్రితం 1965-1975 దశాబ్దంలో సిపిఐఎం నాయకత్వంలో 'ఆపరేషన్ బర్గా' పేరుతో అప్పటివరకు పశ్చిమబెంగాల్ సమాజంలో సన్నకారు, చిన్నకారు, మధ్యతరగతి రైతుల్ని (బర్గాదార్స్) భూస్వాములైన 'జోతేదార్‌ల' నాయకత్వంలో పట్టి పీడించిన 'కౌలు' వ్యవస్థను సమూలంగా నిర్మూలించడం జరిగింది. ఒక్కొక్క సమాజంలో ఆయా చారిత్రక పరిస్థితుల నేపథ్యంలో ఒక్కో సమస్య తీవ్రస్థాయిలో పరిష్కారాన్ని కోరుతూ ప్రజల ముందుకు రావడం జరుగుతుంది (1950లో తెలంగాణా జిల్లాల్లో వెట్టిచాకిరి సమస్య, నేటి తెలుగు సమాజంలో 'భూమి' సంబంధమైన సమస్యల్లాగా). బెంగాల్ సమాజాభివృద్ధికి అడ్డుగా నిలుస్తున్న అనేక నిర్మాణాల్లో ఒకానొక నిర్మాణమైన కౌలు వ్యవస్థ నిర్మూలన అన్నది ఆనాటి మార్క్సిస్టు పార్టీ ఘనవిజయమని చెప్పక తప్పదు. ఇటు పార్టీ కార్యకర్తలను అటు ప్రభుత్వ యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో సన్నద్ధ పరిచి, కౌలు వ్యవస్థ నిర్మూలనతో సాధించిన విజయాల్ని బెంగాల్ గ్రామీణ ప్రాంత రైతాంగానికి సమగ్రంగా, సమర్థవంతంగా అందించడం మూలంగా లబ్ధిపొందిన అశేష రైతాంగమే దశాబ్దాలుగా బెంగాల్ ఎన్నికల్లో మార్క్సిస్టుల విజయాలకు మౌలికమైన చోదకశక్తి. అదే చారిత్రక సందర్భంలో అంతర్జాతీయ విప్లవోద్యమ గమనంలో సంభవించిన పరిణామాల ఒత్తిడి ఫలితంగా ముందుచూపు కోల్పోయిన మార్క్సిస్టుల సైద్ధాంతిక అవగాహనారాహిత్యం భవిష్యత్ ఎన్నికల్లో తమ విజయాలకు గండి కొట్టగలిగిన సామాజిక శక్తులు రూపుదిద్దుకోవడానికి దోహదం చేసిందన్నది కూడా చరిత్రే. అలా రూపుదిద్దుకున్న శక్తులే నేడు పశ్చిమ బెంగాల్‌లో బలమైన ప్రతిపక్షంగా నిలుస్తున్న తృణమూల్ కాంగ్రెస్‌కు, మరో బలమైన విప్లవ పార్టీగా రూపుదిద్దుకుంటున్న మావోయిస్టులకు మౌలికమైన చోదక శక్తులుగా నిలవడం గమనార్హం.

మార్క్సిజం ఒక సిద్ధాంతంగాను, విప్లవం ఒక ఆచరణగాను 1960 దశాబ్దంలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తీవ్రమైన ఆటుపోట్లకు గురికావడం జరిగింది. రష్యా-చైనా కమ్యూనిస్టు పార్టీల మధ్య సైద్ధాంతిక ఘర్షణ, భారతదేశంలో నక్సల్బరీ వసంతకాల మేఘగర్జనలు అందులో భాగమే. ఆ క్రమాన్నే చరిత్రలో నేటికీ 'గ్రేట్ డిబేట్'గా పరిగణించడం జరుగుతోంది. ఆ గ్రేట్ డిబేట్ పరిణామాల ఫలితమే భారతదేశంలో చంద్రరాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య లాంటి నిజాయితీ, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకులు కూడా 'ప్రస్తుతం సాయుధ విప్లవం' ద్వారా సమాజంలో సమూలమైన మార్పులు తీసుకురావడానికి పరిస్థితులు పరిపక్వంగా లేవనే నిర్ధారణతో సాయుధ పోరాటాన్ని విరమించుకోవడం జరిగింది. ఆపరేషన్ 'బర్గా' నాటికే భారతదేశంలో మార్క్సిస్టులు విప్లవం పట్ల, సాయుధపోరాటం పట్ల విముఖతతో కూడుకున్న నిర్ధారణకు రావడం మూలంగా అటు బెంగాల్ సమాజంతో పాటు మొత్తం దేశవ్యాప్తంగా వ్యవస్థీకృతమై కొనసాగుతున్న అభివృద్ధి నిరోధక భూస్వామ్య భావజాల సామాజిక నిర్మాణాల్ని సమూలంగా నిర్మూలించే ఆచరణకు దూరం కావడం జరిగింది. ఈ ప్రమాదకరమైన అవగాహనే బెంగాల్ సమాజంలో కౌలుతో ముడిపడ్డ భూమి, జోతేదార్ల వ్యవస్థ రద్దుతో చేకూరిన ప్రయోజనాలు దక్కని ఆదివాసి గిరిజనులను, భూమిలేని కూలీలను, దళితులను పూర్తిగా నిరాదరణకు గురిచేయడమే కాకుండా ఈ వర్గాల్ని తీవ్రమైన అసంతృప్తికి గురి చేసింది.

మరోవైపు, ఈ ముప్ఫై సంవత్సరాలుగా సంభవించిన అనేక మార్పులతో మార్క్సిస్టులకు బెంగాల్ సమాజంలో బలమైన చోదక శక్తిగా మిగిలిపోయిన గ్రామీణ రైతాంగంలో కూడా గణనీయమైన మార్పులే చోటుచేసుకోవడం జరిగింది. ఈ మార్పుల మూలంగా కోల్పోతున్న శక్తుల్ని వేరే మార్గాల్లో కూడగట్టుకునే ప్రయత్నంలో భాగంగానే బుద్ధదేవ్‌లాంటి నాయకులు గ్లోబలైజేషన్ - నూతన ఆర్థిక విధానాలకు అనుగుణంగా మాట్లాడే ప్రయత్నం. ఆపరేషన్ బర్గాతో మార్క్సిస్టులు ఇంతకాలంగా గణనీయమైన స్థాయిలో ప్రయోజనం పొందగలిగారంటే, కౌలు వ్యవస్థ రద్దు మూలంగా సాధించిన ఫలితాల్ని పొందగలిగిన 'రైతాంగం' ఆనాటికి గణనీయంగా అస్థిత్వంలో వుండడమే. ఆపరేషన్ బర్గా తదనంతరం మార్క్సిస్టులు భూమిలేని పేదల్ని, గిరిజనుల్ని, దళితుల్ని తమ ఆచరణతో మమేకం చేసుకోగలిగుంటే 'ఆపరేషన్ బుద్ధదేవ్' లాంటి ప్రజావ్యతిరేక ప్రయోగాల అవసరం తలెత్తేది కాదు. ఆపరేషన్ బుద్ధదేవ్ పూర్తిగా ప్రజా వ్యతిరేకమైనదే కాకుండా అది మార్క్సిస్టులకు ఏ కోణం లోను దీర్ఘకాలిక ప్రయోజనాల్ని చేకూర్చిపెట్టడం సాధ్యం కాదు. ఎందుకంటే, బుద్ధదేవ్ ఆలోచనలు సఫలం కావాలంటే ఈ దేశంలో ప్రజల పట్ల, ప్రజా ప్రయోజనాలపట్ల, దేశ ప్రయోజనాల పట్ల, చిత్తశుద్ధితో కూడిన ప్రేమ, ఆశక్తి, దేశభక్తి కలిగిన జాతీయ పెట్టుబడిదారీ (నేషనల్ బూర్జువా) వర్గం గణనీయమైన స్థాయిలో అస్థిత్వంలో ఉండాలి. ఆకలి చావులకు గురౌతున్న రైతుల శవాల గుట్టల్ని తన్నుకుంటూ విదేశీ అప్పులకు ఎగబడుతున్న భారత పెట్టుబడిదారులమని చెప్పుకుంటున్న దళారుల్ని చూస్తుంటే అలాంటి దేశభక్తి కలిగిన వర్గం ఒకటుందనే నమ్మకం కలగడం లేదు. ఆపరేషన్ బుద్ధదేవ్ మార్క్సిస్టు పార్టీకి చిన్నపాటి ప్రయోజనాన్నైనా మిగులుస్తుందో లేదో తెలియదు. కాని ఆ పార్టీకి ఇప్పటివరకు కాస్తో కూస్తో కార్మిక వర్గంలో మిగిలిన పట్టును కూడా దూరం చేస్తుందేమోనన్న భయం మాత్రం వెంటాడుతోంది. ఈ దేశ ప్రజల ఆకలి, అభద్రతల్ని రూపుమాపలేని అభివృద్ధి ప్రణాళికలు ఎంతటి 'నూతన'మైనవైనా ప్రజలు వాటిని అంగీకరించడం సాధ్యం కాదన్నదానికి ఆంధ్రప్రదేశ్‌కన్నా గొప్ప ఉదాహరణ ఉండదు.

అలాగే, మరో ప్రయోగంగా దక్షిణ భారతదేశంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు సమాజంలో బివి రాఘవులు లాంటి మార్క్సిస్టు పార్టీ నాయకులు తెలుగు సమాజ సమగ్రాభివృద్ధికి అడ్డంకులుగా వ్యవస్థీకృతమైపోయిన 'కులవ్యవస్థను', వెంటబడి తరుముకొస్తున్న అభివృద్ధితో అన్నిటికీ దూరం చేయబడుతున్న గిరిజనుల బతుకుల్లో చెలగాటమాడుతున్న 'అభద్రతా వ్యవస్థ'ను సమూలంగా నిర్మూలించాలనే పిలుపుతో 'యాత్రల్ని' ప్రారంభించడం మరో మలుపులాంటి ఘటన. యాభై సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో అధిక సంఖ్యాకులైన దళితులకు 'భూమి'లో ప్రవేశం మాట దేవుడెరుగు కనీసం దేవుడి గుడిలోకి కూడా ప్రవేశం దక్కలేదన్న సత్యాన్ని ప్రపంచానికి చాటింపు

వేసే స్థాయిలో చేతికి దొరికిన 'రాళ్ళనే' ఆయుధాలుగా ప్రయోగిస్తున్న రాఘవులుగారి కుల నిర్మూలనా యాత్రల్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయాల్సిందే. భూస్వామ్య భావజాలంతో తులతూగుతున్న అభివృద్ధి నిరోధక సామాజిక నిర్మాణాల్ని సమూలంగా నిర్మూలించే కార్యాచరణ చేపట్టకుండా కేవలం సిద్ధాంతాలకే పరిమితమైపోయిన మార్క్సిస్టు ఆచరణతో ప్రజల్ని కూడగట్టడం సాధ్యం కాదన్న సత్యం మార్క్సిస్టు నాయకులకు మరోసారి బలంగా గుర్తుకురావడం మూలంగానే బివి రాఘవులుగారి నాయకత్వంలో తీవ్రస్థాయిలో ఒక ఆచరణకు పూనుకొనే ప్రయత్నం జరుగుతుందేమోననిపిస్తోంది.

అటు బుద్ధదేవ్ ఇటు బివి రాఘవులు లాంటి మార్క్సిస్టు పార్టీ నాయకుల ఆచరణను గమనిస్తుంటే భారత కమ్యూనిస్టు మార్క్సిస్టు పార్టీ ఎంతటి చారిత్రక సంక్షోభాన్ని, మరెంతటి గందరగోళాన్ని ఎదుర్కుంటుందో అర్థం చేసుకోవచ్చు. చారిత్రాత్మకమైన బెంగాల్ ఎన్నికల విజయాల్లో దాగిన చారిత్రక మూలాల్ని సగర్వంగా ప్రపంచానికి చాటుకోలేని స్థితి కూడా ఆ గందరగోళం ఫలితమే. అలా చాటు కోవాలంటే మార్క్సిజం - విప్లవాలపట్ల 1960 దశాబ్దంలో నిర్ధారణకు వచ్చిన తమ అవగాహనను పూర్తిస్థాయిలో పునఃసమీక్షించుకోవాలేమో నన్న సందేహం. అంతిమంగా అలాంటి సమీక్షలు భూస్వామ్య భావజాల వ్యవస్థలతో తీవ్రస్థాయిలో ఘర్షణ పడక తప్పని స్థితికి దారితీస్తాయేమో నన్న సందిగ్ధం. అంతటి సమీక్షతో అన్ని ఇబ్బందుల్ని ఎదుర్కోవడం ఇష్టంలేని మార్క్సిస్టు పార్టీ అగ్రనాయకత్వం అంతర్గతంగా భూస్వామ్య భావజాల వ్యవస్థ మూలంగా భారత ప్రజలు కోల్పోతున్న హక్కులకన్న అంతర్జాతీయంగా అమెరికన్ సామ్రాజ్యవాద దోపిడి మూలంగా ఎక్కువ కష్టాల్ని ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తుందనే వాదాన్ని ముందుకు తెస్తున్నారు. భారతదేశంలో అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సిపిఐఎం నిర్వహించినన్ని ధర్నాలు, నిరసన కార్యక్రమాలు మరే ఇతర పార్టీ కూడా నిర్వహించలేక పోయిందన్నది వాస్తవం. ఆ నిరసనలు, ధర్నాలన్నీ కూడా ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ లాంటి ద్రవ్య సంస్థల పేరుతో విధిస్తున్న అప్పులపై షరతులకు వ్యతిరేకంగా మాత్రమేనన్నది మరో చారిత్రక సత్యం. సామ్రాజ్యవాద స్వరూపం, స్వభావాల్ని అర్థం చేసుకోవడంలో కూడా ఎక్కడో వైఫల్యం ఉందేమోనన్న అనుమానం ఆ పోరాట రూపాల్ని పరిశీలిస్తే అర్థం అవుతుంది. అమెరికన్ సామ్రాజ్యవాదమంటే అప్పులిచ్చే ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్‌లాంటి ద్రవ్య సంస్థలే అనుకొని వాటినుండి 'షరతులు'లేని అప్పులు సంపాదించడమే ఘనవిజయం అనుకుంటే పొరబడ్డట్టే.

వాస్తవంలో 'సామ్రాజ్యవాదం' అంటే అప్పులూ కాదు, ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ లాంటి ద్రవ్యసంస్థలు అంతకన్న కాదు. అవి కేవలం ప్రపంచ ప్రజల్ని, ప్రభుత్వాల్ని మభ్యపెట్టి లోబరుచుకోవడానికి ప్రాథమిక స్థాయిలో ఉపయోగపడే తాయిలాలు మాత్రమే. వాటికి లొంగని ప్రజల్ని, దేశాధినేతల్ని, దేశాల్ని, ఎంతటి క్రూరంగా కబళిస్తారో క్రికెట్ మ్యాచ్ చూసినట్టు మనం నిత్యం చూస్తునే వున్నాం. సామ్రాజ్యవాదమంటే బలమైన విస్తరణ కాంక్షతో రగిలిపోయే ఒక జాత్యహంకారం. ప్రపంచవ్యాప్తంగా ఆ జాతి ప్రయోజనాల్ని నెరవేర్చడానికి బలమైన రాజ్య యంత్రాంగం కలిగిన ఒక ఆక్టోపస్. అన్నిటిని మించి అత్యంత అధునాతనమైన మారణాయుధాలతో మానవత్వం మచ్చుకైనా కనిపించని సైనికశక్తి. అంతటి దుర్మార్గమైన సామ్రాజ్యవాద శక్తికి వ్యతిరేకంగా పోరాటాలు సాగించాలంటే ఎన్ని ధర్నాలు, మరెన్ని తీర్మానాలైతే సరిపోతాయో ఆలోచించాల్సిందే. సామ్రాజ్యవాదం పట్ల భారత కమ్యూనిస్టు మార్క్సిస్టు పార్టీ నాయకత్వానికి సరైన అవగాహనే ఉండి వుంటే నేపాల్ మావోయిస్టులకు వారి మద్దతు మరోరకంగా ఉండేదేమో.

చారిత్రకంగా ఇంతటి నష్టాలు జరిగినప్పటికీ, భారత ప్రజలు తమ కష్టాల కడగళ్లనుండి విముక్తి పొందడానికి నేటికీ ఎంతో ఆశ, మరెంతో ఆశక్తితో ఈ దేశ కమ్యూనిస్టు, విప్లవ శక్తులవైపే చూస్తున్నా రన్నది వాస్తవం. ఈ దేశంలో కమ్యూనిస్టు, విప్లవకారుల ఐక్యతకు చిత్తశుద్ధితో కూడిన కార్యాచరణతో ప్రయత్నిస్తే, ఆ 'ఐక్యత' భవిష్యత్ ప్రపంచ మానవాళి చరిత్రను తిరగరాసే శక్తిగా ఉద్భవిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒక చారిత్రాత్మక విజయం మరో చారిత్రాత్మక విజయానికి పునాది కావాలని ఆశిద్దాం. ◆

సంస్మరణ



'వీక్షణం'కు సన్నిహిత మిత్రుడు డా. పి.వి.ఆర్. భాస్కరరావు జూన్ 28న మరణించారు. హృద్రోగ వైద్యనిపుణుడిగా పేరుపొందిన డా. భాస్కరరావు అంతే అభినివేశంతో ప్రజానుకూల రాజకీయార్థిక విధానాలను సమర్థించి, ప్రచారం చేయడంలోను, ప్రజావ్యతిరేక రాజకీయార్థిక విధానాలను విశ్లేషించి ఎండగట్టడంలోను అగ్రభాగాన నిలిచారు. ప్రఖ్యాతమైన గుడ్ బై టు బైపాస్ సర్జరీ పుస్తక రచయితగానే కాక ఎన్నో పత్రికలకు ఎన్నో వ్యాసాలు రాసి, ఎన్నో సభలలో మాట్లాడి, ఎన్నో సమావేశాలు ఏర్పాటు చేసి, ఎన్నో సందర్భాలలో ప్రజాసంఘాల ఐక్యసంఘటనలలో భాగం పంచుకుని ఆయన జీవితంలోని విలువైన భాగాన్ని ప్రజాసేవకు అంకితం చేశారు. పీపుల్స్ ఎఫెక్టివ్ అండ్ ఎకనమిక్ మెడికేర్ అనే సంస్థను స్థాపించి కార్పొరేట్ వైద్యసేవల మోసాన్ని ఎదుర్కోవడానికి ప్రయత్నించారు. 2004 అసెంబ్లీ ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు ప్రపంచబ్యాంకు బానిసత్వాన్ని వివరిస్తూ కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. 'వీక్షణం' ప్రారంభమయి నప్పటినుంచీ సన్నిహితంగా ఉంటూ 2003 జనవరి 16-31 సంచికలో, 2003 జూన్ 1-30 సంచికలో 2003 జులై 1-15 సంచికలో, 2005 ఆగస్టు సంచికలో విలువైన వ్యాసాలు రాశారు. ఆయన ప్రజానుకూల కృషిని 'వీక్షణం' వినమ్రంగా సంస్మరించు కుంటోంది.

ఎస్సీలకు కోట్లాది నిధుల ఎగనామం

- వి. హనుమంతరావు

ఎస్సీల కోసం, ఎస్సీల గురించి రాజ్యాంగం, అనేకానేక చట్టాలు వాచా కర్మణా అమలుపరచి వుండి వుంటే, భారతదేశంలో పేదరికం ఎపుడో అంతరించి వుండేది. పేదరిక నిర్మూలనకు గత 50 సంవత్సరాల్లో వెచ్చించిన వేలకోట్ల రూపాయలు అభివృద్ధి కార్యక్రమాలపై ఖర్చు చేసే అవకాశం లభించి వుండేది. కాని పేదల్లో నిరుపేదలుగా ఎస్సీలు మిగిలిపోయారంటే ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో చెప్పకనే చెపుతుంది. ఇందుకు ఎన్ని ఉదాహరణలైనా ఇవ్వవచ్చు.

రాష్ట్ర జనాభాలో ఎస్సీలు 15 శాతంగా వున్నారు కాబట్టి ప్రతి మంత్రిత్వ శాఖ తన కేటాయింపులో 15 శాతం నిధులను ఎస్సీల కోసం ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్దేశమైతే చేసింది కాని, దానిని అమలు పరచటం దాని ఉద్దేశం కాదని ఆచరణలో రుజువు చేసింది. దీనినే స్పెషల్ కాంపొనెంట్ ప్లానుగా (ఎస్‌సిపి) పిలుస్తారు. ఎస్సీల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచాలనేదే ప్రభుత్వం తన లక్ష్యంగా చెప్పుకొంది. కాని ఈ లక్ష్య సాధన తన లక్ష్యం కాదని, ఆచరణలో తనకు తానే రుజువు చేసుకొంది. 1992-93 నుంచి వివిధ శాఖలు ఈ ప్లాన్‌ను ఎలా అమలు పరిచాయో, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ సామాజిక సంక్షేమ శాఖ నుంచి సేకరించిన సమాచారం ఈ కింది పట్టికలో చూడవచ్చు.

ఎస్సీలపట్ల పాలకులు ఒలకబోస్తున్న ప్రేమ వొట్టి నటనేనని ఈ గణాంకాలు తెలియచేస్తుంది. 1) నిజంగా 15 శాతం ఎపుడూ కేటాయించలేదు. 2) పట్టికలో ఉదహరించిన 14 ఏళ్లలో ఏడు సంవత్సరాల పాటు తగ్గించిన కేటాయింపును కూడా ఖర్చుచేయలేదు. 3) 15 శాతం ప్రకారం రు. 13921 కోట్లు కేటాయించాల్సి వుండగా అందునుంచి రు. 6703.11 కోట్లు అంటే సగం మొత్తం ఎస్సీల కోసం ఖర్చు చేయకుండా ఇతర పద్దులకు మళ్ళించారు. 4) ఎనిమిది సంవత్సరాల్లో ఎస్సీల కేటాయింపు 15 శాతం మాట అటుంచి ఎనిమిది శాతం కూడా దాటలేదు. అయ్యా, పరిస్తితి ఇలా వుంది, మీరైనా కలుగచేసుకోండి అని ప్రస్తుత ముఖ్యమంత్రిని అభ్యర్థిస్తే, ఆ అభ్యర్థన పత్రాన్ని సామాజిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శికి పంపి చేతులు దులిపేసుకొన్నారు. 15 శాతం ఖర్చు కేటాయింపు ఖర్చు బాధ్యతను తత్సంబంధిత శాఖలకు అప్పగిస్తే నోడల్ శాఖగా ఏర్పాటు చేయాలని 2004 సంవత్సరంలో కోరగా, ఇప్పటికీ ఎటువంటి చర్యా తీసుకోలేదు. ఎందుకు తీసుకొంటారు? వారి వర్గ, కుల దృక్పథం ఎటువంటి చర్చనూ తీసుకోనివ్వదు. ప్రభుత్వమే ఏర్పాటు చేసిన ఒక కమిటీ కూడా అలాంటి నోడల్ శాఖగా గుర్తించాలని తన నివేదికలో సిఫార్సు చేసినా

(రు. కోట్లలో)

సంవత్సరం	శాఖలకు మొత్తం కేటాయింపు	కేటాయింపులో 15 శాతం	వాస్తవంగా ఎస్‌సిపి కేటాయింపు	వాస్తవ కేటాయింపు శాతం	ఎస్‌సిపి ఖర్చు	శాఖల మొత్తం కేటాయింపులో ఖర్చు శాతం	పూర్తి ఖర్చు చేయకుండా మిగిలిన మొత్తం
92-93	1997	300	171	8.56	183	9.15	117
93-94	2075	311	208	10.01	215	10.36	96
94-95	2170	325	257	11.83	217	10	109
95-96	2720	408	301	11.05	267	9.83	141
96-97	2773	416	233	8.39	228	8.22	188
97-98	3585	538	340	9.48	214	5.97	324
98-99	4679	702	511	10.92	533	11.38	169
99-2000	5479	822	545	9.95	189	3.46	632
00-01	8228	1234	451	5.48	344	4.19	889
01-02	8319	1248	407	4.89	225	2.71	1023
02-03	8553	1283	904	10.56	874	10.22	409
03-04	10970	1646	1189	10.83	1374	12.53	2.71
04-05	13291	*2153	1219	9.17	1341	10.09	812
05-06	15651	*2535	1013	6.47	-	-	1522
మొత్తం	90492	13921	7746	127.6	6203	108.11	6703

*2001 జనాభా లెక్కల ప్రకారం అంకెలు రౌండాఫ్ చేయబడ్డాయి. ఆధారం : సోషల్ వెల్‌ఫేర్ శాఖ

లాభంలేకపోయింది. పదిహేను శాతం ఖర్చు చేయాలని కేంద్రం తాఖీదు ఎపుడో 1980లో ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది కాని, లేకపోతే అది కూడా చేసి వుండేది కాదేమో.

ఇందిరమ్మ పథకం అంటూ ప్రభుత్వం పెద్ద పెట్టున ప్రచారం చేస్తుంది. ఆ ఇందిరమ్మే ఎపుడో 1980లోనే రాష్ట్ర ముఖ్యమంత్రులకు ఒక లేఖ వ్రాస్తూ, ఎస్సీల దయనీయ స్థితిగతులను పేర్కొని, స్పెషల్ కాంపోనెంట్ ప్లాను తయారు చేయమంటే ఆమె ఆవేశానికి ఈ గతి పట్టింది. ఆమె లేఖలో మరో విషయం కూడా చెప్పింది. ఎనిమిదో ప్రణాళికాంతం లోగా ఈ సహాయం కనీసం 50 శాతం మంది ఎస్సీలకు అందాలని అర్థించింది. ఇపుడు పదో ప్రణాళిక చివరన వున్నాం. ఏదీ ఆచరణ? ప్రస్తుత ప్రధాని అపుడు ప్రణాళికా సంఘం మెంబర్ - సెక్రటరీ హోదాలో అదే విషయాన్ని తాను కూడా ఒక లేఖ రాస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులను కోరారు. రాజ్యాంగం నిర్దేశిస్తేనే దిక్కులేదు, అభ్యర్థనలు, వేడికోళ్ళు పనిచేస్తాయా? తాటాకు చప్పుళ్ళకు కుందేళ్ళు బెదరడమా? ప్రభుత్వ వైఫల్యాన్ని కొంతమంది నాయకులు అవకాశంగా తీసుకొని ఎస్సీలను పెడదోవ పట్టిస్తున్నారనే వ్యాఖ్యలు వినవస్తున్నాయి.

భూ సంస్కరణలు

15 శాతం కేటాయింపు, స్కాలర్‌షిప్పులు, రిజర్వేషన్లు, వాటికోసం ఆందోళనలు అవసరమే. శాంతియుతంగా, చట్టబద్ధంగా పోతే సమస్యలు పరిష్కారం కావని ప్రభుత్వ ప్రవర్తనే చెబుతుందని మేధాపాట్కర్ నిరాహార దీక్ష సందర్భంలో అరుంధతీ రాయ్ విమర్శించారు. కాని దీని వెనుక అసలు కుట్ర వేరే వుంది. ఇలాంటి చిన్న సమస్యల వలయంలో ఎస్సీలు, వారి నాయకులు కొట్టుమిట్లాడేలా చేసి, ఎస్సీల అసలు సమస్య భూసంస్కరణల నుంచి వారి దృష్టిని మళ్లించడమే పాలకుల లక్ష్యం. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ అర్థగణాంక శాఖ భూకమతాల గురించి విడుదల చేసిన సమాచారం ప్రకారం ఎస్సీల కమతాల సంఖ్య 1995-96లో 12.85 లక్షల నుంచి 2000-01లో 13.67 లక్షలకు, వాటికింద వున్న భూమి విస్తీర్ణం 10.66 లక్షల హెక్టార్ల నుంచి 2000-01లో 11.33 లక్షలకు పెరిగింది. విస్తీర్ణంలో కొంత పెరుగుదల ఉన్నప్పటికీ, కమతాల సంఖ్యలో కూడా పెరుగుదల వుండడం వల్ల సగటు కమతం విస్తీర్ణం 95-96లోను, 2000-01లోను కూడా 0.83 హెక్టార్లు గానే వుండిపోయింది. ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్నట్టుగా వున్నాయి ఎస్సీల బతుకులు. కుంట, సెంటు భూమి వున్నా, ఎస్సీలకు ఒక హోదా ఇస్తుంది. కుటుంబమంతా కష్టపడి కనీసం తిండికి కరువు లేకుండా వుంటుంది. కాని అగ్రకులాలు అందుకు ససేమిరా అంటున్నాయి.

ఇపుడు ఇంకొక ముప్పు వచ్చి పడనుంది. ఇప్పటికే రైతులుగా వున్నవారిని, వారి భూముల నుంచి రకరకాల పద్ధతుల్లో వెళ్లగొట్టి బహుళ జాతి సంస్థలు, కార్పొరేట్లు వ్యవసాయాన్నే కబ్జా చేయడానికి నడుం కట్టాయి. ప్రభుత్వ విధానాలు అందుకు తోడ్పాటునిస్తున్నాయి. ఈ పరిణామాన్ని ఎస్సీ నాయకులు, వ్యవసాయ కూలి నాయకులు గమనంలోకి తీసుకొని ఎస్సీల రక్షణకు అనువైన విధానాలను రచించాలి. ◆

(5వ పేజీ తరువాయి)

మొదటి పేజీల్లో ఎగదన్నుకుని పాఠకులను ఉక్కిరి బిక్కిరి చేసేవి. శ్రమదానంతో తాజ్‌మహల్ కంటే అద్దంలా మెరిసిన రోడ్లను చూడ్డానికి నాడు పాఠకులకు రెండు కళ్లూ చాలలేదు. ఇక జన్మభూమి స్ఫూర్తితో అక్కినేని నాగేశ్వరరావు మొదలు దారిన పోయే దానయ్యల దాకా చేసిన సేవలతో తెలుగునేల నలుచెరగులూ పులకించిపోయింది.

మానవాభివృద్ధి నివేదికల్లో ఆంధ్రరాష్ట్రం ఎంతగా దిగజారిందో బుద్ధిజీవులు చెవిన ఇల్లుకట్టుకుని చెప్పినా వినడానికి అప్పటి అక్షరానికి ఇష్టం లేకపోయింది. ప్రభుత్వాలను ఇష్టారాజ్యంగా, నియంత పాలనలా నడపడంలో కాంగ్రెస్ చరిత్ర తక్కువదేమీ కాదు. ముఠా తగాదాలకు ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి అతీతుడేమీ కాదు. నమ్మిన వారికోసం అడ్డదిడ్డంగా వ్యవహరించడంలో ఆయనకు ఆయనే సాటి. సాగునీటి ప్రాజెక్టుల జలయజ్ఞంపై వస్తున్న అవినీతి ఆరోపణలు అన్నీ ఇన్నీ కాదు. ఒకరకంగా చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి ఒకనాటి మిత్రులే.

ఒకేరకమైన అనేక సమస్యలకు నాడు-నేడు మీడియా స్పందన చూస్తే మాత్రం తెలుగు మీడియా భవిష్యత్తుకు సమాధానం చెప్పుకోవాల్సిన ప్రశ్నలు చాలా ఉంటాయి. కంటిచూపుతో విలన్‌లను చంపేసే నందమూరి బాలకృష్ణ ఇంట్లో తుపాకి పేలి నిర్మాత బెల్లంకొండ శరీరంలో తూటా మిగిలిపోతే పోలీసులు, నిర్మాత బెల్లం కొట్టిన రాళ్లలా ఎలా ఉండగలిగారు? ఆ తుపాకి ఎవరిది? తూటాలెక్కడివి? ఎవరు ఎందుకు కాల్చారన్న పిచ్చి పిచ్చి ప్రశ్నలు ఉత్పన్నమే కాలేదు. సర్వ ప్రపంచాన్ని తూనాబొడ్డు అని ఎన్టీఆర్ రుణం తీర్చుకోవడానికి నిమ్స్ ఆసుపత్రిలో బాలకృష్ణకు పిచ్చివైద్యం చేయించిన అంతర్జాతీయ వైద్య శిఖామణి కాకర్ల సుబ్బారావు గురించి ఒక్క ఆంధ్రభూమి దినపత్రిక తప్ప మరో అక్షరమేదీ లీలగా అయినా ప్రస్తావించలేకపోయింది. పిచ్చి పిచ్చిగా నిమ్స్ పరుపులపై నుండీ జైలు ఊచలేవీ లెక్కపెట్టకుండా కథానాయకుడు బాలయ్యబాబు ఇంటికి చేరేసరికి తెలుగు అక్షరాలు పరవశించి పండగ చేసుకున్నాయి. పైగా, రాయలసీమలో నరరూపరాక్షసులైన ముఠానాయకులు హత్యలు చేసి బాధితులతోనే రాజీ కాగా లేనిది బాలయ్యబాబు - బెల్లంకొండ రాజీ అయితే తప్పేమిటని మీడియా అక్షరమే పాఠకులను సూటిగా ప్రశ్నించింది. అక్కడక్కడా కొండగుర్తుగా దొరికే ఉదాహరణలే ఇన్ని ఉన్నాయి. మీడియాకు ఉండాల్సిన ఆదర్శ ప్రమాణాలతో తూకం వేస్తే అక్షరం చెడిపోకుండా ఉందా లేక పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతోందా అన్నది సులభంగా అర్థమవుతుంది.

మొన్నటికి మొన్న స్థానిక సంస్థల ఎన్నికల సర్వే ఫలితాలు ఫలానారోజు ప్రసారమవుతాయని ఒక 24 గంటల వార్తా ప్రసారాల ఛానెల్ రెండురోజుల పాటు ముందుగా ప్రకటన ఇచ్చింది. సినిమాలు ప్రసారమయ్యే తేజ టీవీలో రాత్రి 8 గంటల వార్తల్లో 'ఖమ్మం జిల్లా మినహా అన్ని జిల్లా పరిషత్‌లలో కాంగ్రెస్ ప్రభంజనం' అని ముఖ్యాంశాల్లో చెప్పినా అరగంట వార్తల్లో దాని జోలికే వెళ్లలేదు. తేజ న్యూస్ 24 గంటల ఛానెల్లో రాత్రి 8.30కు బ్రహ్మాండమేదో బద్దలవుతుందన్నట్లు ఊదరగొట్టారు కానీ చివరకు తుస్సుమనిపించారు. రాత్రి 8.45 తరువాత సర్వే వివరాలను భయపడుతూ భయపడుతూ ఇచ్చినట్లు ఇచ్చారు. ఇతరేతర కారణాల వల్ల, ప్రలోభాల వల్లనే సర్వే వివరాలు రాలేదనుకోవడానికి అవకాశాల్లేవా?

మీడియా కాగితం పునాదులమీద రాజకీయ ప్రభంజనం భ్రమల్లో బతకడమెలాగో చంద్రబాబును, తొడకొట్టి మీడియాను కయ్యానికి రమ్మని పిలిచి దూరం చేసుకోవడమెలాగో రాజశేఖర్‌రెడ్డిని చూసి నేర్చుకోవాలి.

- ఎం. రవికుమార్, హైదరాబాద్

చారిత్రక దృక్పథంలో విధానశక్తి స్థానం

- వాసిరెడ్డి భాస్కరరావు

ఒక దేశపు ఆర్థికాభివృద్ధి సాధన సామర్థ్యంపై దానికున్న విధానశక్తి స్థానం అత్యంత ప్రభావం చూపుతుందని చారిత్రిక అనుభవం తెలుపుతుంది. 1980ల నుండి అభివృద్ధి చెందుతున్న దేశాల విధాన శక్తి స్థానం కుంగటం ప్రారంభమై సగానికి పడిపోయి దిగుమతులే ప్రత్యామ్నాయంగా బతికిన నాటి దశకు చేరుకున్నాయి. ఇలా విధానశక్తి తరిగిపోవటమే కాక మరింత క్షీణించే ప్రమాదంలో వున్న అభివృద్ధి చెందుతున్న దేశాలలో, అర్థవంతమైన ఆర్థికాభివృద్ధి అసాధ్యమవుతుంది. విధానశక్తి స్థానపు వివిధ అంశాలను విశ్లేషణాత్మకంగా పరిశీలించటం, వాటి వైరుధ్యాలను, పరిమితులను వెల్లడి చేయటం యీ వ్యాసం లక్ష్యం.

శాశ్వతంగా తరుగుతున్న విధానశక్తి స్థానం - ఉపోద్ఘాతం

గత 25 సంవత్సరాలుగా అభివృద్ధి చెందుతున్న దేశాల విధానశక్తి, సామర్థ్య స్థానం ఎంతగానో తరిగిపోయి వారి ఆర్థికాభివృద్ధి సాధనకే చివరికి ముప్పు ఏర్పడిందని సర్వత్రా ఆందోళన పెరుగుతున్నది. విధానశక్తి తరుగుదలతో ప్రస్తుతం వున్న పరిస్థితికి కారణం 1980లలో ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐ.ఎం.ఎఫ్.) బ్రహ్మాండంగా విస్తృతపరచిన వారి కార్యక్రమం, దానికి కావలసిన అప్పులను సమకూర్చటం. 1982లో అప్పుల వూబిలో కూరుకుపోయిన దేశాలకు వారి వ్యవస్థాగత సర్దుబాట్ల కార్యక్రమాన్ని అనేక షరతులతో అంటగట్టి వివిధ రూపాలలో వారి విశ్వరూపాలను ప్రదర్శించి, కార్యక్రమాల పరిధిని విపరీతంగా పెంచి ఆయాదేశాలకు అప్పులనిచ్చారు.

ప్రారంభంలో బ్యాంక్, నిధి విధించిన షరతులు, ముఖ్యంగా లోటుబడ్జెట్లకు, ద్రవ్య విస్తరణకు, ప్రవైటీకరణకు, వ్యాపార సరళీకరణకు సంబంధించినవై వుండేవి. కాని కాలక్రమేణ బ్యాంక్, నిధి బృందాలు అన్ని రంగాలకు పాకి రాజ్యాల అంతర్గత విషయాలలోకి చొచ్చుకొని పోయాయి. 1997లో సంభవించిన విత్త సంక్షోభం ద్వారా అంతర్జాతీయ దవ్యనిధి దక్షిణ కొరియా ప్రభుత్వాన్ని, ఆదేశపు సెంట్రల్ బ్యాంకుకు స్వతంత్ర ప్రతిపత్తిని కలిగించాలని ఆదేశించటమేకాక, కొరియాలో ప్రవేట్ రంగానికి ఎంతైనా అప్పును తీసుకోవచ్చని చెప్పటం మరింత ఆశ్చర్య కరమైన విషయం.

ఈ రోజుల్లో బ్యాంక్, నిధి తమ ప్రభావాన్ని చూపని రంగంలేదంటే అతిశయోక్తి కాదు. ప్రజాస్వామ్యం, న్యాయపర సంస్కరణలు, కార్పోరేట్ పాలన, ఆరోగ్యం, విద్య దాదాపు అన్ని రంగాలకు విస్తరించింది.

ఆర్థిక సహాయం పొందే దేశాలు ఆర్థిక సహాయం అందించే దేశాల వస్తువులను, సేవలను ఆయాదేశాల కంపెనీల నుండి అవసరమైన సహాయనిధుల ప్రాజెక్టులకు పొందాలని సాధారణ షరతులుండేవి. కాని 1980ల నుండి షరతులలో విధానపర సిఫారసులను జొప్పించటం, వాటిని ఒప్పుకుంటేనే అప్పులు, సహాయం చేస్తామన్న (బ్యాంక్, నిధి మాదిరిగానే, ధోరణి మొదలైంది. దానికి ఆశ్చర్య పడనక్కరలేదు. ఎందుకంటే బ్యాంకును, నిధిని నియంత్రించేది ఆర్థికంగా విదేశీ సహాయం అందించేవి ఆ దేశాలే కనుక.

విధానశక్తి స్థానం తరుగుదల ముఖ్యంగా వాణిజ్యం, పారిశ్రామిక విధానాలలో ప్రస్ఫుటంగా కనపడుతుంది. మొదట, 1980ల నుండి, బ్యాంకు, నిధి, వాణిజ్య సరళీకరణలో భాగంగా సుంకాలతగ్గింపు, సుంకాల పరిమాణాల నిబంధనల తొలగింపు, సుంకాలు లేని వాటి నుండి అడ్డంకుల తగ్గింపు, యిటువంటివన్నీ అప్పులకు విధించిన కీలక షరతులు. 1994లో జరిగిన చర్చలు, తర్వాత 1995లో గాట్‌ని స్థాపించటం, యింతకు ముందెన్నడూ వుహించని అంశాలను డబ్ల్యూ.టీ.ఓ., బహుళపక్ష వాణిజ్య రాజకీయాలను తీసుకురావటం - సేవారంగంలో వాణిజ్యం. ఈ ఒప్పందాలద్వారా అనేక సాంప్రదాయక సుంకాలకు సంబంధించిన విధాన పరిధి వెసులుబాటు కూడా తగ్గిపోయింది. డబ్ల్యూ.టీ.ఓ.లో ఇంకొంతవరకు వెసులుబాటు వుందని గుర్తించటం ముఖ్యమైనా, అభివృద్ధి చెందిన దేశాలు విధాన వెసులుబాటు శక్తిని తగ్గించాలని క్రమంగా వత్తిడి చేస్తున్నాయని విస్మరించటం తగదు. ఉదాహరణకు 2003 సెప్టెంబర్‌లో డబ్ల్యూ.టీ.ఓ. అధ్వర్యంలో జరిగిన కాన్‌కూన్ మంత్రుల సమావేశంలో అభివృద్ధి చెందిన దేశాలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలు న్యాయబద్ధమైనవి కావని, వాటి తొలగింపు కొరకు ప్రతిపాదించిన బహుళపక్ష పెట్టుబడి ఒప్పందం (ఎం.ఐ.ఎ.) తీర్మానం అతికష్టంతో వీగిపోయింది.

డిసెంబర్ 2005లో హాంకాంగ్‌లో జరిగిన మంత్రుల సమావేశంలో అభివృద్ధి చెందిన దేశాలు వచ్చే 10 సంవత్సరాలలో పారిశ్రామిక సుంకాలను తీవ్రంగా తగ్గించేటట్లు చూడటానికి విపరీతమైన ప్రయత్నాలను నాన్ ఎగ్రికల్చరల్ మార్కెట్ ఎక్సెస్ (ఎన్.ఎ.ఎం.ఎ.) ఒప్పందాల ద్వారా చేసాయి. చరిత్రలో, వలస పాలనలో కూడా ఏనాడు లేనంతగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో పారిశ్రామిక సుంకాలను 5-7 శాతానికి 2010 నాటికి దించాలని అమెరికా డిసెంబర్ 2002లో ప్రయత్నం చేసింది. ఆవిధంగా బలహీనదేశాలపై అసమానత్వ ఒప్పందాలను రుద్ది ముఖ్యంగా సుంకాలను విధించేహక్కును, వాటి విధానాలను శక్తిహీనం చేయటానికి జరుగుతున్న కృషి ఘోరమైనది. నిజానికి ఆయా సుంకాలు అభివృద్ధి చెందిన దేశాలలో 1970లలో వున్న వాటికంటే కూడా తక్కువైనవి.

హాంకాంగ్‌లో ఎన్.ఎ.ఎం.ఎ. కింద వారి ప్రయత్నాలు ఫలించకపోయినా స్విస్‌ఫార్ములా అనే దాని కింద అభివృద్ధి చెందుతున్న దేశాలలో అధిక పారిశ్రామిక సుంకాలకు కోత సాధించారు.

అభివృద్ధి చెందుతున్న దేశాల వాణిజ్య, పారిశ్రామిక రంగాల విధానశక్తి స్థానాన్ని కబళించటం ఒక్క డబ్ల్యూ.టి.ఓ. మాత్రమేకాక, అభివృద్ధి చెందిన దేశాలు, ముఖ్యంగా అమెరికా ద్వైపాక్షిక, ప్రాంతీయ

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా, ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందాల ద్వారా డబ్ల్యు.టి.ఓ. లో అంగీకరించని వాటిపై అంక్షలు విధించటానికి పూనుకుంది.

ఆర్థిక సహాయం, అప్పుల షరతులకు అదనంగా కొత్త అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు, బహిరంగ పెట్టుబడి మార్కెట్లు వాతావరణంలో పెట్టుబడి ఎగిరిపోవచ్చు అన్న ఒక భయం వల్ల కూడా అభివృద్ధి చెందుతున్న దేశాల విధాన శక్తికి (వాస్తవ, మరింత ఊహాత్మక) లోటు ఏర్పడింది.

ఇక్కడ ఒక విషయం కూడా గుర్తుంచుకోవాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల విధాన శక్తి లోటుకు ఆ దేశాల దేశీయ ప్రయోజన ముఠాలు కూడా కారణం. వారి స్వప్రయోజనాల కొరకు స్వదేశ ప్రభుత్వ విధానశక్తికి పరిమితుల అవసరం. వీరిలో ముఖ్యంగా వడ్డీ వ్యాపారులు కోరుకునేది ప్రభుత్వం స్థూల ఆర్థిక విధానలతో సరిపెట్టుకొవాలని, ఇంకొందరికి సరిహద్దు దేశాల పెట్టుబడి కదలికలను ప్రభుత్వం నియంత్రించకుండా వుండాలి. అలాగయితే వారి పెట్టుబడులను అవసరం అనుకున్నప్పుడు వేరే దేశాలకు తరలించవచ్చు. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారులకు కూడా తమ ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్యానికి కట్టుబడి వుండాలి. అలాగే సిద్ధాంతపర కారణాలచే కొందరు ప్రభుత్వాల విధానశక్తికి పరిమితులుండాలనే వారున్నారు. ఈ రోజుల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలలో నున్న చాలామంది ఆర్థిక శాస్త్రవేత్తలు సిద్ధాంతపరంగా స్వేచ్ఛా వాణిజ్యానికి, మార్కెట్లకు నిబద్ధత కలిగివున్నారు. వారందరూ ప్రభుత్వ విధాన శక్తికి కళ్ళేలు వేసేవారే. ఆ విధంగా వారి ఆర్థిక 'శాస్త్రం' పరిఢవిల్లుతుందని వారి విశ్వాసం.

చారిత్రక దృక్పథంలో విధాన స్థానం

విధాన స్థానం (పాలసీ స్పేస్) ఒక కొత్త పదజాలం కావచ్చు కాని నిజానికి విధాన స్థాన బలిమి తగ్గుతుండటం కొత్తగా కనపడే విషయం మాత్రం కాదు. సామ్రాజ్యవాద ఏలుబడిలో శక్తివంతమైన దేశాలు బలహీన దేశాల విధానపరిధిపై అసభ్యంగా పరిమితులను విధించటం సాధారణ విషయం. కనుక చారిత్రక పరిణామ క్రమాన్ని విశ్లేషించటంతో ఈ చర్చ మరింత సారవంతమౌతుంది.

సామ్రాజ్యవాద కాలం

వలసలు : వలస దేశాలపట్ల విధానాలు సహజంగానే ఆయా దేశాల విధాన శక్తికి అనేక ఆటంకాలు కలిగించేవిగా వున్నాయి. ఉదాహరణకు 1. అత్యధిక విలువను కలిగించే ఉత్పత్తిని తయారుచేసే కార్యకలాపాలను చట్టబద్ధంగా అన్ని వలసల్లో నిషేధించటం. 2. వలస దేశాల ఉత్పత్తుల ఎగుమతులను వలసదారుల ఉత్పత్తులతో పోటీ పడకుండా నిషేధించటం. 3. వలసదేశాలలో ప్రాథమిక ఉత్పత్తుల ప్రోత్సాహానికి విధానాలను తయారుచేసి పంపటం. 4. వలస అధికారులచే విధింపబడిన సుంకాల రద్దు, ఆదాయం అవసరం అనుకుంటే వాటి కొనసాగింపు.

అర్ధ - వలసలు : అదృష్టవశాత్తు కొన్ని బలహీన దేశాలు వలసల ఆక్రమణ నుండి తప్పించుకున్నా, ఆ దేశాల ప్రభుత్వాలు నమ్మదగినవి కాబట్టి, వాటి మెడలువంచి, 'అసమాన ఒడంబడికలకు' ఒప్పించి విదేశీయులపై సుంకాలు విధించే శక్తిని కొల్లోయేటట్లు చేసాయి. దీనివల్ల సుంకాలు విధించే స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోవటం వల్ల సుంకాలపై పరిమితి 5 శాతంగా నిర్ణయించటమైనది. ఇటువంటి అసమాన ఒడంబడికలు, మొదట బ్రిటన్, లాటిన్ అమెరికాలోని బ్రెజిల్‌లలో 1810లో ప్రారంభించింది. ఇలా చైనా, థాయ్‌లాండ్, పెర్షియా, ఆటోమన్ సామ్రాజ్యం, జపాన్, కొరియా, టర్కీ అనేక దేశాలు వివిధ కాలాల్లో పారిశ్రామిక సుంకాలు విధించే స్వతంత్ర అధికారాన్ని కోల్పోయాయి.

అయితే అత్యంత విచారకరమైన విషయమేమంటే, ఇటువంటి తక్కువ, ఒకే విధమైన సుంకాలనే ఈనాటి ఆధునిక స్వేచ్ఛా వాణిజ్య ఆర్థిక శాస్త్రవేత్తలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు సిఫారసు చేస్తున్నారు. అయితే ఈ సుంకాల రేటు బీద దేశాలకు 20 శాతంగా వుండాలని, బాగా అభివృద్ధి చెందిన దేశాలకు సున్నా శాతంగా వుంటే బాగుంటుందని 1970లో లిటిల్‌తో ఇతర ఆర్థిక శాస్త్రవేత్తలు చేసిన చక్కని అధ్యయనం తెలుపుతుంది. 1991లో ప్రపంచబ్యాంకు మట్టుకు 15-25 శాతం సుంకాలను సిఫారసు చేసింది. అయితే అభివృద్ధి చెందుతున్న దేశాల పారిశ్రామిక సుంకాల రేటు 5-7 శాతంగా లేక యూరోపియన్ యూనియన్ ప్రతిపాదనల ప్రకారం 5-15 శాతంగా వుండాలని, అమెరికా ప్రతిపాదించింది ఒకవేళ ఈ ప్రతిపాదనలు ఎన్.ఎ.ఎం.ఎ. చర్చల్లో ఆమోదం పొందితే, అవి అత్యంత ఆందోళనకు గురిచేస్తాయి.

సామ్రాజ్యవాదానంతరయుగం

విధానశక్తి స్థాన సంకోచ - వ్యాకోచాలు

చారిత్రిక అనుభవ పరిశీలన ద్వారా తెలిసినదేమంటే సామ్రాజ్యవాద రోజులనాటికంటే అభివృద్ధి చెందిన దేశాలకు ఈనాడు విధానశక్తి స్థానం చాలా అధికంగా వుందనటం వాస్తవం. అయితే యీ వాస్తవ జ్ఞానంద్వారా మనం ఓదార్పు పొందలేం. ఎందుకంటే ప్రస్తుతమున్న విధానశక్తి స్థానంపై నిత్యం దాడి జరుగుతూ వుంది. పైగా చరిత్ర చెబుతున్న దేమంటే ఈనాటి పరిస్థితికంటే మెరుగైన స్థితికి అవకాశం ఉంది. కావాలనుకుంటే, అసంతృప్తికరమైన పరిమితులనుండి బయటపడాలనుకుంటే డబ్ల్యు.టి.ఓ. ఒప్పందాలనుండి తొలగిపోవటానికి అవకాశం ఉంది. ఇలా చేసినపుడే అభివద్ధి చెందుతున్న దేశాల ఆర్థికాభివృద్ధి మెరుగౌతుంది. వలసకాలంలో అనేక పరిమితులున్నప్పటికి 1950-70ల మధ్య అభివృద్ధి చెందుతున్న దేశాలలో మంచి ఆర్థికాభివృద్ధి జరిగింది. ఆయాదేశాలలో తలసరి ఆదాయం 3 శాతం పెరిగింది. ఈ అభివృద్ధి 19వ శతాబ్దంతో పోల్చుకుంటే రెండు-మూడు రెట్లు ఎక్కువ. సింగపూర్, దక్షిణ కొరియా, తైవాన్ లాంటి దేశాలలో ఈ అభివృద్ధి రేటు 5-6శాతం కూడా వుంది. 12-13 సంవత్సరాలలోనే ఈ అభివృద్ధి జరిగింది.

నిజానికి 1950-70 మధ్యకాలం ఒకవిధమైన స్వర్ణయుగంగా భావించాలి. పూర్వపు వలస రాజ్యాల ప్రభావం కొంతవరకున్నా, నవ్య-వలసవాదం నినాదం ఉన్నా, ప్రచ్ఛన్న యుద్ధం ఉన్నా, వర్ధమాన దేశాలు, ఆయా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ రాజ్యాలను, సోషలిస్టు రాజ్యాలను కూడా ఏదోవిధంగా ఒప్పించి, సహాయం, లాభాలు పొందగలిగాయి. ఈ కాలంలో బలమైన దేశాలు, బలహీన దేశాలకు

తమ తమ విధానాలు స్వేచ్ఛగా తీసుకొనే అవకాశం ఎక్కువగా యిచ్చాయి. అంటే ఆ రోజుల్లో విధానశక్తి స్థానం బలంగా ఉంది.

అయితే 1980ల నుండి ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. 1970ల్లో జరిగిన నూతన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను గురించిన చర్చల్లో, అభివృద్ధి చెందుతున్న దేశాలు, అభివృద్ధి చెందిన దేశాల మధ్య పూర్వపు అసమానత స్థానే సమానత్వస్థాయి ఉండాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆందోళన జరిపి వారి స్థానం వారికివ్వాలని అభివృద్ధి చెందిన దేశాలకు పిలుపునిచ్చాయి.

1980లలో బ్రిటన్, అమెరికాలలో అప్పటి రాజకీయ పరిస్థితులు, ఎన్నికలు, ఆ తర్వాత 1990ల్లో ప్రచ్ఛన్న యుద్ధం అంతంకావటం మొదలగు పరిస్థితుల వల్ల అభివృద్ధి చెందిన దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలు విధానాలపై, అభివృద్ధి పేరిట అధిక ప్రభావాన్ని చూపటం ప్రారంభమైంది. ఇది అభివృద్ధి కుంటుకే దారితీసింది. కనుక గత రెండు దశాబ్దాల నుండి వెనుకబడిన దేశాలు మరింత వెనుకబాటుతనానికి గురైనవి. తలసరి ఆదాయాలు పడిపోయాయి. ఆదాయాల పంపిణీ అనేక వర్ధమాన దేశాలలో దిగజారిపోయి, పేదరికం పెరిగిపోవటానికి కారణమైంది. నూతన సరళీకరణ విధానాలే దీనికి పూర్తి బాధ్యత వహించకపోయినా, ఆ విధానాలు సత్వర ఆర్థికాభివృద్ధిని సాధించలేకపోయావన్నది వాస్తవం.

జాతీయ స్వతంత్ర ప్రతిపత్తి

స్వేచ్ఛావాణిజ్య ఆర్థిక శాస్త్రవేత్తలు చాలామంది అభివృద్ధి చెందుతున్న దేశాలు పరిరక్షకులుగా చెప్పుకుంటున్నారు. ఉదాహరణకు ప్రపంచబ్యాంకు 1993లో సమర్పించిన ప్రఖ్యాత ఈస్ట్ ఏసియన్ మిరకిల్ రిపోర్ట్‌లో యితర అభివృద్ధి చెందుతున్న దేశాలను తూర్పు ఆసియా దేశాల వాణిజ్య, పారిశ్రామిక విధానాలను అనుసరించవద్దని హెచ్చరించింది. ఎందుకంటే ఆ దేశాలలో జటిలమైన విధానాలను ఆవిష్కరించగల పాలనా సామర్థ్యం వారికి లేదని వాదించింది. ఇలా చేయటంలో బ్యాంకు వర్తమాన దేశాల ప్రయోజనాలను రక్షించుతున్నట్లు కనపడాలని ప్రయత్నిస్తుంది. ఇంకొందరు యింకొంచెం ముందుకుపోయి, అభివృద్ధి చెందుతున్న దేశాల అవినీతికర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా, స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా సాధారణ జనం లాభాలు పొందుతారని జనం పక్షాన వారున్నట్లు స్వప్రయోజనదారులు నమ్మబలుకుతారు. ఆయాదేశాల రాజకీయ నాయకులు పేద ప్రజలకు వ్యతిరేకులని, వారు పేద ప్రజల ప్రతినిధులు కారని ప్రచారం కూడా చేపడుతున్నారు.

ఏది ఏమైనాగాని, వాస్తవానికి అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రభుత్వాలకి వాణిజ్యం, పారిశ్రామిక విధానాల స్థాన బలహీనత మంచిదేనని, లేకపోతే వారు తెలిసో, తెలియకో విధానపరంగా చాలా పెద్ద తప్పులు చేసే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంకులాంటి సంస్థలు, స్వప్రయోజనదారుల కొందరు కూడా వివిధ రూపాలలో అభిప్రాయలు వెలిబుచ్చుతూ ప్రచారం చేస్తున్నారు. ఆర్థిక శాస్త్రవేత్తలు కూడా కొందరు ప్రభుత్వ జోక్యం అనవసరమని, పౌరుల స్వేచ్ఛను అడ్డుకోవద్దని, తప్పుల నుండి ఒప్పులను ఎంచుకొనే స్వేచ్ఛ ప్రజలకుండటమే నిజమైన ప్రజాభీష్టమని వాదించటం ఆశ్చర్యంకూడా కలిగిస్తుంది. వ్యక్తుల విషయంలో వ్యక్తి స్వేచ్ఛను గురించి వాదించేవారు, అదే రీతిలో ఆ స్వేచ్ఛను ప్రభుత్వాలకు యివ్వటానికి, తప్పులు చేయటానికి హక్కునివ్వటానికి అంగీకరించలేకపోవటమే విడ్డూరం. ఇది వారి ద్వంద్వ నీతికి తార్కాణం.

ముగింపు

విధాన వెసులుబాటు శక్తి చాలా ముఖ్యమైనది. దేశ ఆర్థికాభివృద్ధి సాధన సామర్థ్యం దీని మీద ఆధారపడివుంది. వలస కాలంలో ఆయాదేశాల ఆర్థికాభివృద్ధి చాల తక్కువ స్థాయిలో ఉంది. ఆ తర్వాత 1950–70ల మధ్య ఆయాదేశాలకు విధాన శక్తిలో అధిక స్థానం, ఎక్కువ వెసులుబాటు లభించిన కారణంగా అయాదేశాల అభివృద్ధి అనూహ్యంగా పెరిగింది. 1980ల నుండి విధాన వెసులుబాటు శక్తిలో బలహీనత ఏర్పడగానే, ఆర్థికాభివృద్ధి స్థాయి సగానికి సగం పడిపోయి, పాత చెడ్డ రోజులైన వలసల నాటి కంటే హీనమైన పరిస్థితి ఏర్పడింది. చారిత్రిక దృష్టితో చూస్తే యిప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశాల విధానశక్తి స్థానం అంతబలహీనంగా లేదు. అయితే రోజు రోజుకు ఆ వెసులుబాటు క్రమంగా తగ్గిపోతున్నదని గమనించాలి. ఆ విధానశక్తి పూర్తిగా తగ్గిపోతే అర్థవంతమైన ఆర్థికాభివృద్ధి అసాధ్యమని కూడా గమనించాలి. దీని గురించి అందరూ ఆలోచించాలన్నదే ఈ వ్యాసం ముఖ్యోద్దేశ్యం. డబ్ల్యూ.టి.ఓ., హాంకాంగ్ – జెనివా సమావేశం భవిష్యత్‌లో జరగబోయే ఆర్థికాభివృద్ధిని నిర్ణయిస్తుందని కూడా గుర్తించాలి. ◆

(ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, ఫిబ్రవరి 18, 2006లో హా–జూన్ చాంగ్ రాసిన ప్రత్యేక వ్యాసానికి యిది సంక్షిప్త స్వేచ్ఛానువాదం.)

వచ్చే సంచికలో ....

* స్థానికసంస్థల ఎన్నికలు
* ఐదు దశాబ్దాల క్రీడా వికాసం చివరిభాగం - జి.ఎస్. రాంమోహన్
* సాల్వాజుడుం- నిజ నిర్ధారణ నివేదిక
* గ్రామీణ ప్రాంతాలలో పట్టణ సౌకర్యాల కల్పన : “పుర” పథకం - తోట సత్యనారాయణ

భారత ప్రజాస్వామ్యం - పెరుగుతున్న వ్యక్తిపూజ

- ఎనిశెట్టి శంకర్

ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యంగా పిలువబడుతున్న భారతదేశంలో ముందస్తు లోకసభ ఎన్నికలై ఏపార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని గడ్డు పరిస్థితి ఏర్పడడం అత్యంత శోచనీయం.

రోజు రోజుకు పెరిగిపోతున్న ఎన్నికల ఖర్చు సామాన్యులు ఎన్నికల్లో పోటీచేసే ఆలోచనలను సజీవసమాధి చేస్తే? ప్రతి ఎన్నికలో వ్యక్తివాదం, వ్యక్తిపూజ పెరుగుతుండడం ఆందోళన కల్గించే విషయంగా చెప్పుకోవచ్చు.

ఈ కోణంలో ఇటీవలే ముగిసిన ఎన్నికల గూర్చి చెప్పాలంటే ముందుగా అభ్యర్థుల ఫిరాయింపు గూర్చి చెప్పాలి. సిగ్గు, బిడియం ఏమాత్రం లేక కేవలం 'పదవీ' కాంక్షే పరమావధిగా భావించి ఎవరు ఏపార్టీలో వున్నరో, ఎప్పుడు ఏ రాత్రి ఏ పార్టీలోకి జంప్ చేస్తారో ఆగమ్యగోచరంగా మారింది. ఇదే అదనుగా మాఫియా నాయకులు, రౌడీషీటర్లు యథేచ్ఛగా వివిధ రాజకీయ పార్టీల్లోకి వచ్చి చేరారు.

భారతీయ జనతాపార్టీ, కాంగ్రెస్‌లు తమ తమ తలుపులు బార్లా తెరచి పేరు, ప్రఖ్యాతులున్న సినీ, టీ.వీ ప్రముఖులను, వివిధ ఆటగాళ్లను ఆహ్వానించడం చూశాం. చూస్తున్నాం. దీనితో పేరు ప్రఖ్యాతులు, గ్లామర్ వున్నవాళ్లు నాయకులై తళుక్కుమనడంతో అట్టడుగు కార్యకర్తలు మరుగున పడిపోయారు. ఈ విధానంతో మరింత విశాలం కావాల్సిన భారత ప్రజాస్వామ్యం వ్యక్తివాదం వైపు పయనిస్తోంది. ఏ రాజకీయ పార్టీ బహిరంగసభ పెట్టినా ఛోటా మోటా సినీతారలు విధిగా పాల్గొనే ప్రక్రియ ఇటీవల పెరగడం మనం చూస్తున్నదే.

ఏ విధమైన కమిట్‌మెంట్ గాని సిద్ధాంత అవగాహన లేని, ఏమాత్రం సేవాభావం లేని ఈ మిణుకు మనే తారల ప్రవేశంతో భారత రాజకీయ రంగం ప్రమాదపుటంచుకు నెట్టి వేయబడుతున్నది. ఇలాంటి వారందరికీ సేవా దృక్పథం లేదని ఎందుకనాల్సి వస్తుందంటే వీరు కేవలం బూర్జువా పార్టీలైన బిజెపి, కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీల్లోకే చేరుతున్నారు. కాని సిపిఐ, సిపిఎం, బిఎస్‌పి లాంటి కమ్యూనిస్టు పార్టీల్లోకి, దళిత పార్టీల్లోనికి రావడం లేదు. అంతేగాక క్రమం తప్పకుండా వీరంతా రాజ్యసభకు నామినేట్ చేయబడతున్నారు. తమ అసాధారణ ప్రజ్ఞాపాటవాలు, మేధోసంపత్తితో భారతప్రజాస్వామ్యానికి ఊపిరి పోయాల్సిన రాజ్యసభ సభ్యుల్లో ఎప్పుడూ ఇలాంటి తళుక్కుమనే తారలే ఎక్కువగా వస్తున్నారు. అమాయక భారత ప్రజలను వీరు రకరకాల పదవులతో దోచుకుంటున్నారు.

అంతేగాక రాజకీయ నాయకుల పిల్లలు, ఇతర రక్త సంబంధీకులు పార్టీల్లోకి రావడం, వివిధ పదవులు అధిష్టించడం రొటీన్‌గా మారింది. తమ చెమటా, రక్తం ధారపోసి పనిచేస్తున్న అట్టడుగుస్థాయి కార్యకర్తలు జీవితాంతం ఆశల పల్లకీల్లో ఊరేగడమే అవుతోంది.

ఈ ప్రజాకర్షక పద్ధతి చాలా కాలంగా మన రాజకీయాల్లో నడుస్తున్నది. ఎవరో మహానుభావులు వచ్చి ఉద్ధరిస్తారనేది పురాణాల నుండి మనం చూడవచ్చు. పురాణాల్లో, ఇతిహాసాల్లోని కథలు, కథనాలనే మన గ్రామీణ ప్రజలు గొప్పగా చెప్పుకుంటూ ప్రస్తుత రాజకీయాలకు అన్వయిస్తుంటారు. గీతలో కృష్ణుడు చెప్పే 'యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత-ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అంటే, సమాజంలో నీతి, న్యాయం గతి తప్పినప్పుడు అవతారపురుషుడు వచ్చి దాన్ని సరి చేస్తాడట. ఇది పురాణాల్లోనిది కాబట్టి మాన్యులు, సామాన్యులు కూడా దీనికి బాగా విలువనిస్తారు. రాజకీయాల్లోకి ఆకాశం నుండి ఊడి పడ్డట్టు వచ్చే జనాకర్షకులే ప్రస్తుత అసమంజ అసంబద్ధ పరిస్థితులను సరిచేస్తారని అనుకుంటూ సరిపెట్టుకోవడం వల్లే ఇలాంటి వారి సంఖ్య అప్రతిహతంగా పెరుగుతూపోతోంది. 1920లో మహాత్మాగాంధీ ప్రారంభించిన మొదటి పౌరసహాయ నిరాకరణతో భారత రాజకీయాల్లో ఒక కొత్త శకం ఆరంభమయిందని చెప్పవచ్చు. మెల్లమెల్లగా జాతీయ మయిందని చెప్పవచ్చు. మెల్లమెల్లగా జాతీయ కాంగ్రెస్‌ను అదుపు చేయడమే గాక తన ఇష్టం వచ్చిన గాంధీ 'మహాత్ముడ'యి, ఆ పిదప 'భారత జాతిపిత'గా కీర్తింపబడి, బడాబడా పెట్టుబడిదారుల విరాళాలతో కాంగ్రెస్‌ను నడపడం, తన ఆశ్రమాన్ని కొనసాగించడమే గాక వాటికి చట్టబద్ధత చేకూర్చాడు. గాంధీ స్వయంగా దేశవిభజన నిర్ణయం తీసుకోకపోవడమే గాక కాంగ్రెస్ అభిప్రాయం వేరే అయినప్పటికీ ఎవరు ప్రధాని కావాలాన్నదీ తనే నిర్ణయించాడు.

ఆ తర్వాత నెహ్రూ పేరు మారుమ్రోగడం ప్రారంభమై సర్దార్ పటేల్ మరణానంతరం తిరుగులేని, ఎదురులేని నాయకుడుగా ఎదిగాడు. తనకు ఏ వ్యతిరేకత లేకున్నప్పటికీ తనకు తానే ఉత్తరాలు రాసి తన విధానాలను విమర్శించుకునేవాడు నెహ్రూ. నెహ్రూ మరణానంతరం అతని కూతురు ఇందిరను ఫోకస్ చేయగలిగారు. ఇందిర 1970లో కాంగ్రెస్ బాధ్యతలు తీసుకోవడం - ఆమెను ఆకాశానికి ఎత్తి చివరకు 'ఇందిరయే ఇండియా-ఇండియాయే ఇందిర' అనే నినాదం తీసుకువచ్చారు. (ఇది అస్సాంకు చెందిన కాంగ్రెస్ నేత దేవకాంత్ బారువా అన్నాడు).

ఇందిర వ్యక్తి పూజను ఎద్దేవా చేస్తూ ఆరోజుల్లోనే వామపక్షాలు ఎ.ఐ.ఆర్.ను ఆల్ ఇందిరా రేడియో అంటూ చమత్కరించారనేది చారిత్రక సత్యం.

మరో జనాకర్షణ గల లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ రంగంమీదికి వచ్చే వరకు ఇందిరాగాంధీ ఇమేజ్‌ను ఎవరూ ఎదుర్కోలేక పోయారు. జెపి ఎన్నడూ రాజకీయ పదవులు అధిష్టించకున్నా రాజకీయాధికారం చేపట్టడానికి ఎందరో అనుచరులకు ఆయన సిద్ధాంతం, ఆకర్షణ మూలధనమయ్యాయి.

1980 ప్రాంతంలో మరోసారి ఇందిరా గాంధీ ఆకర్షణ పెరుగుతూ ఆమె కొడుకు రాజీవ్‌గాంధీ ప్రాపకం ప్రారంభమయింది. దాంతో

మరోసారి గాంధీ–నెహ్రూ కుటుంబ ఆధిపత్యం గట్టిపడడం జరిగింది. ఇందిరా గాంధీ మరణానంతరం ఆమెను ఆకాశానికెత్తే నినాదాల హోరు మనం చూస్తాం.

'జబ్‌తక్ సూరజ్ చాంద్ రహేగా ఇందిరా తేరా నామ్ రహేగా (సూర్య చంద్రులున్నంత వరకు ఇందిర పేరు వుంటుంద'ట) ఏ రాజకీయ అనుభవం, కమిట్‌మెంట్ లేని రాజీవ్ గాంధీ - కేవలం ఇందిర కొడుకు అయినందుకు అతి చిన్న వయసులోనే పైలట్ నుండి ప్రైమ్మినిస్టర్ చేయబడ్డాడు. ఇదే ఆకర్షణతో లోకసభకు భారీ మెజారిటీతో గెలుపొందాడు.

మాజీ రాజు విశ్వనాథ ప్రతాప్‌సింగ్ తెరపైకి వచ్చి నెహ్రూ–గాంధీల కుటుంబ అధిపత్యాన్ని ప్రశ్నిస్తూ ఫోకస్ అయ్యాడు. మరోసారి ఈయన్ను కీర్తిస్తూ నినాదాలు ప్రారంభమయ్యాయి. రాజా నహీ ఫకీర్ హై, దేశ్‌కీ తక్దీర్ హై ! (రాజు కాదు - ఫకీరు. ఇతనే దేశానికి అదృష్టం).

ఇది 1990 మధ్య వరకు సాగుతున్నప్పుడే రాజకీయాల్లో సీనియర్ - సంఘ్ పరివార్‌కు చెందిన వాజ్‌పేయ పేరు మెల్లగా ప్రచారంలోకి వచ్చింది. అంతవరకు ఓ సీదాసాదా రాజకీయవేత్తగానే వున్న ఏ.బి. వాజ్‌పాయ్ ఒక్కసారి రాజకీయాల్లో అత్యున్నత, 'పాత్రధారి'గా ప్రచారం ప్రారంభమైంది. అతని వయస్సు కూడా అతనికి చెరగని సంపదగా తయారైంది. ఈ వయసులో ప్రభుత్వాన్ని నడపగలడా అని ఎవరూ ప్రశ్నించలేదు. బిజెపి కి వాజ్‌పాయ్ 'ముసుగు' అని కొందరంటున్నా సంకీర్ణ ప్రభుత్వ అధినేతగా వాజ్‌పాయ్ పలు ప్రశంలు పొందడం ప్రారంభమైంది. గత్యంతరం లేని ఈ పరిస్థితుల్లో ప్రతిపక్షాలకు మరోసారి నెహ్రూ గాంధీ కుటుంబ వ్యక్తి కావలసి వచ్చింది. 1990 చివరి నుండి భారత రాజకీయ రంగలో రెండు కూటములు - అటల్ బిహారీ వాజ్‌పాయ్, సోనియాగాంధీ ఇద్దరు జనాకర్షణ గలవారుగా ఓ ప్రచార యుద్ధం మొదలైంది.

ఇదే సమయంలో ఈ ఇద్దరు నేతలను పొగుడ్తూ, కీర్తిస్తూ వచ్చిన నినాదాలను చూస్తే అదే అర్థం వస్తుంది.

'రాజ్ తిలక్ కీ కరో తయారీ, జీత్‌గయే అటల్ బిహారీ' (అటల్ బిహారీ గెలిచాడు. రాజ్యాభిషేకానికి సిద్ధంకండి),

గాంవ్ గాంవ్‌మే చలీ బహార్ సోనియా గాంధీ బహు హమారా'
(సోనియాగాంధీ మన కోడలని గ్రామ గ్రామాన గాలి వీస్తున్నది.)
'దేశ్‌కీ ఆంధీ - సోనియాగాంధీ
(సోనియాగాంధీ దేశానికి ఓ ప్రభంజనం.)

ఇలా వ్యక్తి పోకడలు, వ్యక్తి పూజ, వ్యక్తుల ఆధిపత్యం, రాష్ట్రాల్లో కూడా చూడొచ్చు.

తమిళనాడులో ఇద్దరు సినీ ప్రముఖులు బాగా ఫోకస్ అయిన వారుగా చూడొచ్చు. ఒకరు ఎం.జి.ఆర్. అయితే, సమావేశాలకు ప్రజలను ఆకర్షించడానికి తెరముందుకు వచ్చిన జె. జయలలిత ప్రస్తుతం తమిళనాడులో మకుటంలేని మహారాణియే.

ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒక కొత్త పార్టీ పెట్టి ఎన్.టి.ఆర్. రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యాడు. అతి కొద్ది కాలంలోనే అప్పటివరకు బలంగా వున్న కాంగ్రెస్‌ను కాదని టి.డి.పి కి ప్రజలు పట్టం కట్టడానికి కారణం - సినీ గ్లామర్, వ్యక్తి పూజయే కారణంగా చూడొచ్చు. ఇదేవ్యక్తి పూజనాధారం చేసుకొని చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే అటు ఒరిస్సాలో జె.బి. పట్నాయక్ (రాజకీయ దురంధరుడు) కుమారుడు నవీన్ పట్నాయక్ ముఖ్యమంత్రి కాగలిగాడు.

మొన్నటికి మొన్న తండ్రిని కాదన్నట్లే కాదని మెజారిటీని తనవైపుకు తిప్పుకొని కర్నాటకలో హెచ్.డి. దేవగౌడ (మాజీ ప్రధాని) కుమారుడు హెచ్.డి. కుమారస్వామి గౌడ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టడానికి కారణం - పైకి కనిపించే సంఖ్యాబలం కన్నా ఆ వ్యక్తుల తల్లిదండ్రుల పేరు ప్రతిష్ఠలే పెట్టుబడిగా చూడాలి.

ఇక లాలూ ప్రసాద్ తర్వాత అతని భార్య రబ్రీదేవి ముఖ్యమంత్రి కావడం -

మొన్నటికి మొన్న హైదరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీలో 'రాహుల్ వాంటెడ్' అంటూ కాంగ్రెస్‌లో అతిరథమహారథులు కేరింతలు కొట్టడం వ్యక్తి పూజే.

దళిత రాజకీయాల్లో కూడా వ్యక్తి పూజ బాగా చోటు చేసుకుంది. కాన్షీరామ్‌ను అంబేద్కర్‌కు ఏకైక వారసుడుగా పేర్కొన్నారు.

బాబా తేరా మిషన్ అధురా, కాన్షీరామ్ కరేగా పూరా (బాబా నీవు విడిచివెళ్ళిన బృహత్కార్యం కాన్షీరామ్ పూర్తి చేస్తాడు).

ఈ వ్యక్తి పోకడలు, వ్యక్తిపూజ పెరిగి పోవడం ఇటీవల ముగిసిన లోకసభ ఎన్నికల్లో చూడవచ్చు.

బిజెపి అటల్ బిహారీని ప్రధానిగా కేంద్రీకృతం చేసి, చౌతీబారీ అటల్ బిహారీ (నాలుగోసారి అటల్ బిహారీ) అంటూ ప్రచారం చేస్తే దేశ్‌కే అంధీ - సోనియా గాంధీ (దేశ ప్రభంజనం - సోనియాగాంధీ) అంటూ అటు కాంగ్రెస్ ప్రచారం చేసింది.

వ్యక్తులను ముందుపెట్టి ప్రచారం చేయడం నిజంగా ప్రజాస్వామ్య మేనా? ఈ విధానం వల్ల (వ్యక్తులను ఫోకస్ చేసి వాళ్లను బట్టి రాజకీయాలు నడిపేవిధానం) ప్రజలు గత్యంతరం లేక ఎవరో ఒకరిని ఎన్నుకోవడం అనివార్యమవుతుంది.

కులం, మతం, ప్రాంతం వగైరాలను కూడా ప్రచారం చేయడం వల్ల మనమెదళ్లలో అవే బలంగా నాటుకుంటున్నాయి. దీంతో వ్యక్తుల సాధారణ గుణగణాలు మరుగున పడుతున్నాయి. రకరకాల సంస్థలు, వేదికలు ఏర్పడి వ్యక్తి చుట్టూ తిరగడం వల్ల అశేష జనావళి మౌలిక సమస్యలు మరుగున పడుతున్నాయి.

పోలీస్ ఉన్నతాధికారులు, బ్యూరాక్రాట్లు, టీవీ, సినీరంగ ప్రముఖులు, ఆటగాళ్లు తమతమ సంస్థలను వదిలి రాత్రికి రాత్రే రాజకీయులుగా మారుతూ భారత రాజకీయ చరిత్రలో వ్యక్తిపూజను పెంచుతున్నారు.

ప్రజాస్వామ్యమంటే ప్రజలచేత, ప్రజలకొరకు నడిచే ప్రభుత్వం అనే బదులు - వంశపారంపర్యం చేత, వంశ పారంపర్యంకొరకు నడిచే ప్రభుత్వమే ప్రజాస్వామ్యమనుకుంటున్న దౌర్భాగ్య పరిస్థితులు ఉన్నాయి.

ఏది ఏమైనా అశేష జనావళి మౌలిక సమస్యలు పరిష్కరింప బడాలంటే సామాజిక చింతనాపరులు, ప్రజాస్వామ్య పరిరక్షకులు రంగంలోకి దిగి ప్రక్షాళన చేస్తే తప్ప గాడి తప్పిన మనదేశ రాజకీయాలకు విముక్తి లేదు. ◆

(డా॥ వివేక్ కుమార్ గారి ఆంగ్ల వ్యాసానికి స్వేచ్ఛానువాదం)

సాంస్కృతిక విప్లవం ఆవశ్యకత

- కొల్లి సత్యనారాయణ

విప్లవం అంటే వ్యవస్థీకృతమైన సమాజంలోని అన్ని విభాగాలలోను మౌలికమైన మార్పులు తీసుకురావటం అని అర్థం. సాంఘిక విప్లవమంటే సమాజంలోని జీవిత విధానంలోని అన్ని రంగాలలోను సమూలమైన మార్పులు తీసుకురావటం. అది తనకు తాను రాజకీయ, ఆర్థిక రంగాలకు మాత్రమే ఆ విప్లవం పరిమితంకాదు. సమాజంలోని సంస్కృతిలో సమూలమైన మార్పును తీసుకువస్తుంది. అంటే ప్రాబల్యంలో వున్న సామాజిక తత్వశాస్త్రం, విద్యా వ్యవస్థ, సైనిక శాస్త్రం, కళలు, సాహిత్యం మొదలైన వాటిలో మౌలికమైన మార్పులు తీసుకరావటం. కానీ, విప్లవం సమస్యల గురించి చర్చించేటప్పుడు, విప్లవంలోని సాంస్కృతిక విభాగం వైపు తరచు చిన్నచూపు చూడటం జరుగుతోంది. ఆవిధంగా చూడటానికి ప్రభావంలో వున్న సంస్కృతిని మార్చాలని విప్లవకారులు అనుకొనకపోవటం కాదు కారణం. సంస్కృతిపట్ల, నూతన ప్రజాస్వామిక విప్లవం దశలో దాని పాత్ర పట్ల తప్పుడు అవగాహన కలిగివుండటమే అందుకు కారణం.

వాస్తవానికి సంస్కృతి అంటే ఏంటి? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పేప్పుడు కామ్రేడ్ మావో చెప్పిన ఈ క్రింది మాటలను ఆ సమాజపు రాజకీయం, ఆర్థిక విషయాల సైద్ధాంతిక 'ప్రతిబింబమే' ఆ సమాజసంస్కృతి అని ఉదహరిస్తారు ప్రజలు. సమాజపు రాజకీయ, ఆర్థిక విషయాల ప్రతిబింబం సంస్కృతి అయినప్పుడు, సమాజపు రాజకీయ, ఆర్థిక విషయాలలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చినప్పుడు, మారిన రాజకీయ, ఆర్థిక విషయాలకు ప్రతిబింబంగా తనంతట తానే తన సంస్కృతిలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తుందని వాదిస్తారు.

'ప్రతిబింబం' అన్నపదం నుండి ఆవిధంగా యాంత్రిక అవగాహన అభివృద్ధి చెందింది. ఆవిధంగా ఎందుకు జరిగిందంటే, కిరణం ప్రతిబింబం మాదిరిగానే సంస్కృతి ప్రతిబింబిస్తున్నదని తరచు అవగాహన చేసుకోవటం జరుగుతోంది. కిరణానికి ఏవిధమైన స్వతంత్ర వనరు లేకపోవడం వల్ల, రాజకీయ, ఆర్థిక విషయాల మాదిరిగా, కిరణంపై ఎలాంటి ప్రభావం లేకపోవడం కారణంగా ఈ భావం కలుగుతోంది.

అటువంటి ప్రమాదం వుందని మావోకు తెలుసు. అందుకనే, నూతన ప్రజాస్వామ్యం అన్న వ్యాసంలో, చెప్పే ఏ సంస్కృతి అయినా (సైద్ధాంతికరూపంలో) ఆ సమాజపు రాజకీయ, ఆర్థిక విషయాల ప్రతిబింబం అయినప్పుడు, రాజకీయ, ఆర్థిక రంగాలపై ఆ సంస్కృతి గొప్ప ప్రభావం చూపుతుందని మరొకచోట వివరించాడు. లెనిన్ అభిప్రాయాన్ని కూడా మావో పునరుద్ఘాటించాడు. 'ఆర్థిక విషయాలు పునాది, ఆర్థిక విషయాల కేంద్రీకృత వ్యక్తీకరణే రాజకీయాలు' అని చెప్పాడు. సమాజంలో మార్పుకు పునాది ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో వుంది. అంటే, ఉత్పత్తి శక్తుల ఉత్పత్తి సంబంధాల అభివృద్ధిలో వుంది. ఉత్పత్తి శక్తుల అభివృద్ధితో పాత ఉత్పత్తి సంబంధాలు సరితూగకపోతే ఇంకా పెరుగుదలకు అడ్డంకిగా వుంటే, ఉత్పత్తి సంబంధాలలో మార్పు అవసరమౌతుంది. ఈ మార్పు కూడా కొత్త ఉత్పత్తి పద్ధతులకు ద్వారాలు తెరుస్తుంది. ఉత్పత్తి శక్తులు మరింతగా అభివృద్ధికి తోడ్పడుతుంది. ఇవన్నీ సమాజపు ఆర్థిక వ్యవస్థకు మౌలిక మార్పులు. కానీ, పాత సమాజపు రాజకీయ వ్యవస్థ, పాత ఉత్పత్తి సంబంధాలు కొనసాగించటానికి అప్పటికే స్థిరపడివుంటే, అటువంటి మార్పులు రావటానికి అనుమతించదు. అందువల్ల నూతన ఆర్థిక వ్యవస్థ స్థాపనకు రాజకీయ విప్లవం వస్తుంది. ఆవిధంగా ఆర్థిక వ్యవస్థకు కేంద్రీకృత వ్యక్తీకరణ అయిన రాజకీయాలు ఏర్పాటైన సమాజానికి సేవలు చేస్తాయి. పునాది అయిన ఆర్థిక వ్యవస్థ మార్పుకు తోడ్పడే విధంగా మారుతుంది. సమాజపు ఆర్థిక వ్యవస్థలో విప్లవానికి ఒక రాజకీయ విప్లవం అవసరమౌతుంది.

అధికార పీఠాలనుండి పాత పాలక వర్గాలను కూలదోయటానికి, రాజకీయ విప్లవానికి ప్రజాచర్య అవసరం. పాత వ్యవస్థలో తాము దోపిడీకి గురౌతున్నందున పాలక వర్గాలను కూలదోయాలని ప్రజలు భావిస్తారు. కానీ, దోపిడీకి గురౌతున్న ప్రజలు, పాత సమాజపు సంస్కృతి ద్వారా, పాత వ్యవస్థకు సైద్ధాంతికంగా గాఢంగా సంబంధం కలిగి వుంటారని తరచు వెల్లడైంది. వారి అభీష్టం, పాత వ్యవస్థను కూలదోయా లన్న గట్టి దీక్ష చాలా బలహీనపడిపోతాయి. అటువంటి పరిస్థితులలో, నూతన సంస్కృతి ప్రవేశ పెట్టకుండా, సాంస్కృతిక రంగంలో విప్లవపోరాటం కొనసాగించటం రాజకీయ విప్లవానికి తగినంతగా ప్రజాసమీకరణ కష్టమౌతుంది. అసాధ్యమైన పని కూడా అవుతుంది. ఈ సాంస్కృతిక విప్లవ పోరాటం ఎందుకు సాధ్యమౌతుదంటే అసలు పాత సమాజంలోనే ఉత్పత్తి శక్తుల అభివృద్ధితో నూతన రాజకీయాలు, నూతన ఆర్థిక విషయాల అవసరాల బీజాలు నాటబడివుంటాయి.

సాంస్కృతిక రంగంలో ఆ పోరాట ప్రభావం ఎంతబలంగా వున్నప్పటికీ 'నూతన ప్రజాస్వామ్యంపై' కామ్రేడ్ మావో మాట్లాడుతూ, చైనా కమ్యూనిష్టు పార్టీ ఏర్పడిన తరువాత నూతన సాంస్కృతిక శక్తి నూతన యూనిఫామ్‌లో, నూతన ఆయుధాలతో సాధ్యమైన మిత్రలందరిని కూడగట్టి, యుద్ధరంగంలో తమ శ్రేణులన్నింటిని వినియోగించి సామ్రాజ్యవాద సంస్కృతిపైనన, భూస్వామ్య సంస్కృతిపైన వీరోచిత పోరాటాలు" ఎలా నడిపిందీ చెప్పాడు.

గత ఇరవై సంవత్సరాలలో, ఈ నూతన సాంస్కృతిక శక్తి, తన దాడిని గురిపెట్టినప్పుడల్లా, సైద్ధాంతిక సారంలోను, రూపంలోను (ఉదాహరణకు లిఖిత భాషలో) రెండింటిలోనూ గొప్ప విప్లవం వచ్చింది అనికూడా చెప్పాడు.

అక్టోబరు మహా విప్లవం 50వ వార్షికోత్సవం (ఈ సంవత్సరం) చైనాలో జరుగుతున్న సందర్భంలో మన రాజకీయ, ఆర్థిక రంగాలలో మన పోరాటం నుండే గాక, సాంస్కృతిక రంగం నుండి కూడా ఆ మహావిప్లవం నుండి అనుభవాలను మనం నేర్చుకోవాలి.

భారత దేశంలో నిర్దిష్ట పరిస్థితి

భారత దేశంలో మార్క్సిస్టు - లెనినిస్టు వర్గాలలో ప్రతిబింబం గురించి యాంత్రిక అవగాహన ప్రభావం ఉండటమే కాకుండా, సాంస్కృతిక రంగంలో పని, కళలు, సాహిత్యం రంగాలలో పని తగ్గించాలన్న తప్పుడు అవగాహన కూడా వుంది. ఆవిధంగా, ఒక ప్రక్కన, నూతన ప్రజాస్వామిక విప్లవం దశలో సాంస్కృతిక విప్లవానికి తగినంతగా ప్రాముఖ్యం ఇవ్వకపోవటమే గాక, రెండవ ప్రక్కన, సంస్కృతిలో సైద్ధాంతికభాగానికి అంటే - సైద్ధాంతిక రూపంగా సంస్కృతిని మరింత సంకుచితంగా చూడటం జరుగుతోంది.

సాంస్కృతిక పోరాటంలో చైనా కమ్యూనిస్టులు సాధించిన విజయాల గురించి మాట్లాడేటప్పుడు, సైన్స్, కళలు, సాహిత్యరంగం వరకు మాత్రమే ఆయన పరిమితం కాలేదు. ఈ నూతన శక్తి సాంఘిక శాస్త్రాలు, కళలు, సాహిత్యం - అది తత్వశాస్త్రం, ఆర్థికశాస్త్రం, రాజకీయ శాస్త్రం, సైనిక శాస్త్రం, చరిత్ర, సాహిత్యంగాని, కళలుగాని (థియేటర్ సినిమా, సంగీతం, శిల్పకళ, పెయింటింగలతో సహా) ఈ శాఖలలో (డొమెయిన్) గొప్ప ముందడుగు వేసింది" అని మావో చెప్పాడు. ఇది మావో నుండి నేర్చుకోవాలి.

ప్రకృతి శాస్త్రాలు, సాంకేతిక విద్యా రంగాలు కూడా అభివృద్ధి పనుల మాదిరిగా సైద్ధాంతిక అవగాహనతో చూసినప్పుడు సంస్కృతిలో భాగంగా తయారౌతాయి. సైన్స్ టెక్నాలజీల దగ్గర సంబంధం, ఉత్పత్తి శక్తుల అభివృద్ధి, ఉత్పత్తికి ప్రత్యేకించి ఉత్పత్తి సంబంధాలు సేవ చేస్తాయన్నది వాస్తవం. కానీ, అదేసమయంలో, అభివృద్ధి, సైన్స్, టెక్నాలజీలలో సాధించిన విజయాల ప్రచారం, పాలక వర్గాల ప్రత్యేక సిద్ధాంతంతో తరచు సన్నిహిత సంబంధం కలిగి వుంటుంది. ఉదాహరణకు, ఇండియా, పాకిస్తాన్‌ల అణుబాంబుల పరీక్షలు, సైన్స్ టెక్నాలజీ రంగాలలో ఆయా దేశాలు సాధించిన విజయాలు. కానీ, ఈ విజయాలను ఆయా దేశాలలో జాతి దురహంకారాన్ని యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టటానికి ఉపయోగించుకున్నారు. సైన్స్ టెక్నాలజీ రంగాలలో సాంస్కృతిక విప్లవం, శాస్త్రవేత్తలు సాంకేతిక నిపుణులను అటువంటి తప్పుడు ప్రచారం నుండి మినహాయించవచ్చు. సైన్స్, టెక్నాలజీ అభివృద్ధికి కొత్త మార్గాలు ఏర్పడవచ్చు. రెండవ ప్రక్కన అప్పటికే వున్న పాత వ్యవస్థ ఆ మార్గాలకు అడ్డంకిగా వున్నదనడానికి ఉదాహరణలు కూడా వున్నాయి.

మనం ఇప్పుడు సామ్రాజ్యవాద సంస్కృతి, భూస్వామ్య సంస్కృతులు - నిర్దిష్టంగా వ్యక్తం అవుతున్న విషయం పరిశీలిద్దాం. భారత దేశ విషయం చూసినప్పుడు, పాలక వర్గాల ప్రయోజనాల దృష్ట్యా ఈ రెండు సంస్కృతులు తరచు ఒక దానిలో ఒకటి కలసిపోవటం చూస్తాం. అర్ధవలస, అర్ధ భూస్వామ్య ప్రభుత్వాన్ని, సమాజాన్ని కాపాడాలని అనుకోవడమే అందుకు కారణం.

ప్రపంచ సామ్రాజ్యవాదం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ప్రస్తుత చారిత్రక దశలో, శ్రామిక వర్గం బలహీనంగా వుండటం వల్ల భిన్న ఎత్తుగడలను అమలు జరప గలుగుతున్నది. ప్రతి ఎత్తుగడ వాటిని మరింత సంక్షోభంలోకి నెడుతున్నది. భారతదేశం వంటి అర్ధ వలస దేశాలు సాధ్యమైన మేరకు చివరి వరకూ దోపిడీకి గురౌతున్నాయి. ఒక ప్రక్కన తమ ఉత్పత్తులకు ఈ దేశాలను మార్కెట్లుగా తమ పెట్టుబడులను పెట్టే ప్రాంతాలుగా, రెండవ ప్రక్కన, చౌకగా ముడి సరుకులు, శ్రమ శక్తిని వనరులుగా ఉపయోగించుకోవాలని అవి కోరుతున్నాయి. ఈ దేశాన్ని తమ ఉత్పత్తులకు మార్కెట్‌గా, పెట్టుబడి పెట్టే ప్రాంతంగా ఉపయోగించుకున్నంత కాలం భూస్వామ్య లక్షణాలను కొన్నింటిని నశింపజేయాలనుకుంటున్నాయి. కానీ, చౌక బారు ముడిసరుకులు, కూలీల వనరులుగా ఈ దేశాన్ని ఉపయోగించుకోటానికి, భూస్వామ్య విధానాన్ని అట్టి పెట్టాలి. ఇదే సంస్కృతిలో కూడా ప్రతిబింబిస్తున్నది. విద్య, ఉపాధి రంగాలలో విద్యార్థులు, యువకులు తీవ్రమైన పోటీలో పాల్గొనేటట్లు చేస్తున్నాడు. రెండవ వానిని అధిగమించాలని ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తున్నారు. సంకుచిత వ్యక్తివాదం అభివృద్ధి చెందుతున్నది. ఒక్కొక్కప్పుడు ఈ సంకుచిత వ్యక్తి వాదం, కొంచెం మంచి జీవన ప్రమాణం సాధించటానికి తమ వ్యక్తిత్వాన్ని కూడా అమ్ముకునేందుకు సిద్ధమౌతున్నారు. సంఘటిత పరిశ్రమలలోని కార్మికులు, అసంఘటిత పరిశ్రమలలోని కార్మికుల, మూత పడిన పరిశ్రమలలోని కార్మికుల బాధలను పట్టించుకోవటంలేదు. వస్తు వ్యామోహతత్వం (కన్సూమరిజం) ప్రబలింది. వ్యక్తి ఆర్థిక స్థితి మూలుగుల్నే తినివేస్తున్నది. బహుళ జాతి సంస్థలు, వారితో మిలాఖత్ అయిన భారతీయుల లాభాలకు అదుపు లేకుండా పోయింది. రెండవ ప్రక్కన కులతత్వం, మతతత్వం, బాగా రెచ్చగొట్టబడుతోంది. అందువల్ల శ్రామిక జనం చీలిపోయి వుంటున్నారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న అదనపు దోపిడి శాశ్వతమౌతున్నది. భారత దేశంలోని ప్రతిచోట సామ్రాజ్యవాద యజమానులు వారి బహుళ జాతి జాగిలాలు, ఆ దేశాలలో దేశీయ భాషల కంటే ఇంగ్లీషు భాషకు విద్యలోను, ఉద్యోగాలలోను ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతోంది. ఫలితంగా భారత ప్రజలకు రెండు రకాల విద్య బోధించబడుతోంది. ఇంగ్లీషు మీడియం పాఠశాల, ప్రయివేట్ కాలేజీలలో విద్యను కొనుక్కోగల కొద్దిమంది అదృష్టవంతులకు ఒకటి; కూలిపోతున్న భవనాలు, ఏమాత్రం ఆధునిక బోధనా పద్ధతులు, సౌకర్యాలు లేని పాఠశాలలకు తమ కొడుకులను, కూతుళ్ళను పంపి సంతృప్తిపడే ప్రజానీకానికి మరొకటిగా విభజింపబడి వున్నాయి.

భారత దేశంలోని ప్రతి ఒక్కరూ, వ్యక్తిగత జీవితంలోను సామాజిక జీవితంలోను కూడా అసంతృప్తి పెరిగే పరిస్థితిని సృష్టించారు. ఫలితంగా తప్పుడు గర్వభావం ఏర్పడి సులభంగా జాతీయ దురహంకారానికి యుద్ధోన్మాదానికి గురౌతున్నారు.

ఈ పరిస్థితులలో ప్రజలను సమీకరించటం, నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో సాంస్కృతిక విప్లవానికి గొప్ప ప్రాముఖ్యత వుంది.

చైనీయుల అనుభవం నుండి గుణ పాఠాలు

చైనీయుల అనుభవాల నుండి గుణ పాఠాలను తీసుకున్నట్లయితే, ఈ పరిస్థితిలో శ్రామిక వర్గం ఒక్కటే, సామ్రాజ్యవాద సంస్కృతికి, భూస్వామ్య సంస్కృతికి వ్యతిరేకంగా జరిపే పోరాటంలో సమాజానికి నాయకత్వం వహించగలదని స్పష్టమౌతుంది.

కానీ, ఇక్కడ భారతదేశంలోని నిర్దిష్ట పరిస్థితిలో ఒక వర్గంగా పోరాటానికి నాయకత్వం వహించేందుకు శ్రామిక వర్గం రెండు ముఖ్యమైన సమస్యలను ఎదుర్కోవలసివుంది.

ఒకటి – భారత సమాజంలో రివిజనిజం, నయారివిజనిజం, వాటి ప్రభావం వుండటం. ప్రస్తుత ప్రపంచంలో రివిజనిజం, నయా రివిజనిజం పెట్టీ బూర్జువా సిద్ధాంతాలు కావన్న విషయం మనస్సులో వుంచుకోవాలి. అవి పూర్తిగా బూర్జువా సిద్ధాంతాలు. మరి భారతదేశంలో అనేక రాష్ట్రాలలో దీర్ఘకాలం పాటు వీరు అధికారంలో వుండటం వల్ల, ప్రజలకు నష్టకరంగా పాలక వర్గాల ప్రయోజనాలను వారు కాపాడారు. చివరకు ప్రజల అనేక న్యాయమైన పోరాటాలను అణచటంలో నాయకత్వం వహించారు. అందుకు, నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటును అణచడానికి పారామిలటరీ దళాలను పంపించటం, పదకొండు మంది మహిళా కామ్రేడ్స్‌ను చంపటం అత్యంత నగ్నంగా కన్పించే ఉదాహరణలు. అందువల్ల శ్రామిక వర్గం, నూతన ప్రజాస్వామిక సంస్కృతి కోసం తాము జరిపే పోరాటంలో రివిజనిస్టు, నయా రివిజనిస్టు సిద్ధాంతాలతో పోరాడవలసి వుంది.

రెండవది – కమ్యూనిస్టు విప్లవకారులలో చీలిక విప్లవశక్తుల బలంపై ప్రజలు ఆధారపడటాన్ని బలహీన పరుస్తోంది. తమంతట తాముగా కమ్యూనిస్టు విప్లవకారులు సమైక్యం కాకపోతే, మిత్రులందరిని సాధ్యమైన మేరకు సమైక్యపరచి, సాంస్కృతిక యుద్ధ రంగంలో తమ శ్రేణులను ఎలా మొహరించగలరు? అన్ని రకాల ముఠాతత్వం, వ్యక్తిత్వ వాదం, తమకే ఎక్కువ బలం వుందన్న అహంకారం, ఇతరులకంటే తామే పవిత్రులమన్న వైఖరి విడిచి పెట్టాలి. స్పష్టమైన కేంద్రీకృత ప్రజాస్వామ్య సంస్కృతి, విప్లవ శాస్త్రంకోసం చేసే కృషిలో దాపరికం లేని మనస్తత్వం అవసరం. కమ్యూనిస్టు విప్లవకారులనే సమైక్యం చేయలేనప్పుడు, విప్లవంలోకి ప్రజల్ని ఎలా సమీకరించగలమని ప్రతి కమ్యూనిస్టు విప్లవకారులు తప్పకుండా ఆలోచించాలి. విడిచిపెట్టవలసిన, అధికంగా విచారపడవలసిన విషయం, సాయుధ పద్ధతులలో సిద్ధాంత పరమైన సమస్యలను పరిష్కరించగలమన్న సంస్కృతిని విడిచిపెట్టాలి. ఇవి సిద్ధాంత దివాళాకోరు తనానికి రుజువుతప్ప మరొకటి కాదు. అంటువంటి చర్యలకు మద్దతు యివ్వటం, తెలిసిగానీ తెలియకగానీ విప్లవానికి వ్యతిరేకంగా పనిచేయటమే.

శ్రామిక వర్గ అగ్రగామి దళం, పైన పేర్కొన్న రెండు సమస్యలను పట్టించుకోవాలి. సాంస్కృతిక రంగంలో ఇప్పుడుకూడా పోరాటాలు జరుగుతున్నాయి. సామ్రాజ్యవాద సంస్కృతి, భూస్వామ్య సంస్కృతులు వ్యక్తమౌతున్న అనేక వాటికి వ్యతిరేకంగా శ్రామికవర్గ శక్తులు పోరాడుతున్నాయి. కానీ, అవి సమగ్రమైన, సంఘటితమైన పోరాటాలు కావు.

నలభైయ్యవ దశక కాలంలో సాంస్కృతిక రంగంలో జరిపిన అటువంటి ప్రయత్నం గొప్ప విజయాలు సాధించినట్టు తెలుస్తుంది. కానీ, ఆశ్చర్యమేమిటంటే దానికి నాయకత్వం రివిజనిజం వహించింది. శ్రామికవర్గ సంస్కృతి అభివృద్ధిచెందలేదు. నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటు తరువాత తప్పుడు అవగాహనవల్ల గొప్ప అవకాశాలను పోగొట్టుకున్నాం. దానిని సరిజేయటానికి కమ్యూనిస్టు విప్లవకారులు ప్రయత్నించారు. అవిధంగా చేయటానికి తమ శక్తి కొలది ప్రయత్నం చేస్తునే వున్నారు. కానీ, ఇంతకు ముందు చెప్పినట్లుగా, ఆ ప్రయత్నాలు చీలి వున్నాయి. సమగ్రంగా కూడా లేవు.

నూతన ప్రజాస్వామిక సంస్కృతి కొరకు జరిపే పోరాటానికి మరో కోణం, సాంస్కృతిక రంగంలో ఐక్యసంఘటన (యునైటెడ్ ఫ్రంట్) అభివృద్ధి చేయటం. చైనాలో రాజకీయ రంగంలో విప్లవం మాదిరిగా, సాంస్కృతిక రంగంలో కూడా ఐక్య సంఘటన విభిన్న ప్రాంతాలలో, విభిన్న రూపాలలో ఎలా తీసుకున్నదీ పరిశీలించాలి. భారతదేశంలోని ప్రస్తుత విప్లవ పరిస్థితిలో, సాంస్కృతిక రంగంలో, మతతత్వానికి, కులతత్వానికి వ్యతిరేకంగా భారతీయ భాషలను తక్కువ చేయటానికి వ్యతిరేకంగా, జాతీయ దురహంకారానికి వ్యతిరేకంగా, యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా పురుషాధిక్యతకు, పురుషాహంకారానికి వ్యతిరేకంగా, అన్నిరకాల సామ్రాజ్యవాద సంస్కృతికి, భూస్వామ్య సంస్కృతికి వ్యతిరేకంగా అన్ని శక్తులతోను కలిసి ఐక్య సంఘటనను అభివృద్ధి చేయాలి.

ఈ పోరాటంలో, సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతులకు వ్యతిరేకంగా జరిగే పోరాటపు ఐక్య సంఘటనలో అనేక మంది ప్రజలు చేరవచ్చు. సిద్ధాంతంతో సంస్కృతికి సన్నిహిత సంబంధం కలిగి వుండటం వల్ల, భిన్న సిద్ధాంతాలకు చెందిన ప్రజలు అయినప్పటికీ, సామ్రాజ్యవాద సంస్కృతి, భూస్వామ్య సంస్కృతికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సమీకరించవచ్చు. పెటీబూర్జువా సిద్ధాంతం అంబేద్కరిజం, మార్క్సిజం-లెనినిజం, ఆధునికానంతం వాదం, జాతీయ బూర్జువా వర్గంతో సన్నిహిత సంబంధాలు కలిగిన నిజమైన దేశ భక్తులు, సామ్రాజ్యవాద, భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా ఎలా పోరాడాలో తెలియని ప్రజాస్వామిక వాదులు సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతులకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం కొనసాగించేందుకు భుజం భుజం కలపవచ్చు. తన పూర్తి అవగాహనతో దీక్షతో శ్రామిక వర్గం మాత్రమే ఈ పోరాటానికి నాయకత్వం వహించగలదన్నది వాస్తవం. కానీ, ఆ నాయకత్వాన్ని ఇతరులపై రుద్దేదిగా వుండకూడదు. తన కార్యక్రమాల ద్వారా, స్వతంత్ర చొరవ ద్వారా, వాస్తవమైన ప్రజాస్వామ్య సంస్కృతి, శ్రామిక వర్గాన్ని తన సిద్ధాంతం ద్వారా, ఆ ఐక్యసంఘటనపై తన నాయకత్వాన్ని స్థాపించుకోగలదు.

చైనా విప్లవపు ఈ 50వ వార్షికోత్సవం సందర్భంగా నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో సాంస్కృతిక విప్లవం పట్ల మన దృష్టిని కేంద్రీకరించాలి. సామ్రాజ్యవాద, భూస్వామ్య సంస్కృతులను తుడిచి పెట్టటానికి, నూతన ప్రజాస్వామిక సంస్కృతిని అభివృద్ధి చేయవలసివుంది. అది అర్ధ వలస, అర్ధ భూస్వామ్య ప్రభుత్వంపైన, సమాజానికి వ్యతిరేకంగా జరిగే రాజకీయ, ఆర్థిక విప్లవంపై అపారమైన ప్రభావం నెరవుతుంది. ◆

నైజాం రాజ్యంలో ప్రజా ఉద్యమంపై ప్రభుత్వ దాడి

- దేవులపల్లి వెంకటేశ్వరరావు

(ప్రజాశక్తి కార్యాలయం 1946లో దొడ్డి కొమరయ్య అమరత్వానికి ముందే ప్రచురించిన 52 పేజీలు విలువైన, అరుదైన పుస్తకం నుంచి ముఖ్యమైన భాగాలను ఇక్కడ పునర్ముద్రిస్తున్నాం. ఈ పుస్తకానికి నిజాం రాష్ట్రాంధ్ర మహాసభ అధ్యక్షులుగా రావి నారాయణరెడ్డి ఉపోద్ఘాతం రాశారు.)

సామాన్య ప్రజల స్థితిగతులు

నల్లగొండ జిల్లా పెద్ద జమీందారులకు, (జాగీరుదారులు, దేశ ముఖులు, మఖ్తాదారులు, వతన్‌దారులు, భూస్వాములు, పైరవీకారులు) ఆయువుపట్టు.

జాగీరుదారులకు పరిపాలనాధికారం ఉంటుంది. వారు తమ జాగీరు నుంచి వచ్చే ఆదాయాన్ని తమకొరకే వినియోగించుకొంటారు. కాని ప్రజల విద్య, వైద్య సౌకర్యాలకు వినియోగించరు. రైతులు నజరానాలు ఇచ్చుకొంటేనే వారికి తమ భూములపైన కబ్జా (ఆక్రమణ) హక్కు ఉంటుంది. పనిబాటలవారు రాత్రింబవళ్లు జాగీరు అధికారులకు వెట్టి పనులు చేస్తూ ఉండాలి. అక్రమ పన్నులకు హద్దు వుండదు. జాగీరులోని భూములను తమ బంధువులకు పట్టాపైన ఇస్తూ అక్కడి రైతుల భూములను లాగివేయడం తరచుగా జరుగుతుంది.

ఇతర ప్రాంతాలలో దేశముఖులు, పటేలు, పట్వారీల, పెత్తం దారుల అధికారం సాగుతుంది.

వీరిలో చాలా మంది చిన్నరైతుల భూములను ఆక్రమించుకొని పెద్ద వ్యవసాయాలు సాగించుతున్నారు. అప్పులు, కరవు కాటకాలు, దేశముఖుల దౌర్జన్యాలకు తాళలేక రైతులు గత 10, 15 సంవత్సరాల్లో ఎంతో భూమిని పోగొట్టుకొన్నారు.

రైతులు తమ స్వల్ప ఆదాయం నుంచి ఈ రోజు ఆ రోజు అన కుండా ఇచ్చుకోవలసిన లంచాలు ఎన్నో వున్నవి. పటేలు, పట్వారీలకు, గిర్దావరులకు భూమిశిస్తులకు సంబంధించిన లంచాలు ఇచ్చుకోవాలి. ఇప్పటికే ఎన్నో గ్రామాల్లో తీసుకున్న శిస్తుకు (లంచాలతో సహా) రసీదులు ఇవ్వనే ఇవ్వరు గ్రామాధికారులు. మాల్గుజారి ఖానూన్‌లో వుండే అవకతవకలు, రైతోల్లో వుండే అజ్ఞానంవల్ల, వీరు చీమలు, దోమలు వలె నలిపివేయబడతూ వుంటారు.

కొందరు దేశముఖులు, గ్రామాధికారులు నిత్యాదాయం కలిగి వుంటారు. చైతన్యం లేని ప్రజల్లో చిల్లరతగాదాలు రెచ్చగొట్టి తీర్పుచేసే నెపంతో లంచాలు తీసుకొంటారు. భూముల తగాదాలలో ఈ లంచాలు మరీ ఎక్కువగా వుంటాయి. వీరే పైరవీకారు (చెట్టుకిందప్లీడరు) లైతె వీరికి, వకీళ్లకు, అధికారులందరికీ ఇచ్చుకోవాలే. ఇన్ని లంచాలతో అప్పులపాలై బానిసలై జీవిస్తున్నారు ప్రజలు.

వీరిలో కౌల్దారుల పరిస్థితులు మరీ అధ్వాన్నంగా వుంది. వీరు రెండువిధాల ఉన్నారు. 1. సామాన్య కౌల్దారులు 2. ఇజారా కౌల్దారులు పెద్ద పెద్ద భూస్వాములు తాము సేద్యం చేసుకోగా మిగిలిన భూమిని, రైతులు సేద్యం చేసుకొని భూస్వాములు కోరినంత శిస్తును (కొన్నిచోట్ల పంటకు మొదలే) చెల్లించాలి. వీరు రైతులను ప్రతిసంవత్సరమూ, ప్రతి రెండుమూడు సంవత్సరాల కొకసారి మార్చుతూవుండడం వలన వారిలోవారు పోటీపడి, శక్తికి మించిన శిస్తును, ధాన్యాన్ని భూస్వామికిచ్చి పస్తులుంటున్నారు.

ఇజారా భూములను రైతులు అడివికొట్టిన నాటి నుండి సేద్యం చేస్తున్నారు. ఇండ్లు కట్టుకొని తరతరాలుగా జీవించుతున్నారు. భూములు తమకు శాశ్వతంగా ఉంటాయని, వాటిలో బావులు తవ్వించుకొని, కందకాలు తీయించుకొని, విభాగాలు చేసుకొని, కుటుంబానికొక ఎకరం చొప్పున సేద్యం చేసుకుని చాలీచాలని జీవితాన్ని గడుపుతున్నారు. భూస్వామి పేరుకే పట్టాదారు. అయినా అసలు రకానికి అయిదు ఇమ్మడులను మించిన శిస్తును కడుతున్నారు. శిస్తుకు రశీదులు లేవు. వీరు ఈ భూమిని ఇంతకాలం నుంచి సేద్యం చేస్తున్నారని ప్రభుత్వపు రికార్డులలో లేదు. ఎందుకనగా పటేలు, పట్వారీలే సాధారణంగా భూస్వాములై వున్నారు.

వీరు తమ వ్యవసాయపు పనులను వదలి భూస్వామికి వెట్టిచాకిరి చేయాలి. పొలం దున్నడం, గడ్డి, చొప్ప, కోళ్లు ఇవ్వడం తప్పనిసరి. సమయానికి శిస్తులు ఇవ్వకుంటే వీరిని యమభటులవంటి జావానులతో పట్టి తెప్పించి, చెట్టుకు వేలాడగట్టి బాధించుతారు. భూములనుంచి తొలగిస్తారు.

చాలామంది భూస్వాములు ఈపాటికే ఇలాంటి రైతులను వారి భూములనుంచి తొలగించి పెద్ద పెద్ద వ్యవసాయాలను స్థాపించుకున్నారు. వీరు నిరుపేదలై వ్యవసాయకూలీలుగా జీవితం గడుపుకుంటున్నారు. రైతుల అప్పుల బాధలకు హద్దులేదు. పండించిన పంటనంతా షావుకారుకో, పెట్టుబడి ఇచ్చే వడ్డీ వ్యాపారస్తునికో చెల్లించి, మరుసటి రోజునుంచే తిండికి, వ్యవసాయానికి ఖర్చులకు అతనిపైన ఆధారపడి వుండే రైతులు వేలకువేలున్నారు.

అధికారులు ఈ గ్రామ పెత్తందారులకు, జమీందారులకు అతిథులు, స్నేహితులు, బంధువులుగా వుంటారు. రైతులకు నోరెత్తడానికి ధైర్యం లేదు. ధైర్యం చేస్తే ఫలితం సున్న. గ్రామంలో జమీందారుల అక్రమాలకు లొంగక ఎదిరించే వ్యక్తివెవరైనా వుంటే అతనికి సంగా (ఏమీలేనివాడు) ముఖండి, బద్మాష్ అనే నీచమైన పేర్లను పెట్టి పిలుస్తుంటారు, ఈ పెద్దలు. వర్తకులకు కూడా వెట్టి తప్పదు. అధికారులు దౌరాలకు (పర్యటన) వచ్చినప్పుడు వారికి కావలసిన సామానును డబ్బు తీసుకోకుండా ఇవ్వాలి. అప్పుడప్పుడు వారి ఆగ్రహానికి పాత్రులై దెబ్బలు కూడా తింటారు. గౌరవనీయమైన వృత్తికి చెందినవాడైనా కోమటిని చపరాస్ మొదలుకొని పై అధికారి వరకు, గ్రామ తలారీ నుండి దేశముఖు వరకు నీచంగా చూస్తారు. గౌరవమనేది పేరుకుగూడా వుండక వీరందరికి లంచాలు మాముళ్ళు ఇచ్చుకొంటు కాలం గడుపుకుంటారు. వ్యాపారం వృద్ధి కావడంలేదు.

పనిబాటలవారు (చాకలి, మంగలి, కుమ్మరి, వడ్ల, కమ్మర్లు, హరిజనులు) రెండువిధాల వెట్టిపనులు చేయాలె. మొదటిది తాము నివసించే గ్రామ పెత్తందార్ల ఇండ్లలో ఇంటిపనులు, ప్రయాణాలు

చేయాలి. తిట్లు, కొట్లు లెక్కలేనన్ని దొరుకుతవి గాని ప్రతిఫలం మాత్రం చిల్లిగవ్వ కూడా ఉండదు. వీరు ఎంత ఎక్కువ బలవంతులైతే అంత ఎక్కువ మంది పనిబాటలు వారితో పనిచేయించుకొంటారు. రెండవది అధికారులు దొరాకు వచ్చినపుడు చేయించుకునే పని. దీనికి ఒక్క చిల్లిగవ్వకూడా ప్రతిఫలం వుండదు. జవానుగూడా వీరి శరీరాలపైన బెత్తాలను విరగగొట్టుతాడు. అడిగే నాథుడు లేడు, చెప్పుకునే దిక్కు లేదు. మారుమాట్లాడితే వీరికుండే పనికిరాని ఇనాము భూములకు ముప్పు తెస్తామని బెదిరిస్తారు. వీరు ఇష్టం వచ్చినచోట కూలీ సంపాదించుకోడానికి వీలు లేదు. వ్యవసాయం చేసుకొడానికి అవకాశం లేదు. అర్థాకలితో కొన్నాళ్ళు, నిండుటాకలితో తక్కిన రోజులు కాలం వెళ్ళబుచ్చుతారు యీ నిరుపేదలు.

వ్యవసాయ కూలీలు గ్రామ పెత్తందారుల సొత్తుగానే వుంటారు. ఇచ్చినంత కూలీ తీసుకుని, మొదలేవారి పొలాల్లో పనిచేయాలి. సంవత్సరపు జీతాలు ఎక్కువగా వున్నవి. నెలకు 40 శేర్లు 0-4-0 డబ్బు సాధారణంగా ఇచ్చే జీతం. అప్పులు తీర్చడానికి తరాల తరబడి జీతం చేసి ఇటు పొట్టపోసుకోలేక అటు అప్పు తీర్చుకోలేక తమ జీవితాలను పూర్తిగా యజమానుల కమ్ముకునేవారు ఎక్కువమంది వున్నారు. అప్పులపాలై బ్రదుకు తెరువుకై బెజవాడకు, మద్రాసుకు వెళ్లి రిక్షాలను లాగుతూ, వ్యవసాయపనులు చేస్తూ ఎంతోమంది వున్నారు. పనులరోజుల్లో అక్కడకి పోయేవారు రోడ్డులపైన బారులుకట్టి వందల సంఖ్యలో కనుబడతారు.

జీతగాండ్ల (పాలేరులు) విషయమైన ఒకచట్టం చేసి ప్రభుత్వం కొన్ని సౌకర్యాలు కల్పించినా, అది అమలులో లేదు. అధికారులు ఇంచుమించుగా మరచేపోయినారు. గ్రామాలలో స్కూలువుండటం, గ్రామపెత్తందారులకు గిట్టదు. అందులో రైతుల, కూలీల, బిడ్డలు చదువటం అనలేగిట్టదు. వున్న స్కూళ్ళు పేరుకు మాత్రమే. ప్రజాసామాన్యానికి చదువు శూన్యం.

యుద్ధం వచ్చిన తర్వాత, ప్రభుత్వం ఆహారసమస్యను పరిష్కరించ డానికి కొన్ని నిబంధనలు చేసినది. దానివలన ప్రజలకు ముఖ్యంగా గ్రామ ప్రజలకు కష్టాలు ఎక్కువైనవి. లంచగొండులైన పెత్తందారులకు ఎక్కువ అధికారాలు, అవకాశాలు దొరికినవి. వాటిని దుర్వినియోగం చేసి రైతుల ఇండ్లను పట్టపగలు కొల్లగొట్టినారు. ఉద్యోగులు గ్రామా ధికారులు వేల సంపన్నులై రైతులను మాత్రం నిరుపేదలుగా చేసి వేసినారు.

గ్రామాల్లో పోలీసు కానిస్టేబులంటే దెయ్యం, పెనుభూతం, రాక్షసుడు. ఇలా భయపడుతున్న ప్రజలపైన పోలీసువారు ఎన్ని అత్యా చారాలు చేసినా అడిగేవారుండరు. కనుక వీరి లంచాలకు హద్దుండదు.

మధ్యయుగాలనాటి దోపిడీ విధానం

ఇప్పుడు మనం ఒక్కొక తాలూకాలో ప్రజలపైన జరుగుతున్న అక్రమాలను తెలుసుకుందాం.

విసూనూరి ప్రాంతం : ప్రజలపాలిటి నరకం

జనగామ తాలుకాలో విసునూరు గ్రామంలో రాపాక రామచంద్రా రెడ్డి దేశముఖు వున్నాడు. ఇతడు జనగామ, సూర్యాపేట, వరంగల్లు తాలుకాలలో 60 గ్రామాలకు దేశముఖు. అన్నిటిలో యితనికి స్వంతభూమి ఉంది. దగ్గరగావుండే జనగామా తాలుకా గ్రామాలలో ఇతని నిరంకుశాధికారం బాహాటంగా సాగుతున్నది. దీనికి మూడు ముఖ్యాంగాలు :

1. ఏజెంటులు : మిస్కిన్ అలీ ముఖ్తెయార్ ఆ గ్రామాల్లోను స్థానికంగా ఏజెంట్లు వుంటారు. వీరు ప్రజల్లో జగడాలు కల్పించి వారినుంచి తాము కొంత లంచం తీసుకొని వారిని తమ యజమానులకు ఒప్పగించుతారు. అటుతర్వాత మిస్కిన్అలీ, దేశముఖులు తమతమ లంచాలు తీసుకొని ఇష్టమొచ్చినట్లుగా తీర్పు చెబుతారు. లేదా, మరికొన్ని లంచాలకోసం వాయిదా వేస్తారు. వందల రూపాయల లంచాలు రెండు వైపులా తీసుకొని, యినాటికి కూడా, యే తీర్పు లేకుండా తగాదాలను యెప్పటిలాగానే వుంచిన కేసులు వందలాదిగా ఉన్నాయి.

2. రౌడీలు : ఒక్క విసునూరులోనే సుమారు 20, 30 మంది రౌడీలు వున్నారు. ఇతర గ్రామాలలో కూడా వున్నారు. వీరిలో చాలామందికి స్వంత వ్యవసాయాలున్నా, వారు వెంట కర్రలు, కత్తులు వుంచుకొని గ్రామంలోని ప్రజలను అదిరించి, బెదిరించి డబ్బు సంపాదించుకొంటారు. తమకు కావాలసిన వస్తువులను బలవంతంగా తీసుకుంటారు. ఒక వ్యక్తి సాయంత్ర సమయాన కొన్ని చేపలను చాటుచాటుగా భయపడుతూ తెచ్చుకుంటూవున్నప్పుడు, ఇదేమిటని అడిగితే గడగడ వణుకుతూ 'అయ్యా. చేపలు. ఇవి నా యింటికి చేరిందాకా నమ్మకం లేదు. మధ్యనే దొరమనుషులు చూస్తే అక్కడే లాక్కుంటారు' అని అన్నాడు. ప్రజలు దేశముఖుకు, అతని ఏజెంటులతో పాటు వీరికి కూడా సంతృప్తికరమైన లంచాలు ఇచ్చుకోవాలి లేనిదే వారు సంసారం చేయడం అసాధ్యం.

వీరు కొండెపుమాటలు చెప్పడం, అసత్యాలను ప్రచారం చేయడం, దొంగసాక్ష్యాలు చెప్పడం, దొంగ కేసులు పెట్టడంలో ఆరితేరినవారు. ఏ కేసులోనైనా వీరే ప్రత్యక్షం.

3. పోలీసులు : విసునూరలో పోలీసు స్టేషన్ వుంది. పోలీసులు ఎప్పుడూ దేఖముఖు అడుగులకు మడుగులొత్తుతూ వుంటారు. ఆయన నడిపించమన్న కేసును నడిపిస్తారు. వద్దన్న కేసును మానుకొంటారు. అందువలన ప్రజలు పోలీసు దగ్గరకు వెళ్ళడం అసాధ్యం. వెళ్ళినా తిరిగి వారు దేశముఖు దగ్గరకు పోవలసినవారె. తుదకు చుట్టుపట్ల గ్రామాల వతన్దారులు (మునసబు, కరణాలు) దేశముఖులు కూడా, ఇతనికి వెరచి పోలీసులతో తమకవసరమైన పనిని తీసుకోడానికి భయపడుతారు. దేఖముఖు అనుకూలురుమాత్రమే పోలీసుస్టేషన్లో అడుగు పెట్టడానికి నోచుకుంటారు. తక్కినవారు అరెస్టయి మాత్రమే ఇక్కడికి రావచ్చును.

ఒక్కమాటలో చెప్పాలంటే స్టేషన్ హౌస్ దేశముఖు భవనానికి ముఖద్వారంగా వున్నది. పోలీసులు ద్వారపాలకులు. దేశకుఖుకు వ్యతిరేకంగా ఈనాటికీ పోలీసులు ఒక్క కేసునైనా నడిపి, శిక్ష ఇప్పించలేదు. నడిపించడానికి ధైర్యంచేసిన ఒకరిద్దరు అక్కడ సంసారం చేయలేదు. ఏ కేసులోనైనా, వేలకువేలు లంచాలు ఇవ్వడానికి వేనుదీయడు. అందువలన ఎంతపెద్ద అధికారులైనా సరే ఇతనివలలో పడకమానరు.

దేశముఖ భవనం :

ప్రజలడబ్బు ప్రజలకష్టం : సుఖించేదెవరు ? దేశముఖ ప్రజలపైన తనసాటి జమీందారులపైన ప్రాబాల్యాన్ని సంపాదించి, తనను మించిన వాడు లేడని చాటేందుకు పెద్దభవనాన్ని కట్టించాడు. సుమారు 80వేల రూపాయలు ప్రజలనుంచి నిర్బంధంగా వసూలు చేసినారు. ఇల్లు పూర్తి అయ్యేవరకు జరిగిన పనినంత వెట్టిచేయించాడు. గృహప్రవేశం పేరుతో ప్రజలనుంచి తిరిగి కట్నాలు వసూలు చేశాడు.

ఇదేవిధంగా పెండ్లికి, చావుకు, అభానికి, శుభానికి, వేలకువేలు ప్రజలనుంచి వసూలుచేశాడు. ప్రజలు తమదగ్గరవున్నాలేకున్నా, అప్పు తెచ్చికూడా ఇస్తూవచ్చారు. ఒక బిచ్చపు ముసలమ్మ దగ్గర డబ్బులేదని పన్ను చెల్లించకపోతే ఆమె భిక్షమడుగుకొనే చిప్పనుకూడా లాక్కున్నారు ఈయన నౌకరులు. ఈ నిర్బంధపు వసూళ్ళకు పట్టీలని పేర్లు పెట్టి, వీటిని ఇవ్వడం సాంప్రదాయంగా తయారుచేసినారు. చావుకు యిచ్చేడబ్బును బూడిదపట్టీ అని ఇదేవిధంగా పెండ్లిపట్టీ, ఇంటిపట్టీ అనీ వసూలు చేస్తారు.

ఈ విధంగా ఇతని ఇల్లు ఒక దర్బారు, ఇతడు యమధర్మరాజు. రౌడీలు యమభటులు. ఈ ప్రాంతం ప్రజలపాలిటి నరకం. ఇతనిఇంట్లో ప్రజలు ఎంతక్రూరంగానైనా హింసించబడుతారు. దీనిని కసాయి ఇల్లు అంటేనే సరియైన పోలికగా వుంటుంది.

హత్యలు చేయడానికి ఎప్పుడూ సిద్ధమే :

ఆస్తి తగాదాలో ఇతడు తన దగ్గరి బంధువు పడిశాల గ్రామం దేశముఖ వెంకటరెడ్డి చంపబడ్డాడు. అతని ఇంట్లో వున్న ధాన్యాన్ని, పశువులను, చేతికందిన ఇతరసొమ్మునంతా పట్టపగలు దోచుకొని తెచ్చుకున్నాడు. కొంతకాలం అజ్ఞాతవాసంలో గడిపి, శిక్షను తప్పించుకున్నాడు.

సుమారు 5 సంవత్సరాల కింద బందగీ అనే కామారెడ్డిగూడెం ముస్లిం పేదరైతు ఇదే విధంగా చంపబడ్డాడు. ఈ పేదరైతు తన గ్రామ ప్రజలను సమీకరించి దేశముఖను 12 సంవత్సరాలదాకా విరోచితంగా ఎదిరించి పోరాడినాడు. ఎన్ని కేసులు పెట్టినా బందెగీయే జయించినాడు. తుదకు దౌర్జన్యాన్ని ఎదిరించుటలో ప్రాణాలను కోల్పోయాడు. కేసులు పేరుకుమాత్రమే నడిచినవి. హంతకులు దొరలై తిరుగుతున్నారు. ప్రజలు ఏ రక్షణ లేక దేఖముఖ అంటే దయ్యమని భయపడసాగినారు. పచ్చిగడ్డి భగ్గున మండుతూవుంటే ప్రజలను ఆ మంటలలో వేసి బాధించడం సర్వసామాన్యమైంది.

మారు మాట్లాడితే పాతాళలోకానికి త్రొక్కడమే :

దేశముఖ అధికారానికి వచ్చిన మొదటి రోజుల్లో విసునూరులోనే వున్న తక్కిళ్లపల్లి సీతారామయ్య అనే వెలమ శ్రీమంతుడు రైతుల సహాయంతో ఇతన్ని ఎదిరించాడు. కాని తర్వాత క్రమంగా ఒంటరిగా అవడంచూచి ఇల్లుని, ఆస్తిని కొల్లగొట్టించాడు. ఇంట్లోవున్న నీళ్లబావికి కంపపెట్టిస్తే బిడ్డ ఘోషావలన బయటికి వెళ్ళి నీళ్లు తెచ్చుకోలేక బావిలో పడి చచ్చింది. సీతారామయ్య క్రమంగా దిగజారి నేడు దేశముఖ రౌడీలలో ముఖ్యుడైనాడు. మానవత్వం పోయింది. పశుత్వం ప్రవేశించింది.

సుమారు సంవత్సరం కింద ఈ గ్రామపు గౌండ్ల రైతులు బాలగాని నర్సింలు, రాజాలు ఇద్దరు అన్నదమ్ములను ఆంధ్రమహాసభలో చేరడానికి తయారైతే వారిని ఇంటికి పిలిపించి ప్రమాదకరంగా దెబ్బలు కొట్టినాడు. వారు పోలీసుల వద్దకి మొరపెట్టుకోడానికి పోవడాన్ని చూచి ఇల్లును దోయించినాడు. పంటపొలాన్ని కోసుకపోయి ఒక కారుకు సరిపోయే నీరున్న వాళ్ళ కుంట కట్టను తెంపివేసినాడు. ఈ ఆభాగ్య రైతులు 6 నెలలదాక ఎన్నో కష్టాల కోర్చి జిల్లా అధికారులనుంచి బాబెహకూమతు దాకా మొరపెట్టుకున్నారు.. కాని సహాయం పొందలేదు. పోలీసు అధికారుల జేబులు మాత్రం బాగా నిండినవి.

రెండు చేతులతో తినడం :

చిన్న జమీందార్లకు, మక్తాదారులకు వ్యతిరేకంగా రైతులను రెచ్చగొట్టి రెండువైపుల నుండి డబ్బులాక్కొని, రైతులను నట్టేట ముంచుతాడు. ప్రత్యర్థులు ధైర్యంతో ఎదిరిస్తే, తోకముడుచుకొని పోతాడు.

మల్లంపల్లి అనే మక్తాగ్రామం రైతులకు, శిస్తులను తగ్గించడానికి సహాయం చేస్తానని 5-6 వేల డబ్బు లాక్కున్నాడు. కాని ఏమీ చేయలేదు. రైతుల తిరుగుబాటుతోను, మక్తాదారు అన్నదమ్ముల తగాదాలను పురస్కరించుకొని, మఖ్తాపైన అధికారం సంపాదించి ఇటు మఖ్తాదారును, అటు రైతులను దివాలాతీయించినాడు. ఒక శ్రీవైష్ణవుని బాధించిబాధించి, 200 ఎకరాల ఆస్తి, కాజేసి ఇంటినుంచి వెళ్ళగొట్టినాడు. అతడునేడు సకుటుంబగా దేశదిమ్మరి అయినాడు.

బమ్మెర అనే గ్రామపురైతులను చేరదీసి, శిస్తులుమాఫీ (రద్దు) చేయిస్తానని కొంతడబ్బులాగి, ఆ గ్రామపు మఖ్తాదారుపైన దాడి సాగించాడు. శిస్తులు ఎగవేయించాడు. పంటలను తీసుక పోయినాడు. తన రౌడీల సహాయంతో వ్యవసాయాన్ని, గ్రామాన్ని చెల్లాచెదరుగా చేసి, 20వేల రూపాయలిస్తేనే రాజీ చేసుకొని వారి సహాయంతో దేశముఖను, ఎదిరించి రౌడీలను పొలిమేరలోకి కాలుపెట్టకుండా తరిమివేశాడు.

అప్పు ఇవ్వకనే ప్రాంసరీనోట్లు :

వ్యక్తులను అదుపు ఆజ్ఞలలో వుంచుకోడానికి, వారినుంచి వారి శక్తికి మించిన ప్రోనోట్లను రాయించుకొంటాడు. డబ్బు నెత్తిన కూలు తుందనే భయంతో వారు లొంగివుంటారు. కొన్నిసార్లు దొంగప్రోనోట్లు రాయించి, తాను లొంగదీయదలచిన వారిపై దావా వేసి, ఎన్నోబాధలు పెడుతాడు. ఇప్పుడు అకస్మాత్తుగా ఇంటిపైన దాడిచేసి వెతకిచూస్తే ఇలాంటినోట్లు వందల సంఖ్యలో దొరుకతవి.

వెట్టి అంటే యిదే :

పనిబాటలవారు, దేశముఖకు, ఆయన ఏజంట్లకు, రౌడీలకు గూడా వెట్టిచాకిరి చేసి దెబ్బలుతినాలి. వ్యవసాయ కూలీలు, అణాకూలీతో మొదలు వీరి వ్యవసాయంలో పనిచేసి, తర్వాత ఇతర రైతుల పొలాలకు పోవాలి. శేరీదారులు, ఈ కూలీలపైన సర్వాధికారులుగా వుంటారు. ఎక్కువకూలి ఇవ్వరు. ఇతర రైతులదగ్గర తెచ్చుకోనివ్వరు. అటు రైతులకూ ఇటు కూలీలకు ముకుతాళ్లు వేసి లాగుతారు.

ఒకసారి ఈ గ్రామాలన్నిటిలోనూ రైతులనుంచి మంచి మంచి ఎడ్లను ఏరి, మూడవవంతు, నాల్గవవంతు ధరలకు, నిర్బంధంగా తీసుకొన్నాడు.

రెండాకులు ఎక్కువ చదువుకున్న తల్లి :

ఈమె 80ఏండ్ల వృద్ధురాలు. కడివెండిలో వుంటుంది. ప్రత్యేకంగా ఆస్తిసంపాదన, వ్యవసాయం, వ్యవహారం, వ్యాపారం అన్నీ ప్రత్యేకమే.

ఈమె కూడా 4-5 గ్రామాల్లో అధికారం చలాయించుతుంది. వడ్లు, జొన్నలు మొదలగు తిండివస్తువులను, కోరినా, కోరకపోయినా ప్రజలకు ఇచ్చి ఒక సంవత్సరం తర్వాత 3-4 అంతల ధర తీసుకొని వేలకు వేలు సంపాదించుతుంది. భార్యాభర్తల తగాదాలనుంచి అన్ని తగాదాలను నిర్బంధంగా తానే తీర్పుచేసి వందలరూపాయల లంచాలను సంపాదించుతుంది.

ఈ విధంగా దొంగలు దొంగలు కలిసి వూళ్లు పంచుకొని పట్టపగలే ప్రజలను దోచుకుంటున్నారు.

ప్రజాపోరాట ప్రారంభం

ఈ నరకకూపంలో ప్రజలు 20-30 సంవత్సరాల జీవితాన్ని గడిపారు. సహించలేక ప్రజలు అక్కడక్కడ తిరుగుబాటుచేసినా, సరియైన నాయకత్వం లేక నిర్దాక్షిణ్యంగా అణచివేయబడ్డారు.

11వ ఆంధ్రమహాసభ (మే 1944) తర్వాత ప్రజల్లోవచ్చిన బ్రహ్మాండమైన చైతన్యఫలితంగా, ఈ గ్రామాల ప్రజలు, ఆరుట్ల రామచంద్రారెడ్డి గారి నాయకత్వాన ఆంధ్రమహాసభలో చేరి, తాము ఇంతకాలం నుంచి అనుభవించుతూవున్న కష్టాలను ఒక్కసారిగా తుడిచివేసుకున్నారు. సంవత్సరానికి సుమారు 1-2 లక్షల రూపాయల లంచాలు ఆగిపోయినవి. వెట్టిపోయింది. తమ చుట్టూ వున్న ప్రపంచాన్ని ఒకసారి కన్నుతెరచి చూడటానికి అవకాశం కలిగింది.

జమీందారి వర్గానికి ఇది గిట్టలేదు. ప్రజల్లో వచ్చిన ఈ చైతన్యం ఇక్కడి జమీందారులకేగాక, జల్లా అంతటా, లేక సంస్థానమంతటా వున్న జమీందారులకుగూడా నష్టదాయకమని భావించారు. విసునూరు రామచంద్రారెడ్డి నాయకత్వాన జిల్లాలోని జమీందారులంతా ఏకమైనారు. కొన్నివేల రూపాయలు పోగుచేసుకున్నారు. స్థానిక జిల్లా పోలీసును కూడగట్టుకొని, ఆంధ్రమహాసభ కార్యకర్తలు వ్యవసాయ కూలీల సమ్మె చేయించుతున్నారని, జమీందారుల ప్రాణాలు తీయించడానికే సిద్ధమవుతున్నారని, తప్పుడు రిపోర్టులు పంపించి, ఆంధ్రమహాసభను నిషేధింప జేయ చూచారు.

కాని ఆంధ్రమహాసభ కార్యకర్తలు ఇక్కడి పరిస్థితులు వివరంగా నివేదిక ద్వారా ప్రభుత్వానికి తెలిపి దౌర్జన్యపరులపైన చర్య తీసుకోవాలని ఆందోళన చేశారు. దీనివలన వారి ప్లానులు భగ్నమైనవి.

జమీందారులు ఈసారి పోలీసు సహాయంతో ప్రజలపైన కేసుల వర్షాన్ని కురిపించి, రక్తపాతాన్ని సృష్టించి కార్యకర్తలను, ముఖ్యంగా ప్రజానాయకుడైన ఆరుట్ల రామచంద్రారెడ్డిగారిని జైళ్లకు పంపించాలని ప్లానులు వేశారు. దాని ఫలితంగా ఉద్యమాన్ని తుడిచివేయవచ్చని ఆశించారు.

ఈ సమయంలో ఆంధ్రమహాసభాధ్యక్షులు శ్రీరావి నారాయణరెడ్డి గారు ఈ గ్రామాల్లో పర్యటన చేసి, ప్రజల కష్టసుఖాలను తెలుసుకున్నారు. ప్రజలు సమావేశాలలోను, ఊరేగింపులలోను వేలసంఖ్యలో పాల్గొన్నారు. మంగళహారతులిచ్చి నుదుటకుంకుమ పెట్టారు. రాంవరంలో కొందరు స్త్రీలు 'తమ భర్తలు, తల్లిదండ్రులు తీర్చలేని బాధలను ఆంధ్రసంఘం తీర్చిందని' అన్నారు. ప్రజలీవిధంగా తమ హృదయపూర్వకంగా ఆంధ్రమహాసభను గౌరవించారు.

ప్రజల సంరంభం యొక్క ఈ ఉన్నతస్థాయినిచూసి, జమీందారులు, పోలీసులు భయపడి, ఆలసించితే లాభం లేదని, ముంద్రాయి భూమితగాదాను, సాయుధ పోరాటంగా మార్చ ప్రయత్నించారు. దేశముఖులంతా ఐక్యంగా, తమ నాగళ్లతోనేగాక సాయుధ సిబ్బందితో రక్తపాతాన్ని సృష్టించప్రయత్నించారు. ప్రజలంతా వేలసంఖ్యలో ముంద్రాయి రైతుల వెనుక నిల్చుని, సాయపడి తమ ఐక్యతను, సంఘటిత శక్తిని ప్రదర్శించారు. అయినా రక్తపాతానికితావీయక జమీందారుల ప్లానులను తలక్రిందులుగాజేశారు.

పోరాటంలో, జిల్లా పోలీసు, రిజర్వు పోలీసుదళంతో వచ్చి, జమీందారులకు సాయం చేశారు. 3-4 రోజులు ఎడతెగని విందులు ఆరగించారు. భూమిని, కడారు సోదరులకు అప్పగించి తిరిగి వెళ్లారు. ఈ సందర్భంలో పోలీసువారు తీసుకున్న లంచాలకు హద్దులేదు. అప్పుడున్న జిల్లా పోలీసు సూపరిండెంటు హైద్రాబాదులో ఒక భవనాన్ని కట్టుకొంటూ రెండు చేతులా లంచాలు తీసుకొంటూ వచ్చాడు.

ఇతనికన్నా రెండాకులు ఎక్కువ చదివి వచ్చినవాడు జనగామ సబ్ ఇన్స్పెక్టరు గురుదయాల్‌సింగు. ఇతడు ఒక జనగామ తాలూకాలోనే 3లక్షలు డబ్బులు సంపాదించి పంజాబుదేశంలో పెద్ద ఆస్తిని కొనిపెట్టుకున్నాడని జనగామ ప్రాంతంలో వదంతి వుంది. పొలం దున్నే సమయంలో పోలీసులు ఏ కారణం లేకుండానే ఆరుట్ల రామచంద్రారెడ్డిగారిని అరెస్టు చేసి, ఒక రోజంతా ముంద్రాయి రైసుమిల్లులో నిర్బంధించి వుంచారు. మేజిస్ట్రేటు అనుమతి లేకుండా జనగామ తాలూకా కార్యాలయాన్ని సోదాచేసి, రికార్డునంతా తీసుకొనిపోయారు. 22మంది రైతులపైన జిల్లా కమిటీ అధ్యక్షుడు ఆరుట్ల రామచంద్రారెడ్డిగారిపై ఒక కేసు నడిపించుతూ వున్నారు.

ఇక్కడ రక్తపాతాన్ని సృష్టించలేక మరొకసారి పాలకుర్తిలో ప్రయత్నించారు. ఆరుట్ల రామచంద్రారెడ్డి, డి.సుబ్బారావు (జిల్లా కమిటీ కార్యదర్శులు) గంగుల శాయిరెడ్డిగారు (తాలూకా కమిటీ కార్యదర్శి) మరి 19 స్థానిక కార్యకర్తలు, రైతులపైన ఒక ఖూనీ కేసు తెచ్చి, శాయిరెడ్డి గారిని మరికొందరు రైతులను అరెస్టు చేసి పాలకుర్తి నుంచే బెత్తంతోనూ, కర్రలతోనూ దెబ్బలు కొడుతూ తీసుకువెళ్ళినారు. వృద్ధుడైన శాయిరెడ్డిగారి నడుముకు వారి నెత్తిరుమాలుగట్టి లాగుతూ నడిపించారు. స్టేషన్‌హౌస్‌లో కూడా బాధించి, వీరందరినీ మండుటెండలో, కాలుతున్న ఇసుకలో, రాళ్ళలో, ముండ్లలో నడిపించుతూ 30మైళ్లకు పైగా వున్న జనగామకు తీసుకువెళ్లారు.

కొన్నాళ్ళకు, ఆరుట్ల రామచంద్రారెడ్డిగారు స్వయంగానే పట్టుపడ్డారు. విసునూరు స్టేషను హౌస్‌లో దేశముఖు సూచనపైన, అర్ధరాత్రివేళ వారిని లాకప్పులోనుంచి బైటకుతీసి స్పృహ తప్పి పోయిందాకా కర్రలతోనూ, చెప్పులతోనూ, పోలీసులు దెబ్బలు కొట్టినారు. దానిపై పోలీసుపైన ఏమీ చర్య తీసుకోలేదు ప్రభుత్వం. వీరంతా అరెస్టులు కాగానే, విసునూరు రౌడీలు గ్రామాల్లో పెద్ద పెట్టున భయంకరమైన

వదంతులు వ్యాపింపజేశారు. జైలుకు వెళ్లినవారందరికీ, ఆరుట్ల రామచంద్రారెడ్డికి యావజ్జీవ శిక్షపడుతుందని, పాలకుర్తి గ్రామన్ని లూటీచేసి తగులబెట్టబోతున్నామని వదంతులు వ్యాపింపజేశారు.

రామచంద్రారెడ్డి గారు అరెస్టయినతర్వాత, వారితలనుకోసివేసి, విసునూరు దేశముఖు కోటకు వ్రేలాడగట్టారని వదంతులు వ్యాపింపజేస్తే, ఉగాది పండుగనాడు (అరెస్టుచేసినరోజు) పాలకుర్తిలో ఎన్నో కుటుంబాలు ఏడ్చి భోజనాలు మానివేసి ఉపవాసంతో, తమ సంతాపాన్ని ప్రకటించాయి. రౌడీలు, పోలీసులు కలిసి, కేసులో పారిపోయినవారిని పట్టుకోవాలనే నెపంతో, అర్ధరాత్రి ఇండ్లపైన దాడిచేస్తుంటే భయపడి, కొందరు ఇండ్లను వదిలిగుట్టలపాలైనారు. అన్నకు బదులు తమ్ముడిని, తండ్రికిబదులు కొడుకును పట్టుకుపోతామని బెదిరిస్తే ఇండ్లు వాకిండ్లను, వ్యవసాయాలను వదలి, గ్రామంతరం వెళ్లిపోయారు కొందరు. ఇది అదనుగా చూచుకొని రౌడీలు రైతుల చొప్ప, ఇతర వ్యవసాయ పనిముట్లను అపహరించారు. పోలీసులు ఏమీ చర్య తీసుకోలేదు.

సుమారు ఒక సంవత్సరం కింద, ఆంధ్రమహాసభాధ్యక్షులు శ్రీరావి నారాయణరెడ్డిగారు, ఈ జిల్లాలో ముఖ్యంగా జనగామ తాలూకాలో జరుగుతున్న అక్రమాలను ప్రభుత్వంవారికి తెలిపితే, రెవెన్యూ మంత్రి గౌ.గ్రిగ్సన్‌గారు తగిన సాక్ష్యముంటే తప్పక చర్య తీసుకుంటామని వాగ్దానం చేసి, ఈ విషయం ప్రభుత్వపు పాలసీని, ఇతక వివరాలు, అప్పటి హోం సెక్రటరీ నవాబు అలీయావరుజంగ్ గారితో మాట్లాడుమని రెడ్డిగారిని కోరారు. హోం సెక్రటరీ ఆంధ్రమహాసభ పంపిన నివేదికలోని విషయాలన్నీ సత్యాలేఅని అంగీకరించి, ఈ దౌర్జన్యపరులపై కఠినచర్యలు తీసుకోబోతున్నామని వాగ్దానం చేశారు. కాని అదేమీ జరుగలేదు. పైగా కార్యకర్తలపైన, ప్రజలపైన ఈ నాటికీ కేసులు నడుస్తున్నవి. శ్రీయుత ఆరుట్ల రామచంద్రారెడ్డి, జి.గోపాల్‌రెడ్డి గారలపైన నిషేధాజ్ఞను ప్రకటించారు. జనగామ తాలూకా ప్రజలకష్టాలను తెలిపే పుస్తకాన్ని నిషేధించారు. ప్రభుత్వం యొక్క ఈ వైఖరిని, ఇటీవల జరిగిన తాలూక్దార్ల సమావేశంలో, ప్రజా ఉద్యమాలను అణచివేయాలని తీసుకున్న నిర్ణయాలు ఈ హింసాకాండకు మరీ తొడ్పడినవి.

ప్రభుత్వంయొక్క ముఖ్యశాఖలైన పోలీసు, రెవెన్యూ, హోం శాఖలమంత్రి ఇంగ్లీషువారు. గౌ.గ్రిగ్సన్‌గారు, తర్వాత తాత్కాలిక మంత్రి గౌ.సావిడ్జిగారు, జిల్లా పోలీసు డైరెక్టరు జనరల్ అండర్‌సన్ అనే ఇంగ్లీషు ఉద్యోగి. వీరి నాయకత్వాన నడుస్తున్న శాఖల్లో ఇంత అరాచకంవుంటే, జగీర్దాల నాయకత్వాన నడిచే శాఖల గతేమిటి ?

శాంతిభద్రతలు ఇవేనా...?

దొంగకేసులు - దొంగ సాక్ష్యాలు

ఆంగ్రమహాసభ కార్యకర్తలపైన, ఆంధ్రమహాసభలో చేరిన ప్రజలపైన ఇంతవరకు నడుపబడిన, నడుపబడుతున్న కేసులన్నీ అసత్యపువే. దేశముఖులు,గ్రామపెత్తందారులు, ఈ కేసులకు సాక్ష్యాల్ని సప్లయి చేస్తున్నారు. ఈ కేసులన్నీ నిందితులు ఏమో నేరాలు చేశారని కాదు నడుపబడుతున్నవి. గ్రామ దౌర్జన్యపరులు, దొంగవ్యాపారస్తులు, పోలీసులు మొదలే కేసు తేవడానికి, అరెస్టు చేయడానికి, ప్రజలను బాధించడానికి ప్లాను వేస్తారు. ఏదో అవకాశాన్ని ఉపయోగించుకొని కార్యక్రమాన్ని సాగిస్తారు.

తమకు సాక్ష్యంరాకున్నా, ప్రజలవైపునుంచి సాక్ష్యం వచ్చినా, అతని ధన, మాన, ప్రాణాలకు సంరక్షణలేదు.

కోర్టుకు వెళ్లితే, ఈ ప్రజలు ఎన్నో చిక్కులు ఎదుర్కోవాలి. ఈ కేసులన్నీ రాజకీయసంస్థకు సంబంధించినవి కనుక తాలూకా, జిల్లా కేంద్రాలలో ఉన్న వకీళ్ళలో ఎక్కువభాగం పోలీసుకు వ్యతిరేకంగా కేసులు నడిపించడానికి ధైర్యం చేయరు. అలాచేసినవారిపైన పోలీసులనుంచి, దేశముఖులనుంచి వత్తిడిగూడా వస్తుంది. సూర్యాపేటలో ప్రజలవైపున పనిచేసిన కె.అనంతరాంరావుగారిపైన నల్లగొండలో పనిచేస్తున్న కె.వెంకటరాంరావు గారిపైన ఈ విధంగానే వత్తిడితెచ్చి కేసులుగూడా తెస్తామని బెదిరించారు.

పోలీసులు, ఇతర వ్యతిరేకులు, ఆంధ్రమహాసభ కార్యకర్తలను, మహాసభను అనుసరించే ప్రజలను, కమ్యూనిస్టులని వాదించడం ప్రారంభిస్తారు. ఇప్పుడే విప్లవం తెచ్చి ప్రపంచాన్ని తలక్రిందులు చేయబోతున్నారని, అందువలన జైలులో మురుగబెట్టాలని కోరుతారు. దీనివలన నిందితులు అనవసరంగా జైలులో కాలం గడపడం, తర్వాత కేసులు కొట్టివేయడమో, శిక్షలు వేయడమూ జరుగుతున్నది.

ఈ దౌర్జన్యపరులకు వ్యతిరేకంగా కఠినమైన చర్య తీసుకోవడానికి ధైర్యం చేసే అధికారులెవరైనా తాలూకాలకు వస్తే, కొద్దికాలంలో తిరిగి వెళ్లవలసినవారే. దేశముఖులు మొదలగు గ్రామదౌర్జన్యపరులు, ఆ అధికారులను అక్కడినుంచి మార్పించినంతవరకు నిద్రపోరు. సూర్యాపేట కోర్టుకు ఒక మున్సిఫ్ అబ్దుల్ అలాం అని ఇలాంటివాడే వచ్చాడు. ఇతడు ఎవ్వరి సిఫారసులు పట్టక లంచాలుకూడా తీసుకొనేవాడు కాదని ప్రతీతి. ఇతడు ఇద్దరు ముగ్గురు దేశముఖులపై నేరం ఖాయం చేశాడు. దానివలన ప్రజలు, తమపై జరుగుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా, గ్రామ దౌర్జన్యపరులపైన కేసులు నడిపించడానికి సాహసించారు. దీనితో వీరంతా అదిరిపడి కొంతడబ్బు ఖర్చుపెట్టి ఇతన్ని అక్కడినుంచి మార్పించివేశారు.

దేశముఖులకు, జమీందారులకు అనుకూలంగా వుండి వారి మాటలకు ఎదురులేకుండా వుండటానికి అవకాశమిచ్చే అధికారులకు మాత్రమే ఇక్కడ నిలువ నీడున్నది.

సూర్యాపేటలో ఎర్రబోడు గ్రామంలోవున్న ఒకదేశముఖు జన్నారెడ్డి ప్రతాపరెడ్డి పెద్ద భూస్వామి. 1,50,000 ఎకరాల భూమి ఉంది. 800 ఎకరాల పండ్ల తోట పెంచాడు. ఇతడు తన పండ్లతో తాలూకా, జిల్లా కేంద్రంలో వుండే ప్రతిఅధికారిని ముంచివేస్తాడు. ఇతర సంబంధాలుకూడా వుంటాయి. ఏ అధికారికూడా ఇతనికి వ్యతిరేకంగా కేసును నడుప సాహసించడు.

విసునూరు దేశముఖు వేలకువేలు ఖర్చుపెట్టడంలో ప్రఖ్యాతి పొందినాడు.

ఈ పరిస్థితులను ఎదిరించుతూ, ప్రజలు వీరికి వ్యతిరేకంగా కేసులు నడుపుతూ వచ్చారు.

విచారణ అంటే విందులే

కోర్టులో విచారణ ఇట్లుంటే, ప్రభుత్వ పరిపాలనా శాఖవైపునుంచి జరిగే విచారణలగతిని విచారించుతాము.

స్థానికాధికారులు చర్య తీసుకోలేని పరిస్థితిల్లోనూ, వారుకూడా అక్రమాల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాల్గొంటున్నప్పుడు ప్రజలు కేంద్రప్రభుత్వానికి తెలుపుతున్నారు. అప్పుడు ప్రభుత్వం ప్రత్యేక విచారణ చేయించక ఈ స్థానికాధికారుల చేతనే జరిపించుతూ వచ్చింది. జనగామ సంఘటనలో ఒకటి రెండుసార్లు తప్ప, ఏ విషయాన్నైనా ఇలాగే విచారణచేయించింది.

ఈ విధంగా విచారణకై వచ్చిన అధికారులు ఈ దేశముఖుల ఇండ్లలో పెద్దపెద్ద విందులారగించి, ప్రజలను వారి ఇండ్లలోకివచ్చి వారి ఎదురుగానే వాజ్మూలాలు ఇవ్వమని కోరుతారు. వారు గ్రామానికి ఎందుకు వచ్చింది ప్రజలకు తెలుపరు. దేశముఖు మెదటే జాగ్రత్తపడి, లేనిపోని వదంతులు, దెబ్బలు, అరెస్టులు మొదలగునవి వ్యాపింపజేసి ప్రజలను భయపెడతారు. అప్పటికీ ప్రజలు చెప్పడానికి ధైర్యం చేసినా, వారు కసాయి కొట్లుగావుండే దేశముఖుల ఇండ్లలోకి వెళ్ళి చెప్పవలసివస్తుంది. అదిసాధ్యపడదు. దీనికి తోడుగా, దేశముఖులు తమ అనుచరులను కొందరిని రైతులుగాను, కూలీలగాను చూపించి వారితో అంతా బాగానే ఉన్నది. సంఘాలే ప్రజలకు నష్టం చేస్తున్నాయి అని అనిపిస్తారు. దానితో అధికారులు, ప్రజలతో దొరలను అనుసరించి బ్రతుకాలని ధర్మోపన్యాసాలుచేయ మొదలుపెడతారు. విచారణ ముగిసిపోతుంది. విసునూరు దేశముఖుల ఇండ్లలో పొట్టపగుల విందారగించిన అధికారుల రిపోర్టులు యదార్థంపైన ఆధారపడి ఉంటాయా ?

ఈ మధ్యనే ప్రభుత్వం విచారణకై మరో విపరీత యుద్ధపద్ధతిని అవలంబించింది. ప్రజలు ఏ అధికారిపై నేరారోపణచేస్తారో, వారితోనే ఆ సంగతులను విచారణ చేయిస్తున్నారు, ప్రభుత్వంవారు ఫలితం యదార్థం రుజువుకాకపోవడం, ప్రజలపై హింసాకాండ, నల్లగొండలో ప్రభుత్వం ఇలాంటి ప్రమాదకరమైన విధానమవలంబించి పోలీసుల అరాచక చర్యలను ప్రత్యక్షంగా ప్రోత్సహించింది.

ఈ పరిస్థితుల్లో జరిగిన విచారణలన్నీ బూటకాలే. సరిగా విచారణ జరిగితే, వీరి అక్రమాలు ఇంకెన్నో బయలుపడేవి. ప్రభుత్వం ఈ బాధ్యతారాహిత్యమైన విచారణలు చేయించి శిక్షించవలసిన పోలీసు అధికారులను, విసునూరు దేశముఖువంటి దౌర్జన్యపరులను శిక్షించక వారిని ప్రజల గొంతులపై కూర్చోబెట్టి, ఇంతటి హింసాకాండకు ఇంతటి అమానుష చర్యలకు కారణమైంది.

ఈ దౌర్జన్యాలలో ప్రజలకు అనుకూలంగావచ్చిన సాక్షులు, మూటముల్లె సర్దుకొని సిద్ధంకావలసివచ్చినప్పుడు ప్రభుత్వం ఇంకా సాక్ష్యం కావాలనికోరడంలో అర్థమేమి ?

ఇవి కేసులు కావు, నిర్బంధాలు

ఇప్పుడు కార్యకర్తలపైన, ప్రజలపైన నడుస్తున్న కేసులను, వాటిని నడుపడంలో పోలీసులు చేస్తున్న కుట్రలు, అరాచకాలు చూస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. ప్రభుత్వం తాను ఆచరణలో పెట్టే ప్రజా వ్యతిరేక కార్యక్రమాన్ని ఎదిరించేది ఆంధ్రమహాసభ ఒక్కటే. అందువలన దీనిని అణచివేయాలని నిశ్చయించింది. దానికి జిల్లాపోలీసు కార్యక్రమాన్ని తయారుచేసి, పోలీసుశాఖవారి అనుమతి సంపాదించింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని జమీందారీ మొత్తా, ముఖ్యంగా జనగామ తాలూకా మొత్తా సంపూర్ణంగా పాల్గొంటున్నది. పోలీసులకు వేల రూపాయల లంచం పెట్టి ప్రజా ఉద్యమంపైన దెబ్బకొట్టడానికి రేయింబవళ్లు కృషిచేస్తున్నది.

పోలీసులు తయారు చేసిన ఈ కార్యక్రమంలో మొదటిభాగం దొంగసాక్ష్యాలతో కేసులునడిపి, కార్యకర్తలను ప్రజలను నిర్బంధించడం. ఈ దొంగసాక్షులు దేశముఖు ఏజెంట్లు, రౌడీలు ప్రతికేసుకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో సంబంధమున్నది. నిజానిజాలు కోర్టులో బయట పడుతాయని ప్రభుత్వం చెప్పుకోవచ్చుగాని, నిర్దోషులు జైళ్లలో పడడం, రైతులు పనిబాటలు వదులుకొని కోర్టులకు తిరగడం. ఈ విధంగా ప్రజలు నిర్హేతుకంగా బాధింపబడుతున్నారు. నల్లగొండ కేసులన్నీ సరియైనవని ప్రకటించడంతో, ఇలాంటికేసులు, వాటిఫలితంగా ప్రజలు అనుభవించే నష్టకష్టాల బాధ్యత ప్రభుత్వం సంపూర్ణంగా వహించవలసి వున్నది.

కేసులుపెట్టి అరెస్టుచేసి, ప్రజా సేవకులను, ప్రజలను స్టేషన్ హౌసులలోను బయటా బహిరంగంగా హింసించడం ఈ కార్యక్రమంలో రెండవభాగం. ఈ హింసాకాండలో బాధ్యతగల పోలీసు ఉద్యోగులు, కిందినౌకర్లు, జమీందారుల రౌడీలు సమష్టిగా పాల్గొన్నారు. కర్రలతో దెబ్బలు, పచ్చిబూతులు మాత్రమే గాక కండ్లలో, ఆసనంలో కారం పెట్టడం, నోట్లో మూత్రంపోయడం వరకు పోయినవి. ఆక్రమిత రష్యాలో, చైనాలో జర్మనీ, జపాను ఫాసిస్టులు మాత్రమే అక్కడి ప్రజలపైన ఇలాంటి చర్యలు జరిపినారు. వాటికి ఏ మాత్రం తీసిపోకుండా నేడు ఈ ప్రాంతాలలో ఇలాంటి ఘోరాలు జరుగుతున్నవి.

ఇలాంటి చర్యలు జరిపిన పోలీసు అధికారులపైన లేశమైనా చర్య తీసుకోలేదు ప్రభుత్వం. పైగా నల్లగొండ సంఘటనలన్నీ అసత్యమని ప్రకటించసాహసించింది ప్రభుత్వం. ఈ ప్రజాందోళనలేకుంటే ఈ ఉద్యోగులకు ప్రమోషనుకూడా ఇచ్చేదేమో.

ప్రభుత్వం వారి ఈ నిర్లక్ష్యవైఖరివలన పాలకుర్తి కేసులోని 22 మంది యొక్క సంవత్సర జీవితం నష్టపడింది. అక్కడి ప్రజలు ఎన్నోబాధలు అనుభవించారు. ప్రజలు ప్రతిఘటించకపోతే రౌడీల దాడికి అది స్మశాన వాటిక అయిపోయేదే.

పై సంఘటనలనుపరిశీలిస్తే ప్రభుత్వం ప్రజా ఉద్యమాన్ని అణచడానికి పోలీసులు, రౌడీలు సాగించే ఆరాచకాన్ని, ఫాసిస్టుచర్యలను గూడా సహించి నిర్లక్ష్యం చేయడానికి తయారైందనుట స్పష్టం. ఇది ప్రభుత్వం అవలంబించిన అతి ప్రమాదకరమైన పంథా, దీనిని ప్రజలు అంత తేలికగా చూడరు. దీని దుష్ఫలితాలకు ప్రభుత్వమే ప్రధాన బాధ్యత వహించవలసి ఉంటుంది.

కార్యక్రమంలోని మూడవభాగం దొమ్మీలు, లూటీలు చేయించడం. పైగా కార్యకర్తలే దొంగలని కేసులునడిపించడం, ఈకేసులు నడిపించేది ఎవరయా అంటే ఏ క్షణమనక లంచాలతో పొట్టలునింపే పోలీసులు. వీరికే ఆ పేరు సార్థకమవుతుంది. లక్షసభ్యత్వం గల బలమైన ఆంధ్రమహాసభ దీనిని సవాలుగా స్వీకరించింది.

పోలీసులు చేయించే యీ దొమ్మీలు చాలా భయంకరమైనవి. రైతుల పంటపొలాలను గ్రామదౌర్జన్యపరులకు అప్పగించడం, దారిన

వెళుతున్న వారినికొట్టిదొమ్మి చేయించడం బాహాటంగా జరుగుతుంటే, మధ్యయుగాల నాటి బందిపోటు దొంగలను, దొంగతనాన్ని బహిరంగంగా ప్రోత్సహించుతున్నారు. చట్టం మిషతో ప్రభుత్వం సమర్థించుతున్నది. ఈ విధంగా దేశంలో పోలీసులు జరుపుతున్న అరాచక చర్యలకు, చట్టపురంగు పూయబడుతున్నది. దీనివలన ప్రజల ఆస్తిపాస్తులు, ప్రాణాలు చాలా ప్రమాదస్థితిలోకి వచ్చినవి. ఇది ముందుముందు ఇంకెంతదూరం పోనున్నదో ఇప్పుడే చెప్పడం అనవసరం. ఒక్కటి మాత్రం స్పష్టం, దీనివలన విడదీయరాని చిక్కులు ఏర్పడుతున్నవి. ప్రభుత్వం వీటికిగూడా సంపూర్ణమైన బాధ్యత వహించాలి.

కార్యక్రమంలో ఆఖరి భాగం స్త్రీలను చెరచడం. పాలకుర్తిలో ఈ సూచనలు అప్పుడే కనపడుతున్నవి. ఉన్నతాధికారుల వైఖరిచూస్తే వారు దీనిని కూడా లక్ష్యం చేసే పరిస్థితిలో లేరు. దీనికి ఎవరు బాధ్యులు అనే సమస్య రానేరాదు.

ఈ విధంగా కేసుల పేరుతో ఫాసిస్టు చర్యలవరకూ నిర్బంధ విధానం సాగుతున్నది. ప్రజలు దీనిని తుదిదాకా ప్రతిఘటించి, స్వాతంత్ర పోరాటంలో తమ ఉచితస్థానాన్ని ఆక్రమించుకొంటారు.

మేము కోరేదేమిటీ ?

మేము గ్రామాల్లో నేడు రాజ్యం చేస్తున్న ఆకలిమంటలు, అమానుష దౌర్జన్యాలు, బందిపోటు దొంగతనం, పేరుకుగూడా లేకుండా పోవాలని, పట్టణాలలో నిరుద్యోగ పిశాచం, తిండికొరత, దొంగవ్యాపారం, అవిద్య, అజ్ఞానం మొదలగునవి నిర్మూలింపబడాలని కోరుతాం. వీటిస్థానే విద్య, విజ్ఞానాలు, సౌఖ్యసంపదలు, స్వేచ్ఛా స్వాతంత్రాలు తాండవించే గ్రామాలను, పట్టణాలను నిర్మించబడాలని కోరుతాం. వీటిని సాధించడానికి హైద్రాబాద్‌లో ప్రజారాజ్యాన్ని స్థాపించడానికి మా జీవితాలన్నిటినీ ధారపోస్తాం.

మా తక్షణ కోరికలు :

1. పోలీసులు, దేశముఖులు, ప్రజలపైన ప్రజా సేవకులపైన సాగించిన హింసాకాండను బహిరంగంగా విచారణ చేసి, బాధ్యులను శిక్షించాలి.

ఇంతవరకు నిర్దోషులే బాధలనుభవించినారు. వీటి కారకులకు శిక్షలు విధించనంతవరకు ప్రజలు నిద్రపోరు. వీరు శిక్షలు అనుభవిస్తూ చూచినప్పుడే ప్రజలు సంతృప్తి చెందుతారు.

2. విసునూరు రామచంద్రారెడ్డి, కడారు రామచంద్రరావులు యింతవరకు సాగించిన అమానుష దోపిడీ, దౌర్జన్యాలకు ప్రతిఫలంగా వారి ఆస్తులను, ప్రభుత్వం తన నిగరానీలోకి (కోర్ట్ ఆఫ్ వార్డ్సు) తీసుకొని వీరి అధికారాన్ని తొలగించాలి.

వీరు, తాము దేశముఖి మొదలైన గ్రామాధికారాన్ని, పెద్ద వ్యవసాయాలను ఉపయోగించుకొని ప్రభుత్వోద్యోగులను చేతుల్లో పెట్టుకొని ప్రజలను అణచివేసి, న్యాయాన్ని, నీతిని, చట్టాలను ధిక్కరించి, నిరంకుశంగా ప్రవర్తించుతున్నారు. వీరికి ఈ అవకాశాలున్నంతవరకు ఏ విచారణగూడా జయప్రదంగా జరుగదు. దౌర్జన్యం సాగించడంలో ఆరితేరి ఆ మనస్తత్వం వారి ప్రతి నెత్తురుకణంలో జీర్ణించివున్నది. వారికేమాత్రం అవకాశమిచ్చినా తిరిగి దౌర్జన్యాలు సాగిస్తారు. ఇతర దౌర్జన్యపరులను ప్రోత్సహిస్తారు. దౌర్జన్యం తిరిగి తలెత్తకుండా చేయడానికి ఈ చర్య అవసరం.

3. ప్రజలపైన, కార్యకర్తలపైన నడుస్తున్న కేసులను ఉపసంహరించుకోవాలి. దీనికి బదులుగా హింసాకాండ సాగించిన పోలీసులపైన విసునూరు రామచంద్రారెడ్డి, కడారు రామచంద్రరావు, వారి రౌడీలపైన, పౌజ్దారీ కేసులు నడిపించాలి.

4. "జనగామ ప్రజల వీరోచిత పోరాటాలు" అనే పుస్తకం పై నిషేధాన్ని తొలగించాలి.

ప్రజలు కోరుతున్నది పుస్తకంలో తెలుపబడిన విసునూరు దేశముఖు, కడారు సోదరులు, వారి ఏజెంట్లు ప్రజలపై అత్యాచారాలను బహిరంగపరచే, పుస్తకాన్ని నిషేధించి వారు తమకష్టాలను ప్రపంచానికి తెలుపుకునే హక్కును హరించి, వారినోళ్ళను కట్టివేయమనికాదు. ప్రభుత్వం ఈ యదార్థాన్ని గుర్తించి నిషేధాన్ని తొలగించాలె.

5. ఆరుట్ల రామచంద్రారెడ్డి, జి.గోపాలరెడ్డి గార్లపై నిషేధాన్ని తొలగించాలి.

ప్రజలపై అమానుష దౌర్జన్యాలు జరిపి, అధికారులకు వేలకువేలు లంచాలిచ్చి, ప్రజల శాంతియుతమైన జీవితాన్ని నాశనంజేసిన విసునూరు రామచంద్రారెడ్డి, కడారు రామచంద్రరావుపైన తీసుకోవలసిన చర్య, పైవారిపైన తీసుకోవడం న్యాయానికి చెంపపెట్టు, అన్యాయానికి గొప్ప విజయం.

జి. గోపాలరెడ్డిగార్లకు చింతల నర్సింహారెడ్డి ఈ తాలూకా ఉద్యమంతో బొత్తిగా సంబంధంలేనప్పుడు (ఒక కాలంలో నామమాత్రమైన సంబంధం ఉన్నా) వారిపై నిషేధాన్ని ప్రయోగించడాన్ని చూస్తే ప్రజా ఉద్యమం, ప్రజా సేవకుల విషయమై అధికారుల రిపోర్టులు అన్నీ ఎంత సత్యదూరంగా ఉంటున్నాయో, వాటిని ఆధారంగా జేసుకొని నిర్ణయించబడే ప్రభుత్వపాలసీ, ఎంత నిర్హేతుకంగాఉందో తెలుస్తుంది. దీనివలన ప్రజలు, వ్యక్తులు అనుభవించే నష్టకష్టాలు అమితంగా వస్తున్నవి. ప్రభుత్వం ఈ విధానాన్ని చాలించాలి. లేకుంటే ఈ కష్టనష్టాలకు బాధ్యత వహించాలి. (క్షయవ్యాధితో బాధపడుతున్న నర్సింహారెడ్డిగారు నిర్బంధంలోనే ప్రాణం విడిచారు).

ముగింపు

నల్లగొండ జిల్లాలో అమానుషత్వానికి, నిర్బంధవిధానానికి వ్యతిరేకంగా సాగుతున్న యీ వీరోచిత పోరాటం హైద్రాబాదు సంస్థాన ప్రజల స్వాతంత్ర పోరాటంలో ప్రముఖస్థానాన్ని ఆక్రమిస్తున్నది. దీనిని బలపరచడమంటే, స్వాతంత్ర పోరాటాన్నే బలపరచడమన్నమాట. ప్రభుత్వానికి ఏజెంటుగా ప్రవర్తించే ఏ ఒకటి రెండు పత్రికలో తప్ప తక్కినవన్నీ యీ పోరాటాన్ని బలపరచి తమ దేశభక్తియుత కర్తవ్యాన్ని నిర్వహించాయి. పత్రికలు, ప్రజాసంస్థలు, దేశభక్తులు, పైకోరికలను బలపరచి, వాటిని సాధించిందాకా ఆందోళనసాగించి, విజయం సాధించడం అవసరం. ప్రజలు తమ సంఘటిత శక్తితో విప్లవాత్మకమైన మార్పులు సాధించుతున్న ఈ కాలంలో, పైకోర్కెలను సాధించడం ఒక గొప్పవిషయం కాదు. మనంకూడా సంఘటిత శక్తితో ముందుకు సాగిపోదాం. ◆

తెలంగాణ సాయుధ పోరాటం - భూమి సమస్య

- రాజ్ బహద్దూర్ గౌర్

(ఆంధ్రప్రదేశ్ టైమ్స్ దినపత్రిక 1977 జూలై 4, 25 తేదీల్లో వచ్చిన వ్యాసానికి స్వేచ్ఛానువాదం)

కుతుబ్‌షాహీ పాలనలో తెలుగు, దక్కనీ భాషలకు పాలకుల ప్రోత్సాహం లభించింది. అంతేకాదు కుతుబ్‌షాహీల హయాంలో వాణిజ్యాభివృద్ధి రహదారులు, ఓడరేవుల నిర్మాణం కూడా జరిగింది. పశ్చిమాసియాతో జరిగిన వాణిజ్య లావాదేవీలకు మచిలీపట్టణం కేంద్రం గా నిలిచింది. రాయలసీమలో వెలికితీసిన వజ్రాలను హైదరాబాద్‌కు తెచ్చి వాటిని శుభ్రపరచి, సానబెట్టి అమ్మేవారు. కోహినూర్ వజ్రం కూడా అప్పటి కుతుబ్‌షాహీ రాజుల వద్దనే ఉండేది. మచిలీపట్నం, నర్సాపూర్, రాయలసీమకు హైదరాబాద్ నుండి రోడ్డు సౌకర్యం ఉండేది.

ఔరంగజేబు దండయాత్ర తరువాత కుతుబ్‌షాహీల పాలన అంత మవడంతో ఈ ప్రాంతం తన వైభవాన్ని కోల్పోయింది. అసఫ్‌జాహీలు 18వ శతాబ్దపు తొలినాళ్లలో స్వాతంత్ర్యం ప్రకటించుకుని ఔరంగాబాద్‌ను తమ రాజధానిగా ప్రకటించుకున్నారు. రెండో అసఫ్‌జాహి కాలంలో రాజధాని హైదరాబాద్‌కు మారింది. దీంతో హైదరాబాద్ సాంస్కృతిక రూపురేఖలు మారడం మొదలైంది. దక్కనీ, తెలుగుభాషలు తమ ప్రాముఖ్యతను కోల్పోయి వాటి స్థానాన్ని ఉర్దూ ఆక్రమించడం మొదలైంది. తదనంతరం ఉర్దూ అధికార భాషగా గుర్తింపు పొందింది. దీంతో ఉత్తర భారతం నుండి ఉర్దూ తెలిసిన మేధావులు, అధికారులు హైదరాబాద్ రావడం ప్రారంభించారు.

ఇలాంటి వలసలు స్థానికులలో 'ముల్కీ' భావనలు మొగ్గ తొడిగాయి. బహమనీ పాలన రోజుల్లో పర్షియన్ అధికారులపై (అఫాకీలు) స్థానికులకు కలిగిన వైరి భావాలే వీటికి మూలం. అప్పట్లో మహమ్మద్ గవాన్ అనే పర్షియన్‌ను హత్య కూడా చేశారు. 1930లలో మళ్లీ ఈ ముల్కీ భావనలు ఉవ్వెత్తున ఎగిశాయి. అస్గర్ యార్ జంగ్ అంతటివాడు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. అప్పుడప్పుడే ఉర్దూ మీడియం లో ఉస్మానియా యూనివర్సిటీ స్థాపించడం, ఉద్యోగార్థులైన స్థానిక పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ఉండటంతో ఉద్యమానికి చాలా ఊతం లభించింది.

1920లలో ముస్లింలలో ఖిలాఫత్ ఉద్యమంలో పోరాడే వారూ, సిరాజుల్ హసన్, తిర్మిజీ వంటి జాతీయవాద, కాంగ్రెస్ నాయకులూ ఉండేవారు. బారిస్టర్ అక్బర్ అలీఖాన్ వంటి కాంగ్రెస్ మితవాదులూ ఉండేవారు. హైదరాబాద్ 'ముస్లిం రాజ్యం' అనీ, నిజాం 'ముస్లిం సార్వభౌమత్వానికి' ప్రతీక అని నమ్మే ఒక అతివాద వర్గం కూడా ఉండేది. ఇలాంటి భావాలను మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ వంటి సంస్థలు పెంచి పోషిస్తే, బహదూర్ యార్ జంగ్ వంటి వ్యక్తులు వాటికి వత్తాసు పలికారు. ఈ విచ్ఛిన్నకర భావాలు అధికశాతం ముస్లింలకు కడగండ్లనే మిగిల్చాయి. కొద్దిమంది ముస్లిం యువకులు నియాజ్ ఫతేపురి హేతువాద స్ఫూర్తిని అందుకుని, వామపక్ష భావజాలంతో, ట్రేడ్ యూనియన్ రాజకీయాలతో ప్రభావితులైనారు. అలాంటి వారిలో మఖ్దూమ్, ఆలంఖుంద్‌మీరీ ప్రముఖులు.

అసఫ్‌జాహీ రాజులు బ్రిటీష్‌వారికి విధేయులుగా ఉండేవారు. తమ ఉనికిని కాపాడుకోవడానికి కూడా బ్రిటీష్ వారిపైనే ఆధారపడేవారు. తమ అవసరాల కొరకు తెలుగు ప్రాంతాన్ని ముక్కలుగా విడగొట్టారు. ఉత్తర సర్కారు జిల్లాలు ఫ్రెంచి వారు తమ సైన్యాన్ని హైదరాబాద్‌లో పెట్టినందుకు బదులుగా ఇచ్చేయడం జరిగింది. కొన్నాళ్లకు ఆ జిల్లాలను ఫ్రెంచి వారి నుండి బ్రిటీష్ వారు స్వాధీనం చేసుకున్నారు. అసఫ్‌జాహీ పాలకులకు 'రక్షణ' కలిపించినందుకు బదులుగా రాయలసీమ జిల్లాలు (సీడెడ్) బ్రిటీష్ వారికి సమర్పించబడ్డాయి.

టిప్పుసుల్తాన్‌తో బ్రిటీషు వారు యుద్ధం చేసినప్పుడు అప్పటి అసఫ్‌జాహీ రాజు బ్రిటీష్ వారికి సాయం చేశాడు. 1857 తిరుగుబాటు జరిగినప్పుడు అసఫ్‌జాహీలు బ్రిటీషువారికి చేసిన సాయానికి ప్రతిఫలంగా వారికి 'బ్రిటీష్ వారి నమ్మకపాత్రులైన మిత్రులనే' బిరుదు లభించింది. 1880లలోనే సాలార్‌జంగ్ జమీందారీ వ్యవస్థను సృష్టించాడు. జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, జమీందార్లు ఇప్పుడు అసఫ్‌జాహీ పాలనా స్థంభాలుగా నిలిచారు. దాదాపు పదకొండు వందల మంది జమీందార్లు రాష్ట్రంలోని 37 శాతం గ్రామాలను, మూడోవంతు జనాభాను పరిపాలించేవారు. అప్పటి రాష్ట్ర జనాభా కోటీ ఎనభై లక్షలు.

రాష్ట్రంలో నిజాం స్వంత జాగీర్-సర్ఫేఖాస్‌గా ఉండేది. 1920ల కాలంలో 64.35 లక్షలుగా ఉన్న నిజాం సైన్యం ఖర్చు 1946-47 నాటికల్లా 170.77 లక్షలకు, 1947-48 నాటికి 643.41 లక్షలకు పెరిగింది. పోలీస్ శాఖపై ఖర్చు 1920-21లో 26.5 లక్షలు కాగా అది 1951-52 నాటికి 592 లక్షలకు పెరిగింది.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం బ్రిటీష్ ఇండియాలో జరిగిన ఆందోళనలు - ముఖ్యంగా ఖిలాఫత్ ఉద్యమం - హైదరాబాద్ ప్రాంతంలోనూ ప్రభావం చూపాయి. అప్పట్లోనే రాష్ట్ర ప్రజలపై అమిత ప్రభావం చూపుతున్న 'జమీందార్' వంటి ఉర్దూ పత్రికలను అణచివేయడానికి మార్గాలు వెతకవలసిందిగా అప్పటి వైస్‌రాయ్ లార్డ్ ఛెమ్స్‌ఫోర్డ్‌కు నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఉత్తరం రాయడం గమనార్హం. 1923లో మౌలానా మహ్మద్ అలీ అధ్యక్షతన కాకినాడలో కాంగ్రెస్ సమావేశం జరిగింది. హైదరాబాద్ రాష్ట్రం నుండి కూడా పలువురు నేతలు ఈ సమావేశానికి హాజరైనారు. సమావేశం జరుగుతుండగా మౌలానా మహ్మద్ అలీ ఉర్దూ ప్రసంగాన్ని తెలుగులోకి అనువదించవలసిందిగా బి. రామ్‌కిషన్‌రావును షర్ట్ చేతిని పట్టి లాగి నిలబెట్టింది సరోజిని నాయుడు.

అప్పట్లో రాజకీయ సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇక్కడి ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోయేది. దీంతో మొదటి హైదరాబాద్ రాష్ట్ర రాజకీయ సమావేశం కాకినాడలో 1923లో జరిగింది. రెండవ సమావేశం 1926లో బొంబాయిలో జరిగింది. మూడోది పూనాలో (1928), నాలుగోది అకోలాలో (1931) జరిగాయి. ఈ సమావేశాలకు హైదరాబాద్ రాష్ట్రం నుండి కూడా ఉద్యమకారులు హాజరయ్యారు.

1921లో ఆంధ్ర జన సంఘం ఏర్పడింది. దాని మొదటి సమావేశం హనుమకొండలో ఏప్రిల్ 1 1924నాడు జరిగింది. సంఘం విధివిధానాల రూపకల్పన ఏప్రిల్ 27 నాడు హైదరాబాద్‌లో మరో సమావేశంలో జరిగింది. సంఘం ముఖ్య లక్ష్యాలలో లైబ్రరీల స్థాపన, తెలుగు భాషా ప్రోత్సాహం, విద్యార్థులకు సాయం చేయడం ఉన్నాయి. సంఘం నేతృత్వంలో మొదటి గ్రంథాలయ సమావేశం ఫిబ్రవరి 22, 1925 నాడు మధిరలో జరిగింది. రెండో సమావేశం సూర్యాపేటలో జరగవలసింది కానీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. రెండేళ్ల తరువాత అనుమతి లభించింది సమావేశానికి. పండిట్ వామన్ నాయక్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.

ఈ గ్రంథాలయోద్యమం మాడపాటి హనుమంతరావు, వామన్ నాయక్ వంటి నాయకుల కృషి ఫలితం.

1930లలో స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. 1930లోనే ఆంధ్రమహాసభ తన తొలిసభను సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన జోగిపేటలో జరుపుకుంది. ఆంధ్రమహాసభ ఏర్పడ్డ నాటి నుండీ అది తెలంగాణా రైతాంగం గురించీ, తెలుగు భాషాభివృద్ధి గురించీ, పౌరహక్కుల గురించీ మాట్లాడేది.

ఆంధ్రమహాసభ రెండో సమావేశం బి. రామ్‌కిషన్‌రావు అధ్యక్షతన దేవరకొండలో జరిగింది. ప్రభుత్వానికి మాత్రం ఈ సమావేశం గురించి కొన్ని 'భయాలు' ఉండేవి. సమావేశంలో ఎలాంటి రాజకీయ అంశాలూ మాట్లాడరాదని ఆంక్షలు విధించారు. తమ ఉత్తర్వులు ఉల్లంఘించకుండా రు. 2000 డిపాజిట్‌గా తీసుకున్నారు అధికారులు. మూడో సమావేశం నిర్వహించేందుకు 1934 వరకూ ఆగవలసి వచ్చింది. 1934లో ఖమ్మంలో ఆంధ్రమహాసభ మూడో సమావేశం జరిగింది.

ఇదే సంవత్సరంలో అనేక ఆంక్షల నడుమ గాంధీ హైదరాబాద్‌కు విచ్చేశారు. అతని రాక వేలమంది ప్రజలను ఆకర్షించింది. అతని ప్రతిరూపం ప్రజల్లో ఆలోచనలు రేకెత్తించింది. గాంధీ పర్యటన స్వాతంత్ర్యోద్యమంలో ఓ మైలురాయి. నాలుగో ఆంధ్రమహాసభ 1935లో సిరిసిల్లలోను, అయిదో సభ 1936లో షాద్‌నగర్‌లోను జరిగాయి. 1937లో నిజామాబాద్‌లో ఎం. నర్సింగరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ కాలపు దేశ రాజకీయాల వేడి ప్రతిఫలించింది. సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాలలో ముఖ్యమైనవి 'బాధ్యతాయుతమైన ప్రభుత్వం, అప్పట్లో చేపట్టిన కొన్ని సంస్కరణల పట్ల అసంతృప్తి, వ్యవసాయ రుణాల మాఫీ.

1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఏర్పడింది. సంస్థ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేయగానే ప్రభుత్వం అడ్డుకుంది. కాంగ్రెస్ ఒక 'మతతత్వ' సంస్థ అనీ, అది జాతీయ కాంగ్రెస్ వంటి 'బయటి' సంస్థల ఆదేశాలకు అనుగుణంగా నడిచే సంస్థ అనేది ప్రభుత్వ ప్రధాన ఆరోపణ.

స్టేట్ కాంగ్రెస్ లౌకికవాద 'స్థానిక' సంస్థ అని ప్రభుత్వానికి వివరించేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. కానీ అప్పటి ప్రభుత్వానికి వేరే ఆలోచనలు ఉండేవి. మరికొద్ది రోజుల్లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చేలా ఉంది. దీంతో హైదరాబాద్ రాష్ట్ర భవిష్యత్తు నిర్ణయించవలసి ఉంది. నిజాం, మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ కలిసి 'స్వతంత్ర, సార్వభౌమ హైదరాబాద్' కోసం డిమాండ్ చేస్తున్నారు. కానీ అశేష ప్రజానీకానికి ఈ ప్రతిపాదన సుతరామూ ఇష్టం లేదు.

చర్చలు విఫలం కావటంతో కాంగ్రెస్‌ను నిజాం ప్రభుత్వం నిషేధించింది. పర్యవసానంగా 1938 అక్టోబర్ 24 నాడు స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం మొదలు పెట్టింది. ఈ కార్యక్రమం ముందు వరుసల్లో శ్రీ గోవింద్‌రావు నానల్, రావి నారాయణరెడ్డి వంటి వారున్నారు. హైదరాబాద్, ఔరంగాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఈ సత్యాగ్రహం కొనసాగింది. హైదరాబాద్‌లో దాదాపు 18 జట్లను అరెస్ట్ చేశారు. 18వ జట్టుకు నేతృత్వం వహించిన కాశీనాథ్‌రావ్ వైద్య, గాంధీజీ సలహా మేరకు సత్యాగ్రహం నిలిపివేస్తున్నట్టు 1938 డిసెంబర్ 24 నాడు ప్రకటించాడు.

నాయకత్వం సత్యాగ్రహాన్ని నిలిపివేయడానికి మరో ముఖ్య కారణం దీనికి పోటీగా మొదలైన ఇతర సత్యాగ్రహాలు. వైడి జోషీ అధ్యక్షతన హిందూ పౌరహక్కుల యూనియన్ గౌలిగూడలో సత్యాగ్రహం చేపట్టగా, ఆర్యసమాజ్ కూడా దేశవ్యాప్త సత్యాగ్రహం చేపట్టింది. దీనికి చాలా ప్రజాదరణ కూడా కలిగింది.

వ్యవహారం గందరగోళంగా మారి కాంగ్రెస్ డిమాండ్లు మరుగున పడిపోయాయి. మరోవైపు ప్రభుత్వానికి ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేసి, ప్రజాస్వామ్య హక్కులు కాలరాచే వెసులుబాటు లభించింది. కాంగ్రెస్ వారంతా ఆంధ్రమహాసభ (తెలంగాణ), మహారాష్ట్ర పరిషత్ (మరత్వడ) కర్నాటక కాన్ఫరెన్స్ (కన్నడ జిల్లాలు)లలో చేరిపోయారు.

ఈ కొత్త రూపంలో ఉద్యమం ముందుకు సాగింది. తెలంగాణ ఆంధ్రమహాసభ గొడుగు కింద నడిచింది. అదే సమయంలో సర్కార్, రాయలసీమ జిల్లాలో జరుగుతున్న ఆందోళనల ప్రతిధ్వని తెలంగాణ ప్రాంతంలో వినిపించసాగింది. 1937 నాటి మహత్తర మునగాల పోరాటం పొరుగున ఉన్న తెలంగాణ ప్రాంతంపై బాగా ప్రభావం చూపింది. ఆంధ్ర మహాసభలోని కమ్యూనిస్టుల మితవాదులను సిగ్గుపడేలా చేస్తూ ప్రజా పోరాటాలను నిర్మించడం మొదలుపెట్టారు.

1941లో ఆంధ్రమహాసభ ఆధ్వర్యంలో వెట్టి వ్యతిరేక ఉద్యమం మొదలైంది. ఈ ఉద్యమం ప్రజలకు అనేక కష్ట నష్టాలు మిగిల్చింది. నిర్బంధ లెవీ వసూలును ఆంధ్రమహాసభలోని కమ్యూనిస్టులు తీవ్రంగా వ్యతిరేకించారు.

1941 నాటి ఆంధ్ర మహాసభ చిలుకూరు సమావేశం ఉద్యమ పురోగతిలో ఓ చారిత్రక మలుపు. ఈ సమావేశానికి రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. 1943లో కౌల్దార్ల రక్షణ కొరకు పోరాటం మొదలైంది. కౌలు భూమిలో పండించిన ధాన్యం ముఖ్య కేంద్రాలు సూర్యాపేట

తాలూకాలోని దోపాడు, నూర్జహాన్‌పురం, భక్తలాపురం. ఈ పోరాటాన్ని ఆర్గనైజ్ చేసిన కామ్రేడ్లను అప్పటి ఆంధ్రమహాసభ మితవాద నాయకత్వం తొలగించింది.

ప్రభుత్వం ఈ కామ్రేడ్లను (కా. తిరుమలరావు, రాఘవేంద్రరావు, సుబ్బారావు, మొ॥) వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపింది. ఇది తొలి దెబ్బ. కౌల్దార్ల శ్రమను, వారి పంటను కాపాడుకునే దశ మొదటిదికాగా భూస్వాములు అక్రమంగా ఆక్రమించుకున్న భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడం రెండోదశ.

ఇక భూస్వాముల మిగులు భూములు ఆక్రమించుకోవడం మూడోదశ. ఇక్కడ భూస్వామికి ఎంత భూమి ఉండొచ్చో నిర్ణయించే సీలింగ్ ఖరారు చేయడం మాకు సమస్యగా మారింది. వియత్నాం పార్టీ నిర్ణయాధారంగా మేం కూడా వ్యవహరించాం. ఫ్రెంచి సామ్రాజ్య వాదులపై వియత్నాం కామ్రేడ్లు పోరాటం చేసినప్పుడు సీలింగ్ పరిమితిని ఎక్కువగా పెట్టడం ద్వారా భూమిగల వారిని, చిన్న భూస్వాములను కూడా పోరాటంలోకి ఆకర్షించగలిగారు. మేం కూడా అదే ఎత్తుగడతో సీలింగ్‌ను 200 ఎకరాలుగా నిర్ణయించాం. ఏ విధంగా చూసినా ఇది ఎక్కువే కానీ నిజాంపై చేస్తున్న మహత్తర పోరాటానికి మద్దతు కూడగట్టడానికి, ప్రజాస్వామ్యానికి, వ్యవసాయ సంస్కరణలకు ఇది అవసరమే.

1944లో భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభ 11వ సమావేశంలో మితవాదులను ఓడించి రావినారాయణరెడ్డి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. దీంతో ప్రజాస్వామ్య హక్కుల కొరకు, ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా, భూమికొరకు జరుగుతున్న పోరాటం ఉధృతమైంది.

ఫిబ్రవరి 1945లో నిజాం ప్రభుత్వం కామ్రేడ్ ఆరుట్ల రామచంద్రారెడ్డి, డి. సుబ్బారావు తదితరులపై మొదటిసారిగా పాలకుర్తి కుట్ర కేసు పెట్టింది. విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి ప్రోద్బలంతో ఈ కామ్రేడ్లపై హత్యాయత్నం కేసును మోపింది ప్రభుత్వం.

1945 ఏప్రిల్‌లో ఆంధ్రమహాసభ సమావేశం ఖమ్మంలో జరిగింది. అధ్యక్షుడిగా కామ్రేడ్ బద్దం ఎల్లారెడ్డి ఎన్నికయ్యారు. ఆయన తన గ్రామం వదిలి రాకూడదని ఆంక్షలు ఉండటంతో రావినారాయణరెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలోనే హైదరాబాద్ భవిష్యత్ నిర్ణయించేందుకు ఒక అసెంబ్లీ ఉండాలని మేం తీర్మానం ప్రవేశపెట్టాం.

మా వ్యూహం ప్రకారం మా ఆంధ్రప్రాంత కామ్రేడ్లు విశాలాంధ్ర కొరకు డిమాండ్ చేస్తారు. ఇక్కడ మేం మరఠ్వాడా, కర్నాటకలతో కలిపి అసెంబ్లీని ఏర్పాటు చేయాలని అడుగుతాం. కామ్రేడ్ సుందరయ్యగారి 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అనే పుస్తకం మూలం ఇదే. ఖమ్మం ఆంధ్రమహాసభ ఉద్యమ సాంస్కృతిక కోణాన్ని ముందుకు తీసుకువెళ్లి తెలుగు మాట్లాడే ప్రజలు, ప్రాంతాలు ఏకం కావాలనే లక్ష్యం ఏర్పరచింది. భూమి కోసం పోరాటం కూడా కొత్త ఎత్తులకు వెళ్ళింది.

1945 నవంబర్‌లో సూర్యాపేట తాలూకాలోని మొండ్రాయి గ్రామంలో కౌలుదారు ఐలమ్మ పంటను కాపాడేందుకు ఒక పెద్ద పోరాటం జరిగింది. విసునూరు దొర గూండాలను ఎదిరించి ఐలమ్మ పంటను కాపాడేందుకు చుట్టుప్రక్కల గ్రామాల నుండి అనేక మంది ప్రజలు కదిలివచ్చారు. అనేకమంది కామ్రేడ్లపై రెండు పాలకుర్తి కుట్రకేసులు మోపింది ప్రభుత్వం.

కొంతకాలానికి విసునూరు గూండాలు ప్రముఖ కామ్రేడ్ ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డితో పాటు ఇతర కామ్రేడ్లపై కూడా భౌతికదాడులకు దిగారు. 1946లో పరిస్థితి అల్లకల్లోలంగా ఉండేది. జులై 1946లో కడివెండి గ్రామంలో ప్రజలపై విసునూరు దొర గూండాలు దాడి చేశారు. ఆనాటి ఘర్షణలో కామ్రేడ్ దొడ్డి కొమురయ్య అమరుడైనాడు.

అదే ఏడాది నవంబర్‌లో పాతసూర్యాపేట దగ్గర మా కామ్రేడ్లు నిజాం పోలీసులతో తలపడ్డప్పుడు కామ్రేడ్ సర్వా నరసయ్య మరణించాడు. అదే నెలలో దేవరుప్పుల గ్రామంలో ప్రజలకు నిజాం దళాలకు మధ్య జరిగిన ఘర్షణలలో ఇద్దరు కామ్రేడ్లు బలిదానం చేశారు. పులిగిల్ల జాగీర్దార్ తన రక్షణ కొరకు స్టేట్ సైన్యాలను పిలిచాడు. కామారెడ్డిగూడ వద్ద నిజాం సైన్యాన్ని ప్రజలు నిలువరించారు.

డిసెంబర్ 1946లో మల్లారెడ్డిగూడెం వద్ద జరిగిన పోరాటంలో నిజాం సైనికులను ఎదిరించి ముగ్గురు మహిళా కామ్రేడ్లు అమరులయ్యారు. అదే సమయంలో సాయుధపోరు చేయాలని ఒక నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఏర్పడింది. 1947లో పోరాట వేగం కొంచెం మందగించినట్టు కనపడినా ఇదంతా తరువాతి పోరాటానికి సన్నాహాలు చేసుకోవడం వల్లనే అని అర్థం చేసుకోవలసి ఉంది. సెప్టెంబర్ 1947లో కామ్రేడ్ రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూమ్ మొహియుద్దీన్‌లు ఉమ్మడిగా సాయుధపోరాటానికి పిలుపు నిచ్చారు.

1947 నవంబర్ 23 నాడు పల్లెపాడు వద్ద పోలీసులపై పార్టీవారు దాడి చేశారు. ఒక పోలీసు మరణించాడు, అనేక ఆయుధాలను దళం స్వాధీనం చేసుకున్నది. నవంబర్ 28 నాడు దాదాపు 5000 మంది ప్రజలు ఎర్రజెండాలు, త్రివర్ణ పతాకాలు చేబూని ఆలేర్ టౌనులో ప్రదర్శన జరిపారు. పోలీసులు ప్రదర్శకులపై కాల్పులు జరపడంతో ఆరుగురు వ్యక్తులు మరణించగా దాదాపు 50 మంది తీవ్రంగా గాయపడ్డారు.

1947 డిసెంబర్ 28 నాడు అడ్డగూడూరు గ్రామంలో ప్రజలు, మా దళం నిజాం పోలీసులతో తలపడ్డారు. ఆనాటి పోరులో ఇద్దరు పోలీసులు మరణించగా, కామ్రేడ్ సాయన్నతో పాటు వారు ఇద్దరు దళ సభ్యులు కూడా నేలకొరిగారు. ఓ వంక ఇలా పోరాటం జరుగుతుంటే మరో వంక భారత ప్రభుత్వం నవంబర్ 29, 1947 నాడు నిజాంతో యథాతథ ఒప్పందం కుదుర్చుకుంది.

1948 సంవత్సరంలో తెలంగాణ సాయుధ పోరాటం రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగింది. రావులపెంటలో జనవరి 2 నాడు జరిగిన ఘర్షణలో ఇద్దరు బలిదానం చేయగా ఫిబ్రవరి 2 నాడు రేనుకుంటలో దళానికి, నిజాం పోలీసులకు మధ్య పోరు జరిగింది. ఫిబ్రవరి 20 నాడు రాగిపాడు వద్ద జరిగిన పోరాటంలో మా దళం ఎనిమిది మంది జవాన్ల బృందాన్ని హతమార్చి వారి ఆయుధాలు లాక్కుంది.

ఏప్రిల్ 1 నాడు మా కామ్రేడ్లు ఒక రజాకార్ శిబిరంపై దాడి చేసి ఆయుధాలు లాక్కున్నారు. ఆ కాలంలో జరిగిన అనేక సంఘటనల్లో ఇవి కొన్ని మాత్రమే ఉద్యమం కొత్త ప్రాంతాలకు విస్తరించింది.

నల్లగొండ, వరంగల్ (ఇప్పటి ఖమ్మం జిల్లాతో సహా) కరీంనగర్, అదిలాబాద్ జిల్లాలు పూర్తిగా మెదక్, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాలకు కూడా పాక్షికంగా ఈ పోరాటం పాకింది.

ఆనాటి పోరాటం ముఖ్యంగా మిగులు భూములు పేదలకు పంచడం అనే కార్యక్రమం చేపట్టింది. దాదాపు 5,000 గ్రామాలు నిజాం నుండి విముక్తం చేయబడ్డాయి. స్థానిక వ్యాపారస్తులు, రైతులు కూడా ఎంతో తోడ్పాటు అందించి నిత్యావసర సరుకులకు ఇబ్బంది లేకుండా చేశారు.

ఈ సాయుధ పోరాటంలో దాదాపు 4,000 మంది యోధులు బలిదానం చేశారు. దాదాపు 25,000 మంది కార్యకర్తలు, ప్రజలు అరెస్టయ్యారు. పదిలక్షల ఎకరాల భూమి పంచబడింది. అన్నిటికన్నా ముఖ్యంగా పోరాటం 1952 ఎన్నికల తదనంతర కాలంలో కూడా ప్రభుత్వ విధానాలపై ప్రభావం చూపింది.

హైదరాబాద్ శాసనసభలో ప్రవేశపెట్టిన కౌల్దారి చట్టం దేశంలోనే విశిష్టమైనది. దాదాపు 40 లక్షల ఎకరాలు కౌలు భూములు సెక్షన్ 38ఇ కింద వాటిని సాగు చేసుకుంటున్న రైతుల వశమయ్యాయి.

పోరాట క్రమంలో మేం పంచిన భూమిలో గణనీయమైన భాగం లబ్ధిదారులకు వశమైంది. కొన్ని చోట్ల భూస్వాములు ప్రజలు ఆక్రమించుకున్న భూమిని తిరిగి వారికే స్వల్ప మొత్తాలకు అమ్ముకున్నారు. ఆరోజుల్లో గ్రామాల్లో 20 శాతం భూమిని గొడ్లు మేయడానికి బన్ చరాయిగా వదిలేవారు. పోరాట కాలంలో పార్టీ బన్ చరాయి భూములు కూడా పేదలకు పంచింది.

భూస్వాముల వర్గం నుండి వచ్చిన కెవి రంగారెడ్డి అప్పట్లో రెవెన్యూ మంత్రిగా ఉండేవారు. అతనిలాంటి గట్టి మనిషిని కూడా మేం బన్‌చరాయి భూముల విస్తీర్ణం అయిదు శాతానికి పరిమితం చేసి పేదలు ఆక్రమించుకున్న భూములు వారికే ఉండేలా ఒప్పించగలిగాం.

ప్రజల అనుభవాలు, వారి సంసిద్ధతకు అనుగుణంగా పోరాట పద్ధతుల పరిణామంలో తెలంగాణ సాయుధ పోరాటం దానికదిగా ఒక చారిత్రక గ్రంథం.

పోరాటాన్ని ముందుండి నడిపినది, సహాయ సహకారాలు పార్టీకి అందించింది. పోరాట వెల్లువకు మూడు ప్రధాన స్రవంతుల కలయికే కారణం అవి సాంస్కృతిక, రాజకీయ, వ్యవసాయిక స్రవంతులు. పార్టీ మూడు స్రవంతులకూ సరైన నాయకత్వం అందించింది. దాని ఫలితం మనం చూశాం - తెలుగు ప్రజలందరూ ఒకటైనారు, ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడింది, అప్పటి వ్యవసాయ సంస్కరణల ఫలితాలను అనుభవిస్తున్నాం.

సాధించవలసినది ఇంకా చాలా ఉంది. -ఈ అనుభవాలు మనం ముందడుగు వేయడానికి అవసరమయ్యే ఉత్తేజం అందివ్వగలవు. ◆

అమరజీవి కొమరయ్యా! అందుకో జోహార్లు

-కందిమళ్ల ప్రతాపరెడ్డి

1946 సంవత్సరం-

భారతదేశం ఆంగ్లేయ సామ్రాజ్యవాదుల పాలనలో వున్నది. హైదరాబాదు రాష్ట్రం నిజాం నవాబు ఏలుబడిలో వున్నది. నిజాం పాలన, దోపిడి, దౌర్జన్యం నిరంకుశత్వంలో ఆంగ్లేయ పాలకుల అధిగమించింది. దొరలు, దేశముఖులు-జాగీర్దార్లు-జమీందార్లు-దేశముఖులు-దేశపాండేలు-ఇనాందార్లు-మక్తేదార్లు-వాళ్ళకు అండగా నిజాం నవాబు - అతని పాలన యంత్రాంగమున్నది. వాళ్ళ గుప్పిట్లో - ఏ హక్కులు లేని జనం బిక్కు బిక్కుమంటున్నారు. దొరా నీ కాల్మొక్త! నీ బాంచన్! గులాపోన్ని కాల్మొక్త ! కరునించుండి దొరా! నీ కాల్లకాడ బతికేటోన్ని! దండంబెద్త దొరా! నీ కాల్మొక్త ప్రతి రోజూ - ప్రతిచోట - ప్రతి గ్రామంలో వినిపించే మాటల- ఈ మాటలు తప్ప మరో మాట వినిపించదు. కారణం! వాళ్ళకు మాటలు రాక కాదు! అంతకు మించి మాట్లాడే హక్కు- అవకాశం లేదు.

నోరుండి కూడా మాట్లాడలేని మూగజీవులు-మనుషులైనా పశువుల కంటే హీనంగా బతికే మానవులు. నోరుమూసుకొని-తలదించుకొని - వాళ్ళ ఆజ్ఞలను శిరసావహించాలి. చెప్పింది చేయాలి. తిట్టినా-కొట్టినా-చివరకు ప్రాణం తీసినా - అడిగేవాడులేదు!

వాళ్ళ చుట్టూ వున్న పచ్చని పొలాలు - వీచే గాలి - పారే నీరు - కురిసే వాన - ప్రకృతి సంపదంతా దొరలు-జమీందార్లు- నిజాం నవాబు మద్దతుదార్లదే. వాళ్ళకు మేడి తెలియదు - కాడి తెలియదు. వడ్లగింజ ఎక్కడ నుంచి వస్తుందో తెలియదు. నారూ-నీరూ కున్న అనుబంధం తెలియదు. ఎద్దుకూ-మొద్దుకూ వున్న తేడా తెలియదు. దున్నపోతు ఈనిందంటే - బిడ్డ పుట్టిందని ఆనందించేవాళ్ళు - అయినా వాళ్ళు సంపదకు వారసులు. శ్రమశక్తి ఫలితాన్ని అనుభవించే మహరాజులు.



ఎందుకు వాళ్ళకీ భోగం? ఎందుకు మాకీ కష్టాలు? మా కష్టాలకు కారణం!

గత జన్మలో మేమేదో పాపం జేశామట- భగవంతుడు మాకీ శిక్ష విధించాడట. ఏ పాపం జేశామో తెలియదు? ఎందుకు ఈ శిక్ష విధించారో తెలియదు?

ఎంతకాలమీ శిక్ష అనుభవించాలో తెలియదు

అయినా రేపటికై ఆశతో - బానిసలుగా బతుకుతున్నారు.

బతికి కష్టాలు భరించేకంటే - చావటమే మేలనుకుంటారు!

కానీ! ఎందుకో చావంటే వాళ్ళకు భయం-ఇంకా బతకాలనే కోరిక.

బతికి ఏం చెయ్యాలి! బతికినంత కాలం- ఈ నరకమే కదా!

నిజమే-కానీ-వాళ్ళకింకా ఎందుకో బతకాలనే వుంది

అదే మనిషి బలహీనత-అదే దోపిడిదార్లకు కానుక అయ్యింది.

ఎప్పటికైనా మార్పు రాకపోతుందా? మా జీవితాలలో వెలుగు రాకపోతుందా?

ఆశాజీవులుగా - అష్టకష్టాలు భరిస్తూ బతుకుతున్న వాళ్ళు-తమను కన్నవాళ్ళు - తాము కన్న బిడ్డలు - కాలే కడుపులతో కన్నీరు పెడుతుంటే వాళ్ళ కడుపుకు గంజినీళ్ళు పోయలేకపోతున్నారు.

కష్టించే శక్తిలేక కాదు - పంటలు పండించే యుక్తి లేక కాదు.

చేసే కష్టం పరాయి కొంపకు చేరుతున్నది - వాళ్ళ గూటికి ఇంటికి కన్నీళ్ళు వస్తున్నాయి.

కారణం?

వాళ్ళకు ప్రశ్నించే హక్కు లేదు - ఎదిరించే శక్తి లేదు.

అప్పుడప్పుడు ఆవేశం కలిగినా! జరిగే పరిణామం తెలుసు.

అందుకే ఆవేశం చంపుకుంటున్నారు!

యంత్రంగా మారిపోతున్నారు!

ఎప్పటికైనా మార్పు రాకపోతుందా?

మా జీవితాల్లో వెలుగురాకపోతుందా? అని ఆశాజీవులుగా జీవిస్తున్నారు!

ఇంతలో వినిపించిందొక పొలికేక - అది ఆంధ్రమహాసభ పిలుపు

1944.... భువనగిరిలో జరుగుతున్న 11వ ఆంధ్రమహాసభ- వేల సంఖ్యలో జనం వచ్చారు. వారంతా రైతు-కూలీ- శ్రమజీవులు- రకరకాల వృత్తులు చేస్తున్నా దొరలు - పెత్తందార్లకు వెట్టి చేయడమే ముఖ్యమైన పనిగా వున్నది. మహాసభ సందర్భంగా ఆటలు-పాటలు-వినోద కార్యక్రమాలతో పాటు నాయకుల ఉపన్యాసాలు విన్నారు. వాళ్ళు-గ్రామాల్లో జరిగే దోపిడీ-దౌర్జన్యాలు-వెట్టిచాకిరి గురించి చెప్పారు- దానిక్కారణమేమిటో

చెప్పారు. ప్రజలంతా ఒక్కటిగా లేకపోవడమే నన్నారు. అందరూ ఐక్యంగా సంఘశక్తితో వుంటే - ఏ దొర-ఏ దోపిడిదారు ఏమి చేయలేడన్నారు. అందుకే కష్టపడే వాళ్ళంతా ఒకటి కావాలన్నారు. సంఘశక్తితో ముందుకు పోవాలన్నారు.

వెట్టిచాకిరి రద్దు-దొరలు-దేశముఖులు-గ్రామ పెత్తందార్ల దౌర్జన్యం అంతం పలకాలన్నారు.

అవన్నీ నిజవే-కానీ-ఏదో సందేహం! సందేహవే కాదు-ఇదంతా ఎట్ల జరుగుతుంది.

గుండెల్లో గుబులు-దొరకు-పటేల్‌కు తెలిస్తే బతకనిస్తాడా?

వూల్ల వుండనిస్తాడా? గుంపులు గుంపులుగా జేరి గుసగుసలు పెడుతున్నారు.

ఇంతకూ వీళ్లెవరు? అన్న సందేహం కలిగింది!

సంఘపోళ్ళు అన్నాడు పక్కనున్న యువకుడు-వాళ్ళ సంభాషణ విని.

అందరూ అతనివైపు తిరిగారు.

సంగమంటేంది? అడిగాడో యువకుడు.

అందరూ కలిసికట్టుగా వుండి- ఒకేమాట- ఒకే బాట నడిస్తే- అదే సంఘం అన్నాడా యువకుడు.

"ఎంతమందిమి కలిసినా దొరను-పటేల్ను యెదిరించగలమా?"

"ఊరంతా ఒక్కటైతే - వాళ్ళిద్దరేం జేస్తారు?"

"నిజమేగని- వూరంత ఒక్కటెట్లయితరు?"

"అందరూ సంఘంలో జేరితే"

"గట్లయితే వూరోల్లందరం సంగంలో జేర్తం. మావూరి కొస్తరా?" అమాయకంగా అడిగాడు యింకో యువకుడు.

"ముందు మీరు సంఘ సభ్యులుగా చేరాలి- తర్వాత- దొర-పటేల్- ఎవరొచ్చినా- భయపడమని- సంఘం నాయకులు చెప్పినట్టు చేస్తామని ప్రమాణం చెయ్యాలె"

"అమ్మో! దొర వూరుకుంటాడా?"

"యేం జేస్తడు?"

"కొడ్తడు! తన్తడు- నోటికొచ్చినట్లు తిడ్తడు - జుల్మానా యేస్తడు"

"దొర కొట్టడు- కొట్టడానిక్కూడా నౌకరునే పెట్టుకుంటడు.

కొట్టేది-కొట్టించుకునేది మన పేదోళ్లే-

"నిజమే! దొరకు నౌకర్లుంటరు!"

"వాళ్ళెవరు? మనవాళ్ళే - మాల మాదిగ- అంటరాని వాళ్ళ చేతనే అడ్డమైన పనులు చేయించుకుంటారు. దూరంగా వుండమంటారు- కుక్కకు బొక్కేసినట్లు - అప్పుడప్పుడు తాము తినీ - తాగిన దాంట్లో మిగిలింది పడేస్తారు- అది అమృతంలా భరించిన వాళ్ళు- అందరికంటే దొరకు దగ్గరవాళ్ళమని-మన వాళ్ళ మీదనే కర్రలెత్తుతారు.

"నిజమే!"

"కానీ, దొర! పటేల్! వాళ్ల నౌకర్లు అందరు కలిసి ఎందురుంటారు?

పదిమందికి మించి వుండరు!

వూరి జనమంతా ఒక్కటైతే వందలమందయితరు?

పదిమంది వందలమందినేమి జేస్తరు?"

"నిజమే"

"వందలమంది కలిస్తే-అదే సంఘం.

వందల గొంతులు కలిస్తే-

ఒక్కసారి జై అంటే - మీ ఊరి దొర వులిక్కి పడతాడు- మరోసారంటే-పక్కలోనే మూత్రం జేస్తాడు. మూడోసారంటే - వూరినుండి వుడాయిస్తాడు. సంఘానికున్న శక్తి అది-ఇంతకాలం మనం మరచిపోయిన యుక్తి-మీరంతా ఒకటిగా ఒక్కసారి జై అనండి.

"ఆంధ్ర మహాసభకు జై-

రావి నారాయణరెడ్డికి జై

బద్దం ఎల్లారెడ్డికి జై"

వాళ్ళే కాదు - చుట్టుపక్కనోళ్ళంత ఒక్కసారి జై అన్నారు.

గుట్టలు, చెట్లు, పుట్టలు జై జై అని ప్రతిధ్వనించాయి.

గుండెల్లో-ధైర్యం-

కండల్లో శక్తి -

బుర్రలో ఆవేశం -

జెండా పట్టి - జై అనిపించాయి -

ఆ శక్తిని ప్రసాదించింది ఆంధ్రమహాసభ-కమ్యూనిస్టు పార్టీ నిగూఢమైన శక్తిని నిద్ర లేపింది - ప్రజాశక్తికి పరీక్షగా నిలిచింది - జనగామ తాలూకా-

విసునూరు దొర అక్రమాలకు

అడ్డం పట్టింది పాలకుర్తి కడివెండి -

చాకలి ఐలమ్మ - దొడ్డి కొమరయ్యా!

ప్రజా పోరాటానికి ప్రతీకలయ్యారు!

ఐలమ్మ ఆత్మధైర్యం-

కొమరయ్య అమరత్వం-

ఉద్యమానికి వూపిరి పోసింది.

జనగామ తాలూకా పోరుబాట బట్టింది.

ఒక్కొక్క వూరు ఒక కురుక్షేత్రమయ్యింది.

తెలంగాణా మంతట విప్లవ జ్యోతి వెలిగింది.

చీకటి తొలిగి వెలుతురొచ్చింది.

అణగారిన బతుకుల్లో ఆశలు చిగురించాయి.

అమరుడు కొమరయ్య - తెలంగాణ పోరాట తొలి అమరుడుగా-

సాయుధ సమరానికి సంకేతమయ్యాడు

"నిన్ను గన్నట్టి ఈ తెలుగు గడ్డను మేము


స్వాతంత్ర్యముగ జేసి శాంతించెదమె గాని

నీ పేరు నిలుపకనే కొమరయ్యా-మేము

నిదురైన బోమోయి కొమరయ్యా?" అని సంఘ సభ్యులు శపథం చేశారు. ◆

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం - ఇవాళ్టి ప్రశ్నలు

- ఎన్. వేణుగోపాల్



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం (1946-51) ఒకానొక చిన్న భౌగోళిక ప్రాంతంలో, అతి స్వల్పకాలం పాటు సాగి, అధికారికంగా విరమించబడిన పోరాటమే అయినప్పటికీ ఆధునికాంధ్ర చరిత్రలోనూ, ఆధునిక భారత చరిత్రలోనూ దానికి అపూర్వమైన విశిష్టత ఉంది. ఆ పోరాటం జరిగి ఆరు దశాబ్దాలు గడిచినా ఇవాళ్టికీ దాని ప్రేరక శక్తి తగ్గలేదు సరిగదా నానాటికీ పెరుగుతోంది. ఇప్పటికి కనీసం యాభైవేల పేజీలకు మించిన సాహిత్యం వెలువడిన తర్వాత కూడ ఇవాళ్టికీ ఆ పోరాటం గురించి విశ్లేషించవలసిందీ, గ్రహించవలసిందీ ఎంతో మిగిలే ఉంది. వ్యవసాయ ప్రధానమైన భారత ఉపఖండంలో, వలసవాదులకు విశ్వసనీయ మిత్రుడిగా ఉండిన ఒక నిరంకుశ రాచరిక ప్రభువు పాలనలో, భూస్వామ్యానికీ అశేష ప్రజానీకానికీ మధ్య వైరుధ్యమే ప్రధాన వైరుధ్యంగా ఉండిన రోజులలో గ్రామసీమలలో, వర్గ పోరాటాన్ని నడపడమెట్లాగో తొలిసారిగా ప్రయోగపూర్వకంగా చూపిన పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం. భూస్వామ్యం మీదా, దాన్ని పరిరక్షిస్తున్న రాజ్యం మీదా తెలంగాణ రైతు కూలీలు ప్రారంభించిన ఆ పోరాటానికి ఇవాళ్టికీ ప్రాసంగికత ఉంది. అందువల్లనే ఇవాళ్టికీ ఆ పోరాటం పదే పదే స్మరణకు వస్తోంది. మళ్ళీ మళ్ళీ విశ్లేషించబడుతోంది. కొత్త వెలుగులు ప్రసరించినప్పుడల్లా కొత్త పాఠాలను నేర్పుతోంది. గత వర్తమానాల మధ్య నిరంతర సంభాషణే చరిత్ర అని ఇఎచ్‌కార్ చెప్పినట్టు గతంలోని ఆ మహత్తర పోరాటం వర్తమానంలోని అనేక పోరాట అనుభవాలతో నిరంతరం సంభాషిస్తూనే ఉంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను అధ్యయనం చేయడమంటే ఆ సంభాషణను గుర్తించి, ఇవాళ్టి ప్రశ్నలకు నిన్నటి పోరాటం చెప్పగల జవాబులేవో, నిన్న జవాబులేని ఏ ప్రశ్నలకు ఇవాళ జవాబులు దొరుకుతున్నాయో, లేక భవిష్యత్తుకు వాయిదా వేయవలసి ఉందో గుర్తించడమే. ఆ గత వర్తమానాల సంభాషణను అర్థం చేసుకునేందుకు, భవిష్యత్తుకు ప్రాతిపదికలను సూచించేందుకు చేసే ప్రయత్నమే ఈ వ్యాసం.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ఇవాళ్టి ప్రశ్నల నేపథ్యం నుంచి విశ్లేషించబోయే ముందు ఆ పోరాట చరిత్రను స్థూలంగా తెలుసుకోవలసిఉంటుంది. దురదృష్టవశాత్తూ ఇప్పటి దాకా ఆ పోరాటం గురించిన విశ్వసనీయమైన, వాస్తవికమైన చరిత్ర వెలువడలేదంటే అతిశయోక్తి కాదు. గత ముప్పై సంవత్సరాలలో ఆ పోరాట యోధులూ నాయకులూ దాదాపు ముప్పై మంది తమ అనుభవాలకూ, జ్ఞాపకాలకూ, విశ్లేషణలకూ పుస్తక రూపం ఇచ్చారు. కనీసం పది మంది చరిత్ర పరిశోధకులూ, ఆర్థిక శాస్త్రవేత్తలూ, సాహిత్య విమర్శకులూ కూడ ఆ పోరాటాన్ని విశ్లేషించడానికి ప్రయత్నించారు. ఇందులో పోరాట నాయ కులూ యోధులూ రాసిన పుస్తకాలు వారి ప్రస్తుత రాజకీయావగాహనలనే ఎక్కువగా ప్రతిబింబించాయి గాని గతకాలపు పోరాట వాస్తవికతను కాదు. వారి పోరాటాల పట్ల, వ్యక్తిత్వాల పట్ల చాల గౌరవం ఉంచు కుంటూనే వారి పుస్తకాలను విమర్శనాత్మకంగా పరిశీలించవలసి ఉంది. చాలమంది పోరాట నాయకులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాయడం మీద కన్న, గుణపాఠాలు తీయడం మీద ఎక్కువ శ్రద్ధ పెట్టారనే గుర్తింపుతో ఆ పుస్తకాలను చదవవలసి ఉంది. అట్లాగే స్వతంత్ర పరిశోధకులలో ఎక్కువమంది ఆధారాలు పూర్తిగా దొరకకపోవడం వల్లనో, తమ సామాజిక, రాజకీయ దృక్పథాల వల్లనో పోరాటం గురించి సమగ్రంగా విశ్లేషించలేకపోయారు.

అందువల్ల ఇప్పటిదాకా వచ్చిన తెలంగాణ పోరాట సాహిత్యాన్ని నిశితంగా, విమర్శనాత్మకంగా, తులనాత్మకంగా అధ్యయనం చేసి ఒక సమగ్రమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర రాయవలసిన అవసరం ఇంకా మిగిలే ఉంది. అటువంటి సమగ్ర చరిత్ర రచనకు కొన్ని ముఖ్యమైన సమస్య లున్నాయి.

మొట్టమొదట, తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం ఎప్పుడు ప్రారంభమైందనే విషయంలో విభేదాలున్నాయి. సాధారణంగా ఆ పోరాటాన్ని 1946 జులై 4న దొడ్డి కొమరయ్య మరణంతో ప్రారంభమైనట్టుగా చెపుతారు. కాని సమకాలీన ఆధారాలను చూస్తే 1947 సెప్టెంబర్ 11న రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్‌లు సాయుధపోరాటం ప్రారంభిస్తున్నట్టు సంయుక్త ప్రకటన ఇచ్చినట్టు తెలుస్తుంది. కాని ఇంకా ముందుకు వెళితే దాదాపు 1944 నుంచే రైతాంగం, కౌలుదార్లు, స్థానిక భూస్వాములను ఎదిరిస్తూ, సాంప్రదాయిక ఆయుధాలను వాడడం, సంఘటితం కావడం కనబడుతుంది.

కడివెండిలో విసునూరు రామచంద్రారెడ్డి మనుషులు ఊరేగింపు మీద కాల్పులు జరిపి దొడ్డి కొమరయ్యను చంపిన తర్వాత తమ ప్రతిఘటన సాయుధంగా ఉండక తప్పదని రైతాంగం నిశ్చయించుకున్నట్టు అనిపిస్తుంది. ఆయుధ శిక్షణ, దళ నిర్మాణం ప్రారంభమయింది. ఆ తర్వాత కూడ కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాట ప్రకటన చేయడానికి చర్చోపచర్చలు జరిపి దాదాపు పద్నాలుగు నెలల తర్వాత ఆ ప్రకటన చేసింది. ఈ చర్చల సరళి గురించి దేవులపల్లి వెంకటేశ్వరరావు రాశారు.

సాయుధ పోరాట ప్రారంభం గురించి ఇటువంటి అనిశ్చిత స్థితి ఒక ఎత్తయితే, అసలు ఆ సాయుధపోరాటానికి రంగం సిద్ధం చేసిన ఇతర ప్రజాందోళనల, ప్రజాచైతన్య క్రమాలన్నిటినీ పరిగణనలోకి తీసుకోకుండా చరిత్ర రచనకు పూనుకోవడం మరో ఎత్తు. సాయుధ పోరాటమో, ప్రతిఘటనో, సంఘటిత నిర్మాణ చైతన్యమో వాటికవిగా హఠాత్తుగా రూపొందేవి కావు. వాటికి వ్యక్తిగత, సామూహిక, సామాజిక స్థాయిలో ఎన్నెన్నో ఘటనలు, ప్రేరణలు, క్రమాలు, ప్రయత్నాలు, చొరవలు ఉంటాయి. నిశితమైన పోరాట చరిత్ర ఏదయినా ఈ అదృశ్య, అస్పష్ట, అవ్యక్త పరిణామాలను వెతికిపట్టుకుని వాటి ఆధారంతో దృశ్య, వ్యక్త, విస్పష్ట పోరాట రూపాలను వివరించవలసి ఉంటుంది. తెలంగాణ పోరాట చరిత్రలుగా పేరుపొందిన పుస్తకాలలో చాల భాగం హఠాత్తుగా 1946లో ప్రారంభమవుతాయి. కొన్ని కొంచెం ముందుకు వెళ్ళి 1944 ఆంధ్రమహాసభ భోనగిరి సమావేశం దగ్గరో, 1930 ఆంధ్రమహాసభ ప్రారంభం దగ్గరో, 1921 ఆంధ్ర జనసంఘం ఏర్పాటు దగ్గరో కథనం మొదలుపెడతాయి. కాని తెలంగాణ రైతాంగం, తెలంగాణ ప్రజ తమ సమస్యల పరిష్కార మార్గంగా సాయుధ పోరాటాన్ని ఎంచుకోవడం 1940 దశకంలో జరిగిన ఒక వ్యక్తీకరణ అయితే, దాదాపు ఇరవయో శతాబ్ది ప్రారంభం నుంచీ అటువంటి వ్యక్తీకరణలు చాల ఉన్నాయి. ఆ వ్యక్తీకరణలకు చాల పరిమితులుండవచ్చు. లక్ష్య స్పష్టత లేకపోవచ్చు. విస్తృత ప్రజా సమూహాన్ని తమలో భాగం చేసుకోలేకపోవచ్చు. కాని ఆ వ్యక్తీకరణలలో ప్రతి ఒక్కటీ తెలంగాణ ప్రజా చైతన్యాన్ని పరిమాణాత్మకంగానూ, గుణాత్మకంగానూ అభివృద్ధి చేస్తూ వచ్చాయి. తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం ఆ పరిమాణాత్మక, గుణాత్మక మార్పుల గొలుసులో ఒక ఉజ్వలమైన లంకె. సమగ్ర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

రెండు, తెలంగాణ రైతాంగ సాయుధపోరాట లక్ష్యాలేమిటనే విషయంలో ఆ పోరాట నాయకుల మధ్యనే గందరగోళం ఉంది. నిజానికి ఏ పోరాటమయినా ముందే నిర్ణయించుకున్న పథకం ప్రకారం, స్పష్టమైన లక్ష్యంతో కొనసాగకపోవచ్చు. ఒక సుదూర లక్ష్యం గురించి ఎంత స్పష్టత ఉంటుందో, ఆ లక్ష్యాన్ని సాధించే మార్గం గురించి, ఆ మార్గంలో, కాలక్రమంలో ముందుకు వచ్చే తాత్కాలిక, మధ్యంతర లక్ష్యాల గురించి అంత స్పష్టత ఉండకపోవచ్చు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట లక్ష్యాలు భూమి, భుక్తి, విముక్తి అనే విషయంలో స్థూలమైన ఏకాభిప్రాయం ఉంది. కాని నిశిత పరిశీలనలోకి వెళ్తే పోరాట రూపాల విషయంలో, భూ పంపిణీలో గరిష్ట పరిమితి విషయంలో, గ్రామ రాజ్యాల స్థాపన విషయంలో, నిజాం పోలీసులను, రజాకార్లను ఎదిరించినట్టుగానే, కేంద్ర ప్రభుత్వ సైన్యాలను ఎదిరించే విషయంలో, పోరాట దశల విషయంలో, పోరాట విస్తరణ విషయంలో విరమణ విషయంలో అనేక భిన్నాభిప్రాయాలు అప్పుడూ వ్యక్తమయ్యాయి. ఇప్పటికీ వ్యక్తమవుతున్నాయి. హైదరాబాదు రాజ్యంలో, ప్రత్యేకించి తెలంగాణలో సోషలిజం స్థాపన లక్ష్యంగానే ఆ పోరాటం సాగిందనే విశ్లేషణ నుంచి తెలుగుజాతిని ఏకం చేసి విశాలాంధ్ర స్థాపించడమే లక్ష్యమనే విశ్లేషణ వరకు ఎన్నో విభిన్న సైద్ధాంతిక అవగాహనలు ఉన్నాయి.

ఇక్కడ కూడ సమకాలీన ఆధారాలను పరిగణనలోకి తీసుకుంటూ మొత్తంగా తెలంగాణ ప్రజా చైతన్యం తన ముందు ఎప్పుడెప్పుడు ఏయే లక్ష్యాలను పెట్టుకుంటూ ముందుకు సాగిందో పరిశీలించవలసి ఉంది. మొత్తం ఆ చైతన్య పరిణామ క్రమాన్నంతా ఒకే ముద్దగా చూసి ఏకైక లక్ష్యానికి కుదించడం సరియైనది కాదు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని కమ్యూనిస్టు పార్టీ అధికారికంగా విరమించే నాటికి దాని లక్ష్యాలుగా భూ యాజమాన్యంలో సమానత్వం సాధించడం, గ్రామసీమల నుంచి పేదరికాన్నీ అసమానతనూ పారదోలి అందరికీ భుక్తికి అవకాశాలివ్వడం, అన్నిరకాల పీడనల నుంచీ విముక్తి సాధించడం అనేవి చెప్పుకోవచ్చు. కాని ఈ భూమి-భుక్తి-విముక్తికి కూడ ఈ ఆరు దశాబ్దాలు గడిచి వచ్చిన తర్వాత మనం ఇచ్చుకుంటున్న నిర్వచనాలే ఆ రోజు కూడ ఉన్నాయనుకోవడం సరికాదు. సమగ్ర తెలంగాణ రైతాంగ సాయుధపోరాట చరిత్ర ఈ లక్ష్యాలను గుర్తించి వివరించడంలో జాగ్రత్త వహించవలసి ఉంది. వాస్తవిక, విశ్వసనీయ, సమకాలీన ఆధారాల ప్రాతిపదికన ఆ వివరణ జరగవలసి ఉంది.

మూడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విస్తరణను ఎట్లా అర్థం చేసుకోవాలనేది ఇవాళ్టికీ ఒక ముఖ్యమైన సమస్యే. రైతాంగ అసంతృప్తి రూపంలో మాత్రమే చూసినా ఆ పోరాట బీజాలు పాలకుర్తిలో, మొండ్రాయిలో, ధర్మాపురంలో, బేతవోలులో, కామారెడ్డిగూడెంలో, కడివెండిలో, అట్లా చెదురుమదురుగా అనేక గ్రామాలలో ఉన్నాయి. ఈ గ్రామాలన్నీ ప్రస్తుత వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లా సరిహద్దుల గ్రామాలు. క్రమక్రమంగా పోరాటం ఈ జిల్లాలోని ఇతర గ్రామాలకూ, పొరుగు జిల్లాలకూ కూడ విస్తరించింది. చివరి రోజుల్లో పోరాట దళాలు ఇటు నల్లమల అడవిలోకీ, అటు గోదావరి తీర అడవిలోకీ కూడ విస్తరించాయి. అట్లాగే పోరాటపు తొలి అడుగులు కౌల్దార్లలో, మధ్య తరగతి రైతులలో ఉండగా, క్రమక్రమంగా పోరాటం భూస్వాములు తప్ప మిగిలిన అన్ని వర్గాలలోకీ విస్తరించింది. ఏ అంశాల మీద, ఏ డిమాండ్లతో పోరాటం సాగిందనే విషయంలో కూడ గ్రంథాలయోద్యమం, వర్తక సంఘాల వంటి అంశాల నుంచి వెట్టిచాకిరీ రద్దు, భూ పంపకం, రాచరికం రద్దు, విముక్తి అనే అంశాల దాకా విస్తరణ సాగింది.

ఈ విస్తరణలో ప్రజల యాదృచ్ఛిక ఆకాంక్షల ఫలితం ఎంత, నాయకత్వపు ఉద్దేశ్యపూర్వక విధానాల ఫలితం ఎంత అనేది పోరాట చరిత్ర పుస్తకాలలో స్పష్టంగా లేదు. సాధారణంగా మార్క్సిస్టు పరిభాషలో ఒక పోరాట ప్రారంభానికీ, విస్తరణకూ భౌతిక పరిస్థితుల, స్వీయ



మానసిక శక్తుల పొందికను కారణంగా చూపుతారు. తెలంగాణలో నాటి భౌతిక పరిస్థితులేమిటి, స్వీయ మానసిక శక్తులు ఏమిటి, అందులోనూ ఆ స్వీయ మానసిక శక్తులలో నాయకత్వం పాత్ర ఎంత, శ్రేణుల పాత్ర ఎంత అనే విశ్లేషణ జరగవలసినంతగా జరగలేదు. అటువంటి విశ్లేషణ జరిగితే, సమానమైన భౌతిక పరిస్థితులు ఉన్న ఇతర ప్రాంతాలలో, సమానమైన స్వీయ మానసిక శక్తులు ఉన్నచోట కూడ, ఇటువంటి పోరాటాల ప్రజ్వలనం ఎందుకు జరగలేదనే ప్రశ్నకు జవాబు వెతకవలసి ఉంటుంది. అంటే తెలంగాణ పోరాట ప్రారంభం, విస్తరణలను సరిగా విశ్లేషించి మదింపు వేస్తే అది కేవలం తెలంగాణ పోరాట చరిత్ర రచించడం మాత్రమే కాదు, ప్రజా ఉద్యమ విస్తరణకు సంబంధించిన మార్క్సిస్టు సిద్ధాంతానికే చేర్పు అవుతుంది. అట్లాగే ఒక ప్రజా ఉద్యమం స్థలంలోనూ, కాలంలోనూ, చేపట్టే అంశాల పరిధిలోనూ, భాగం పంచుకునే ప్రజా సమూహాలలోనూ ఏ విధంగా విస్తరిస్తుందో, ఆ విస్తరణ క్రమంలో ఏయే వ్యూహాలు ఉద్దేశ్యపూర్వకంగానూ, అసంకల్పితంగానూ అమలులోకి వస్తాయో గ్రహించడానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర ఒక విలువైన ఆధారం అవుతుంది.

నాలుగు, తెలంగాణ రైతాంగ సాయుధపోరాట చరిత్రలో ఉన్న ఒక విశిష్టత గురించి ఇప్పటిదాకా సరైన విశ్లేషణ జరిగినట్టు కనబడదు. ఆ విశిష్టత పోరాట క్రమంలో పోరాట శత్రువులు మారిపోతూ ఉండడం. ప్రపంచ ప్రజాపోరాటాల చరిత్రలో కేవలం చైనా విప్లవం మాత్రమే అటువంటి అనుభవాన్ని చవిచూసింది. చాంగ్‌కైషేక్‌తోనూ, యుద్ధ ప్రభువులతోనూ పోరాడుతుండిన చైనా ప్రజలకు హఠాత్తుగా జపాన్ ఆక్రమణ సైన్యం శత్రువులుగా వచ్చారు. అందువల్ల చైనా విప్లవం తన వ్యూహాన్నీ, ఎత్తుగడలనూ మార్చుకోవలసి వచ్చింది. తెలంగాణ రైతాంగం పోరాటం ప్రారంభించినపుడు ప్రత్యర్థులుగా ఉన్న వాళ్ళు స్థానిక భూస్వాములు, వారికి రక్షణగా వచ్చిన నిజాం ప్రభుత్వ పోలీసులు. కాలక్రమంలో రాచరికం, భూస్వామ్యం బలపరిచిన, మతం పేరు పెట్టుకున్న కొత్త శత్రువులుగా రజాకార్లు తోడయ్యారు. ప్రజా ఉద్యమం ప్రారంభమయినప్పటి నుంచి 1948 సెప్టెంబర్ 17 దాకా స్థూలంగా దృశ్యం ఇదే. ఆ తర్వాత పాత ప్రత్యర్థులలో ఇద్దరు అదృశ్యమయ్యారు. - నిజాం పోలీసులు రద్దయ్యారు, రజాకార్లు లేకుండా పోయారు. భూస్వాములు గ్రామాలకు తిరిగి రావడం ప్రారంభించారు. కాని ఇప్పుడు కొత్త శత్రువు, ఇంకా బలమైన, ఇంకా నిర్దాక్షిణ్యమైన శత్రువుగా కేంద్ర ప్రభుత్వ సైనిక బలగాలు వచ్చాయి. ఈ మారిన 'పరిస్థితితో వ్యవహరించడం ఎట్లాగో పోరాట నాయకత్వానికి తెలియలేదు. మూడు దశాబ్దాల తర్వాత రాసిన పుస్తకాలలో, జ్ఞాపకాలలో ఆ నాయకులు తమ పాత ప్రవర్తనను సమర్థించుకునేందుకు ఎంతగానో ప్రయత్నించారు గాని ఆ ప్రవర్తన అప్పటి స్థలకాలాలకు, ప్రజా ఉద్యమ స్థాయికి తగినంతగా లేదనేది ఒక చేదు వాస్తవం. పోరాటం ఆనాడే ఆపి ఉండవలసిందా, ఇంకా బలంగా కొనసాగించి ఉండవలసిందా, అప్పటిదాకా సాధించిన విజయాలను పరిరక్షించుకునేందుకే పోరాడవలసి ఉండిందా అనే మూడు ప్రశ్నలు ఇవాళ్టికీ చర్చలో ఉన్నాయి. ఆ ప్రశ్నలకు ఇవాళ్టి అవగాహనలతో జవాబు చెప్పబోవడం అర్థరహితం. కాని ఆనాటి నాయకత్వం ఆనాడు ఆ ప్రశ్నలకు సృజనాత్మకమైన జవాబులు చెప్పుకోలేకపోయిందనేది, అందువల్ల అప్పటిదాకా ఎదిగి వచ్చిన ప్రజా చైతన్యాన్ని ఒక మెట్టు పైకి ఎక్కించడంలో, కనీసం ఉన్నచోట ఉంచడంలో విఫలమయిందనేది ఒక వాస్తవం.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సమగ్ర చరిత్ర ఈ క్లిష్టదశను ఎటువంటి అతి, మిత వాదాలకు లోనుగాకుండా పరిశీలించవలసి ఉంటుంది. కాంగ్రెస్ పట్ల, కాంగ్రెస్ దేశంలో ప్రవేశపెట్టనున్న పాలన పట్ల తెలంగాణ పోరాట నాయకులకు ఉండిన అంచనాల నేపథ్యంలో 1948-51 పోరాటాన్ని అర్థం చేసుకుని వివరించవలసి ఉంటుంది.

ఐదు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని కమ్యూనిస్టు పార్టీ అధికారికంగా 1951 అక్టోబర్ 20న విరమించింది. ప్రభుత్వం నుంచి ఏ హామీలు లేకుండానే ఆయుధ విసర్జన చేసి, దళాలను రద్దు చేసింది. పార్టీ మీద నిషేధం ఎత్తివేయకపోయినా, ప్రజాతంత్ర సంఘటనలో భాగమయి ఎన్నికలలో పాల్గొనడానికి కూడ ఉవ్విళ్ళూరింది. ఈ నిర్ణయాల పట్ల కొందరు నాయకులలో, కార్యకర్తలలో భిన్నాభిప్రాయాలున్నా, అవి దాదాపు పది, పదిహేనేళ్ళు నివురుగప్పిన నిప్పులాగనే ఉన్నాయి. ఆ తర్వాత ఆ భిన్నాభిప్రాయాలతోనే చాల వాదవివాదాలు జరిగాయి, జరుగుతున్నాయి. భారత కమ్యూనిస్టు ఉద్యమ సంప్రదాయంలో ఈ విరమణ అనుకూలత, వ్యతిరేకతలు ఇప్పటికీ తమ పాత్ర వహిస్తూనే వున్నాయి.

విస్తరణ అసాధ్యమయిన, కష్టసాధ్యమయిన పరిస్థితిలో, పోరాటం ప్రతిష్ఠంభన ఎదుర్కొన్న స్థితిలో ఒక తాత్కాలిక వెనుకంజ సహజమే. ఆ వెనుకంజను వాచ్యంగా పోరాట విరమణగా అభివర్ణించినా తప్పుకాదు. కాని ఆ వెనుకంజ అప్పటిదాకా సాధించిన భౌతిక విజయాలన్నిటినీ ప్రత్యర్థులకు దఖలు పరిచేదిగా, మానసిక విజయాలను, చైతన్య పురోభివృద్ధిని కోల్పోయేదిగా ఉండడం మాత్రం పొరపాటు.



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విరమణ ఫలితాలు, ప్రభావాలు అటువైపే దారి తీశాయి.

అందువల్ల తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర ఒక సమ్యగ్ దృక్పథంతో ఈ విరమణ సమస్యను పరిశీలించవలసి ఉంది. విరమణ సముచితమా కాదా, విరమణ సమర్ధనీయమా కాదా, విరమణ అనివార్యమే అయితే ఏ హామీలతో ఏ షరతులకు లోబడి జరగవలసింది, విరమణ అనంతరం నాయకుల, కార్యకర్తల ఆచరణ ఏ రకంగా ఉండవలసింది వంటి ప్రశ్నలకు వాస్తవికమైన సమాధానాలు వెతికినప్పుడే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర సమగ్రం అవుతుంది.

చివరిగా, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మీద ఇప్పటి వరకు వచ్చిన రచనలన్నీ కూడ ఆ అనుభవాలను ఉత్తేజపూర్వకంగా చెప్పడానికో, ఇవాళ్టి రాజకీయ అవసరాలకు ఆ అనుభవాలను వత్తాసుగా తెచ్చుకోవడానికో ఉపయోగపడ్డాయే గాని ఆ అద్భుత అనుభవాలను సాధారణీకరించడం,తాత్విక, సైద్ధాంతిక స్థాయిలో భావనీకరించడం జరగలేదు. ఈ సమస్య మొత్తంగా భారతదేశంలోని ప్రజాఉద్యమాలన్నిటికీ వర్తించేదే అయినప్పటికీ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మరింత ఎక్కువగా వర్తిస్తుంది. అది ఒక గొప్ప పోరాటం అయినప్పటికీ, మన ప్రజలకు చెందిన ఉజ్వల అనుభవం అయినప్పటికీ, ఆ అనుభవాన్ని సాధారణీకరించి, అందులోని సైద్ధాంతిక భావనలను నిగ్గుతేల్చడం జరగలేదు. ఇప్పటికైనా అటువంటి పనికి పూనుకోవలసిన అవసరం ఉంది. తెలంగాణ కంటె చిన్న ప్రాంతమైన హునాన్ రైతాంగ ప్రజ్వలనం నుంచి మావో ఎటువంటి విశ్లేషణకు, నిర్ధారణకు పూనుకున్నాడో, అటువంటి సైద్ధాంతిక, తాత్విక కృషికి భారతీయ మార్క్సిస్టులు ఎప్పుడూ ప్రయత్నించినట్టు కనబడదు.

ఈ చర్చ పూర్వరంగంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఏయే ప్రశ్నలను లేవనెత్తిందో, వాటిలో వేటికి జవాబులు చెప్పగలిగిందో, ఆ ప్రశ్నలలో ఏవి ఇవాళ్టికీ సంబద్ధంగా ఉన్నాయో, వేటికి ఇవాళ్టికీ జవాబులు చెప్పలేని స్థితి ఉందో పరిశీలించవలసి ఉంది.

ఒక పోరాట లక్ష్యాలు ఏ విధంగా నిర్ణయమవుతాయి, అవి ఏ విధంగా పరిణామం చెందుతాయి, ఒక పోరాటానికి లక్ష్యశుద్ధి ఉండడమంటే ఏమిటి అనే ప్రశ్నలను తెలంగాణ రైతాంగ పోరాటం చాల బలంగా ముందుకు తెచ్చింది. బహుశా ఈ ప్రశ్నలు ఇవాళ్టి పోరాటాలకు కూడ అంతగానే వర్తిస్తాయి. అసలు భారత ప్రజా ఉద్యమాల చరిత్రలోనే, బహుశా గాంధీవాద ప్రభావం వల్ల లక్ష్యాలకు పవిత్రతను, నిశ్చలతను, స్థిరత్వాన్ని ఆపాదించడం జరిగింది. లక్ష్యాలకూ మార్గానికీ మధ్య అనవసరమైన విభజన రేఖను గీయడం జరిగింది. దీనికి ప్రతిగా మరొక కొసకు వెళ్ళి లక్ష్యాల పట్ల స్పష్టత లేకపోవడం, లక్ష్యాల పట్ల చంచలత్వం, తాత్కాలిక ప్రయోజనాల కోసం లక్ష్యాలను మార్చుకునే వెసులుబాటుతనం వచ్చాయి. అందువల్ల లక్ష్యశుద్ధి లేని పోరాటాలు, లక్ష్యాలను సాధించడం పట్ల చిత్తశుద్ధిలేని నాయకత్వాలు, తాము పట్టిన కుందేటికి మూడే కాళ్ళన్నట్టుగా కొన్ని మార్గాల పట్ల మితిమీరిన నమ్మకం, ఇతర మార్గాల పట్ల తృణీకారం, మార్గాల చర్చలో, వివాదంలో పడి అసలు లక్ష్యాల గురించే మరిచిపోవడం భారత ప్రజా ఉద్యమాలలో, ముఖ్యంగా మార్క్సిస్టుల నాయకత్వం లోని ప్రజా ఉద్యమాలలో పరిపాటి అయిపోయాయి.

ఈ సంప్రదాయం బహుశా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దగ్గరే బలంగా వ్యక్తమయినట్టుంది. నిజానికి ఇది మార్క్సిస్టు ఆలోచనాధారకు సరిపోయే సంప్రదాయం కాదు. కాని భారతదేశంలో మార్క్సిస్టు ఆచరణకూ సిద్ధాంతానికీ ఉన్న అంతరం ఈ సంప్రదాయాన్ని బలపరుస్తూ వచ్చింది. కమ్యూనిస్టు పార్టీగా పేరు పెట్టుకున్న పార్టీ ఏదయినా మౌలికంగా రాజ్యాధి కారాన్ని సాధించడం మీద, పీడిత ప్రజలు తరతరా లుగా కోల్పోయిన సామాజిక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అవకాశాల్ని పునరుద్ధరించడం మీద కేంద్రీకరించాలి. ఎక్కడయినా కమ్యూనిస్టులకు ఇవి మౌలిక లక్ష్యాలుగా ఉంటాయి. ఈ లక్ష్యాల సాధనకు తగిన మార్గాలను ఆయా స్థల కాలాలను బట్టి, సామా జిక స్థితిని బట్టి రూపొందించుకోవలసి ఉంటుంది. ఆ క్రమంలో తాత్కాలిక, స్వల్పకాలిక, మధ్యంతర లక్ష్యాలు కూడ ముందుకు రావచ్చు. భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర చదివితే, తొలి దశకంలో 'విప్లవ స్వరాజ్యం' గురించీ, సామ్రాజ్యవాద బంధనాల నుంచి విముక్తి కావడం గురించీ, స్థానిక నిరంకుశత్వాన్ని తొలగించడం గురించీ ప్రస్తావనలు కనబడతాయి. దేశంలోని పెటీ బూర్జువా నాయకులతో కలిసి ఒకే పార్టీలో పనిచేయడం గురించి ఆలోచనలు కనబడతాయి. రెండో దశకం - అంటే 1930లు వచ్చేసరికి - ఇటు కార్మికవర్గాన్ని సంఘటితం చేయడం, అటు భారత జాతీయ కాంగ్రెస్‌లో ప్రగతిశీల శక్తులను వెతకడం మాత్రమే లక్ష్యాలుగా మారిపోయాయి. మూడో దశకంలో భారత కమ్యూనిస్టు ఉద్యమంలోనే కొత్త ఆలోచనలు ప్రారంభించి, కొత్తగా లక్ష్యశుద్ధి కలిగించిన పోరాటంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని చెప్పుకోవాలి.

అది కమ్యూనిస్టు పార్టీని పట్టణాల నుంచి, కార్మికవర్గం నుంచి పల్లెసీమలకు, భూమి లేని రైతు కూలీలలోకి తీసుకువచ్చింది. కాంగ్రెస్‌తో,

జాతీయవాదులతో, మితవాదులతో కలిసి పనిచేస్తూ వారిలో అభ్యుదయాంశను వెతికే స్థితి నుంచి కమ్యూనిస్టులు సొంతంగా నిర్మాణాలు చేసే దశకు, నాయకత్వం వహించే దశకు, పోరాటాలు నడిపే దశకు తీసుకు వచ్చింది. ఒకటి రెండు సంవత్సరాల పోరాటానుభవంతో గ్రామ రాజ్యాలను నిర్మించడం కూడ ప్రారంభించి ప్రజా ఉద్యమపు అంతిమ లక్ష్యం రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడమేనని చూపించింది. అంటే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తాను అభివృద్ధి చెందుతూ తనకు నాయకత్వం వహించిన కమ్యూనిస్టు పార్టీని కూడ అభివృద్ధి చేసింది. కమ్యూనిస్టు పార్టీకి ఉండవలసిన మౌలిక లక్షణాలేవో గుర్తుచేసింది.

ఈ రకంగా అంతిమ లక్ష్యం గురించి స్పృహ కోల్పోకుండా ఉన్నప్పుడు, అంటే లక్ష్యశుద్ధి ఉన్నప్పుడు, ఏ మార్గం చేపడతారనేది ప్రధానం కాదు. నిజానికి పార్టీ రూపొందే క్రమంలో రాసిన ఒక పత్రంలో "ఎంఎన్ రాయ్ మార్గాల గురించి ఏదయినా నిర్ధారించడం అవసరం లేదు" అని రాశాడు. అయితే ఆయనే, "భారతదేశంలో కమ్యూనిస్టుల తక్షణ కర్తవ్యం కమ్యూనిజాన్ని ప్రచారం చేయడం కాదు, జాతీయ విప్లవాన్ని సంఘటితం చేయడమే" అని కూడా రాశాడు. తర్వాతి దశాబ్దాలలో ఎంఎన్‌రాయ్ కమ్యూనిజానికి దూరమైనా, కమ్యూనిస్టు పార్టీ ఎంఎన్‌రాయ్‌ని 'ద్రోహి'గా చూసినా, ఈ భావాల ప్రభావం మాత్రం కొనసాగింది. మరో మాటలో చెప్పాలంటే మార్గాల గురించి ఉండవలసినంత స్పష్టత, వెసులుబాటు ఉంటూనే, లక్ష్యం గురించి మాత్రం స్పష్టత లేకపోయింది.

ఈ నేపథ్యంలో చూసినప్పుడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటపు విశిష్టత ఇంకా ఎక్కువగా అర్థమవుతుంది. దానికి, సాయుధపోరాటం ప్రారంభం కాకముందు నుంచే, 1944 నుంచే, ఇంకా చెప్పాలంటే ఒకటి రెండు దశాబ్దాల ముందునుంచే లక్ష్యం గురించిన స్పృహ ఉంది. అది పెరుగుతూ వచ్చింది. ఆ లక్ష్యం దిశలో ఏయే మార్గాలు చేపట్టాలనే విషయంలో కూడ ఆ పోరాటం అసాధారణమైన విజ్ఞతను, వెసులుబాటును ప్రదర్శించింది.

పోరాట విరమణ తర్వాత అవిభక్త కమ్యూనిస్టు పార్టీకి గాని, 1964 చీలిక తర్వాత ఏర్పడిన మార్క్సిస్టు పార్టీకి గాని అటువంటి లక్ష్యశుద్ధి ఉందా అనేది అనుమానాస్పదమే. రాజ్యాధికార లక్ష్యం ఈ రెండు కమ్యూనిస్టుపార్టీలకు, తెలంగాణ సాయుధ పోరాటానికి 1948-51 మధ్య ఉండినంత స్పష్టంగానయినా ఉందా అనేది చర్చనీయాంశమే. ఇక 1969 తర్వాత ఏర్పడిన మార్క్సిస్టు-లెనినిస్టు సంప్రదాయం లక్ష్యాన్ని స్పష్టంగా, నిర్ద్వంద్వంగా పునర్నిర్వచించుకుంది గాని మార్గాల విషయంలో పట్టువిడుపులు లేని జడాత్మక వైఖరిని అవలంబించింది. తొలి రోజుల్లో ఏకైక మార్గం వంటి నినాదాలు ఇచ్చినా, ఆ తర్వాతి రోజుల్లో ఆ అతివాదం నుంచి బైటపడినా, లక్ష్యశుద్ధి ఉన్నంతగా మార్గాల పట్ల అవగాహన లేదని అనిపిస్తుంది.


తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లేవనెత్తిన ఈ ప్రశ్నకు సంతృప్తికరమైన, ఉపయోగకరమైన జవాబును చెప్పుకోవలసిన అవసరం ఇంకా మిగిలే ఉంది.

ఈ లక్ష్యాలు-మార్గాలకు సంబంధించిన మొదటి ప్రశ్నకు అనుబంధంగానే పోరాటంలో విభిన్న వర్గాల భాగస్వామ్యం, విభిన్న వర్గాల ప్రయోజనాల మేళవింపు అనే ప్రశ్న గురించి కూడ ఆలోచించాలి. ఇక్కడ కూడ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అనుభవం విలువైన పాఠాలను అందిస్తుంది.

సమాజంలో విభిన్న వర్గాలు, వాటి దృక్పథాల మధ్య, ప్రయోజనాల మధ్య వైవిధ్యం ఉన్నప్పుడు ఆ వైవిధ్యమంతా పోరాటంలోకి కూడ ప్రవేశిస్తుంది. అందులోనూ కుల, మత ప్రాంత విభేదాలు తీవ్రంగా ఉన్న మన సమాజంలో, పోరాటం లోపల వర్గ, స్త్రీ-పురుష అస్తిత్వాలతో పాటు ఈ విభిన్న అస్తిత్వాలు కూడ వాటి పాత్రలను నిర్వహిస్తుంటాయి. ఒక పోరాటం విస్తరించిన కొద్దీ ఈ విభిన్న అస్తిత్వాలను తనలో కలుపుకుని వాటి మధ్య ఐక్యతను సాధించవలసి ఉంటుంది. అదే సమయంలో ఆ అస్తిత్వాలు తమ సొంత వ్యక్తిత్వాన్ని వదులుకోవలసిన అవసరం లేదనే, అంటే ఒక దానికి మరొకటి లోబడనవసరం లేదనే హామీని కూడ ఆ పోరాటం ఇవ్వవలసి ఉంటుంది. ఒక ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా ఐక్యత సాధించడం సులభసాధ్యమైన పనే గాని, ఆ శత్రువు బలహీనపడినప్పుడో, ఆ శత్రువే ప్రోత్సహించినప్పుడో, పోరాట క్రమంలో తమ ప్రయోజనాలు నెరవేరాయని ఒక బృందం భావించినప్పుడో ఆ ఐక్యత దెబ్బతింటుంది. ఘర్షణది పైచేయి అవుతుంది. ఘర్షణ ప్రాధాన్యత వహించిన మేరకు పోరాటం బలహీనపడుతుంది. ఆ సందర్భంలో విభిన్న వర్గాల ప్రయోజనాల మేళవింపును సాధించగల విజ్ఞత, సమయస్ఫూర్తి భవిష్యత్ దృష్టి నాయకత్వానికి ఎంతగా ఉన్నాయనేది పోరాట విజయానికి సూచిక అవుతుంది.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విజయమూ వైఫల్యమూ రెండూ కూడ ఈ అంశంలోనే దాగి ఉన్నాయనిపిస్తుంది. దేశముఖులకు, జాగీర్దార్లకు, పెద్ద భూస్వాములకు వ్యతిరేకంగా ధనిక రైతు నుంచి భూమిలేని నిరుపేదల వరకు అనేక వర్గాలను ఏకం చేయడంలో పోరాటం విజయం సాధించింది. భాషా సంస్కృతుల కోసం తపన పడిన మధ్య తరగతి నుంచి భూమికోసం పోరాడిన రైతు కూలీల నుంచి వెట్టి చాకిరీ నుంచి విముక్తి పొందదలచిన వృత్తి కులాల వరకు అన్ని సామాజిక బృందాలను ఏకం చేయడంలో పోరాటం విజయం సాధించింది. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, రాజ బహదూర్ గౌడ్, మఖ్దూం మొహియుద్దీన్ మొదలయిన విద్యావంతులయిన కమ్యూనిస్టులు మొదలుకొని యాదగిరి, దొడ్డి కొమరయ్య, ఐలమ్మ వంటి అట్టడుగు నుంచి ఎదిగి వచ్చిన నిరక్షరాస్యులైన కార్యకర్తల వరకు, కాళోజీ నారాయణరావు, వట్టికోట ఆళ్వారుస్వామి వంటి సానుభూతి పరులైన మేధావుల వరకు, డాక్టర్ జయసూర్య, డాక్టర్ వాఘ్రే వంటి ఉదార ప్రజాస్వామిక వాదుల వరకు విస్తృత ప్రజాభిప్రాయాన్ని ఆ పోరాటం ఒక్క తాటి మీదికి తేగలిగింది. ఆ రకంగా ఒక వెనుకబడిన సమాజంలో, విభిన్న వైరుధ్యాలు కొనసాగే సమాజంలో విశాల ఐక్య సంఘటనను ఏర్పరచడంలో పరిణతిని ఆ పోరాటం సాధించింది.

ఈ విజయాన్ని వెన్నంటే ఒక అపజయం కూడ ఉంది. పోరాట క్రమంలో కలిసి వచ్చిన విభిన్న శక్తులను, శ్రేణులను చివరిదాకా



సంఘటితంగా ఉంచడంలో పోరాట నాయకత్వం విజయం సాధించలేక పోయింది. తమ తమ ప్రయోజనాలు తీరగానే, లేదా తీరాయని అను కోగానే వేరు వేరు సమూహాలు పోరాటానికి దూరం కావడం సహజమే కావచ్చు. కాని అలా దూరం కాకుండా చూడడంలో లక్ష్యం చేరేదాకా వీలయినంత విశాలమైన ఐక్య సంఘటనను నిర్వహించడంలో నాయకత్వపు విజ్ఞత, పరిణతి ఇమిడి వుంటాయి.

ఈ సమస్య ఇవాల్టికీ భారత దేశంలోని ప్రజా ఉద్యమాలన్నిటి ముందరా, ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీల ముందర సవాలుగానే ఉంది. కొన్ని ఉద్యమాలు, కొన్ని కమ్యూనిస్టు పార్టీలు కూడ ఏదో ఒక వర్గానికో, సమూహానికో తమను తాము పరిమితం చేసుకుని అంతకన్న విస్తృతమైన వర్గాల మేళవింపు గురించి విస్మరిస్తున్నాయి. ఎప్పటికయినా ప్రజా ఉద్యమాలేవయినా ఈ విషయంలో నేర్చుకోవలసిన అనుకూల, ప్రతికూల పాఠాలకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అనుభవం మంచివనరు.

ఈ రెండు ప్రశ్నలకూ సంబంధించి, వాటిలోనే దాగి ఉన్న మరో సమస్య పోరాట వ్యూహంలో, ఎత్తుగడలలో, దృక్పథంలో, వైఖరులలో, పని పద్ధతులలో ఉండవలసిన వెసులుబాటు. ఈ వెసులుబాటును ఆదాన ప్రదానాలలోను, ఎప్పటి కప్పుడు చలనశీలంగా ఉంటూ మార్పులకు లోను కావడంలోను, భిన్నాభిప్రాయాలకు, భిన్నాభి ప్రాయాల ఛాయలకు అవకాశం కల్పించడంలోను చూడవచ్చు. ఈ మార్పులు అటు ప్రత్యర్థి వ్యూహాలలో ఎత్తుగడలలో వచ్చిన మార్పుల వల్ల అవసరం కావచ్చు. లేదా సామాజిక, రాజకీయ పరిస్థితులలో మార్పుల వల్ల అవసరం కావచ్చు. అంటే పోరాటం, ముఖ్యంగా పోరాట నాయకత్వం బైటి మార్పులను వేగంగా, సున్నితంగా గ్రహించగలి గిందిగానూ, ఆ మార్పులకు అనుగుణంగా తాను మారగలిగిందిగానూ ఉండాలి.

ఈ అంశంలో కూడ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జయాపజయాలు రెంటినీ చవి చూసింది. ఒక్కొక్క సందర్భంలో చాలా త్వరితంగా, సృజనాత్మకంగా బైటి మార్పులను అర్థం చేసుకుని అందుకు తగినట్టుగా స్పందించ గలిగింది. అందుకు భిన్నంగా మరి కొన్ని సందర్భాలలో చాల మొరటుగా తన పాత పద్ధతులకే కట్టుబడి ఉండిపోయింది. ఏ మాత్రం వెసులుబాటును చూపలేకపోయింది.

ఆరు దశాబ్దాల తర్వాత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి వారసులుగా తమను తాము భావించుకుంటున్న ఉద్యమాలన్నీ కూడ తమతమ స్థాయిలో ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఒక్కోసారి ప్రత్యర్థిని కూడ సానుభూతితో అర్థం చేసుకోగలిగినంత వెసులుబాటును ప్రదర్శిస్తున్న ఉద్యమాలే, మరో సందర్భంలో మిత్రులపట్ల, శ్రేణుల పట్ల, ప్రజల పట్ల చాల మొరటుగా ప్రవర్తిస్తున్నాయి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జవాబు చెప్పలేకపోయిన ఈ ప్రశ్న ఇవాల్టికీ ప్రశ్నగానే మిగిలిపోవడం ఒక చారిత్రక విషాదం.

ఉద్యమాల వైఖరిలో వెసులుబాటు ఇంత ప్రశ్నార్థకంగా ఉండ డానికి ఒక ముఖ్య కారణం మధ్య తరగతితో ఈ ఉద్యమాల సంబంధం. తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం నుంచి ఇవాల్టి దాకా మన ప్రజా ఉద్యమాలలో అత్యధిక సంఖ్యలో నాయకత్వం మధ్యతరగతి నుంచే వచ్చింది, వస్తోంది. మధ్య తరగతిలో ఉండే తొందరబాటుతనం, అసహనం ఉద్యమాలలో వెసులుబాటు లేకపోవడానికి మూలం. ఉత్పత్తిలో పాల్గొనే ప్రజలలో ఇటువంటి తొందరపాటుతనం, అసహనం ఉండే అవకాశాలు తక్కువ. అందువల్ల వెసులుబాటు ఎక్కువ. కాని మన ఉద్యమాల నాయకత్వంలోకి కింది వర్గాల, ఉత్పత్తి వర్గాల నుంచి వచ్చిన వాళ్ళు కూడా చాల త్వరగా మధ్య తరగతి విలువలను అలవరచు కుంటున్నారు.

మధ్యతరగతిలో సామాజిక అభివృద్ధికి అవసరమైన వెసులుబాటు ఉండదు సరికదా, సామాజిక అభివృద్ధికి ఆటంకమైన ఊగిసలాట ఉంటుంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అనుభవంలో కూడ 1947 ఆగస్టు 15 తర్వాత, 1948 సెప్టెంబర్ 17 తర్వాత నిర్బంధ కాలంలో ఈ ఊగిసలాట చాల ఎక్కువగా కనబడింది.

పోరాట నాయకత్వం, శ్రేణులు పుట్టుకతో ఏ వర్గం వారయి నప్పటికీ, వారిని శ్రామిక వర్గ విలువలతో పదునెక్కించకపోతే, వారి చైతన్యాన్ని నిరంతరం ఆచరణతో, విమర్శ-ఆత్మవిమర్శలతో మెరుగు పరచకపోతే ఏ దుష్పరిణామాలు సంభవిస్తాయో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చూపింది. ఇవాల్టి పోరాటాలు కూడ చూపుతున్నాయి.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మధ్యతరగతి విలువలు చేసిన కీడుతోపాటే గుర్తించవలసిన మేలు కూడ ఉంది. సాపేక్షికంగా సురక్షితమైన, భద్రమైన జీవనం ఉన్న మధ్య తరగతి, తనకన్న కింది స్థాయిలో ఉన్న ప్రజల బాగు కొరకు పోరాడడం, ప్రాణాలను కూడ బలిపెట్టడం అనే గొప్ప త్యాగ సంప్రదాయాన్ని తెలంగాణ రైతాంగ

సాయుధ పోరాటం ప్రారంభించింది. మన నేల మీద బహుశా అల్లూరి సీతారామరాజు ఈ త్యాగ సంప్రదాయధారకు ప్రారంభకుడు కావచ్చు. కాని ఆయనది ఒంటరి ప్రయత్నమే. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వందలాదిమంది మధ్యతరగతి యువకులు ఈ సంప్రదాయాన్ని కొనసాగించారు. కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన వందలాదిమంది మధ్యతరగతి యువకులు మరొక ప్రాంతపు ప్రజల కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారు. ఈ త్యాగనిరతిని నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాట ధార మరింత ఉజ్వలంగా కొనసాగిస్తోంది.

ప్రపంచీకరణ క్రమంలో ఒకరికోసం మరొకరు త్యాగం చేయడం అనే విలువే చాదస్తంగా, అసాధ్యమయినదిగా, అనవసరమైనదిగా భావించే రోజులలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లేవనెత్తిన ఈ ప్రశ్నకు చాల ప్రాముఖ్యత ఉంది. ఇవాళ్టికీ సమాజం తనను తాను ఈ త్యాగనిరతి గురించి, బహుశా త్యాగనిరతి కొరత గురించి, ప్రశ్నించుకుంటూనే ఉంది. భద్ర జీవనం గడుపుతున్న మధ్య తరగతి ముందర ఈ ప్రశ్న నిరంతరం తలెత్తుతూనే ఉంది.

ఈ త్యాగనిరతికి అనుబంధంగానే వచ్చే ప్రశ్న విలువల చట్రానికి సంబంధించినది. సమాజంలోని ఇతర వ్యక్తులకన్న భిన్నమైన విలువలను కమ్యూనిస్టులు, విప్లవకారులు పాటిస్తారా లేదా అనేది సమాజం ఎప్పుడూ అడిగే ప్రశ్న. సమాజాన్ని మార్చే కర్తవ్యంలో, కృషిలో ఉన్నారు గనుక కమ్యూనిస్టులు మారిన విలువలను, కొత్త విలువలను పాటించాలని సమాజం ఆశిస్తుంది. ఈ ఆకాంక్షలో కొంత ఆదర్శవాదం ఉండవచ్చు. కాని అది అర్థరహితమయిన ఆకాంక్షకాదు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిజంగా తెలుగుజాతి చరిత్రలో కొత్త విలువలు అద్భుతంగా వికసించిన కాలం. దాదాపు ప్రతిపుస్తకం లోనూ ఆ కొత్తవిలువల స్పృహ కనబడుతుంది. నిరక్షరాస్యులు, అట్టడుగు కులాల వాళ్ళు నాయకత్వంలోకి రావడం, స్త్రీలు పోరాటంలో భాగస్వాములు కావడం, తమ మతానికే చెందిన రాజును ధిక్కరించి ముస్లింలు పోరాటంలో భాగం పంచుకోవడం, పీడిత కులాల మధ్య ఐక్యత గొప్పగా ప్రదర్శితం కావడం, అసాధారణమైన సాంస్కృతిక ప్రజ్వలనం వంటి వందలాది సూచికలను ఈ కొత్త విలువలకు ఉదాహరణగా చూపవచ్చు.

అయితే ఈ కొత్తవిలువల వ్యవస్థ పోరాట విరమణ తర్వాత కనబడకుండా పోయిందనీ, ఆ విలువలు నాయకత్వంలో ప్రధానంగానూ, శ్రేణులలో, ప్రజలలో అక్కడక్కడా రద్దయిపోయాయనీ గుర్తించడం ఆశ్చర్యంగా ఉంటుంది. ప్రజాచైతన్యం ఒకసారి ఒక శిఖరం చేరిన తర్వాత అక్కడి నుంచి ఇంకా పైకి పోకుండా, కనీసం అక్కడే నిలిచిపోకుండా, కిందికి దిగజారుతుందా, ఎందువల్ల దిగజారుతుంది, ఆ పతనాన్ని ఎట్లా అడ్డుకోగలం అనే ప్రశ్నలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ముందుకు తెచ్చింది. వర్గపోరాటం పదునుగా ఉన్నప్పుడు, తీవ్రతరంగా ఉన్నప్పుడు సామాజిక విలువలు కూడ ఊర్ధ్వముఖంగా ఉంటాయని, వర్గపోరాట తీవ్రత గందరగోళానికి గురయినప్పుడు ఆ విలువల పతనం జరుగుతుందని ఒక స్థూల విశ్లేషణ చేయవచ్చును గాని సూక్ష్మంగా ప్రతి సందర్భాన్నీ విశ్లేషించవలసి ఉంటుంది. చదలవాడ పిచ్చయ్య 'ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ అగ్ర నాయకుల నగ్న సత్యాలు'లో చేసిన దుర్మార్గమైన దాడిగానో, చలసాని ప్రసాదరావు 'ఇలా మిగిలేం'లో ప్రకటించిన నిర్వేదం లాగనో కాక, ఈ విలువల పతనానికి వస్తుగత, వ్యక్తిగత కారణాలు అన్వేషించవలసి ఉంటుంది.

విలువల పతనం విషయంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విరమణానంతర అనుభవం ఇవాళ్టికీ అన్ని ఉద్యమాలనూ పీడిస్తూనే ఉంది. ఆ విలువల పతనం ప్రశ్న పదే పదే తలెత్తుతూనే ఉంది. ఆ ప్రశ్నకు సరైన జవాబును ఇంకా వెతకవలసే ఉంది.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఎదుర్కొన్న మరొక ప్రశ్న విస్తరణలో వచ్చే సమస్యలకు సంబంధించినది. ఆ పోరాటం ముందే చెప్పుకున్నట్టు భౌగోళిక విస్తృతిలోనూ, సామాజిక వర్గాల విస్తృతిలోనూ, లేవనెత్తిన అంశాల విస్తృతిలోనూ ఐదారు సంవత్సరాల వ్యవధిలోనే ఎంతగా విస్తరించిందో చూస్తే అబ్బురపాటు కలుగుతుంది. ఈ విస్తరణతో వ్యవహరించడం, దాన్నంతా నిర్మాణ, సంఘటిత కృషిలోకి తేవడం నాయకత్వానికి సాధ్యం కాలేదేమో అని కూడ అనిపిస్తుంది. ఏ పోరాటమయినా విస్తరించిన కొద్దీ ఆ విస్తరణను క్రమబద్ధం చేయగల నిర్మాణ రూపాలు, పోరాట రూపాలు, నాయకత్వ శ్రేణులు కావలసి ఉంటుంది. ఆ పోరాటాలన్నీ ఎంత ప్రాప్తకాలజ్ఞతతో వచ్చేవయినా, ఈ అవసరాలు మాత్రం ఆలోచనా పూర్వకంగా తీర్చవలసినవి. ఇది బహుశా చైతన్యయుతంగా పరిష్కరించవలసిన వైరుధ్యం. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకత్వం ఈ వైరుధ్యాన్ని సవ్యంగా పరిష్కరించ లేకపోయింది. ఇప్పటికి వెలువడిన అనుభవాల, జ్ఞాపకాల పుస్తకాలు చూస్తే, ఆ పోరాటం ప్రవేశించని రంగం లేదనిపిస్తుంది. కాని ఆయా రంగాలకే ప్రత్యేకమైన నిర్మాణాలు, పోరాట రూపాలు ఆ స్థాయిలో కనబడవు. విస్తరణకూ దాన్ని క్రమబద్ధం చేయడానికీ మధ్య అంతరం ఉందని కనబడుతుంది. ఆ అంతరమే ఆ తర్వాతి కాలపు పోరాటాలకు కూడ వర్తిస్తుంది. తర్వాతి కాలంలో ఉద్యమాలు నిజంగానే ఇంకా ఎక్కువ రంగాలలోకి, ఎక్కువ ప్రాంతాలలోకి విస్తరించాయి. దాదాపు అన్ని రంగాలలోనూ ఏదో ఒక స్థాయిలో నిర్మాణాలు రూపొందాయి. కాని విస్తరణకు-నిర్మాణానికి, ప్రభావానికి - దాన్ని సంఘటితం చేసే శక్తికి మధ్య అంతరాలు పెరుగుతున్నాయి గాని తగ్గడం లేదు. ఒక కొసన పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీల ప్రజాసంఘాలు, ముఖ్యంగా ట్రేడ్ యూనియన్లు లక్షలాది మందిని సభ్యులుగా చేర్చుకుని కూడ, ఆ సభ్యులలో పదిశాతం మందికి కూడ అవి కమ్యూనిస్టు సంస్థలని తెలియని స్థితిలో ఉన్నాయి. మరో కొసన మార్క్సిస్టు-లెనినిస్టు ఉద్యమ నేపథ్యంలో ప్రజాసంఘాలు అవసరం లేదనే వాద కొంతకాలం, ఏర్పాటు చేసినా వాటి కార్యక్షేత్రాల స్పష్టత లేకపోవడం కొంతకాలం, ఏర్పాటు చేసిన సంఘాలలో, గుర్తించిన రంగాలలో పట్టుదలగా, దీర్ఘకాలికంగా పనిచేసే ఓపిక లేకపోవడం కొంతకాలం - మొత్తం మీద ఉద్యమాల విస్తరణ అవసరమైన స్థాయిలో ఆశించిన మేరకు లేని స్థితి ఉంది.

ఒక ప్రజా ఉద్యమం విస్తరించడం అంటే ఏమిటి, ఆ విస్తరణను సుస్థిరం చేసుకునే మార్గాలేమిటి, కొత్త క్షేత్రాలకు విస్తరించడమంటే



పాత క్షేత్రాలు విస్మరించడమా వంటి అనేక ప్రశ్నలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో ముందు కొచ్చాయి. ఇవాళ్టికీ ప్రశ్నలుగానే ఉన్నాయి.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నాటికి అంతగా ఉనికిలో లేని ప్రశ్నలు కొన్ని ఇటీవలి కాలంలో ముందుకు వచ్చి, ఆ పోరాటాన్ని కూడ ఆ ప్రశ్నలవైపు నుంచి చూడడం జరుగుతోంది. వర్తమానానికీ గతానికీ మధ్య ఎడతెగని సంభాషణే చరిత్ర అనుకున్నప్పుడు ఇటువంటి ప్రశ్నలు తలెత్తడం, వాటికి జవాబులు వెతకవలసి రావడం సహజమే. కాని ఆ ప్రశ్నలను ఆనాటి స్థల, కాల, చైతన్యాల పరిమితుల లోపల పరిశీలించవలసి ఉంటుందనే జాగ్రత్త తీసుకోవాలి.

అట్లా వర్తమానంలో తలెత్తుతున్న ప్రశ్నలు కుల, మత, ప్రాంతీయ, స్త్రీ-పురుష విభేదాలకు సంబంధించినవి. ఈ అన్ని విభేదాలు మన సమాజంలోని కఠిన వాస్తవికతలు. కనుక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో కూడ ఈ విభేదాలు, వాటివల్ల తలెత్తిన ఘర్షణలు ఉండే ఉంటాయి. కాని ఆ నాటికి సమాజం ఆ ప్రశ్నలను ఇవాళ వేస్తున్నంత తీవ్రంగా వేయలేదు. అందువల్ల ఆ ప్రశ్నలు, ఒకవేళ ఉన్నప్పటికీ, ఇతర ప్రశ్నలకన్న వెనుకబడి ఉంటాయి. ఆ ప్రశ్నలు అణగదొక్కబడినాయా, అసలు రానే లేదా, వచ్చి ఏవో జవాబులతో సంతృప్తి చెందాయా ఇంకా చారిత్రక పరిశోధన సాగితే తప్ప చెప్పలేం. కాని స్థూలంగా అప్పుడు ఏం జరిగిందో, ఆ అనుభవం నుంచి ఇప్పుడు ఏమయినా గ్రహించగలమో ఆలోచించ వచ్చు.

తెలంగాణ సమాజంలో, భూస్వామ్యం కింద, కుల అణచివేత, వివక్ష తీవ్రంగానే ఉన్నాయి. ఆ కుల అణచివేత భూయాజమాన్య అసమానతలలో, వెట్టిచాకిరీలో, సాంఘిక రూపాలలో వ్యక్తమయింది కూడ. ఒకవైపు కుల విభజన ఇంత స్పష్టంగా ఉండి కూడ పోరాటక్రమంలో ఒక చాకలి స్త్రీ పంట రక్షించడానికి కొందరు రెడ్లు, కొందరు వెనుకబడిన కులాల వ్యక్తులూ స్వయం సేవకులుగా వెళ్ళగలిగారంటే పీడిత కుల ఐక్యత కూడ బలంగానే ఉండిందన్న మాట. పోరాటంలో అమరులయిన వారి జాబితా చూస్తే అందులో అన్ని కులాల ప్రాతినిధ్యమూ కనబడుతుంది. పని పద్ధతులలో అతి, మిత వాదాల గురించి చర్చ వచ్చినప్పుడు కూడ అవి ఆయా వ్యక్తుల, వారి వర్గ స్వభావాల ప్రతిఫలనాలు గానే చిత్రణ పొందాయి గాని వారు పుట్టిన కులం ప్రస్తావన రాలేదు.

కులం పట్ల తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం రోజులలో వ్యక్తమయిన ఈ వైఖరి తర్వాతి కాలంలో చాల మార్పులకు గురయింది. ఒక రకంగా ప్రజా ఉద్యమాలన్నీ కుల విభేదాల సవాలును ఎదుర్కోవలసి వచ్చింది. గతంలో లాగ ఇతర ప్రశ్నల ప్రాధాన్యతలో ఈ ప్రశ్న వెనుకబడడానికి వీలులేని స్థితి వచ్చింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అనుభవంతోనూ, ఆ తర్వాత అభివృద్ధి చెందిన చైతన్యంతోనూ, అనుభవాలతోనూ ఈ ప్రశ్నకు జవాబు వెతకవలసిన అవసరం మిగిలే ఉంది.

అట్లాగే మతం సమస్య తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలానికీ, ఆ తర్వాతకీ చాల మార్పులకు లోనయింది. అప్పుడు రాజు ఒక మతానికి చెందినవాడయి ఉండి, తనది మతరాజ్యంగా ప్రకటించినప్పటికీ, ఇతర మతంలోని భూస్వాముల మీద ఆధారపడి పీడక ఐక్యతకు ప్రతినిధి ఉన్నాడు. తన మతంలోని పేదలను తనతో కలుపుకోవడానికి 'ముస్లిం అయిన ప్రతివాడూ రాజే' అని నినాదం ఇచ్చాడు. మత భావనలతో ప్రేరేపించిన ప్రైవేటు సైన్యాన్ని సమీకరించాడు. అయినా తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం ఇరుమతాల పేదలను సమైక్యం చేసి పీడిత ఐక్యతను ప్రకటించింది. బందగీతో మొదలైన పోరాట సంప్రదాయం మఖ్దూం మొహియుద్దీన్, ఆలంఖుంద్ మీరీ, జవాద్ రజ్వీల దాకా విస్తరించింది. రజాకార్లకు నాయకత్వం వహించిన కాశిం రజ్వీ పైన ఏ ప్రగల్భాలు పలికినా, ఇత్తెహాదుల్ ముస్లమీన్ ఎంత మత ప్రచారం చేసినా, కింద రజాకార్లు హిందూ దొరల గడీలలో ఉండి హిందూ దొరల పక్షాననే పేదల మీద, మధ్యతరగతి మీద, ఉద్యమ కార్యకర్తల మీద దాడులు చేశారు గనుక మత ఆచ్ఛాదనల వాస్తవమేమిటో ప్రజలు గుర్తించారు.

అంటే భారతదేశంలో ప్రజా ఉద్యమాలలో హిందూ-ముస్లిం పీడిత ఐక్యత ఎంత బలంగా ఉండవలసి ఉంటుందో, దాన్ని చెడగొట్టడానికి బ్రిటిష్ ఇండియాలో వలసవాదులు చేసిన కుట్రలను, హైదరాబాదు రాజ్యంలో పాలకవర్గాలు చేసిన కుట్రలను ఎట్లా అర్థం చేసుకుని ఓడించాలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఆచరణాత్మకంగా చూపింది. ఆ సంప్రదాయం ఆ తర్వాతి దశాబ్దాలలో వాస్తవికంగా కొనసాగిందో లేదో ప్రజా ఉద్యమాలన్నీ ఆత్మ పరిశీలన చేసుకోవలసి

ఉంది. ముఖ్యంగా బాబ్రీమసీదు విధ్వంసం తర్వాత, అప్రకటితంగానే ఈ రాజ్యం హిందూ మత రాజ్యంగా కొనసాగుతున్నప్పుడు, హిందూ ముస్లిం పీడిత ఐక్యత విషయంలో ప్రజా ఉద్యమాలు అనుసరించవలసిన వైఖరి ఏమిటనే ప్రశ్నకు కచ్చితమైన జవాబు ఇంకా వెతకవలసే ఉంది.

ఇక స్త్రీ-పురుష విభేదం విషయంలో తెలంగాణ పోరాటం పితృస్వామికంగానే వ్యవహరించిందనే ఒక విమర్శ స్త్రీ శక్తి సంఘటన ప్రచురించిన 'మనకు తెలియని మన చరిత్ర' నాటి నుంచి ప్రాచుర్యంలో ఉంది. పితృస్వామ్యాన్ని చైతన్య పూర్వకంగా ఎదిరించాలనే అవగాహన నాటి నాయకత్వానికీ, శ్రేణులకూ లేకపోవచ్చు. స్త్రీలు ఆ పోరాటంలో ఎక్కువగానే పాల్గొన్నప్పటికీ స్త్రీ సమస్యల గురించిన అవగాహన సవ్యంగా లేకపోయి ఉండవచ్చు. అది ఒక లోపంగా, ఉద్యమపు బాల్యారిష్టంగా గుర్తించి, అర్థం చేసుకోవలసిందే తప్ప ఇవాళ ఆ నాయకత్వాన్నో, పోరాటాన్నో బోను ఎక్కించి ప్రయోజనం లేదు. నిజానికి తెలంగాణ రైతాంగ సాయుధపోరాటపు చివరి రోజులలో కొన్ని డాక్యుమెంట్లలో, పత్రాలలో వ్యక్తమయిన స్త్రీ-పురుష సంబంధాల ఘర్షణలు, ఆ ప్రశ్న అప్పుడప్పుడే తలెత్తుతుందనడానికి సూచికలు. ఆ ప్రశ్నను మరొక మూడు దశాబ్దాల తర్వాత అటు స్త్రీవాద ఉద్యమమో, ఇటు విభిన్న ప్రజా ఉద్యమాలలోని మహిళా కార్యకర్తలో ఇంకా లోతుగా, ఇంకా బలంగా వేశారు. భారత ప్రజా ఉద్యమాలు జవాబు చెప్పవలసిన ముఖ్యమైన ప్రశ్నలలో ఒకటిగా అది ఇంకా నిలిచే ఉంది.

చివరిగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, ఆ ఆకాంక్షల పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వ్యతిరేకత కనబరుస్తున్నాయి గనుక తెలంగాణ వాదులు ఆ పార్టీలను వ్యతిరేకించడంతో పాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని కూడ తప్పు పడుతున్నారు. ఆ పోరాటం కోస్తాంధ్ర వలసవాదుల కుట్ర అని, తెలంగాణలో ఎదిగివస్తున్న నాయకత్వాన్ని దెబ్బతీసిందని, తమవి కాని డిమాండ్లను తమ మీద పెట్టి తమను బలిపశువులను చేసిందని, 1942 నుంచి 1956 దాకా తెలంగాణ చీకటి రాజ్యాన్ని అనుభవించిందని నిర్ధారణలు, విశ్లేషణలు ప్రకటిస్తున్నారు. మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలన అద్భుతమైనదని, విసునూరు రామచంద్రారెడ్డి మంచి దొర అని కితాబులు ఇస్తున్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఆరు దశాబ్దాల తర్వాత మరొక ప్రజాస్వామిక ఉద్యమ నేపథ్యంలో ఇటువంటి నేరారోపణలు ఎదుర్కోవడం విషాదం.

నిజానికి అప్పుడు తెలంగాణ రైతాంగం సాయుధ పోరాట రూపంలో వ్యక్తీకరించిన ఆకాంక్షకూ, ఇప్పుడు తెలంగాణ ప్రజానీకం ప్రత్యేక రాష్ట్రం రూపంలో వ్యక్తీకరిస్తున్న ఆకాంక్షకూ రూపంలోనే తప్ప సారాంశంలో తేడా లేదు. భూమి, భుక్తి, విముక్తి డిమాండ్లకు పునాది స్వయం నిర్ణయాధికారం ఉండాలని, తమ వనరుల మీద తమకే అధికారం ఉండాలని కోరుకోవడమే. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌కు పునాది కూడ ఆ కోరికలే. ఒక రెండో మూడో కమ్యూనిస్టు పార్టీలు తమ సొంత ప్రయోజనాల కొరకు ఆ డిమాండ్‌ను వ్యతిరేకించినంత మాత్రాన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని తప్పు పట్టనక్కరలేదు. జాతుల సమస్య విషయంలో, ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కు విషయంలో దేశంలో కమ్యూనిస్టు శ్రేణుల మధ్య ఉన్న గందరగోళాన్ని ఇవాళ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలు ప్రశ్నిస్తున్నాయి. ఆ ప్రశ్నకు తెలంగాణ రైతాంగ సాయుధపోరాట అనుభవం నుంచి జవాబులు చెప్పుకోవచ్చు.

మొత్తం మీద అరవై సంవత్సరాల తర్వాత కూడ తెలంగాణ రైతుకూలీ ఎగరేసిన ప్రశ్నల జెండా సమున్నతంగా రెపరెపలాడుతూనే ఉంది. ఆ జెండా రెపరెపలలో కొన్ని జవాబులూ ఉన్నాయి, కొన్ని ప్రశ్నలూ ఉన్నాయి, కొన్ని చర్చనీయాంశాలూ ఉన్నాయి. వాటిని ఎంత సంయమనంతో స్వీకరించగలమనేది ఎవరికి వారు వేసుకోవలసిన ప్రశ్న. ♦

విమోచనోద్యమ యోధులకు దక్కుతున్న గౌరవం!

- కొణతం దిలీప్

వాళ్ళు పాతతరం ప్రతినిధులు. స్వార్థం అంటే అర్థం తెలియని అమాయకులు. నమ్మిన విలువల కోసం ప్రాణాలను తృణప్రాయంగా భావించినవాళ్లు. మన భవిష్యత్ కోసం వారి వర్తమానాన్ని యుద్ధరంగం చేసుకున్నవాళ్లు. సహచరులు కళ్ల ముందే క్షతగాత్రులవుతుంటే, విచ్చుకత్తులకు, తుపాకీ గుండ్లకు బలవుతుంటే కన్నీళ్లను పంటిబిగువున అదిమిపట్టి తుపాకీ ఎక్కుపెట్టి శత్రువును మట్టికరిపించినవారు. ఎర్రజెండా ఎత్తి కదనరంగాన రెపరెపలాడించిన వీర తెలంగాణ విప్లవ యోధులు వాళ్లు.

జీవితపు మలి సంధ్యలో.... ఆరోగ్యం సహకరించక, అయినవాళ్లు ఆదరించక వారు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వారు చేసిన మహోన్నత త్యాగానికి కృతజ్ఞతగా వారికి పెన్షన్లు ఇస్తామని పదేళ్ల క్రిందట ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ చేసిన వాగ్దానం నిలబెట్టుకోలేదు. పెన్షన్లు ఇప్పిస్తాం అంటూ వేలు వసూలు చేసిన మధ్య దళారులు ముఖం చాటేస్తున్నారు. ఓట్లు, సీట్ల ఎత్తుగడల్లో బిజీగా ఉన్న వామపక్ష నేతలు అసలీ విషయం పట్ల ఏ ఆసక్తీ చూపట్లేదు. అధికారుల, రాజకీయ నాయకుల, దళారుల బంతాటలో చిక్కుకుని తెలంగాణ సమరయోధుల పెన్షన్ల కథ ఎప్పటికి సుఖాంతమవుతుందో తెలియదు కానీ ఈ లోపలే అనేకమంది సమరయోధులు మాత్రం కాలం చేస్తున్నారు.

భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వారితో సమానంగా నైజాంపై పోరాటం చేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధులకు కూడా సమరయోధుల పింఛన్ ఇవ్వాలని 1997లో అప్పటి యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో హోంశాఖ మంత్రి ఇంద్రజిత్ గుప్తా నిర్ణయం తీసుకున్నారు. తదనుగుణంగా సీనియర్ సిపిఐ నేత సిహెచ్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఒక రాష్ట్రస్థాయి స్క్రీనింగ్ కమిటీని కూడా వేశారు. ఈ కమిటీ తెలంగాణ జిల్లాలన్నిటి నుండీ దరఖాస్తులు స్వీకరించింది. వాటిని వడపోసి దాదాపు 12,500 మందితో ఒక లిస్టు తయారుచేసింది. అప్పటి కేంద్ర ప్రభుత్వం ఈ లిస్టు ఆధారంగా అర్హులను ఎంపిక చేయడానికి డిప్యూటీ హోమ్ సెక్రటరీ శశీర్ జా ను పంపింది. ఆయన వెరిఫికేషన్ అనంతరం దాదాపు 3000 మందితో మొదటి లిస్టు తయారుచేశాడు.

ఈ ప్రక్రియ జరుగుతుండగానే కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కూలిపోవడం, బిజెపి గద్దెనెక్కడం జరిగిపోయాయి. అసలే కమ్యూనిస్టులంటే పడని బిజెపి ఈ పెన్షన్ల విషయాన్ని తొక్కిపెట్టాలని నిర్ణయించుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి శాఖ అయితే ఏకంగా 'దేశద్రోహులకు పింఛనులా?' అనే పుస్తకాన్ని ముద్రించింది. అప్పటి రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు సిహెచ్ విద్యాసాగర్‌రావు కమ్యూనిస్టులకు పింఛన్‌లు ఇవ్వరాదంటూ అద్వానీకొక లేఖ రాశాడు. పోలీస్ యాక్షన్ తరువాత కమ్యూనిస్టులు భారత ప్రభుత్వ సైన్యానికి వ్యతిరేకంగా పోరాడారనీ, అందునా ఇప్పుడు తయారయిన లిస్టులో చాలా బోగస్ అప్లికేషన్లు ఉన్నాయనీ బిజెపి నాయకులు వాదించారు. దీంతో పెన్షన్ల ఫైలు కాస్తా మరుగునపడిపోయింది.

ఇక్కడ దళారీలు మాత్రం ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టడం, ఊళ్లలో పింఛన్‌లు ఇప్పిస్తామని డబ్బు వసూలు చేయడం కొనసాగించారు. మొదట్లో అరెస్ట్ వారెంట్‌లో కానీ, జైలు రికార్డుల్లో కానీ పేరు అవసరం అన్నారు, తరువాత ఎవరైనా దళ నాయకుడు సంతకం పెట్టి ధృవీకరిస్తే చాలన్నారు. ఇలా వేలమంది దగ్గర డబ్బులు వసూలు చేసి అప్లికేషన్లు పెడుతూ పోయారు. ఈ బోగస్ అప్లికేషన్లు ఎక్కువ అవడంతో కేంద్ర హోం శాఖ ఇంటలిజెన్స్ వారిని ఈ అప్లికేషన్ల నిగ్గు తేల్చమని పురమాయించింది. రంగంలోకి దిగిన కేంద్ర, రాష్ట్ర ఇంటలిజెన్స్ శాఖలు అప్లికేషన్లలో చాలా నకిలీవివున్నాయని తేల్చారు. పోరాటం జరిగిన నాటికి పదేళ్ల వయసు కూడా లేని వారు కొంతమంది పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నారని నిఘా సంస్థలు వెల్లడించాయి. రాష్ట్ర స్థాయి స్క్రీనింగ్ కమిటీకి కూడా నిఘా సంస్థలు ఇదే విషయం చెప్పి ఇక కొత్తగా అప్లికేషన్లు తీసుకోరాదని సూచించాయి. దీంతో స్క్రీనింగ్ కమిటీ సభ్యులు సమావేశం అయి వయోభారం వల్ల ఇక ఈ పనిని కొనసాగించలేమని చెప్పి తమ కమిటీని రద్దు చేయమని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఈ నకిలీ అప్లికేషన్ల గొడవలో అసలు పోరాటం చేసినవారికి మొండిచెయ్యి ఎదురైంది. నిజంగా సాయుధపోరాటంలో తుపాకీ పట్టి పోరాడినవారు, కొరియర్లుగా, సహాయకులుగా పనిచేసిన అనేక వందల మంది పోరాటకారులకు ఇవ్వాళ పెన్షన్లు లభించడంలేదు. అనారోగ్యం వృద్ధాప్యంతో అనేక బాధలు పడుతున్న వారు తమకు పెన్షన్లు ఇప్పించమని తట్టని తలుపు లేదు, ఎక్కని మెట్టులేదు.

బిజెపి అధికారంలో ఉన్నప్పుడు ఖమ్మం, వరంగల్ జిల్లాలకు చెందిన కొంతమంది సమరయోధులు అప్పటి ప్రతిపక్ష నేత సోనియాగాంధీ వద్దకు కూడా వెళ్లారు. ఆమె 'వచ్చేది మా ప్రభుత్వమే. మేం అధికారంలోకి రాగానే మీ సమస్య తీరుస్తామని మాట ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

2004 సెప్టెంబర్ 20 నాడు హైదరాబాద్‌లో రావి నారాయణరెడ్డి మెమోరియల్ హాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కేంద్ర హోం మంత్రి శివరాజ్ పాటిల్ "హైదరాబాద్ విముక్తి పోరాటంలో పాల్గొన్న వారికి పింఛన్‌లు ఇచ్చే విషయంలో 'సానుకూలమైన నిర్ణయం' తీసుకుంటాం అని ఒక ప్రకటన చేశాడు. ఆ యోధుల త్యాగం ముందు తామిచ్చేది అత్యల్పమైనదని గంభీరమైన ఉపన్యాసం ఇచ్చాడు. రాష్ట్ర ముఖ్యమంత్రి

వైయస్ రాజశేఖర్ రెడ్డి కూడా అలాంటి హామీనే ఇస్తూ ఈ సమర యోధులకు పెన్షన్లకు ఏటా కేవలం 70 కోట్లు అవసరమని వారు చేసిన త్యాగంతో పోలిస్తే ఇది చిన్న మొత్తమని చెప్పారు. రెండేళ్లు గడిచినా విషయం మాత్రం అంగుళం కూడా కదల్లేదు.

2006 మార్చి నెలలో కొద్దిమంది తెలంగాణ సమరయోధులు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ముందట పెన్షన్‌లు ఇప్పించాలని కోరుతూ ధర్నా చేశారు. వారిలో అనేకమంది వంటిపై ఆనాటి పోరాటపు గాయాల ఆనవాళ్లున్నాయి. వారికి పెన్షన్లు ఇవ్వడానికి ఇంకా ఏ సాక్ష్యాలు కావాలి?

ఇవ్వాళ తెలంగాణ పోరాట యోధులు బాధపడుతున్నారు. కానీ వారి బాధ పెన్షన్లు రానందుకు ఖచ్చితంగా కాదు. ఏ పోరాటం చేయకుండానే డబ్బుల కోసం దరఖాస్తులు పెట్టుకున్న వారిని చూసి, అబద్ధాలు చెప్పి పదిసార్లు డబ్బులడుక్కునే దళారులను చూసి, పోరాటం చేసింది తామైతే సిగ్గు విడిచి విమోచనోత్సవాలు జరుపుకునే పార్టీని చూసి, ఓట్లు, సీట్లు రాజకీయాల్లో ఆరితేరినా తమను మాత్రం పట్టించుకోని వామపక్షాలను చూసి, అసలు పోరాటమంటే ఏమిటో, సమాజం కోసం ఆలోచించడం అంటే ఏమిటో తెలియని నేటి తరాన్ని చూసి 'ఇలాంటివారి కోసమా మేం పోరాటం చేసింది' అని బాధపడుతున్నారు. ◆

'తెలంగాణలో ప్రతీ కుటుంబానికీ పెన్షన్ ఇవ్వాలి'



బహుశా అలాంటి మృత్యుంజయులు అరుదుగా ఉంటారేమో. నిజాం వ్యతిరేక సాయుధ పోరాటంలో పాల్గొని, స్పెషల్ ట్రిబ్యునల్‌చే ఉరిశిక్ష విధింపబడిన పన్నెండుమందిలో సంధ్యాల శ్రీనివాసరెడ్డిగారు ఒకరు. 1949వ సంవత్సరంలో అంతర్జాతీయంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో వీరికి ఉరిశిక్ష విధించవద్దంటూ అనేక దేశాల్లో ప్రదర్శనలు జరిగాయి. అప్పట్లో టైమ్ పత్రిక వీరి కేసు గురించి ముఖచిత్ర కథనం వేసింది. ప్రఖ్యాత లండన్ న్యాయవాది డి.ఎన్. ప్రిట్ ఈ కేసును ముద్దాయిల తరపున వాదించారు. కేసు విచారణలో ఉండగానే హైకోర్టు భవనం నుండి పోలీసుల కన్నుగప్పి పారిపోయారు శ్రీనివాసరెడ్డి. పోరాట విరమణ తరువాత జరిగిన ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థిగా నకిరేకల్ నియోజక వర్గం నుండి ఎంఎల్.ఏగా ఎన్నికయ్యారు. గత కొన్నేళ్లుగా సిపిఎంలో కొనసాగుతున్న వీరు స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ స్క్రీనింగ్ కమిటీలో సభ్యులుగా కూడా ఉన్నారు. సాయుధ పోరాటం గురించీ, పెన్షన్ల సమస్య గురించీ అడిగినప్పుడు ఇలా స్పందించారు.

❝ దొరలు, దేశ్‌ముఖ్‌లు ప్రజలపై సాగిస్తున్న అత్యాచారాలు, ప్రభుత్వం వసూలు చేస్తున్న పన్నులు కట్టలేక ప్రజలు అనుభవిస్తున్న బాధలు, వెట్టిచాకిరీ విధానం ఇవన్నీ నన్ను ఈ పోరాటంలో పాల్గొనేటట్టు చేశారు. రజాకార్లపై అనేకచోట్ల మా దళం దాడి చేసింది.

నిజాం దిగిపోయిన తరువాత కూడా మేం పోరాటం కొనసాగించాం. మితవాదులు మాత్రం నిజాం దిగిపోవడంతో మన పోరాటం ఆపాలని నిర్ణయించారు. మేం మాత్రం పోరాట కాలంలో ప్రజలకు పంచిన భూములు వారి స్వంతమయ్యే వరకూ పోరాటం సాగాల్సిందే అన్నాం. ఫలితంగా భారతసైన్యం చేతిలో దారుణ నిర్బంధం ఎదుర్కున్నాం.

హైదరాబాద్‌లో పొరపాటున పోలీసులకు చిక్కాను నేను. రెండుసార్లు జైలు నుండి తప్పించుకోవడానికి విఫలయత్నం చేశాను. చంచల్‌గూడ జైలులోంచి సొరంగం తవ్వి బైటపడేందుకు నేను నా సహ ఖైదీలు ప్రయత్నించి విఫలమయ్యాం. స్పెషల్ మిలటరీ ట్రిబ్యునల్ మాపై అనేక కేసులు మోపి ఉరిశిక్ష విధించింది. పార్టీ నన్ను తప్పించేందుకు ఏర్పాటు చేసింది. హైకోర్టు భవనం నుండి విచారణ జరుగుతుండగా తప్పించుకున్నాను.

తరువాత పరిణామాల వల్ల సిపియంతో అనుబంధం కొనసాగిస్తున్నాను. పెన్షను అప్లికేషన్ల స్క్రీనింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నాను. పెన్షన్లు రాకపోవడానికి బిజెపి, కాంగ్రెస్‌లు రెండూ సమాన కారణాలు. మనవాళ్లు కూడా కొన్ని డౌట్‌ఫుల్ అప్లికేషన్లు పాస్ చేయడంతో పరిస్థితి బాగా చెడిపోయింది. సిబిఐ వాళ్లు కూడా మా కమిటీ అప్లికేషన్లు తీసుకోవడం ఆపేయాలని సూచించారు.

నిజంగా పోరాటం చేసిన వాళ్లు ఎక్కువమందే ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే నకిలీ అప్లికేషన్లు వచ్చాయి. అయినా ఆ రోజుల్లో ఉద్యమం ఉధృతంగా ఉన్న ప్రాంతాల్లో పోరాటంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో పాల్గొనని కుటుంబం లేదు. బాల సంఘాలని ఉండేవి. 12-15 ఏళ్ళ పోరగాండ్లు జెండా పట్టుకుని, పాటలు పాడుకుంటు తిరిగేటోళ్లు. నాకు తెలిసి అలాంటి చిన్నపిల్లలను కూడా నైజాం పోలీసులు కాల్చి చంపారు. అందుకే తెలంగాణలో ప్రతి కుటుంబానికీ పెన్షన్ ఇచ్చినా తప్పులేదు.

పోరాటం విరమించే ముందు జరిగిన సంఘటన ఒకటి చెప్పాలె మీకు. అడవిలో అందరం సమావేశమయ్యాం. మా నాయకులు ఆయుధాలు అప్పగించమని ఆదేశించారు. అందరం అప్పగించాం కానీ ఒక దళిత కుర్రాడు మాత్రమే అసలు ఒప్పుకోలేదు. ఎంత అడిగినా వినలేదు. 'మీరు భూమి జాగ ఉన్నోళ్లు, వెనకకు పోయి మీరు వ్యవసాయమో ఇంకో పనో చేసుకుంటారు కానీ నేను? దొరను కాదని ఇండ్లకు వచ్చిన. వెనకకు పోయి ఏం జేసి బతకాలె, అని అడిగిండు. మా ఎవరి దరగ్గరా ఆ ప్రశ్నకు జవాబు లేకుండె అనాడు. ❞

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పరిశోధన ఒక అసంపూర్ణ సూచి

తెలంగాణ రైతాంగ సాయుధపోరాటం 1946 జులై 4న ప్రారంభం కావడానికి చాల ముందు నుంచే తెలంగాణ ప్రజానీకం అనుభవిస్తున్న దుస్థితి గురించి, జరగనున్న పోరాట పురుటినొప్పుల గురించి రచనలు వెలువడడం ప్రారంభమైంది. బహుశా సురవరం ప్రతాపరెడ్డి 1938లో రచించిన 'పౌరస్వత్వములు' ఇటువంటి సాహిత్యపు తొలి ఆధారాలలో ఒకటి కావచ్చు. అప్పటి నుంచి గడిచిన ఈ ఏడు దశాబ్దాలుగా తెలంగాణ జనజీవితం గురించి, ఆ జనజీవన సంఘర్షణ భూమి-భుక్తి-విముక్తి పోరాటంగా, సాయుధ పోరాటంగా మారిన తీరు గురించి వివరణలు, విశ్లేషణలు, అనుభవాల కథనాలు, జ్ఞాపకాలు అసంఖ్యాకంగా వెలువడుతూనే ఉన్నాయి. ఈ రంగంలో వెలువడిన సాహిత్యం మొత్తానికీ ఒక సమగ్ర సూచిక తయారు చేయడం అసాధ్యం కాకపోవచ్చుగాని, చాల కష్టసాధ్యమైనపని. కేవలం పుస్తక రూపంలో వచ్చిన సాహిత్యమే తెలుగు, ఇంగ్లీషుల్లో కలిపి, కనీసం 200 పుస్తకాలుగా దాదాపు ముప్పైవేల పేజీలుగా ఉంటుంది. ఇక పుస్తక రూపంలోకి రాకుండా పత్రికలలో వార్తలు, వ్యాసాలు, విశ్లేషణలు, వ్యాఖ్యల రూపంలో కనీసం మరొక ముప్పైవేల పేజీల రచనలు వెలువడి ఉంటాయి. తెలంగాణ రైతాంగ సాయుధపోరాట సాహిత్య సమగ్ర సూచి తయారు చేయవలసిన బృహత్తర కర్తవ్యానికి ఒక నాందిగా, ఈ అసంపూర్ణ ఆధారసూచిని ప్రకటిస్తున్నాం.

- సురవరం ప్రతాపరెడ్డి, ఉమ్మెంతల కేశవరావు - జాగీరులు, అణా గ్రంథమాల, 1940.
- సురవరం ప్రతాపరెడ్డి - జాగీరులలోని స్థితిగతులు - అణా గ్రంథమాల - 1941.
- దేవులపల్లి వెంకటేశ్వరరావు, బద్దం ఎల్లారెడ్డి - నేటి హైదరాబాదు - మన కర్తవ్యం, ప్రజాశక్తి కార్యాలయం, 1944.
- దేవులపల్లి వెంకటేశ్వరరావు - జన్గాం ప్రజల వీరోచిత పోరాటాలు! ప్రజాశక్తి కార్యాలయం, 1945.
- దేవులపల్లి వెంకటేశ్వరరావు-నైజాం రాజ్యంలో ప్రజా ఉద్యమంపై ప్రభుత్వ దాడి - ప్రజాశక్తి కార్యాలయం, 1946.
- పుచ్చలపల్లి సుందరయ్య - విశాలాంధ్రలో ప్రజారాజ్యం - ప్రజాశక్తి కార్యాలయం, 1946 (పునర్ముద్రణ : ప్రజాశక్తి బుక్‌హౌస్, 1990)
- హైదరాబాద్ కమ్యూనిస్టు పార్టీ స్టేటు కమిటీ తీర్మానం - నైజాం నిరంకుశ పాలన పోవాలి! ప్రజారాజ్యం స్థాపించుకోవాలి!, ప్రజాశక్తి ప్రచురణాలయం, 1946.
- కోదాటి నారాయణరావు - హైదరాబాదు రాజ్యాంగ సంస్కరణలు - శాసనసభ, ప్రభాత ప్రచురణ సమితి, 1946.
- దేవులపల్లి వెంకటేశ్వరరావు - హైదరాబాదు సంస్థానంలో పోలీసు దురంతాలు, ప్రజాశక్తి కార్యాలయం, 1946.
- పెరవెల్లి వెంకట రమణయ్య - వరంగల్లు జిల్లా రైతు పోరాటాలు, ప్రజాశక్తి ప్రచురణాలయం, 1946.
- మక్దూం మొహియుద్దీన్ - నైజాంలో దోపిడీ విధానం - ముస్లింల కర్తవ్యం - ప్రజాశక్తి ప్రచురణాలయం, 1947.
- దేవులపల్లి వెంకటేశ్వరరావు - నల్లగొండ ప్రజల వీరోచిత పోరాటం, ప్రజాశక్తి కార్యాలయం, 1947
- వారణాసి వెంకటనారాయణ శాస్త్రి - హైదరాబాదు ప్రజల స్వాతంత్ర్య పోరాటం, దేశికవితా మండలి, 1947.
- చదలవాడ పిచ్చయ్య - ఆంధ్ర కమ్యూనిస్టు కమిటీ అగ్ర నాయకుల నగ్నసత్యాలు - 1948.
- కాళోజీ నారాయణరావు - కాళోజీ కథలు, అణా గ్రంథమాల.
- యన్.కె. చౌదరి - హైద్రాబాద్ స్టేటు ఖాశీం రజ్వీ బుర్ర కథ, చందా నారాయణ శ్రేష్టి, 1948.
- చెర్విరాల బాగయ్య - రజాకార్ల దౌర్జన్యం అను షోయిబుల్లాఖాన్ బుర్రకథ, కొండావీరయ్య, 1948.
- అవంత్స సోమసుందర్ - వజ్రాయుధం, కళాకేళీ నికేతన్, 1949.
- గంగినేని వెంకటేశ్వరరావు, ఉదయిని, ఆంధ్ర రాష్ట్ర అరసం, 1950.
- జనతంత్ర ప్రజా సంఘటన - ఎన్నికల ప్రణాళిక, 1951.
- సురవరం ప్రతాపరెడ్డి - ప్రజాధికారములు - 1951 (మొదటి ముద్రణ - 1938)
- భవదీయుడు - తెలంగాణా తీరు తెన్నులు - జనపద ప్రచురణలు, 1951.
- ఉమ్మెత్తల కేశవరావు - భూదాన ఉద్యమం, హైదరాబాదు భూదాన యజ్ఞసమితి, 1951.
- గంగినేని వెంకటేశ్వరరావు - ఎర్రజెండాలు, తెలంగాణ గెరిల్లా యోధుల జీవిత గాథలు (మూడు భాగాలు), తిలింగ పబ్లిషింగ్ కంపనీ, 1952.
- వట్టికోట ఆళ్వారు స్వామి - జైలు లోపల - దేశోద్ధారక గ్రంథమాల, 1952.
- చలసాని వాసుదేవరావు, నందూరి ప్రసాదరావు - తెలంగాణ రైతు సమస్యలు, విశాలాంధ్ర, 1952.
- కాళోజీ నారాయణరావు - నాగొడవ - దేశోద్ధారక గ్రంథమాల, 1953.
- తిరునగరి రామాంజనేయులు - రాష్ట్ర వాంఛ గొల్ల సుద్దులు, నవయుగ పబ్లిషింగ్ హౌస్, 1953.
- సుంకర సత్యనారాయణ - జీతగాడు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1953.
- వట్టికోట ఆళ్వారుస్వామి (సం) - తెలంగాణం - రెండవభాగం, దేశోద్ధారక గ్రంథమాల, 1956.
- మహీధర రామమోహనరావు - ఓనమాలు, అవంతి, 1956.
- ఆదిరాజు వీరభద్రరావు - తెలంగాణం - మూడవభాగం - దేశోద్ధారక గ్రంథమాల, 1957 (మొదటి ముద్రణ 1950).
- నందూరి ప్రసాదరావు - తెలంగాణలో కౌలుదారీ చట్టం - 1957
- నూతి నర్సయ్య పంతులు - తెలంగాణ ఆలేరు కాల్పులు అమరవీరుల బుర్రకథ, 1962.
- - మృత్యువు నీడల్లో, అవంతి, 1962.
- ఆదిరాజు వీరభద్రరావు - మన తెలంగాణము, 1963.
- ఎర్రోజు మాధవాచార్యులు - మఘవలయము (తెలంగాణ స్వాతంత్ర్య సమరగాథ) - అప్పరాయ గ్రంథమాల, 1965.
- ఆదిరాజు వీరభద్రరావు - మాడపాటి హనుమంతరావు జీవిత చరిత్ర - సన్మానసంఘం, 1965.
- కిషన్‌చందర్ - జైత్రయాత్ర (అను : పోట శేషగిరిరావు), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1966.
- కె.వి. రంగారెడ్డి - స్వీయచరిత్ర - ట్రస్టు కమిటి, 1969.
- వట్టికోట ఆళ్వారు స్వామి - ప్రజల మనిషి - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 1970.

- గొల్లపూడి నారాయణరావు - తెలుగుగడ్డ - మార్క్సిస్టు ప్రచురణలు, 1970.
- మాకినేని బసవపున్నయ్య - తెలంగాణ సాయుధ పోరాటం - వాస్తవాలు, మార్క్సిస్టు ప్రచురణలు, 1972.
- - తెలంగాణా పోరాట గేయాలు - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 1973.
- సిహెచ్ రాజేశ్వరరావు, ఆరుట్ల రామచంద్రారెడ్డి, వై.వి. కృష్ణారావు - భూస్వామ్య విధానం రద్దుకై రైతుల వీరోచిత తిరుగుబాటు, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి, 1973.
- సుంకర సత్యనారాయణ - గెరిల్లా, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 1973.
- ముద్దసాని రామిరెడ్డి - సురవరం ప్రతాపరెడ్డి జీవితం - రచనల, ఆంధ్ర సారస్వత పరిషత్తు, 1974.
- వట్టికోట ఆళ్వారు స్వామి - గంగు - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 1974.
- రావి నారాయణరెడ్డి - వీర తెలంగాణా - నా అనుభవాలు - జ్ఞాపకాలు, కమ్యూనిస్టు పార్టీ ప్రచురణ, 1976.(మొదటి ముద్రణ 1972)
- ఎంఎల్ నరసింహారావు - తెలంగాణ వైతాళికులు - కాకతీయ విజ్ఞాన సమితి, 1976.
- మందుముల నరసింగరావు - 50 సంవత్సరాల హైదరాబాదు, మందుముల నరసింగరావు స్మారక సమితి, 1977.
- విరసం - తెలంగాణ పోరాట పాటలు - రెండవ సంపుటి - విరసం, 1977.
- బొల్లిముంత శివరామకృష్ణ - మృత్యుంజయులు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 1977.
- వరవరరావు - ప్రజల మనిషి - ఒక పరిచయం, యుగ ప్రచురణలు, 1978.
- హీరాలాల్ మోరియా - సర్దార్ జమలాపురం కేశవరావు - సర్దార్ జమలాపురం కేశవరావు మెమోరియల్ కమిటీ, 1978.
- ఖండేరావ్ కులకర్ణి - హైదరాబాద్ అజ్ఞాత చరిత్ర పుటలు. నవభారతి, 1979.
- ఎంఎల్ నరసింహారావు - తెలంగాణ వైతాళికులు స్వామి రామానంద తీర్థ.
- దాశరథి రంగాచార్య - చిల్లరదేవుళ్ళు, మాయ జలతారు, మోదుగుపూలు, జనపదం.
- తిరునగరి రామాంజనేయులు - తెలంగాణ వీరయోధులు, అరుణజ్యోతి.
- సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు - మాభూమి - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 1980.
- తటవర్తి వెంకటేశ్వరరావు - మునగాల పరగణా ప్రజా ఉద్యమ చరిత్ర, 1981.
- ప్రజాసాహితి - జులై-ఆగస్టు 1981 - తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట సాహిత్య సమీక్ష సంచిక.
- సరిపల్లి కృష్ణారెడ్డి - ఉప్పెన - హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 1981.
- ఆరుట్ల రామచంద్రారెడ్డి - తెలంగాణ పోరాట స్మృతులు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 1981.
- గంగినేని వెంకటేశ్వరరావు - ఆదర్శ కుటుంబాలు - జయంతి పబ్లికేషన్స్, 1982.
- దేవులపల్లి వెంకటేశ్వరరావు - భారత విప్లవ పంథాను చూపిన తెలంగాణా సాయుధ పోరాటం, ప్రొలిటేరియన్ లైన్ ప్రచురణలు, 1982.
- సుందరయ్య - వీర తెలంగాణా విప్లవపోరాటం - గుణపాఠాలు. నవశక్తి ప్రచురణలు, 1983 (మొదటి ముద్రణ 1973).
- జయధీర్ తిరుమల రావు (సం) - సుద్దాల హనుమంతు పాటలు - సాహితీ సర్కిల్, 1983.
- వరవరరావు - తెలంగాణ విమోచనోద్యమం - తెలుగు నవల : సమాజ సాహిత్య సంబంధాలు - ఒక విశ్లేషణ, 1983.
- - విప్లవ తెలంగాణ పోరాట వీరగాథలు - ప్రజాశక్తి బుక్ హౌజ్, 1984.
- వెల్దుర్తి మాణిక్యరావు - హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం, 1984.
- స్వామి రామానంద తీర్థ - హైదరాబాదు స్వాతంత్ర్య పోరాటం అనుభవాలు, జ్ఞాపకాలు, స్వామి రామానందతీర్థ స్మారక సంఘం, 1984.
- వడిసెల - నవంబర్ 1984 దేవులపల్లి వెంకటేశ్వరరావు స్మృతి సంచిక, సృజన.
- చంద్ర పుల్లారెడ్డి - వీర తెలంగాణా విప్లవ పోరాటం, 1984 (మొదటి కూర్పు - 1968).
- డి. రామలింగం - ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు - శతజయంతి ఉత్సవ సంఘం, 1985.
- ఎస్ ఎమ్ జవాద్ రజ్వీ - హైదరాబాదు సంస్థానంలో రాజకీయ చైతన్యం - విద్యార్థి యువజనుల పాత్ర (1938-1956) విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1985.
- దేవులపల్లి వెంకటేశ్వరరావు - కొమరయ్య అమరత్వం : తెలంగాణా ప్రజల విప్లవోద్యమంలో చేమలుపు, ప్రొలిటేరియన్ లైన్, 1985.
- కె. లలిత, వసంత కన్నబిరాన్, రమామేల్కొటె, ఉమామహేశ్వరి, సూసీతారు, వీణాశత్రుఘ్న, ఎమ్ రత్నమాల - మనకు తెలియని మన చరిత్ర - స్త్రీ శక్తి సంఘటన, 1986.
- వైవి కృష్ణారావు (సం) ఆంధ్రప్రదేశ్‌లో రైతు ఉద్యమాలు, పోరాటాలు, రెండు భాగాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1986, 1990.
- మాకినేని బసవ పున్నయ్య - సాయుధ తెలంగాణా పోరాటం - వాస్తవాలు, మరికొన్ని డాక్యుమెంట్లు, ప్రజాశక్తి బుక్ హౌస్, 1987.
- చంద్ర రాజేశ్వరరావు, డా. రాజబహదూర్ గౌడ్, నల్లమల గిరిప్రసాద్ - చారిత్రాత్మక తెలంగాణా పోరాటం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 1987 (మొదటి ముద్రణ - 1972).
- దొడ్డా నరసయ్య - తెలంగాణ సాయుధ పోరాటం అనుభవాలు - జ్ఞాపకాలు - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 1987.
- సుద్దాల హన్మంతు, సుద్దాల అశోక్ - వీర తెలంగాణ సాంఘిక యక్షగానం - తెలుగు కళావేదిక, 1988.
- జయధీర్ తిరుమలరావు - తెలంగాణ రైతాంగ పోరాటం - ప్రజాసాహిత్యం, సాహితీ సర్కిల్, 1988.
- ఆరుద్ర - వీర తెలంగాణా విరచించిన విప్లవ గీతాలు - ప్రజాచైతన్య వేదిక !?
- దేవులపల్లి వెంకటేశ్వరరావు - తెలంగాణా ప్రజల సాయుధ పోరాట చరిత్ర (1946-51) - మొదటి భాగం, ప్రొలిటేరియన్ లైన్ ప్రచురణలు, 1988.
- సురవరం ప్రతాపరెడ్డి - గోలకొండ పత్రిక సంపాదకీయాలు. మొదటి సంపుటం - 1926-36, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి, 1989.
- నల్లా నరసింహులు - తెలంగాణా సాయుధపోరాటం - నా అనుభవాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1989.
- భీమిరెడ్డి నరసింహారెడ్డి - ఆయువు పట్టు - ప్రజాశక్తి బుక్ హౌస్, 1989.
- దేవులపల్లి రామానుజరావు - హైదరాబాదులో స్వాతంత్ర్యో ద్యమము - జనార్ధన పబ్లికేషన్సు?
- డి. రామలింగం - బహుముఖ ప్రజ్ఞాశాలి బూర్గుల - తెలుగు విశ్వవిద్యాలయం, 1989.
- భద్రిరాజు శేషగిరిరావు - ఆంధ్రప్రదేశ్‌లో రైతు ఉద్యమాలు - తెలుగు అకాడమి, 1990.
- ఏనుగొండ కృష్ణమాచార్యులు - నైజాం రాష్ట్ర చరిత్ర - సమీక్ష, 1990.

- జయధీర్ తిరుమలరావు (సం) – తెలంగాణ పోరాట పాటలు, సాహితీ సర్కిల్, 1990.
- వెల్దుర్తి మాణిక్యరావు – హైదరాబాదు సంస్థానంలో స్వాతంత్ర్యోద్యమం, పబ్లికేషన్స్ డివిజన్, 1992.
- రావి నారాయణరెడ్డి – నా జీవన పథంలో.... – మూసీ పబ్లికేషన్స్, 1992.
- మాడపాటి హనుమంతరావు – తెలంగాణా ఆంధ్రోద్యమం – తెలుగు విశ్వవిద్యాలయం, 1995.
- గుజ్జుల వీరయ్య – నానాటి పోరాటాలు – మేఘనాథ్ ప్రచురణలు – 1995.
- తూర్పు మల్లారెడ్డి (సం) – జైని మల్లయ్య గుప్త జీవితం – వ్యక్తిత్వం, సాహితీ మిత్రమండలి, 1995.
- తిరునగరి రామాంజనేయులు – విప్లవ పథంలో నేనూ – నా కలం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1995.
- గుజ్జుల వీరారెడ్డి – తెలంగాణా సాయుధ పోరాట యోధుడు దొడ్డా నర్సయ్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1997.
- జి.వై. గిరి – వీర తెలంగాణ – జనగామ పోరాటం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1997.
- అన్నవరం దేవేందర్ (సం) – మేర మల్లేశం పోరాట పాటలు, మోయు తుమ్మెద బుక్‌ట్రస్ట్, 1997.
- – మహోజ్వల తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం – విలువైన అనుభవాలు – జనశక్తి ప్రచురణ, 1997.
- కందిమళ్ళ ప్రతాపరెడ్డి – వీర తెలంగాణ సాయుధ సమరం, 1998.
- బోయ జంగయ్య – తెలంగాణ వెతలు – ప్రగతి పబ్లిషింగ్ హౌస్, 1998.
- రాంమాధవ్ – నియంత నిజాం కొమ్ములు విరిచిన ఉక్కుమనిషి సర్దార్, హైదరాబాద్ సంస్థాన విమోచన స్వర్ణోత్సవ సమితి, 1998.
- మేదరమెట్ల అనసూయ – కామ్రేడ్ మేదరమెట్ల సీతారామయ్య, 1998.
- విహెచ్ దేశాయ్ – వందేమాతరం నుంచి జనగణమన వరకు – పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 1999.
- ఎస్వీ సత్యనారాయణ – తెలంగాణా సాయుధ పోరాట సాహిత్యం – డా. చెలికాని రామారావు స్మారక కమిటీ, 1999.
- పంగా నర్సయ్య – అరుణోదయా – తెలంగాణా పోరాట గాథలు – ప్రజాశక్తి బుక్ హౌస్, 2000.
- ఎస్వీ సత్యనారాయణ, కె. భారతి (సం) – తెలంగాణా వీరనారి ఆరుట్ల కమలాదేవి – ఆరుట్ల కమలాదేవి మెమోరియల్ ట్రస్ట్, 2002.
- సరోజినీ రేగాని – నిజాం – బ్రిటీష్ సంబంధాలు, మీడియా హౌజ్ పబ్లికేషన్స్, 2002.
- సంగిశెట్టి శ్రీనివాస్ – షబ్నవీస్ – కవిలె, 2003.
- సంగిశెట్టి శ్రీనివాస్ – దస్తుమ్ – కవిలె, 2004.
- ఎన్. వేణుగోపాల్ – తెలంగాణ నుంచి తెలంగాణ దాక, దేవులపల్లి పబ్లికేషన్స్, 2004.
- కె. జితేంద్రబాబు – తెలంగాణాలో చైతన్యం రగిలించిన నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు – ప్రథమ భాగము, కొండా లక్ష్మీకాంతరెడ్డి విజ్ఞాన సరోవర ప్రచురణలు, 2005.
- తూర్పు మల్లారెడ్డి, సామ మల్లారెడ్డి (సం.) – సహస్ర చంద్రదర్శిని, సామాజిక అధ్యయన వేదిక, 2005.
- కందిమళ్ల ప్రతాపరెడ్డి – తెలంగాణ పులిబిడ్డ బద్దం ఎల్లారెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, 2006.
- సంగిశెట్టి శ్రీనివాస్, ఎన్. వేణుగోపాల్ – సార్థక జీవనం, కవిలె, 2006.
- Hyderabad Struggle Committee, Socialist Party - The Hyderabad Problem - The Next step, 1948.
- Ramgopal - Hyderabad Today, KMP series, 1948.
- Sundarayya P - Vishal Andhra, PPH, 1946.
- Waghmare AK - communalism in Hyderabad State, State Congress, 1948.
- Hyderabad State Congress - The Nizam Disowned, Bulletin No. 3, 1947.
- Romesh Thapar - Storm over Hyderabad, Kutub, 1948.
- AM Khusro - Economic and Social Effects of Jagirdari Abolition and Land Reforms in Hyderabad. Atmaram & Sons, 1958.
- VP Menon - The story of integration of Inidan States, Longmans Green & Co., 1956.
- EMS Nambodripad - Communist Party and State's Reorganisation, CPI, 1955.
- Narayana Reddy Ravi, An outline for a Policy, CP, 1955.
- Committee for the compilation of the History of Freedom struggle in Andhra Pradesh Freedom Struggle in Hyderabad, 4 volumes, 1956.
- Taya Zinkin - Reporting India, chatta & Windus, 1962.
- Narayan BK - Agricultural Development of Hyderabad State, 1900-1956, Keshav Prakashan, 1960.
- Narayan BK - A survey of Industries in Telangana, Keshav Prakashan, 1962.
- Mohan Ram - Indian Communist Movement - Split within a Split, 1969.
- Joshi PC - For the Final Bid for Power - Freedom Programme of Indian Communists - PPH.
- Mohanty, Manoranjan - Revolutionary violence in India - A Maoist Experiment, Macmillan, 1977.
- MB Rao (ed) - Documents of the History of the Communist Party of India. People's Publishing House, 1976.
- BK Narayan - Finances and Fiscal Policy of Hyderabad State (1900-1956), Govt. of AP, 1973.
- ASR Chari - Memo(irs) of an unrepentant communist, Orient Longman, 1975.
- P. Sundarayya - Telangana People's Struggle and Its Lessons - CPI(M), 1972.
- Fareed Mirza - Police Action in the Erstwhile Hyderabad State, 1996 (First ed. 1976).
- A.R. Desai - Peasant Struggles in India - Oxford University Press, 1981.
- DN Dhanagare - Peasant Movements in India - 1920-1950, Oxford University Press, 1986.
- Parrier, Barry - The Telangana Movement, Vikas, 1981.
- Amit Kumar Gupta - The Agrarian Drama, The Leftists and the Rural Poor in India, 1934-1951, Manohar, 1996.
- VK Bawa - The Last Nizam - The Life & Times of Mir Osman Ali Khan - Penguin Books, 1993.
- Raj Bahadur Gour - Random writings, Makhdoom Society, Hyderabad - 2002.
- KL Mahendra - Events and Movements - Prachee Publications, 2005.
- KL Mahendra - Recollections and Reflections - Prachee Publications, 2006.

దక్షిణ కెరటాలు



లాటిన్ అమెరికా చరిత్ర అంతా అరుణ వర్ణమే. తరతరాల దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా పోరాడిన యోధుల గాథలు ఈ ప్రాంతపు చరిత్రలో మరచిపోలేని ఘట్టాలు. సైమన్ బొలీవర్ మొదలుకుని చేగువేరా, అలెండీ, ఒమర్ టోరిజోస్, జైమె రోల్డోస్, ఫిడెల్ కాస్ట్రో, మార్కోస్, హ్యూగో చావెజ్, మొరాలెస్, బేష్‌లె.... ఒకరా.. ఇద్దరా... సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ప్రజా శ్రేయస్సే ఊపిరిగా, స్వాతంత్ర్యం, సార్వభౌమత్వమే శ్వాసగా వారు ప్రపంచానికంతా ఆదర్శంగా నిలబడ్డారు. కోట్లాదిమంది జనులకు దిశానిర్దేశకులయ్యారు.

లాటిన్ అమెరికన్ ప్రజాపోరాటాల గురించి, రాజకీయ పరిణామాల గురించి వీక్షణం పాఠకులకు ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలనే ఉద్దేశ్యంతో ఈ కొత్త శీర్షికను ప్రారంభిస్తున్నాం.

స్వేచ్ఛా వాణిజ్యానికి ప్రత్యామ్నాయం

దక్షిణ అమెరికా ఖండాన్ని గత నాలుగు దశాబ్దాలుగా సామ్రాజ్య వాదులు దోచుకుంటూనే ఉన్నారు. మొదలు స్పానిష్ వలస పాలకులు ఆ తరువాత అమెరికన్ సామ్రాజ్యవాదులు ఈ రత్నగర్భను పీల్చి పిప్పి చేశారు. స్వేచ్ఛా వాణిజ్యం పేరిట ఇక్కడి వనరులను ఇంకా నిరాఘాటంగా దోపిడీ చేసేందుకు లాటిన్ అమెరికా ఖండంలో ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్ ఆఫ్ అమెరికాస్ (ఎఫ్‌టిఎఎ) అనే వాణిజ్య ఒప్పందం ప్రవేశ పెట్టింది అమెరికా. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చిన తొలినాడే మెక్సికోలోని చియాపస్ రాష్ట్రంలో స్థానిక తెగలు జపటిస్టా ఉద్యమానికి తెరలేపాయి. గత పదిహేనేళ్ళుగా ముసుగు వీరుడు మార్కోస్ నేతృత్వంలో జరుగుతున్న జపటిస్టా తిరుగుబాటు ప్రపంచ ప్రజలందరి దృష్టినీ ఆకర్షిస్తున్నది. ప్రపంచీకరణపై పోరులో ఈ తిరుగుబాటుది ఒక మహత్తర అధ్యాయం.

మరో వేపు వెనిజులా అధ్యక్షుడు హ్యూగో చావెజ్, క్యూబా అధ్యక్షుడు ఫెడెల్ కాస్ట్రో కలిసికట్టుగా ఎఫ్‌టిఎఎకు ప్రత్యామ్నాయంగా బొలివేరియన్ ఆల్టర్‌నేటివ్ ఆఫ్ అమెరికాస్ (ఏఎల్‌బిఏ) అనే వాణిజ్య ఒప్పందాన్ని రూపొందించారు. దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకునేటప్పుడు వాటి మధ్య ఉన్న ఆర్థిక వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకోవాలనేది ఏఎల్‌బిఏ ఒప్పందంలో ముఖ్యమైన అంశం. వాణిజ్యం ద్వారా పోగుపడే సొమ్ముతో ఒక 'పరిహార నిధి'ని ఏర్పాటు చేసి పేద దేశాల ప్రజలకు ఆహార వసతి కల్పించడం, ఆ దేశ ప్రజలు మార్కెట్లు స్వావలంబన సాధించే దిశగా చర్యలు చేపట్టడం ఈ ఒప్పందంలో మంచి అంశం.

బహుళజాతి కంపెనీలకు లాభం చేకూర్చే పేటెంట్లు, మేధో సంపత్తి హక్కులకు ఎఫ్‌టిఏఏ పెద్ద పీట వేయగా దీనికి భిన్నంగా ఏఎల్‌బిఏ మాత్రం జీవవైవిధ్యం, దేశీయ విజ్ఞానం వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తుంది. అంతేకాదు ఏఎల్‌బిఏ ఒప్పందం ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలకు పూర్తిగా వ్యతిరేకం.

ఏఎల్‌బిఏ ఒప్పందం - కొన్ని గణాంకాలు

- 2001 సంవత్సరంలో క్యూబా, వెనిజులా దేశాల మధ్య జరిగిన వాణిజ్య లావాదేవీల విలువ 97.3 కోట్ల డాలర్లు. అది 2005 నాటికి 240 కోట్ల డాలర్లకు చేరింది.
- క్యూబా ఆరోగ్య నిపుణులు 23,601 మంది ప్రస్తుతం వెనిజులాలో ఆరోగ్య సేవలు అందజేస్తున్నారు.
- ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా 3,328 వెనిజులా విద్యార్థులు క్యూబాలో వైద్యవిద్య నభ్యసిస్తుండగా 12940 మంది క్యూబన్ విద్యార్థులు వెనిజులాలో చదువుతున్నారు.



- ఆపరేషన్ మిరకిల్ కార్యక్రమం కింద 2,20,571 కంటి ఆపరేషన్లు లాటిన్ అమెరికాలోని 17 దేశాల్లో నిర్వహించారు.
- 2001లో వెనిజులాలో 10 లక్షల మంది నిరక్షరాస్యులు ఉండేవారు. క్యూబా సాయంతో చేపట్టిన సాక్షరతా కార్యక్రమం పుణ్యమా అని ఇవ్వాళ వెనిజులా 100 శాతం అక్షరాస్యతను సాధించింది.


2001లో మొదలుపెట్టిన ఈ ఏఎల్‌బిఏ ఒప్పందంలో ఇటీవలే బొలీవియా కూడా చేరింది.

బొలీవియాలో సహజవాయు రంగం జాతీయం

బొలీవియా అధ్యక్షుడు ఎవో మొరాలెస్ 2006 మేడే నాడొక చారిత్రాత్మక నిర్ణయం ప్రకటించాడు. దేశంలోని హైడ్రోకార్బన్ (చమురు, సహజ వాయువు) రంగాన్ని జాతీయం చేస్తూ ఆయన తీసుకున్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. నిజమైన సోషలిస్టు భావనతో తన దేశపు వనరులు తన ప్రజలకే చెందాలనే ఉదాత్తమైన ఈ నిర్ణయం సమసమాజ స్థాపనలో గొప్ప ముందడుగు.



ఎన్నికల ప్రచారంలో భాగంగానే మొరాలెస్ ఈ హైడ్రోకార్బన్ చట్టం గురించి ప్రస్తావించాడు. తనకంటే ముందే ఈక్వెడార్ దేశాధ్యక్షుడు జైమె రోల్డోస్, పనామా దేశాధ్యక్షుడు ఒమర్ టోరిజోస్‌లు ఇటువంటి చట్టాన్నే ప్రవేశపెట్టి అగ్రరాజ్య కన్నెర్రకు గురై సిఐఏ కుట్రలో దారుణంగా హతమయ్యారు. అయినా మొక్కవోని ధైర్యంతో ఇటువంటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న మొరాలెస్ అభినందనీయుడు.



లాటిన్ అమెరికన్ ఖండంలో వెనిజులా తరువాత అత్యంత విలువైన సహజవాయువు వనరులు బొలీవియాలో ఉన్నాయి. అయినప్పటికీ బొలీవియా జిడిపి (స్థూల జాతీయోత్పత్తి) కేవలం 2600 అమెరికన్ డాలర్ల వద్దే ఉంది. దీనికి ప్రధాన కారణం బహుళజాతి కంపెనీలు నిరాఘాటంగా చేస్తున్న సహజవనరుల దోపిడీ. ఇదివరకు చట్టాల ప్రకారం ఇక్కడి బహుళజాతి చమురు కంపెనీలు సహజవాయువుపై లభించే రాబడిలో 82 శాతం ఉంచుకుని కేవలం 18 శాతమే ప్రభుత్వానికి చెల్లించేవారు. మారిన చట్టాల ప్రకారం వారిప్పుడు 82 శాతం ప్రభుత్వానికి చెల్లించాలి.

మే మొదటివారంలో బొలీవియా రాజధానిని దర్శించిన వెనిజులా అధ్యక్షుడు చావెజ్, మొరాలెస్ నిర్ణయం చారిత్రాత్మకమైనదని కీర్తించాడు. ఈ మహత్తర కార్యంలో తన వంతు సాయంగా 700 మంది చమురు రంగ నిపుణులను బొలీవియాకు పంపించి ఇక్కడి ఇంధన రంగాన్ని అభివృద్ధి పరచే ప్రణాళికలో సాయపడుతామని అభయమిచ్చాడు చావెజ్.

చమురు వనరులను పళ్లెంలో పెట్టి ప్రైవేటుకు అప్పజెపుతున్న మన పాలకులు వింటున్నారా?

మొరాలెస్ ఆధ్వర్యంలో భూమి పంపిణీ

తను అధికారంలోకి వచ్చాక దేశంలో చేపట్టిన వ్యవసాయ సంస్కరణల్లో భాగంగా దాదాపు 30,000 చదరపు కిలోమీటర్ల భూమిని భూమిలేని పేదలకు పంపిణీ చేశాడు బొలీవియా దేశాధ్యక్షుడు మొరాలెస్.

సాంటాక్రజ్ పట్టణ నడిబొడ్డులో గత నెల భూ పంపిణీ కార్యక్రమం జరిగినపుడు వేలాదిమంది పేద బొలీవియన్లు రంగు రంగుల జెండాలు చేబూని తమ నాయకున్ని శ్లాఘించారు. దేశంలోని భూస్వాముల ఫెడరేషన్‌కు సాంటాక్రజ్ ముఖ్య కేంద్రం కావడం గమనార్హం.



అయిదు శతాబ్దాలుగా స్థానికుల నుండి లాక్కొన్న భూమిని తిరిగి వారికి అందించడమే తన ధ్యేయమని మొరాలెస్ ప్రకటించాడు. ఇప్పటి వరకూ ప్రభుత్వ భూమినే పంచామని కానీ త్వరలోనే ప్రైవేటు ఎస్టేట్లను స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతామని మొరాలెస్ అన్నాడు. వచ్చే అయిదేళ్లలో దేశంలోని అయిదోవంతు భూమిని పంచాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఆయన అన్నాడు. భూమి కోల్పోతున్న భూస్వాములు మాత్రం మొరాలెస్ పట్ల గుర్రుగా ఉన్నారు

పనామాకు వెనిజులా సాయం

లాటిన్ అమెరికా దేశాలు ఒకదానికొకటి చేసుకుంటున్న సాయం ముచ్చటగొలుపుతోంది. తీవ్రమైన ఇంధన సంక్షోభం ఎదుర్కొంటున్న పనామాను గట్టెక్కించడానికి తమ దేశం చమురు, సహజవాయువులను అందిస్తుందని జూన్ చివరి వారంలో పనామాను పర్యటించిన వెనిజులా దేశాధ్యక్షుడు హ్యూగోచావెజ్ భరోసా ఇచ్చారు.

పనామాలో రోజుకి 1,50,000 బ్యారెళ్ల ముడి చమురు శుద్ధి చేసే రిఫైనరీని నెలకొలుపుతామని, తద్వారా మధ్యవర్తుల బెడద లేకుండా పనామీయులకు చౌక పెట్రోల్ లభిస్తుందని చావెజ్ చెప్పారు.

సైమన్ బొలీవర్ స్ఫూర్తితో లాటిన్ అమెరికన్ ఖండాన్ని మొత్తం ఏకతాటిపై తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న చావెజ్ ఇప్పటికే ఉరుగ్వే, అర్జెంటీనా, క్యూబా, బ్రెజిల్, జమైకా, బొలీవియాలతో చమురు ఒప్పందాలను కుదుర్చుకున్నారు.

ఈ సందర్భంగా పనామా దేశాధ్యక్షుడు మార్టిన్ టోరిజోస్‌తో మాట్లాడుతూ 'మన వెనుకబాటుతనం పోవాలంటే మనం చేయి చేయి కలపాల్సిందే' అన్నాడు చావెజ్.

చేనేత పునాదులపై పెరిగిన పవర్‌లూమ్ రంగం

- పులుగుజ్జు సురేష్

అగ్రిమెంట్ ఆన్ టెక్స్‌టైల్ అండ్ క్లాతింగ్ 31 డిశంబరు 2004కు ముగిసింది. యిది మనందరికీ తెలిసిందే. కోటా పద్ధతి రద్దయి ఒకటిన్నర సంవత్సరం కావస్తోంది. కోటా పద్ధతి రద్దయితే భారత జౌళి పరిశ్రమ పుంజుకుంటుందని, మార్కెట్ అవకాశాలు విస్తారంగా పెరుగుతాయని నిపుణులు అంచనా వేశారు.

భారత జౌళి రంగంలో మూడు రకాలుగా ఉత్పత్తి జరుగుతుంది. 1. చేనేత రంగం 2. మిల్లు రంగం 3. పవర్‌లూమ్ రంగం. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా ఒక్క భారతదేశంలోనే జౌళి పరిశ్రమ యిన్ని విధాలుగా కనబడుతుంది.

కోటా పద్ధతి రద్దయిన తరువాత జౌళి మార్కెట్, దాని ఫలితాలు ఏ విధంగా ఉన్నాయో సమీక్షించుకోవాల్సిన అవసరం ఉన్నది. చేనేత, మిల్లు రంగాల కంటే పవర్‌లూమ్ రంగం బాగా లబ్ధి పొందుతున్నది. ఎందుకంటే ఈ రంగానికి స్వతహాగా ఉన్న మార్కెట్ చాలా సూక్ష్మమైనది. దొడ్డిదారిన చేనేత మార్కెట్‌ను కైవసం చేసుకున్న పవర్‌లూమ్ రంగం దేశ విదేశాలలో విస్తారమైన మార్కెట్ అవకాశాలను పెంచుకోగలిగింది. ఈ రంగానికి గల మార్కెట్‌లో చేనేత పేరుతో జరుగుతున్న పవర్‌లూమ్ అమ్మకాలకే డిమాండ్ బాగా ఉన్నది. దీనిని గమనించిన పాశ్చాత్య దేశాలు అనేక సందర్భాలలో పవర్‌లూమ్ దిగుమతులను తిరస్కరించారు. కొన్ని దేశాలలో తమ దేశానికి అనుమతులు రద్దు చేసే పరిస్థితి కూడా వచ్చింది.

భారత జౌళి పరిశ్రమకు స్థూలంగా 37 బిలియన్ డాలర్ల మార్కెట్ ఉన్నది. దీనిలో 12 బిలియన్ డాలర్ల విలువైన వస్త్రాలు ఎగుమతి అవుతున్నాయి. 25 బిలియన్ డాలర్ల విలువైన వస్త్రాలకు దేశీయ మార్కెట్ ఉన్నది. విదేశాలకు జరుగుతున్న ఎగుమతులలో దాదాపు 55 శాతం వస్త్రాలు కోటా దేశాలకే ఎగుమతి జరుగుతున్నది. దీనిని బట్టి స్వేచ్ఛా మార్కెట్ అవకాశాన్ని భారత జౌళిరంగం పూర్తిగా వినియోగించు కుంటున్నది.

మొత్తం భారత జౌళి ఉత్పత్తిలో పవర్‌లూమ్ ఉత్పత్తులు అధికంగా ఉన్నాయి. 67 శాతం పవర్‌లూమ్ రంగంలో వస్త్ర ఉత్పత్తి జరుగుతున్నది. ఈ పరిశ్రమలో రు. 51,623 మిలియన్ల విలువగల వస్త్రాలు ఎగుమతి జరుగుతున్నది. ఈ పరిశ్రమలో సెమీ పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలోని వారికి ఉపాధి దొరుకుతున్నది. ఈ పరిశ్రమ అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణాలు 1. చౌక శ్రమ 2. సంస్థాగత మౌలికపరమైన ప్రభుత్వ మద్దతు 3. వస్త్రం ధర తక్కువ 4. విద్యుత్తు మొదలగు రాయితీలు 5. పర్యావరణ ఖర్చులు లేకపోవడం. ఈ అవకాశాల వలన ప్రపంచ మార్కెట్‌లో ఎదుర్కోగల్గుతున్నది.

పవర్‌లూమ్ పరిశ్రమ జౌళి రంగంలో అతి పెద్దది. సాదా వస్త్రాలు, ఫర్నిషింగ్, డ్రెస్ మెటీరియళ్లు, చీరలు, టవల్స్, ధోవతులు, మొదలైనవి తక్కువ ధరకు ఉత్పత్తి చేయగలుగుతున్నాయి. పెద్ద పరిమాణంలో ఉత్పత్తి జరుగుతుంది. వీటిని ఇంటి అవసరాలకు, గృహోపకరణాలవంటి వస్త్రాల తయారీకి ఉపయోగిస్తున్నారు. ఈ దేశంలో మరో 17 లక్షల పవర్‌లూమ్‌లను ఏర్పాటు చేసి, వీటి ద్వారా 20, 689 మి.చ.మీ. వస్త్రాన్ని ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంది.

పవర్‌లూమ్ పరిశ్రమ దేశ వ్యాప్తంగా విస్తరించింది. కానీ దేశంలో 15 ప్రధానమైన పవర్‌లూమ్ కేంద్రాలను గుర్తించారు. వాటిలో ముఖ్యమైనవి 1. ఈరోడ్ 2. సేలం 3. మదురై 4. ఇచ్చల్కారాంజీ 5. షోలాపూర్ 6. భీవండి 7. మాలెగాంవ్ 8. బుర్హాన్‌పూర్ 9. భిల్వారా 10. కిషన్‌గర్ 11. లూధియానా 12. అమృతసర్ 13. నగరి 14. సిరిసిల్ల మొదలైనవి. జౌళి ఉత్పత్తుల్లో పవర్‌లూమ్ రంగంపై 67 శాతం ఉత్పత్తి జరుగుతున్నది. అది 23,803 మి.చ.మీ. యిదే మిల్లు రంగంలో కేవలం 1670 మి.చ.మీ. మాత్రమే. పెద్ద మొత్తంలో జరుగుతున్న ఉత్పత్తి వలన మిలియన్‌ల కొద్దీ ప్రజల వస్త్ర అవసరాలను తీర్చగలుగుతుంది. దీని ఉత్పత్తులు గార్మెంట్, మేడ్-అప్ పరిశ్రమలో తయారుచేసి దీని విలువను పెంచుతున్నారు. యివి కూడా పెద్ద పరిమాణంలోనే ఎగుమతి చేయబడుతున్నాయి.

మార్కెట్ అవసరాలను బట్టి ఏ రకమైన వస్త్రాన్నైనా ఈ రంగంలో ఉత్పత్తి చేయడానికి వీలుంది. యిది చాలా పెద్ద అవకాశం. వస్త్ర ఉత్పత్తిలో ఈ రంగానికి ఉన్న పరిమితులు సూక్ష్మం. ఒక్కొక్క డిజైనుకు తక్కువ నుండి చాలా పెద్ద పరిమాణంలో సునాయాసంగా సరఫరా చేయగలదు. యివి ధరలో పోటీకి నిలబడగలవు. ఈ ఫ్యాషన్ ప్రపంచంలో నిరంతరం కొత్త డిజైనులను అందించగలదు. కానీ వీటిలో దాదాపు చేనేత రంగం నుండి కాపీ చేయబడినవి, చేనేతకు రిజర్వ్ చేయబడిన వస్త్రాలు అధికంగా ఉన్నాయి. యిందువల్లనే పెద్ద మొత్తంలో గార్మెంట్ వస్త్రాలు భారత్ నుండి ఎగుమతి చేయగలుగుతున్నాం.

మహారాష్ట్రలోని భీవండి అతిపెద్ద పవర్‌లూమ్ పరిశ్రమ కేంద్రం. యిక్కడ 4.5 లక్షల పవర్‌లూమ్‌లు ఉన్నాయి. యిక్కడ ప్రధానంగా కాటన్ వస్త్రాలు ఉత్పత్తి చేస్తారు. యిక్కడి ఉత్పత్తి రకాలు చీరలు, షర్టింగ్, డ్రెస్ మెటీరియళ్లు మొదలైనవి. పది సైజింగ్ యూనిట్లు, ప్రాసెసింగ్ యూనిట్లు 20, మరొక 20 చేతితో చేసే ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. ఈ పరిశ్రమలో, ఈ పరిసర ప్రాంతంలో నేతకు ముందు జరిగే ప్రక్రియలోను, నేత తరువాత జరిగే ప్రక్రియలోను, నేత నేయడంలోను 6.5 లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నారు. భీవండి ప్రత్యేకమైనది. దీనికి ప్రత్యేకమైన మార్కెట్ అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే భీవండి ముంబాయికి సమీపంలో ఉండడం ఒక కారణమైతే, ముంబాయి జౌళి ఉత్పత్తులకు అతి పెద్ద మార్కెట్ కేంద్రం కావడం మరో కారణం. ఈ ప్రాంతంలో ఉత్పత్తులను ప్రధానంగా జాబ్‌వర్క్ చేస్తారు. ముడినూలు నుండి రంగుల అద్దకం, వస్త్ర ఉత్పత్తి వరకు మాస్టర్ వీవర్స్ అధీనంలో జరుగుతుంది. మెజారిటీ వ్యాపారం ట్రేడర్స్

ద్వారా జరుగుతుంది. ట్రేడర్స్ ముడిసరుకు సరఫరా చేయడం, ఉత్పత్తి అయిన వస్త్రాలు కొని మార్కెట్ చేస్తారు. ట్రేడర్స్ బొంబాయి కేంద్రంగా ఉన్నారు.

రెండవ అతి పెద్ద పవర్‌లూమ్ కేంద్రం తమిళనాడు. తమిళనాడు రాష్ట్రంలో 3.2 లక్షల పవర్‌లూమ్‌లు ఉన్నాయి. ఇవి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. తమిళనాడు రాష్ట్రంలో ఈరోడ్, సేలం, సోమనూర్, అంతియార్‌లు ముఖ్యమైనవి. ఈరోడ్‌లో ఆరువేల పవర్‌లూమ్‌లు ఉన్నాయి. ఇక్కడ గ్రే క్లాత్, షర్టింగ్, లుంగీలు మొదలైనవి ఉత్పత్తి చేస్తారు. వీటితో పాటు టవల్స్ కూడా ఉత్పత్తి చేస్తారు. అంతియార్‌లో మూడువేల పవర్‌లూమ్‌లు ఉన్నాయి. షర్టింగ్, లుంగీలతో పాటు టవల్స్ కూడా ఉత్పత్తి చేస్తారు. పెరుంద్రిలో ఐదువేల పవర్‌లూమ్‌లు ఉన్నాయి. ప్రత్యేకంగా 40 ఎస్, 60 ఎస్ నెంబర్ల షర్టింగ్‌ను ఉత్పత్తి చేస్తారు. బెడ్‌షీట్లు కూడా ఉత్పత్తి చేస్తారు. యిక్కడ ఇంకా 20 ఎస్, 30 ఎస్ నెంబరుతో గ్రే క్లాత్‌ను ఉత్పత్తి చేస్తారు. పెరుంద్రి పరిసర ప్రాంతాలైన భవాని, వెల్లకోయల్, మధూర్, చెన్నిమలమ్ మొదలగు ప్రాంతాలు కూడా పవర్‌లూమ్ ఉత్పత్తి కేంద్రాలు. చెన్నీ మలయ్‌లో అల్లికలు చేస్తారు. బెడ్‌షీట్స్ పైన చెక్ డిజైన్స్, జాకార్డు, డాబీ డిజైనులు చేస్తారు. తమిళనాడు నుండి పెద్ద ఎత్తున ఎగుమతులు జరుగుతున్నాయి.

పవర్‌లూమ్ పరిశ్రమ దేశవ్యాప్తంగా విస్తరించింది. దాదాపు 18 లక్షల పవర్‌లూమ్‌లు ఉన్నాయి. పవర్‌లూమ్‌లు ఏర్పడిన పరిస్థితులు, వాటి అవసరం ఎందుకు వచ్చింది, వీటి నిర్మాణాలు ఎక్కడ జరిగాయి, అక్కడే నిర్మించడానికి గల కారణాలు వీటన్నింటినీ సమీక్షించాలి.

వస్త్ర పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే ఆయా భౌగోళిక పరిస్థితుల పైన ఆధారపడి ఉంటుంది. భూమి, నీరు, గాలిలో తేమ, వేడిమి, చల్లదనం, ప్రజల అవసరాలు, కట్టుబట్టల తీరు, సాంప్రదాయాలు, సంస్కృతులు, పని పద్ధతులు, ముడిసరుకు మొదలగువన్నిటిమీద ఆధారపడి ఉంటుంది. భారతదేశంలో చేనేత పరిశ్రమ ఆయా పరిస్థితులను బట్టి చేనేత కార్మికులు తమంతట తామే స్వీయ అధ్యయనాలు చేసి పరిశ్రమ నెలకొల్పి అభివృద్ధి చేశారు. మైసూర్ రాష్ట్రం ఉన్నపుడు (ఇప్పటి కర్ణాటక) అక్కడి భౌగోళిక పరిస్థితులు, నీటి లభ్యతను బట్టి అక్కడ స్వచ్ఛమైన పట్టు ఉత్పత్తులు బాగా అభివృద్ధి జరిగాయి. బెంగుళూరు, దొడ్డి బల్లాపూర్ పరిసర ప్రాంతాలలో స్వచ్ఛమైన పట్టు చీరల ఉత్పత్తి బాగా జరిగింది. మహారాష్ట్రలోని ఇచ్చల్కారాంజీ గ్రామం చేనేత వస్త్రాలకు పెట్టింది పేరు. స్థానిక మానవ అవసరాలకు అనుగుణమైన వస్త్రాలను అందించగలిగింది. మానవ సంబంధాలు చాలా మెరుగ్గా ఉండేవి. భారతదేశంలో మొదటిసారిగా ఇచ్చల్కారాంజీలో 1904లో పవర్‌లూమ్‌లు ఏర్పడినట్టు నిపుణుల అభిప్రాయం. గ్రామంలో ఏర్పడిన పవర్‌లూమ్‌ల అభివృద్ధికోసం, పన్నురాయితీని యివ్వడం, ఆర్థిక సహాయం, కరెంటును అందించడం, వంటి మౌలిక అవసరాలను తీర్చడానికి నాటి ప్రభుత్వంపై బాధ్యత పడింది. ప్రభుత్వ అనుమతి లేకుండా దొంగచాటుగా ఏర్పడిన పవర్‌లూమ్‌లను సయితం చూసిన చూడనట్టున్నది. ఆ గ్రామంలో ప్రసిద్ధి చెందిన చేనేత ఉత్పత్తులను పవర్‌లూమ్‌లు ఉత్పత్తి చేసినా ప్రభుత్వం పట్టించుకున్నట్టు కనబడలేదు.

ఇదే మహారాష్ట్రలో షోలాపూర్ జిల్లా చేనేత వస్త్రోత్పత్తికి ప్రసిద్ధి. విభిన్న రంగులతో అందమైన వస్త్రాలను అందించింది షోలాపూర్. షోలాపూర్ జిల్లాలో 1950కి పూర్వం ఇరవై ఎనిమిది వేల చేనేత మగ్గాలు ఉండేవి. ఒక్క షోలాపూర్ నగరంలోనే ఇరవైవేల మగ్గాలు ఉండేవి. యిపుడవి మచ్చుకైన ఒకటి కనబడటంలేదు.

కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ మొదలగు రాష్ట్రాలన్నింటిలో కూడా చేనేత రంగం ఎక్కడెక్కడైతే ప్రసిద్ధి చెంది, ఆయా గ్రామాల పేరుతో విస్తారమైన మార్కెట్ ఉన్నదో ఆ ప్రదేశంలోనే పవర్‌లూమ్‌లను స్థాపించడం జరిగింది. అంటే ఏదైనా పరిశ్రమను స్థాపించాలంటే దానికి ప్రత్యేక పరిస్థితులు ఉండాలి, పెట్టుబడి, నైపుణ్యమైన కార్మికులు, మార్కెట్ కావాలి. పవర్‌లూమ్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రైవేటులో దేనికొరకు ప్రయత్నం చేయాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ పరిశ్రమ తమంతట తాముగా ఎదగకుండా చేనేత పరిశ్రమపై ఆధారపడింది. ఈ పరిశ్రమ ప్రసిద్ధి చెందిన ప్రదేశంలో పవర్‌లూమ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడం. ఆ ప్రదేశంలో విస్తారమైన మార్కెట్ కలిగిన ఉత్పత్తులను చేయడం, పవర్‌లూమ్‌లో పనిచేయడానికి చేనేత కార్మికులను ఆకర్షించి, ఆశ చూపి మభ్యపెట్టడం వంటివి, అనేకం జరిగాయి. దీనివలన పవర్‌లూమ్ రంగం శరవేగంతో అభివృద్ధి చెందింది తప్ప తనంతట తానుగా అభివృద్ధి చెందలేదు.

పవర్‌లూమ్ పరిశ్రమ స్థాపన, దాని తీరుతెన్ను, వాటి ఉత్పత్తులను గమనిస్తే మానవ అవసరాలు తీర్చడం అటుంచి చేనేత రంగంను నాశనం చేయడానికే అనిపిస్తుంది. ఎందుకంటే చేనేత ప్రసిద్ధి చెందిన చోటనే వీటిని ఏర్పాటు చేయడం వలన ఆ ప్రదేశాలలోని కార్మికులను బలవంతంగా పవర్‌లూమ్ కార్మికులుగా మార్చారు.

చేనేత ముడిసరుకును పవర్‌లూమ్ ముడిసరుకుగా ఉపయోగించారు. నైపుణ్యమైన చేనేత కార్మికులను పవర్‌లూమ్ కార్మికులుగా మార్చారు. చేనేత మార్కెట్‌లో చేనేత పేరుతో పవర్‌లూమ్ ఉత్పత్తులను అమ్మడం జరుగుతున్నది. ప్రధానమైన ఈ మూడింటిని పవర్‌లూమ్ చేజిక్కించుకున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని సిరిసిల్ల ప్రాంతంలో 1986 సంవత్సరంలో సుమారుగా 76వేల చేనేత మగ్గాలు ఉండేవి. పవర్‌లూమ్‌ల ప్రవేశానంతరం వీటి అనైతిక పోటీకి చేనేతరంగం చతికిలబడక తప్పలేదు. 2003 సంవత్సరం నాటికి కరీంనగర్ జిల్లాలో కేవలం 1225 మగ్గాలు మాత్రమే పనిచేస్తున్నాయి. యిదే విధంగా చీరాల ప్రాంతంలో పవర్‌లూమ్ ప్రవేశించలేదు. యిక్కడి ఉత్పత్తులను పవర్‌లూమ్‌లు కాపీ కొట్టలేకపోయాయి. కావున ఈ ప్రాంతంలో చేనేత మగ్గాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి.

పవర్‌లూమ్‌ల స్థాపనలో ప్రభుత్వ పాత్ర చాలా కీలకమైనది. ఒక వ్యూహం ప్రకారం చేనేతను దెబ్బతీయడానికే ఏర్పాటు చేసింది. కేరళ, పశ్చిమ బెంగాల్ మొదలగు రాష్ట్రాలలో చేనేత సహకార సంఘాల ద్వారా పథకాలను మార్పిడి చేసి, చేనేత సంఘాల ద్వారానే పవర్‌లూమ్‌లను ఏర్పాటు చేయించారు. దీనిని బట్టి ప్రభుత్వమే చేనేత పునాదులపైన పవర్‌లూమ్ బిల్డింగ్‌ను నిర్మించాలని కంకణం కట్టుకున్నదనడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలు. గత దశాబ్ద కాలంగా ముందుకు వస్తున్న టెక్స్‌టైల్, అపెరల్ పార్కుల నిర్మాణం కూడా ఈ వ్యూహంలో భాగమై ఉండొచ్చు....

ఆంధ్రప్రదేశ్ : నాడు - నేడు

వివిధ పద్ధతుల్లో నీటి పారుదల కింద ఉన్న భూమి విస్తీర్ణం-
నీటి పారుదల కింద ఉన్న స్థూల విస్తీర్ణం

క్రమ సంఖ్య	సంవత్సరం	చెరువులు	ప్రాజెక్టు కాల్వలు	బోరు బావులు	ఇతర బావులు	ఇతర మార్గాల్లో	నికర విస్తీర్ణం	నీటిపారుదల క్రింద వున్న స్థూల విస్తీర్ణం
1. *	1956-57	1180 (41.24%)	1274 (44.75%)	- -	321 (11.23%)	85 (2.98%)	2860	3388
2.	1960-61	1151 (39.57%)	1331 (45.76%)	- -	328 (11.27%)	99 (3.4%)	2909	3472
3.	1965-66	1189 (39.93%)	1226 (41.16%)	31 (1.04%)	424 (14.23%)	108 (3.62%)	2978	3533
4.	1970-71	1112 (33.55%)	1579 (47.65%)	66 (1.99%)	444 (13.4%)	113 (3.41%)	3314	4223
5.	1975-76	1100 (32.01%)	1626 (47.33%)	114 (3.32%)	470 (13.68%)	126 (3.67%)	3436	4528
6.	1980-81	900 (25.99%)	1693 (48.9%)	147 (4.26%)	629 (18.18%)	93 (2.69%)	3462	4342
7.	1985-86	786 (22.22%)	1483 (50.37%)	184 (5.19%)	673 (19.01%)	113 (3.19%)	3539	4337
8.	1990-91	968 (22.48%)	1869 (43.4%)	282 (6.55%)	1021 (23.72%)	166 (3.84%)	4306	5370
9.	1995-96	747 (18.1%)	1539 (37.31%)	710 (17.21%)	947 (22.97%)	181 (4.39%)	4124	5304
10.	2000-01	727 (16.05%)	1649 (36.43%)	1066 (23.56%)	888 (19.01%)	197 (4.36%)	4527	5916
11.	2004-05	477 (12.29%)	1346 (34.68%)	1254 (32.31%)	649 (16.72%)	155 (3.99%)	3881	4987

* నికర విస్తీర్ణంతో పోల్చిన శాతం

(మూలం : డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, హైదరాబాద్)

వీక్షణం చందాదారులుగా చేరండి!
వీక్షణంను మిత్రులకు పరిచయం చేయండి!

తెలుగు నాట విలక్షణమైన ఆర్థిక, సామాజిక పత్రిక 'వీక్షణం' ను మూడు సంవత్సరాలకు పైగా ఆదరించి పోషిస్తున్న మిత్రులందరికీ 'వీక్షణం' సంపాదకవర్గం వినమ్రంగా ధన్యవాదాలు తెలుపుతోంది. అయితే తెలుగుసీమలో రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల విశ్లేషణ కోసం ప్రజలలో, పాఠకులలో, ఆలోచనా పరులలో వ్యక్తమవుతున్న తహతహకూ, ఆ ఆసక్తిని తీర్చడంలో 'వీక్షణం' చేస్తున్న కృషికీ మధ్య చాల అంతరం ఉంది. ఆ అంతరం పూడాలంటే 'వీక్షణం'కు పాఠకుల నుంచే ఇతోధిక సహకారం అందాలి. 'వీక్షణం' చందాదారుల సంఖ్య కనీసం మూడురెట్లు పెరిగితే గాని, 'వీక్షణం' తన ముందు పెట్టుకున్న కర్తవ్యాలను తీర్చడం సాధ్యం కాదు. అంటే 'వీక్షణం' పాఠకులలో ప్రతి ఒక్కరూ తమ చందాలను క్రమం తప్పకుండా పునరుద్ధరించు కోవడంతో పాటు, కనీసం మరొక ముగ్గురు మిత్రులకు 'వీక్షణం' ను పరిచయం చేసి చందాలు కట్టించాలి.

'వీక్షణం' చందాదారులుగా చేరండి!
మీ మిత్రులను 'వీక్షణం' చందాదారులుగా చేర్చండి!
ఇది వీక్షణంకు సాయం కాదు, తెలుగు సమాజం తన గురించి తాను తెలుసుకోవడానికి చేసే అన్వేషణకు సాయం!

వీక్షణం విడిప్రతి రు. 10, సంవత్సర చందా రు. 120,
దశాబ్ది చందా రు. 1,000
చందాలు కింది చిరునామాకు ఎం.ఓ./డి.డి. ద్వారా పంపవచ్చు.

వీక్షణం, సి.డి.ఆర్.సి, మైత్రి రెసిడెన్సీ,
3-6-394, స్ట్రీట్ నం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

మీలోని రచయితను వెలికి తీయండి!
వీక్షణం మీ రచన కోసం వేచి చూస్తోంది!

మీ చుట్టూ, మీ గ్రామంలో, మీ బస్తీలో మీ పని స్థలంలో, మీరు పనిచేసే సంఘంలో ఒక ఘటన మిమ్మల్ని కదిలిస్తుంది. మీలో ఆలోచనలు రగిలిస్తుంది. ఆ ఘటన వెనుక ఉన్న సామాజిక, రాజకీయ, ఆర్థిక మూలాల గురించి మీరు అన్వేషిస్తుంటారు. మీ ఆలోచనలను రాయండి. సరిగ్గా 'వీక్షణం' ఎదురు చూస్తున్నది అటువంటి క్షేత్ర నివేదికల కోసమే. 'వీక్షణం' ఆర్థిక, సామాజిక పత్రిక తెలుగు సమాజం తన గురించి తాను చేసుకునే ఆలోచనలకు, అన్వేషణలకు ఒక వేదిక. మీరు అట్టడుగు నుంచి, మీ అనుభవాల నుంచి పంపే నివేదికలు ఆ ఆలోచనల్లో, అన్వేషణల్లో భాగమే.

'వీక్షణం'ను ఇటు క్షేత్ర నివేదికల, అటు నిపుణుల విశ్లేషణల మేలు కలయికగా తీర్చిదిద్దాలని సంపాదకవర్గం ప్రయత్నిస్తోంది. మన జీవితాల మీద ప్రగాఢ ప్రభావం వేయగల అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ పరిణామాల మీద నిపుణుల విశ్లేషణలు ఎంత అవసరమో, ఆ పరిణామాలు అట్టడుగు మనుషుల జీవన సరళిని ఎట్లా మారుస్తున్నాయో కింది నుంచి నివేదించడమూ అంతే అవసరం.

'వీక్షణం' మీ పత్రిక వీక్షణం మన పత్రిక
వీక్షణం తెలుగు సమాజం తన గురించి తాను చేసుకునే అన్వేషణ, ఆ అన్వేషణలో భాగం పంచుకోండి.


రచనలు పంపవలసిన చిరునామా :
సంపాదకుడు, **వీక్షణం,** సి.డి.ఆర్.సి, మైత్రి రెసిడెన్సీ,
3-6-394, స్ట్రీట్ నం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029.

PRINTED BOOK
RNI Regn. No.APTEL/2003/11482 Published on 01-07-2006 Postal Regn. No: LII/RNP/H-HD 1029/2004-06

విడుదలైన రెండు నెలల్లోనే మూడో ముద్రణ !!

మీ ఆత్మీయ స్పందనకు మా హృదయపూర్వక ధన్యవాదాలు

- వీక్షణం పబ్లికేషన్స్



ప్రపంచ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు పేద దేశాల అవసరాలు పెంచి, కొత్త అవసరాలు సృష్టించి ఆ అవసరాలు తీర్చుకునేందుకు ఇబ్బడిముబ్బడిగా అప్పులు ఇచ్చే కుట్ర, బహుళ జాతి కంపెనీల ప్రయోజనాలు నెరవేర్చేందుకు ఉద్దేశించిన ఓ అంతర్జాతీయ కుట్ర ఇప్పుడు బట్టబయలైంది. 'ఎకనామిక్ హిట్‌మాన్' అనే ఆర్థిక దళారీలను నియమించి, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రభుత్వాధినేతలను ప్రలోభపెట్టి, ఆ దేశాలను అమెరికన్ సామ్రాజ్య వాదానికి బంట్లుగా మార్చేసిన ఈ కుట్ర గుట్టు విప్పారు జాన్ పెర్కిన్స్. స్వయంగా ఎకనామిక్ హిట్‌మాన్‌గా పనిచేసి ఇప్పుడు చేతికంటిన సామాన్యుల రక్తాన్ని పశ్చాత్తాపంతో కడుక్కోవాలనుకుంటున్న పెర్కిన్స్ అంతరంగ కథనమే ఈ సంచలనాత్మకమైన పుస్తకం.

కాపీలు లభించు షాపులు :

హైదరాబాద్ : ప్రజాశక్తి బుక్ హౌస్ - చిక్కడపల్లి, దిశ పుస్తక కేంద్రం - చిక్కడపల్లి, నవోదయా బుక్ షాప్ - కోఠి, తెలుగు బుక్ షాప్ - కోఠి, సహచర బుక్ మార్క్ - బాగ్‌లింగంపల్లి, విశాలాంధ్ర బుక్ హౌస్ - కోఠి, అబిడ్స్.

విజయవాడ : ప్రజాశక్తి బుక్ హౌస్, మైత్రి బుక్ హౌస్

నెల్లూరు : మణి బుక్ స్టాల్ - సండే మార్కెట్

విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, ఖమ్మం, హన్మకొండ, నల్గొండ } ప్రజాశక్తి బుక్ హౌస్

ఎం.ఓ / డి.డి కింది అడ్రస్‌కు పంపి కూడా మీ కాపీ పొందవచ్చు.

మీ సామాజిక స్ఫూర్తికి మా వంతు సహకారం

పుస్తకం చదివి అమితంగా ప్రభావితం అయిన కొంతమంది పాఠకులు పుస్తకాన్ని తమ మిత్రులకు, శ్రేయోభిలాషులకు బహూకరించాలని నిర్ణయించుకున్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, ట్రేడ్ యూనియన్ సంఘాలకు చెందిన వారు కూడా ఇలా పెద్దమొత్తంలో కాపీలు కొనుగోలు చేశారు. హైదరాబాద్‌లో ఇద్దరు పాఠకులు చెరి వందకాపీలు కొనుగోలు చేసి తమ సామాజిక స్ఫూర్తిని చాటుకున్నారు.

మీరూ 'ఒక దళారీ పశ్చాత్తాపం' పుస్తకాన్ని ఇలా మీ మిత్రులకు, శ్రేయోభిలాషులకు బహూకరించదలుచుకుంటే మమ్మల్ని సంప్రదించండి. ఎక్కువ కాపీలు తీసుకునే వారికి ఇప్పుడు భారీ తగ్గింపు ఇస్తున్నాం.

వీక్షణం పబ్లికేషన్స్
3-6-394, మైత్రీ రెసిడెన్సీ, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500 029. ఫోన్-ఫ్యాక్స్: 040-5584 3495

Owned, Printed and Published by V. Hanumantha Rao at 301, Mythri Residency, 3-6-394, Road No. 3, Himayatnagar, Hyderabad - 29. Ph : 55843495. Printed at Charita Impressions, Hyderabad. For Nutan Art Printers, Hyderabad. Working Editor : N. Venugopal
VEEKSHANAM
301, Mythri Residency, Road No. 3, Himayatnagar, Hyd.-29.